www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 4-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 66 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి రా. 10.01 తదుపరి చతుర్దశి; నక్షత్రం: భరణి రా 10.35 తదుపరి కృత్తిక; వర్జ్యం: ఉ.9.05-10.35; దుర్ముహూర్తం: ఉ.8.19-9.11, రా.10.19-11.01; అమృతఘడియలు: సా.6.05-7.35; రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 5.43, సూర్యాస్తమయం: 6.43 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రేవ్ పార్టీ కేసులో సినీ నటి హేమ అరెస్టు



విచారణ అనంతరం అదుపులోకి తీసుకున్న బెంగళూరు పోలీసులు

12 వైద్యపరీక్షల తర్వాత కోర్టుకు!

14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ

రేవ్ పార్టీలో నేను లేను: హేమ

64.2 కోట్ల ఓట్లతో ప్రపంచ రికార్డు

భారత ఎన్నికలు ఓ అద్భుతం.. జీ7 దేశాల ఓటర్లతో

2 పోలిస్తే ఇక్కడ ఓటేసినవారి సంఖ్య 1.5 రెట్లు

ఈయూలో 27 దేశాల ఓటర్లతో పోలిస్తే రెండున్నర రెట్లు

75 మంది విదేశీ ప్రతినిధులు ఈ ఎన్నికల్ని పరిశీలించారు

పత్తాలేని మనుషులం కాదు.. అందుబాటులోనే ఉన్నాం

త్వరలో జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ: సీఈసీ

హైదరాబాద్‌లోని ఏవీ కాలేజీలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది



తీర్పుకు వేళాయె

నేడే లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు.. తొలి అరగంట పోస్టల్ బ్యాలెట్లు, తర్వాత ఈవీఎంలు

ఉదయం 8 గంటలకు షురూ.. 4కల్లా పూర్తి ఫలితాలు!

మధ్యాహ్నం ఒంటిగంటకు నిజామాబాద్ రిజల్ట్

చివరగా.. హైదరాబాద్, నల్లగొండ, కరీంనగర్

రాష్ట్రవ్యాప్తంగా 34 చోట్ల కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు

21 రోజుల ఉత్కంఠకు తెర.. ఎవరి ధీమా వారిదే!

ప్రధాన పార్టీల భవిష్యత్‌ను నిర్దేశించనున్న ఫలితాలు

కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నిక విజేత తేలేది నేడే

కేంద్రంలో మళ్లీ కమల వికాసమా? లేక హస్తవాసినా? మూడోసారీ మోదీనా..? రాహుల్ శకం రానుందా? 400 సీట్లు దాటేస్తామంటున్న ఎన్డీఏ..! గ్యారెంటీగా మెజారిటీ మార్క్‌ను చేరుతామంటున్న ఇండియా..! ఏ కూటమిదో గెలుపు తీరం! తెలంగాణలో పైచేయి కాంగ్రెస్‌దా..? కాషాయ దళానిదా..? గులాబీ గుబాళిస్తుందా..? ఏపీని వచ్చే ఐదేళ్లు ఏలేదెవరు..? టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి సూపర్ హిట్ కొట్టనుందా..? విజయం వైసీపీని వరించనుందా? ఉత్కళ నేల ఒడిసాలో ఉత్కంఠ తప్పదా..? ఈ ప్రశ్నలన్నింటికీ తెరదించుతూ.. 81 రోజుల ప్రక్రియ.. 46 రోజుల క్రతువుకు ముగింపు పలుకుతూ.. 21 రోజుల నిరీక్షణకు వీడ్కోలు చెబుతూ.. జూన్ 4 రానే వచ్చింది..! దేశవ్యాప్తంగా ప్రజల తీర్పు తేలేది నేడే..!

13

13 **అత్యధిక స్థానాలు మావే!**

రాష్ట్రంలో మెజారిటీ సీట్లు గెలుస్తామంటున్న కాంగ్రెస్

ఎగ్జిట్ పోల్స్‌కు భిన్నంగా ఫలితాలు: సోనియా

సూచీలు సరికొత్త శిఖరాలకు

మార్కెట్లకు ఎగ్జిట్ పోల్స్ కిక్ 11

సెన్సెక్స్ 2,507 పాయింట్లు అప్

733 పాయింట్ల వృద్ధితో 23,264కు నిఫ్టీ

కేంద్రంలో 'హ్యాట్రిక్'పై బీజేపీ ధీమా

గెలుపుపై ఇండీ కూటమి విశ్వాసం 2

రాష్ట్రంలో డబుల్ డిజిట్ పక్కా

లోక్‌సభ సీట్లపై కమలనాథుల ధీమా

మోదీ హవా కలిసి వస్తుందని అంచనా

ఫోన్ ట్యాపింగ్ కేసు
హైకోర్టుకు

సుమోటోగా విచారణకు స్వీకరించిన న్యాయస్థానం

హైకోర్టు జడ్జి ఫోన్ ట్యాప్ చేశారని వాంగ్మూలంలో పేర్కొనడంతోనే..

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

పత్రికల్లో కథనాల ఆధారంగా నిర్ణయం

సుమోటో లిస్ట్‌కు ఆదివారమే సీజే ఆదేశం

నేడు విచారణ చేపట్టనున్న సీజే ధర్మాసనం



హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సాక్షాత్తూ హైకోర్టు జడ్జి జస్టిస్ కాజా శరత్ ఫోన్‌ను ట్యాపింగ్ చేశారని ఓ నిందితుడు (ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీ భుజంగరావు) తన వాంగ్మూలంలో పేర్కొన్నట్లు వార్తలు గుప్పుమన్న నేపథ్యంలో హైకోర్టు సంచలన నిర్ణయం తీసుకుంది. పలు పత్రికల్లో ఈ అంశంపై వచ్చిన కథనాలను సుమోటోగా విచారణకు స్వీకరించింది. సుమోటో పిటిషన్‌పై మంగళవారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ టి.వినోద్ కుమార్‌ల ధర్మాసనం విచారణ చేపట్టనుంది. ఇందులో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్), తెలంగాణ డీజీపీ, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, ఇంటెలిజెన్స్ అదనపు డీజీ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌ను ప్రతివాదులుగా పేర్కొన్నారు. 'ఆంధ్రజ్యోతి' సహా ఇతర పత్రికల కటింగ్‌లు ధర్మాసనం ఎదుట రిజిస్ట్రీ ఉంచింది. హైకోర్టు ఎదుట విచారణ జాబితాలో ఉన్న పిటిషన్‌లో వివరాలు ఇలా ఉన్నాయి. "చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే ఈ నెల 2న ఇచ్చిన ఆదేశాల ప్రకారం పలు పత్రికల్లో మే 29న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కాజా శరత్ ఫోన్ ట్యాపింగ్ అయిందని వచ్చిన వార్తా కథనాలను సుమోటోగా ఈ కేసు లిస్ట్ చేశారు. హైకోర్టు జడ్జి మొబైల్ ట్యాపింగ్ గురైనట్లు పత్రికల కథనాల ద్వారా వెలుగులోకి వచ్చింది. గత బీఆర్ఎస్ హయాంలో అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ చేశారని, అందులో భాగంగానే జస్టిస్ శరత్ కూడా టార్గెట్‌గా మారారని ఆ కథనాల్లో ఉంది. బీఆర్ఎస్ వర్కింగ్

మిగతా 12వ పేజీలో...

సచివాలయంలో వాస్తు మార్పులు!

సీఎం రాకపోకలు సాగించనున్నారనే ప్రచారం జరుగుతున్న గేటు



సీఎం రాకపోకల గేట్లనూ మార్చే యోచన

ఈశాన్య గేటు నుంచే ముఖ్యమంత్రి ఎంట్రీ, ఎగ్జిట్

లేదంటే పడమర గేటు నుంచి లోపలికి వచ్చి ఈశాన్య గేటు గుండా బయటకు వెళ్లేలా ప్లాన్

ఐఏఎస్, ఐపీఎస్‌ల రాకపోకలు ఆగ్నేయ గేటు నుంచి

సోమవారం ఈశాన్య గేటు నుంచి వచ్చివెళ్లిన సీఎస్

సీఎం కార్యాలయమూ తొమ్మిదో అంతస్తుకు మార్పు!

హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సచివాలయంలో వాస్తు మార్పులు జరగబోతున్నాయా.? ముఖ్యమంత్రి సచివాలయంలోకి వచ్చి, వెళ్లే ద్వారాలు కూడా మారబోతున్నాయా? అంటే అవుననే సమాధానమిస్తున్నాయి తాజా పరిణామాలు. సెక్రటేరియట్ ప్రధాన ద్వారాన్ని మూసి వేయడం, అవి తెరుచుకోకుండా ఉండేందుకు మూడు స్టెప్పుల మేర ఇనుప తీగలతో లాక్ చేయడం వంటివి ఈ అభిప్రాయాలకు బలాన్నిస్తున్నాయి. వాస్తు మార్పుల్లో భాగంగా ఇప్పటివరకు సీఎం వచ్చి వెళ్తున్న ప్రధాన ద్వారం కాకుండా.. వేరే గేట్ల నుంచి రాకపోకలు సాగించనున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి ఎంట్రీ, ఎగ్జిట్ రెండూ ఈశాన్య గేటు (ఎన్టీఆర్ గార్డెన్ వైపున్న నార్త్ ఈస్ట్ గేట్ నంబర్ 4) నుంచే ఉంటాయని తెలుస్తోంది. మరోవైపు పడమర గేటు (మసీదు, చర్చి వైపు, వెస్ట్ గేట్ నంబర్ 3) నుంచి సచివాలయంలోకి వచ్చి.. ఈశాన్య గేటు నుంచి బయటకు వెళ్తారనే ప్రచారం కూడా జరుగుతోంది. అయితే వెస్ట్ గేటు

మిగతా 14వ పేజీలో...

కౌంటింగ్ సమయంలో జాగ్రత్త.. కాంగ్రెస్ అభ్యర్థులకు సీఎం సూచన 13

పాలిసెట్‌లో 84% ఉత్తీర్ణత

ఖమ్మం జిల్లా పెనుబల్లి విద్యార్థికి ఎంపీసీ విభాగంలో మొదటి ర్యాంకు

ఎంబైపీసీ విభాగంలో సూర్యాపేట విద్యార్థికి ఫస్ట్ ర్యాంక్



హైదరాబాద్/సిటీ (ఆంధ్రజ్యోతి), మహబూబాబాద్ ఎడ్యుకేషన్, పెనుబల్లి, జూన్ 3: తెలంగాణ పాలిసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. మే 24న నిర్వహించిన పాలిసెట్ ఫలితాలను సోమవారం విద్యా శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం విడుదల చేశారు. ఇందులో 84 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ సెట్‌కు 92,808 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. ఇందులో 82,319 మంది

మిగతా 12వ పేజీలో...

టెట్ ప్రాథమిక కీ విడుదల 3





వంశీకృష్ణ(ఫైల్)

నల్లగొండలోని 12వ వార్డు పాతబస్తీలో మిషన్‌భగీరథ తాగునీటి ట్యాంకు

తాగునీటి ట్యాంకులో మృతదేహం

నీటిలో దుర్వాసనపై స్థానికుల ఫిర్యాదు

ట్యాంకులో చూస్తే మృతదేహం లభ్యం

గత నెల 24న తప్పిపోయిన..

వంశీకృష్ణ మృతదేహంగా నిర్ధారణ

ట్యాంకు పరిధిలో 1,500 కుటుంబాలు

కొన్నాళ్లుగా ఆ నీటిని తాగుతున్న ప్రజలు

నల్లగొండ జిల్లా కేంద్రంలో ఘటన

నల్లగొండ/నల్లగొండ టౌన్, జూన్ 3: అది నల్లగొండ జిల్లా కేంద్రంలోని 12వ వార్డు పాతబస్తీ..! 1,500 కుటుంబాలకు మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు ద్వారా తాగునీరు అందుతోంది. కొన్నాళ్లుగా తాగునీటిలో దుర్వాసన వస్తోందంటూ కొందరు స్థానికులు మునిసిపల్ అధికారులకు

మిగతా 14వ పేజీలో...




ఇల్లెందుల ఏసు (ఫైల్)

మావోయిస్టుల మందుపాతరకు అమాయకుడు బలి!

కట్టెల కోసం వెళ్లిన వ్యక్తి మృతి.. కొడుక్కి గాయాలు

వాజేడులో ఘటన 14



ఢిల్లీ మద్యం కేసులో 1100 కోట్ల అక్రమాలు

అందులో రూ.292 కోట్ల మేరకు కవిత పాత్ర!

విజయ్ నాయర్ ద్వారా ఆప్‌కు రూ.100 కోట్లు ఇచ్చారు

డిజిటల్ సాక్ష్యాల్ని చెరిపేశారు.. ఫోన్లపైనా తప్పుడు ప్రకటనలు

మనీలాండరింగ్ చట్టం కింద కవితపై చర్యలు తీసుకోవాలి

ఆమె ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవాలి.. ఈడీ అనుబంధ చార్జిషీట్

న్యూఢిల్లీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణంలో ప్రధాన పాత్ర పోషించిన కల్వకుంట్ల కవితపై మనీలాండరింగ్ చట్టంలోని సెక్షన్ 4 కింద చర్యలు తీసుకోవాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ప్రత్యేక కోర్టును కోరింది. ఆమె ఆస్తుల స్వాధీనానికి ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేసింది. మద్యం కుంభకోణంలో మొత్తం రూ.1100 కోట్ల మేరకు అక్రమాలు జరిగాయని, ఇందులో కవిత పాత్ర రూ.292 కోట్ల మేరకు ఉందని తెలిపింది. ఈ మేరకు ఢిల్లీలోని ప్రత్యేక కోర్టులో ఈడీ సోమవారం

మిగతా 14వ పేజీలో...

కవిత కస్టడీ పొడిగింపు

సీబీఐ కేసులో ఈ నెల 7 వరకు

ఈడీ కేసులో జూలై 3 దాకా.. 14

ప్రజాపాలన కాదు.. 12
గలీజు పాలన

కాంగ్రెస్ తీరు మారకపోతే జనం తరిమికొట్టడం ఖాయం: కేటీఆర్



ఇదేం తీర్పు!?

పిన్నెల్లికి ఏపీ హైకోర్టు బెయిల్ ఇవ్వడంపై సుప్రీం విస్మయం

ఆయనకు రక్షణ కల్పించడం పెద్ద జోక్

వ్యవస్థల్ని అపహాస్యం చేసేలా హైకోర్టు తీరు

పోలింగ్ బూత్‌లోకి ఎమ్మెల్యే వెళ్లి ఈవీఎం, వీవీప్యాట్‌ను ధ్వంసం చేశారు

'గుర్తు తెలియని వ్యక్తుల'పై కేసు పెడతారా?

నేడు కౌంటింగ్ కేంద్రానికి పిన్నెల్లి వెళ్లొద్దు

సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశం

పోస్టల్ బ్యాలెట్లపై జోక్యం చేసుకుంటే ఓట్ల లెక్కింపుపై ప్రభావం: సుప్రీం

వైసీపీకి అక్కడా ఎదురుదెబ్బే 3

రాష్ట్రాన్ని తాకిన నైరుతి



కుత్బుల్లాపూర్‌లో శిథిలాల్లో ఇరుక్కుపోయిన కార్మికుడికి సిలిండర్ ద్వారా ఆక్సిజన్ సరఫరా

4-5 రోజుల్లో తెలంగాణ అంతటా వ్యాప్తి

నేడు, రేపు భారీ వర్షాలు

31 మండలాల్లో అత్యధిక వర్షపాతం

పడిపోయిన పగటి ఉష్ణోగ్రతలు

రాజోలిలో 14.78 సెంటీమీటర్ల వర్షం

హైదరాబాద్, గద్వాల, గంగాధర, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని నైరుతి పలకరించింది. ఉష్ణోగ్రతలు తగ్గాయి. వాతావరణం చల్లబడింది. రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. రాబోయే 4-5 రోజుల్లో రాష్ట్రంలోని మిగిలిన అన్ని ప్రాంతాలలోకి ప్రవేశించడానికి పరిస్థితులు అనుకూలంగా మారాయని తెలిపింది. ఇప్పటికే కర్ణాటక, రాయలసీమ, కోస్తాంధ్రలోని కొన్ని

మిగతా 3వ పేజీలో...

ప్రహరీ కూలి.. శిథిలాల కింద నలిగి..

ఇద్దరు పిల్లల దుర్మరణం.. మరో ముగ్గురు చిన్నారులకు తీవ్రగాయాలు

శిథిలావస్థకు గోడ.. వర్షానికి తడిసిన ఆ గోడకు మేకుకొట్టి ఉయ్యాల ఊగడంతో ఘోరం.. బాధితులంతా బిహార్ వాసులే.. రాజేంద్రనగర్‌లో ఘటన

3 కుత్బుల్లాపూర్‌లో సెల్లార్ గోడ కూలి, శిథిలాల్లో చిక్కుకున్న కార్మికుడు



పాల ధర పెంచిన మదర్ డెయిరీ

లీటర్‌పై రూ. 2 పెంపు

న్యూఢిల్లీ, జూన్ 3: అమూల్ పాల ధర పెంచిన మరుసటి రోజే మదర్ డెయిరీ కూడా పాల ధర పెంచింది. అన్ని రకాల పాలపై లీటర్‌కు రూ.2 చొప్పున పెంచినట్లు మదర్ డెయిరీ సోమవారం ప్రకటించింది. సోమవారం నుంచే కొత్త ధరలు అమల్లోకి వచ్చాయి. మదర్ డెయిరీ ప్రస్తుతం రోజు 35 లక్షల లీటర్ల పాలు అమ్ముతోంది. గతేడాది ఫిబ్రవరి తర్వాత ఈ కంపెనీ మళ్లీ పాల ధరలు పెంచింది ఇప్పుడే.

లోకం తీరు





మంగళవారం ఓట్ల లెక్కింపు కోసం సన్నద్ధమవుతున్న అధికారులు

నేడే 'లోక్‌సభ' ఓట్ల లెక్కింపు

న్యూఢిల్లీ, జూన్ 3: కేంద్రంలో అధికార పీఠం ఎవరిదో మరికొద్ది గంటల్లో తేలిపోనుంది. ప్రజలు, రాజకీయ పార్టీల ఉత్కంఠకు తెరపడనుంది. వరసగా మూడోసారి, రికార్డు విజయంపై ప్రధాని మోదీ కన్నేయగా.. ప్రతిపక్ష ఇండీ కూటమి అనూహ్యంగా తామే అధికారంలోకి వస్తామని ధీమాగా ఉంది. ఎగ్జిట్ పోల్స్ అన్నీ ఏకపక్షంగా కేంద్రంలో మళ్లీ మోదీ సర్కారే వస్తుందని, బీజేపీ హ్యాట్రిక్ కొడుతుందని పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ సారి 400 సీట్లు సాధించాలన్న మోదీ లక్ష్యానికి దగ్గరగా ఎన్డీయే కూటమి సీట్లు సాధిస్తుందని కూడా వెల్లడించాయి. ఇండీ కూటమికి 180 సీట్లలోపే వస్తాయని ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయి. ఈ క్రమంలో అవి ఎగ్జిట్ పోల్స్ కాదని.. మోదీ మీడియా పోల్స్ అని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే.

లోక్‌సభ ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఇలా..

నిబంధనల ప్రకారం తొలుత పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు.

పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు మొదలైన అరగంట తర్వాతే ఈవీఎంల్లోని ఓట్ల లెక్కింపును మొదలెట్టాల్సి ఉంటుంది.

ఒకవేళ నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్లు లేకుంటే నిర్దేశించిన సమయానికే ఈవీఎంల్లో ఓట్ల లెక్కింపు ప్రారంభించాలి.

కంట్రోల్ యూనిట్ల నుంచి ఫలితాన్ని నిర్ధారించే ముందు.. పేపర్ సీల్ చెదిరిపోకుండా చూసుకోవాలి. అనంతరం మొత్తం పోలైన ఓట్లను, ఫారం 17సీలో పేర్కొన్న సంఖ్యతో సరిపోల్చుకోవాలి.

ఫలితాన్ని తొలుత కౌంటింగ్ సూపర్‌వైజర్, మైక్రో అబ్జర్వర్, కౌంటింగ్ ఏజెంట్లకు చూపించాలి.

కంట్రోల్ యూనిట్‌లోని డిస్ప్లే ప్యానెల్‌పై ఒకవేళ ఫలితం కనిపించకపోతే, అన్ని యూనిట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత, ఆయా వీవీ ప్యాట్లలోని స్లిప్పులను లెక్కించాలి.

ప్రతి పోలింగ్ స్టేషన్‌కు చెందిన ఫారం 17సీని తుది ఫలితాన్ని కంపైల్ చేస్తున్న అధికారికి పంపించాలి. ఆయన వాటిని ఫారం 20లో పొందుపరుస్తారు.

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం/లోక్‌సభ పరిధిలోని ఒక్కో సెగ్మెంట్ నుంచి ఐదు పోలింగ్ స్టేషన్లను ఎంపిక చేసుకొని.. ఒక్కో వీవీప్యాట్‌లోని స్లిప్పులను లెక్కించాల్సి ఉంటుంది.

తిరస్కరణకు గురైన పోస్టల్ బ్యాలెట్ల సంఖ్య కంటే గెలుపు మార్జిన్ తక్కువగా ఉన్నట్లయితే.. తిరస్కరించిన పోస్టల్ బ్యాలెట్లను మళ్లీ పరిశీలించాలి. ఆ తర్వాతే తుది ఫలితం వెల్లడించాలి.

ఇద్దరు అభ్యర్థులకు సమాన ఓట్లు వస్తే డ్రా తీస్తారు.

నడ్డా అధ్యక్షతన బీజేపీ నేతల కీలక భేటీ

న్యూఢిల్లీ, జూన్ 3: లోక్‌సభ ఎన్నికల ఫలితాలకు ఒకరోజు ముందున బీజేపీ సీనియర్ నేతలు సోమవారం భేటీ అయ్యారు. పార్టీ చీఫ్ జేపీ నడ్డా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు కూడా పాల్గొన్నారు. మూడోసారీ మెజారిటీ సీట్లతో కేంద్రంలో బీజేపీ సర్కారే వస్తుందన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాల నేపథ్యంలో తాజా రాజకీయ పరిస్థితులపై వారు చర్చించినట్లు తెలిసింది. భేటీ అనంతరం పార్టీ నేత వినోద్ తావ్డే మీడియాతో మాట్లాడుతూ.. 'దేశంలో ఏడు దశల్లో నిర్వహించిన ఎన్నికలు, ఓటింగ్ సరళి, పోలింగ్ ఎలా జరిగిందనే దానితో పాటు రేపు జరగబోయే ఓట్ల లెక్కింపుపై విస్తృతంగా చర్చించాం. కౌంటింగ్ కేంద్రాలకు పార్టీ ఏజెంట్లు సకాలంలో చేరుకునేలా దిశానిర్దేశం చేశాం. ఎక్కడైనా ఓట్ల లెక్కింపులో అనుమానాలుంటే పార్టీ ఆఫీసు బేరర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించాం' అని వెల్లడించారు.

పాక్ కోసం గూఢచర్యం..

బ్రహ్మోస్ మాజీ ఇంజనీర్‌కు జీవిత ఖైదు

నాగపూర్, జూన్ 3: పాకిస్తాన్ నిఘా సంస్థ ఐఎస్ఐకు క్షిపణి రహస్యాలను చేరవేసిన కేసులో బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ మాజీ ఇంజనీర్ నిశాంత్ అగర్వాల్‌కు జీవిత ఖైదు పడింది. దాంతోపాటు 14 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.3 వేల జరిమానా విధిస్తూ నాగపూర్ జిల్లా కోర్టు జడ్జి ఎంవీ దేశ్‌పాండే సోమవారం తీర్పునిచ్చారు. డీఆర్‌డీవో, రష్యాకు చెందిన మిలటరీ ఇండస్ట్రియల్ కన్సార్టం సంయుక్తంగా బ్రహ్మోస్ ఏరోస్పేస్‌ను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. నిశాంత్ అగర్వాల్ 2014 నుంచి ఆ సంస్థలోని సాంకేతిక విభాగంలో పనిచేశాడు. అతను బ్రహ్మోస్‌కు చెందిన రహస్యాలను ఐఎస్ఐకు చేరవేసినట్లు మిలటరీ ఇంటెలిజెన్స్ గుర్తించింది. 2018లో మిలటరీ ఇంటెలిజెన్స్‌తోపాటు ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రకు చెందిన ఉగ్రవాద నిరోధక బృందాలు(ఏటీఎస్) సంయుక్త ఆపరేషన్ నిర్వహించి, నిశాంత్‌ను అరెస్టు చేశాయి. ప్రభుత్వం తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జ్యోతి వాజాని వాదనలను వినిపించారు. పూర్వాపరాలను పరిశీలించిన జడ్జి ఎంవీ దేశ్‌పాండే.. నిశాంత్‌కు జీవిత ఖైదుతోపాటు.. 14 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 3 వేల జరిమానా విధించారు.

17 మంది ఐసిస్ సభ్యులపై ఎన్ఐఏ ఛార్జిషీటు

న్యూఢిల్లీ, జూన్ 3: అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ 'ఐసిస్'లో కరుడుగట్టిన సభ్యులుగా పనిచేస్తున్న 17 మందిపై ఎన్ఐఏ సోమవారం ఛార్జిషీటు దాఖలు చేసింది. బాంబులు తయారు చేయడం, యువతను ఉగ్రవాదం వైపు మళ్లించడం, నిధులు సేకరించడం వంటి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించింది. గత ఏడాది పటియాలా హౌస్‌లోని ప్రత్యేక కోర్టులో ముగ్గురు ఐసిస్ సభ్యులపై ఛార్జిషీటు దాఖలు చేసింది. వారిపై దర్యాప్తు చేస్తున్న క్రమంలో ఈ 17 మంది పేర్లు వెలుగులోకి వచ్చాయి. దాంతో వారిపై ఆరోపణలను నమోదు చేస్తూ అదనపు అభియోగపత్రాలను కోర్టులో సమర్పించింది.

ముంబైలో పదో అంతస్తు నుంచి దూకి ఐఏఎస్ దంపతుల కుమార్తె బలవన్మరణం

ముంబై, జూన్ 3: మహారాష్ట్ర కేడర్ ఐఏఎస్ దంపతుల కుమార్తె బలన్మరణానికి పాల్పడ్డారు. సోమవారం తెల్లవారుజామున దక్షిణ ముంబైలోని మంత్రాలయ సమీపంలోని ప్రభుత్వ నివాస భవనం పదో అంతస్తు నుంచి దూకి ఆమె తనువు చాలించారు. ఐఏఎస్ దంపతుల కుమార్తె లిపి రస్తోగి (27) హరియాణాలోని సోనిపట్‌లో ఎల్ఎల్‌బీ కోర్సు చదువుతున్నారు. ఆమె తన చదువు పట్ల ఒత్తిడికి గురి కావడం ఈ పరిణామానికి దారితీసినట్టు పోలీసులు తెలిపారు. లిపి తండ్రి వికాస్ రస్తోగి మహారాష్ట్ర ఉన్నత, సాంకేతిక విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్నారు. ఆమె తల్లి రాధికా రస్తోగి రాష్ట్ర ప్రభుత్వంలో సీనియర్ ఐఏఎస్ అధికారి.

బెంగళూరులో ఒకే రోజు 110 మి.మీ. వర్షం

బెంగళూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలో వర్షాలు సాధారణమే. ఏడాదిలో ఏడెనిమిది నెలలపాటు ఇక్కడ వర్షం కురుస్తుంది. అయితే, జూన్ ఆరంభంలోనే ఆదివారం ఒకే రోజు ఏకంగా 110.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 133 ఏళ్ల నాటి రికార్డును బద్దలు కొట్టింది. బెంగళూరులో 1891 జూన్ 16న 101.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఆ రికార్డును తాజా వర్షం తిరగరాసింది. నగరంలో శని, ఆదివారాలలో మొత్తం 140.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి పొద్దుపోయేదాకా వర్ష బీభత్సం కొనసాగింది. ఒక్కరోజులోనే 261 విద్యుత్‌స్తంభాలు నేలకొరిగాయి. 200కు పైగా చెట్లు కూలాయి.

64.2 కోట్లు



మీడియా సమావేశంలో సీఈసీ రాజీవ్ కుమార్

ఈ సార్వత్రిక ఎన్నికల్లో పోలైన ఓట్లు
ఇది ప్రపంచ రికార్డు

- భారత ఎన్నికలు ఓ అద్భుతం
- ఏడు దశల్లో.. రూ.10 వేల కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నాం
- పత్తాలేని పెద్దమనుషులం కాదు.. ఎప్పుడూ అందుబాటులో ఉన్నాం
- త్వరలో జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ: సీఈసీ రాజీవ్‌కుమార్

న్యూఢిల్లీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో 64.2 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రపంచరికార్డు సృష్టించారని కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ ప్రకటించారు! "భారతదేశ ఎన్నికలు నిజానికి ఒక అద్భుతం. వీటికి ప్రపంచంలో ఏదీ సాటిరాదు" అని ఆయన వ్యాఖ్యానించారు. జీ7 దేశాల ఓటర్లతో పోలిస్తే భారత్‌లో ఈ ఎన్నికల్లో ఓటేసిన వారి సంఖ్య ఒకటిన్నర రెట్లు ఎక్కువని.. యూరోపియన్ యూనియన్‌లో ఉన్న 27 దేశాల ఓటర్ల కంటే రెండున్నర రెట్లు ఎక్కువని తెలిపారు. 31.2 కోట్ల మహిళా ఓటర్లు పార్లమెంటు ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు. సోమవారం ఇక్కడ కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయంలో ఎన్నికల కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధుతో కలిసి రాజీవ్‌కుమార్ పాత్రికేయులతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికలలో ఓటుహక్కు వినియోగించుకున్న ఓటర్లందరికీ కృతజ్ఞతభావంతో స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చారు. 85 ఏళ్లు దాటిన ఓటర్లు ఈ తరానికి ఆదర్శమని.. గత 70 ఏళ్లుగా వారు దేశం పట్ల తమ బాధ్యతను నెరవేరుస్తున్నారని రాజీవ్‌కుమార్ కొనియాడారు. గత నాలుగు దశాబ్దాలలో ఎప్పుడూ లేనివిధంగా జమ్ముకశ్మీర్‌లో ఈసారి అత్యధికంగా ఓటింగ్ జరిగిందన్న ఆయన.. జమ్ముకశ్మీర్ ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అక్కడ నమోదైన ఓటింగ్ పట్ల ఈసీ సంతోషంగా ఉందని.. ప్రజాస్వామ్య ప్రక్రియలో పాల్గొనడానికి ప్రజల ఉత్సుకతకు కశ్మీర్‌లో పోలింగ్ శాతమే నిదర్శనమని పేర్కొన్నారు. జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ ప్రక్రియను త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. ఈసారి ఎన్నికల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకోలేదని.. డీప్‌ఫేక్ వీడియోల బెడదను నియంత్రించామని చెప్పారు. ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేయడానికి ప్రయత్నించిన అధికారులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని.. నియమావళిని ఉల్లంఘించిన నాయకులకు నోటీసులు జారీ చేశామని గుర్తుచేశారు. ఎన్నికల సిబ్బంది సమర్థంగా పనిచేయడంతో ఈసారి అతి తక్కువగా 39 చోట్ల మాత్రమే రీపోలింగ్ జరిగిందని.. అందులోనూ 25 చోట్ల రీపోలింగ్ రెండు రాష్ట్రాలలోనే జరిగిందని వివరించారు. గత లోక్‌సభ ఎన్నికలలో 540 చోట్ల రీపోలింగ్ నిర్వహించినట్లు గుర్తుచేశారు. సామాజిక మాధ్యమాలలో ఎన్నికల సంఘాన్ని 'లాపతా జెంటిల్మెన్ (పత్తా లేని పెద్ద మనుషులు)' గా అభివర్ణిస్తూ వైరల్ అవుతున్న మీమ్స్ పట్ల సీఈసీ స్పందించారు. తాము ఎక్కడికీ పోలేదని, ఎల్లప్పుడూ అందుబాటులోనే ఉన్నామని చెప్పారు. ఏపీలో ఎన్నికల అనంతరం భద్రతాబలగాల బందోబస్తును కొనసాగిస్తున్నట్లు తెలిపారు. 23 దేశాలకు చెందిన 75 మంది ప్రతినిధులు లోక్‌సభ ఎన్నికల ప్రక్రియను పరిశీలించినట్లు వెల్లడించారు.

కోటిన్నర మంది..

కోటిన్నర మంది పోలింగ్, భద్రతా సిబ్బంది, 68 వేల పర్యవేక్షణ బృందాలు ఈ ఎన్నికల బృహత్తర యజ్ఞంలో పాలుపంచుకున్నట్లు రాజీవ్‌కుమార్ తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా నాలుగు లక్షల వాహనాలను, 135 ప్రత్యేక రైళ్లను, 1692 ట్రిప్పుల హెలికాప్టర్/విమాన సేవలను వినియోగించుకున్నామని చెప్పారు. అలాగే.. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు తరలిస్తున్న నగదు, వస్తువులు, మాదక ద్రవ్యాలు, మద్యం.. ఇలా అన్నింటినీ కలిపితే తాము స్వాధీనం చేసుకున్నవాటి విలువ రూ.10వేల కోట్ల దాకా ఉంటుందని తెలిపారు. 2019లో ఇలా స్వాధీనం చేసుకున్నవాటి విలువ రూ.3500 కోట్లేనని వివరించారు. కౌంటింగ్‌లో భాగంగా తొలుత పోస్టల్ బ్యాలెట్లను లెక్కించి, ఆ ఫలితాలను వెల్లడించాలన్న విపక్షాల విజ్ఞప్తిపై సీఈవో వివరణ ఇచ్చారు. నిబంధనల ప్రకారం.. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ముందుగానే లెక్కించనున్నట్లు తెలిపారు. ఆ ఓట్లను లెక్కించడం మొదలుపెట్టిన అరగంట తర్వాతే ఈవీఎంలలో పోలైన ఓట్లను లెక్కిస్తామన్నారు.

అమిత్ షాపై ఆరోపణలకు ఆధారాలు చూపండి

కేంద్ర మంత్రి అమిత్ షాపై తాను చేసిన ఆరోపణలకు ఆధారాలు సమర్పించడానికి వారం రోజుల సమయం కావాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ చేసిన అభ్యర్థనను ఎన్నికల సంఘం తిరస్కరించింది. చివరి దశ ఎన్నికలు ముగిశాక.. జిల్లా కలెక్టర్లకు అమిత్ షా ఫోన్ చేసి బెదిరిస్తున్నారని జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. దీనిపై స్పందించిన ఎన్నికల సంఘం.. ఆ ఆరోపణలకు సోమవారం రాత్రి 7 గంటలలోగా ఆధారాలు చూపాలని జైరాం రమేశ్‌ను ఆదేశించింది. లేనిపక్షంలో వాటిని నిరాధార ఆరోపణలుగా భావించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. కాంగ్రెస్ ఆరోపిస్తున్నట్టుగా.. బెదిరింపులకు సంబంధించి తమకు ఏ జిల్లా మేజిస్ట్రేట్ నుంచిగానీ, ఇతర అధికారుల నుంచిగానీ ఎలాంటి ఫిర్యాదులూ అందలేదని కమిషన్ స్పష్టం చేసింది.

ఢిల్లీకి ఇండియా కూటమి నేతలు

ఇండియా కూటమి నేతలు ఒక్కొక్కరుగా ఢిల్లీకి చేరుకుంటున్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేతల పిలుపు మేరకు తృణమూల్ అధినేత్రి మమతాబెనర్జీ, ఇతర మిత్రపక్షాల నేతలు ఢిల్లీకి వస్తున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడగానే వీరంతా సమావేశమై, భవిష్యత్ కార్యాచరణపై చర్చించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఫలితాలు అనుకున్న విధంగా, అనుకూలంగా రాకపోతే.. ఇతర మార్గాలను అన్వేషించాలని కాంగ్రెస్ భావిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో రాష్ట్రపతిని కలవడం, మీడియా సమావేశాలు, ప్రదర్శనలు నిర్వహించడం వంటి అంశాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల నిర్వహణలో ఈసీ పాత్రపైనా చర్చించాలని ఇండియా కూటమి నేతలు భావిస్తున్నారని తెలిసింది. ఎన్డీయేకు 350కి పైగా స్థానాలు వస్తే ఎన్నికల ప్రక్రియ బూటకమని భావించాలని వారు తీర్మానించినట్లు సమాచారం.

ఫలితాలు ఎగ్జిట్ పోల్స్‌కు భిన్నంగా ఉంటాయి

సోనియా గాంధీ

న్యూఢిల్లీ, జూన్ 3: లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఎగ్జిట్ పోల్స్‌కు పూర్తి భిన్నంగా ఉంటాయన్న ఆశాభావంతో ఉన్నామని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తెలిపారు. సోమవారం తమిళనాడు మాజీ సీఎం కరుణానిధి శత జయంతి సందర్భంగా ఢిల్లీలోని డీఎంకే కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి సోనియా హాజరై నివాళి అర్పించారు. అనంతరం 'మంగళవారం వెలువడనున్న ఎన్నికల ఫలితాలపై మీ అంచనాలు ఏమిట'ని పీటీఐ ప్రతినిధి అడగ్గా ఆమె బదులిస్తూ ఎగ్జిట్ పోల్స్‌కు పూర్తి భిన్నంగా ఫలితాలు ఉంటాయని తమ పార్టీ ఆశాభావంతో ఉందని, రేపటి వరకు వేచి చూడాలని పేర్కొన్నారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ తిరుగులేని మెజారిటీ సాధిస్తుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఎగ్జిట్ పోల్స్ బోగస్ అని కాంగ్రెస్ నాయకులు కొట్టిపారేశారు.

'హంగ్' వస్తే కూటమిని పిలవండి

- రాష్ట్రపతికి మాజీ జడ్జీల లేఖ

న్యూఢిల్లీ, జూన్ 3: ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ఒకవేళ ఏ పార్టీకీ స్పష్టమైన ఆధిక్యం రాకుండా 'హంగ్' వస్తే అలాంటి సందర్భాల్లో ప్రజాస్వామ్య సంప్రదాయాలను పాటించాలని కోరుతూ ఏడుగురు మాజీ న్యాయమూర్తులు రాష్ట్రపతికి లేఖ రాశారు. ఎక్కువ సీట్లు సంపాదించిన, ఎన్నికల ముందు ఏర్పడిన కూటమిని ప్రభుత్వ ఏర్పాటు కోసం తొలుత ఆహ్వానించాలని కోరారు. ఎంపీల కొనుగోళ్లను నివారించడానికి ఈ చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఒకవేళ ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల్లో ఓడిపోతే అధికార బదిలీ సక్రమంగా జరిగేందుకు రాజ్యాంగాన్ని పాటించాలని కోరారు. రాష్ట్రపతితో పాటు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రధాన ఎన్నికల కమిషనర్‌లకు కూడా ఈ బహిరంగ లేఖ రాశారు. ప్రస్తుత ప్రభుత్వం ఓడిపోతే అధికార బదిలీ సక్రమంగా జరగదన్న ఆందోళన నెలకొందన్నారు.

దుర్బుద్ధితో వ్యవహరించొద్దు



ఓట్ల లెక్కింపు రోజు ఎవరికీ భయపడవద్దు

కౌంటింగ్ సందర్భంగా అధికార యంత్రాంగానికి ఖర్గే లేఖ

న్యూఢిల్లీ, జూన్ 3: లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా రాజ్యాంగాన్ని పాటించాలని కోరుతూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సోమవారం అధికార యంత్రాంగానికి బహిరంగ లేఖ రాశారు. ఎలాంటి భయం, పక్షపాతం లేకుండా దేశానికి సేవ చేయాలని, ఎవరిపట్లా దుర్బుద్ధితో వ్యవహరించకూడదని కోరారు. జాతీయ కాంగ్రెస్ అధ్యక్షునిగానే కాకుండా, రాజ్యసభలో ప్రతిపక్ష నేత హోదాలో ఈ లేఖ రాస్తున్నట్టు తెలిపారు. "ఓట్ల లెక్కింపు రోజున ఎవరికీ భయపడకండి. ఎలాంటి రాజ్యాంగేతర శక్తులకూ తలవంచకండి. మెరిట్ అధారంగా నిర్ణయాలు తీసుకోండి. మనం భవిష్యత్తు తరాలకు సచేతనమైన ప్రజాస్వామ్యాన్ని, సుస్థిరమైన రాజ్యాంగాన్ని అందించాల్సి ఉంది. భారత్ నిజమైన ప్రజాస్వామ్య దేశంగా ఉండాలన్నా, రాజ్యాంగంలో పొందుపరిచిన ఉన్నత విలువలను కాపాడాలన్నా అది అధికార యంత్రాంగం ద్వారా సాధ్యమ"ని తెలిపారు. ఎన్నికలను విజయవంతంగా నిర్వహించినందుకు ఎలక్షన్ కమిషన్, సివిల్ సర్వెంట్లు, పోలీసులు, జిల్లా కలెక్టర్లు, ఇతర సిబ్బందిని అభినందించారు. సివిల్ సర్వెంట్లు భారత దేశ ఉక్కు చట్రంలాంటి వారని ప్రథమ హోం మంత్రి సర్దార్ వల్లభ భాయ్ పటేల్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. రాజ్యాంగానికి అనుగుణంగా వివిధ సంస్థలను ఏర్పాటు చేసి ప్రజాస్వామ్యానికి బలమైన పునాదులు వేసింది కాంగ్రెస్ పార్టీయేనన్న విషయం దేశ ప్రజలందరికీ తెలుసని పేర్కొన్నారు. "సంస్థలు స్వతంత్రంగా వ్యవహరించడం చాలా ముఖ్యమైన విషయం. ప్రతి సివిల్ సర్వెంట్ కూడా రాజ్యాంగానికి అనుగుణంగా నడుచుకుంటామని ప్రమాణం చేస్తారు. అందువల్ల కింది నుంచి పై స్థాయి వరకు ఉన్న అధికారులంతా తమ విధి నిర్వహణలో ఈ స్ఫూర్తిని ప్రదర్శించాలి. ఈ విషయంలో అధికార కూటమి నుంచి గానీ, విపక్ష కూటమి నుంచిగానీ ఎలాంటి బెదిరింపులు వచ్చినా లొంగకండి" అని కోరారు. "గత దశాబ్ద కాలంగా సంస్థల స్వయంప్రతిపత్తిని అధికార పక్షం ఒక పద్ధతి ప్రకారం అణగదొక్కింది. దాని ప్రభావంగా ప్రజాస్వామ్య విలువలు దెబ్బతిన్నాయి. దేశాన్ని నియంతృత్వం వైపుగా తీసుకెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నాయి. సంస్థలు కూడా తమ స్వయంప్రతిపత్తిని విస్మరించి అధికార పక్ష హుకుంలను అమలు చేస్తున్నాయి. కొందరితే అధికార పార్టీ మాదిరిగా మాట్లాడుతుండడంతో పాటు, వాటి వ్యవహార శైలినే అనుసరిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో వారి రాజకీయ భావజాలాన్నే చెబుతున్నారు" అని వ్యాఖ్యానించారు. ఇందుకు ఆ సంస్థలను తప్పుపట్టలేమని ఖర్గే అభిప్రాయపడ్డారు. "మంద బలం, బెదిరింపులు, వివిధ వ్యవస్థలను దుర్వినియోగం చేసి భయపెట్టడం, తమ అధికారం ముందు అందరూ తలవంచాలనే మనస్తత్వం కలిగిన ప్రభుత్వ పక్ష వైఖరితో ఇలాంటివి జరుగుతున్నాయి. ఈ కారణంగా చివరకు రాజ్యాంగం, ప్రజాస్వామ్యానికి నష్టం కలుగుతోంది" అని వివరించారు.

జూలై–సెప్టెంబరులో లా నినా!

- ప్రపంచ వాతావరణ విభాగం ప్రకటన
- బలహీనపడుతున్న ఎల్ నినో

న్యూఢిల్లీ, జూన్ 3: ప్రపంచవ్యాప్తంగా ప్రతికూల వాతావరణం, రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలకు కారణమైన ఎల్ నినో బలహీనపడుతోందని, ఈ ఏడాది జూలై-సెప్టెంబరులో లా నినా ఏర్పడే అవకాశం 60 శాతం వరకు ఉందని ప్రపంచ వాతావరణ విభాగం(డబ్ల్యూఎంవో) తాజా బులెటిన్‌లో వెల్లడించింది. ఎల్ నినో ప్రభావంతోనే గత 13 నెలలుగా సముద్ర ఉపరితలాలపై రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు కొనసాగాయని తెలిపింది. ఆ ఫలితంగానే భారత్, పాకిస్థాన్ సహా దక్షిణాసియాలో కోట్లాదిమంది ప్రజలు ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో అత్యధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిపోయారని, అత్యంత వేడి ఏప్రిల్‌ను కూడా ఈ ఏడాది చూశామని పేర్కొంది. ఎల్ నినో వల్ల పసిఫిక్ మహాసముద్రం తూర్పు, మధ్య ప్రాంతాల్లో జలాలు అసాధారణంగా వేడెక్కిపోతున్నాయని వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వాతావరణ కేంద్రాల దీర్ఘకాలిక అంచనాల మేరకు ఈ ఏడాది జూన్-ఆగస్టు కాలంలో లా నినా లేదా తటస్థ పరిస్థితి ఏర్పడేందుకు సమాన అవకాశాలు(50 శాతం) ఉన్నాయని పేర్కొంది. జూలై-సెప్టెంబరు నాటికి లా నినా ఏర్పడే అవకాశాలు 60 శాతానికి, ఆగస్టు-నవంబరులో 70 శాతానికి పెరుగుతాయని తెలిపింది. ఆ సమయంలో తిరిగి ఎల్ నినో ఏర్పడే అవకాశాలు చాలా తక్కువని పేర్కొంది. ఎల్‌నినో వల్ల భారత్‌లో బలహీన రుతుపవన గాలులు, పొడి వాతావరణం ఏర్పడిందని, దీనికి వ్యతిరేకంగా లా నినా వల్ల రుతుపవన కాలంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని తెలిపింది. '2023 జూన్ నుంచి ప్రతి నెలా ఉష్ణోగ్రతల్లో కొత్త రికార్డులు నెలకొల్పాయి. అలాగే, అత్యంత వేడి సంవత్సరంగా 2023 రికార్డులకెక్కింది. ఎల్ నినో ముగియడమంటే దీర్ఘకాలిక వాతావరణ మార్పులకు విరామమని అర్థంకాదు. ఎందుకంటే గ్రీన్ హౌస్ వాయువుల విడుదల వల్ల గ్రహం వేడెక్కడం కొనసాగుతోంది. రానున్న నెలల్లోనూ అసాధారణ సముద్ర ఉపరితల అత్యధిక ఉష్ణోగ్రతలు కీలకపాత్ర పోషించే అవకాశం ఉంది' అని డబ్ల్యూఎంవో డిప్యూటీ ప్రధానకార్యదర్శి కో బారైట్ పేర్కొన్నారు.

ముందస్తు బెయిల్ కోసం హైకోర్టుకు భవాని



బెంగళూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల వివాదంలో బాధితురాలిని కిడ్నాప్ చేసిన కేసు నిందితురాలు, ప్రజ్వల్ తల్లి భవాని ముందస్తు బెయిల్ కోసం సోమవారం హైకోర్టును ఆశ్రయించారు. కిడ్నాప్ కేసులో ప్రజ్వల్ తండ్రి హెచ్‌డీ రేవణ్ణ తొలి నిందితుడు కాగా, ఇప్పటికే అరెస్టు అయి బెయిల్‌పై బయటకు వచ్చారు. భవాని రేవణ్ణకు దర్యాప్తు సంస్థ సిట్ నోటీసులు జారీ చేసింది. ఆమె స్పందించలేదు. ప్రజాప్రతినిధుల న్యాయస్థానంలో ఆమె బెయిల్ పిటిషన్ తిరస్కరణకు గురైంది. దీనిపై ఆమె తరఫు న్యాయవాదులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సిట్ జారీ చేసిన నోటీసుల ప్రకారం తాను చట్ట ఉల్లంఘనలకు పాల్పడలేదని, అరెస్టు భయం ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. దర్యాప్తునకు సహకరించాలని ఆమెకు శనివారం రెండోసారి సిట్ నోటీసులు జారీ చేసింది. హొళెనరసీపుర ఇంట్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలవరకు ఉండాలని, విచారణకు సహకరించాలని సూచించారు. ఆమె అందుబాటులో లేకపోవడంతో గుర్తించేందుకు 4 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

ప్రజ్వల్‌కు మరోసారి వైద్య పరీక్షలు

అత్యాచార ఆరోపణలతో అరెస్టు అయిన ప్రజ్వల్ రేవణ్ణకు మరోసారి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రజ్వల్‌ను సిట్ అధికారులు అంబులెన్స్‌లో సోమవారం శివాజినగర్‌లోని బౌరింగ్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. కోర్టుకు సమర్పించేందుకు అవసరమైన మూడు, నాలుగు రకాల వైద్యపరీక్షలు చేయాలని వైద్యాధికారులను కోరారు. దీంతో మెడికల్ కాలేజీ డీన్, సూపరింటెండెంట్ సమక్షంలోనే వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రజ్వల్‌ను కస్టడీకి తీసుకుని మూడు రోజులు గడిచింది. ఏ ప్రశ్న అడిగినా తాను తప్పు చేయలేదని, ఇదంతా రాజకీయ కుట్ర అని, తనను రాజకీయంగా వేధిస్తున్నారని చెప్పినట్లు తెలుస్తోంది. పంచనామా జరిపేందుకు ప్రజ్వల్‌ను హాసన్ జిల్లా హొళెనరసీపురకు సోమవారం రాత్రి లేదా మంగళవారం తరలించే అవకాశం ఉంది. లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ మంగళవారం ఉండడంతో సిట్ అధికారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ప్రజ్వల్ హాసన్ ఎంపీ అభ్యర్థి. ఇలాంటి సమయంలో ప్రజ్వల్‌ను పంచనామాకు తీసుకెళ్తే శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయని అధికారులు ఆలోచిస్తున్నట్లు సమాచారం.

గ్యాంగ్‌స్టర్ అరుణ్ గావ్లీ విడుదలపై సుప్రీం స్టే

న్యూఢిల్లీ, జూన్ 3: హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న గ్యాంగ్‌స్టర్-పొలిటీషియన్ అరుణ్ గావ్లీని ముందస్తుగా విడుదల చేయడంపై స్టే విధిస్తూ సోమవారం సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. తనను ముందస్తుగా విడుదల చేయాలంటూ గావ్లీ పెటుకున్న దరఖాస్తును పరిశీలించాలంటూ ఏప్రిల్ 5న బాంబే హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్ రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన ఆదేశాలపై స్టే ఇచ్చింది. 2006లో శివసేన కార్పొరేటర్ కమలాకర్ జామసండేకర్‌ను హత్య చేసిన కేసులో గావ్లీకి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.17 లక్షల జరిమానా విధిస్తూ ముంబయిలోని సెషన్స్ కోర్టు 2012లో తీర్పు చెప్పింది. అప్పటి నుంచి ఆయన జైలులో ఉన్నారు. వయసు 65 ఏళ్లు దాటడం, శారీరకంగా బలహీనపడడంతో 2006 రెమిషన్ పాలసీ ప్రకారం ముందస్తుగా విడుదల చేయాలని గావ్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. కానీ, గావ్లీ దరఖాస్తును పరిశీలించాలని హైకోర్టు ఆదేశించింది. దీనిపై ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు చేయగా స్టే ఇచ్చింది. గావ్లీ 2004-09 మధ్య ముంబయిలోని చించ్‌పోక్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పనిచేశారు.

మాల్దీవులు వద్దు.. లక్షద్వీప్ ఉందిగా..

- ఇక్కడి అందమైన బీచ్‌లు సందర్శించండి
- తమ దేశ పౌరులకు ఇజ్రాయెల్ పిలుపు
- మాల్దీవుల నిషేధం ప్రకటనతో నిర్ణయం

న్యూఢిల్లీ, జూన్ 3: ఇజ్రాయెల్ పౌరులను తమ దేశంలోకి ప్రవేశించకుండా నిషేధిస్తామని మాల్దీవులు ప్రభుత్వం ప్రకటించిన మరుసటి రోజే ఇజ్రాయెల్ కీలక నిర్ణయం తీసుకుంది. ఎవరూ మాల్దీవుల పర్యటనకు వెళ్లొద్దని దానికి బదులుగా భారత్‌లోని లక్షద్వీప్‌ను సందర్శించాలని తమ దేశ ప్రజలను కోరింది. ఈ నిర్ణయాన్ని భారత్‌లో ఇజ్రాయెల్ కాన్సుల్ జనరల్ కోబీ షోషాని స్వాగతించారు. మాల్దీవుల్లో ఇజ్రాయేలీయులపై విధించే నిషేధం వారిని లక్షద్వీప్ బీచ్‌లను సందర్శించేలా ప్రోత్సహిస్తుందని ఆయన అన్నారు. "మాల్దీవుల ప్రభుత్వానికి ధన్యవాదాలు. ఇజ్రాయేలీయులు ఇప్పుడు లక్షద్వీప్ అందమైన బీచ్‌లను సందర్శించవచ్చు" అని షోషాని ఎక్స్ (ట్విటర్)లో ట్వీట్ చేశారు. లక్షద్వీప్ అందించే ప్రశాంతతను చూడాలని ప్రజలను ప్రోత్సహిస్తూ భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ ఏడాది జనవరి 4న చేసిన ట్వీట్‌ను కూడా షోషాని మళ్లీ షేర్ చేశారు. ఈ నేపథ్యంలో భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం లక్షద్వీప్‌లోని అందమైన బీచ్‌ల చిత్రాలను ఎక్స్‌లో షేర్ చేసింది. 'మాల్దీవులు ఇకపై ఇజ్రాయెల్ పౌరులను స్వాగతించడం లేదు కాబట్టి.. ఇక్కడ కొన్ని అందమైన, అద్భుతమైన భారత్ బీచ్‌లు ఉన్నాయి. ఇజ్రాయెల్ పర్యాటకులను ఇక్కడ ఆప్యాయంగా స్వాగతిస్తారు. మంచి ఆతిథ్యం ఇస్తారు' అని ట్వీట్ చేసింది. ఈ ఏడాది ఆరంభంలో మాల్దీవులకు చెందిన కొందరు మంత్రులు భారత్‌పై చేసిన వివాదాస్పద వ్యాఖ్యల కారణంగా ఇరుదేశాల మధ్య దౌత్యపరమైన వివాదం నెలకొంది. దీంతో 'బాయ్‌కాట్‌మాల్దీవులు' పేరిట సోషల్ మీడియాలో భారత్ నుంచి పెద్దఎత్తున నిరసన మొదలైంది. కాగా.. గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల నేపథ్యంలో పాలస్తీనియన్లకు మద్దతుగా ఇజ్రాయేలీయులను తమ దేశంలో పర్యటించకుండా నిషేధించాలని మాల్దీవులు ప్రభుత్వం ఆదివారం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ కూడా తమ దేశ పౌరులెవరూ మాల్దీవులకు వెళ్లొద్దని పిలుపునిచ్చింది.

ప్రహరీ కూలి.. శిథిలాల కింద నలిగి..

» ఇద్దరు పిల్లల దుర్మరణం.. మరో ముగ్గురికి తీవ్రగాయాలు

రాజేంద్రనగర్, పేట్‌బషీరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పాపం.. ఆ చిన్నారులకేం తెలుసు.. అది శిథిలావస్థకు చేరిన ప్రహరీ అని.. అప్పటికే వర్షానికి బాగా తడిసి కూలేందుకు సిద్ధంగా ఉందని! ఆ గోడకు మేకు కొట్టి తాడు కట్టి మరో చివరను ఓ చెట్టుకు కట్టి సరదాగా ఉయ్యాల ఊగుతున్నారు. అప్పటికే శిథిలమై, వర్షానికి తడిసిపోవడానికి తోడు పందికొక్కులు చేరి గోడ కింద బొయ్యారం పడటం.. దానికి ఊయల ఒత్తిడీ తోడవడంతో ప్రహరీ నిలువునా కూలిపోయింది. ఆ శిథిలాలన్నీ పిడుగుల్లా చిన్నారుల మీద పడ్డాయి. ఈ ఘటనలో ఇద్దరు చిన్నారులు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ముగ్గురు చిన్నారులు తీవ్రంగా గాయపడ్డారు. రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవుపల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్ బస్తీలో ఉదయం 10:30కు ఈ ఘటన జరిగింది. మృతులు, క్షతగాత్రులంతా పదేళ్లలోపు పిల్లలే! బిహార్ సమస్తీపూర్ జిల్లా కల్యాణపూర్‌కు చెందిన మహ్మద్ అక్బర్, మహ్మద్ నజీమ్, మహ్మద్ అఫ్జల్‌కు చెందిన మూడు కుటుంబాలు తొమ్మిదేళ్ల క్రితం బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వలసొచ్చాయి. బాబుల్‌రెడ్డినగర్‌లో కె. వెంకటేశంగుప్తా ఇంట్లో అద్దెకుంటున్నారు. మహ్మద్ అక్బర్, మహ్మద్ నజీమ్, మహ్మద్ అఫ్జల్ సోమవారం పనికి వెళ్లారు. ఇంటి వద్ద ఈ మూడు కుటుంబాలకు చెందిన పిల్లలు ఆడుకుంటున్నారు. మహ్మద్ అక్బర్ కుమార్తె ఆఫియా పర్వీన్(5), మహ్మద్ నజీమ్ కుమార్తెలు నూర్జహాన్ ఖాతూన్(10), నబియా(6), కుమారుడు మహ్మద్ అలీరెయిన్(8), మహ్మద్ అఫ్జల్ కుమార్తె అఫ్రీది(3) ఇంటి ముందు ఉన్న జామ చెట్టు వద్ద ఉయ్యాల ఊగుతున్నారు. ఈ క్రమంలో గోడ కూలి ఐదుగురు చిన్నారులపై పడింది. ఈ ప్రమాదంలో ఆఫియా పర్వీన్, నూర్జహాన్ ఖాతూన్ మృతి చెందారు. నబియా, మహ్మద్ అలీ రెయిన్, అఫ్రీదికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాగా, మరో ఘటనలో అపార్ట్‌మెంట్‌లో మరమ్మతులు చేస్తుండగా పాత గోడ కూలడంతో ఓ కార్మికుడు శిథిలాల కింద కూరుకుపోయాడు. కుత్బుల్లాపూర్ వెన్నెలగడ్డ శ్రీనిలయ ఎన్‌క్లేవ్‌లోని సాయి రామ్‌బృందావన్ అపార్టుమెంట్ సెల్లార్‌లోకి వర్షపు నీరు వస్తుండటంతో అపార్టుమెంట్ అసోసియేషన్ రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టింది. సోమవారం రిటైనింగ్ వాల్ కోసం తీసిన పునాది పక్కన ఉన్న పాత గోడ కూలింది. నలుగురు కూలీలు అప్రమత్తమై బయటకు రాగా.. మహబూబాబాద్ జిల్లా, పూర్వి మండలం నేరేడుకు చెందిన కార్మికుడు బల్వంత్‌రెడ్డి (32)గోడ కిందనే ఇరుక్కుపోయాడు. జీహెచ్ఎంసీ, అగ్నిమాపక ఎన్‌డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్ సిబ్బంది 5గంటల పాటు శ్రమించి బయటకు తీశారు.


బాబుల్‌రెడ్డి బస్తీలో గోడ కూలిన ప్రాంతం ఇదే

చిలుకూరు బాలాజీ సేవలో గవర్నర్ రాధాకృష్ణన్

మొయినాబాద్ రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ సోమవారం చిలుకూరు బాలాజీ ఆలయాన్ని సందర్శించారు. ఉదయం 8 గంటలకు ఆలయానికి చేరుకొన్న గవర్నర్‌కు ఆలయ ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ ఘన స్వాగతం పలికారు. తర్వాత గవర్నర్ ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా రంగరాజన్ గవర్నర్ రాధాకృష్ణన్‌ను సన్మానించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ విశిష్టతను వివరించారు. ఆలయ విశిష్టతకు సంబంధించిన పుస్తకాన్ని గవర్నర్‌కు అందజేశారు. చిలుకూరు బాలాజీని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందని గవర్నర్ రాధాకృష్ణన్ తెలిపినట్లు రంగరాజన్ చెప్పారు.


ప్రదక్షిణ చేస్తున్న గవర్నర్ రాధాకృష్ణన్

టెట్ ప్రాథమిక కీ విడుదల

హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): టెట్ పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక కీని విడుదల చేశారు. దీనిపై ఈ నెల 5వ తేదీ వరకు అభ్యంతరాలను నమోదు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. నిపుణుల కమిటీ పరిశీలన తర్వాత తుది కీని విడుదల చేస్తారు.

గురుకుల డిగ్రీ కాలేజీల ప్రవేశ పరీక్ష ఫలితాలు

రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఉత్తీర్ణులైన విద్యార్థులకు కేటాయించిన ఆయా కాలేజీల్లో ఈ నెల 5 నుంచి 13వరకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో రిపోర్టు చేయాలని టీజీఆర్‌డీసీ సెట్ కన్వీనర్ బడుగుల సైదులు ఓ ప్రకటనలో తెలిపారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

రాష్ట్రంలో పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఫస్ట్ లాంగ్వేజ్‌కు జరిగిన పరీక్షకు 16,215 విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా..14,041 మంది విద్యార్థులు హాజరయ్యారు.

5న ఐసెట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

ఈ నెల 5న ఐసెట్ పరీక్షను నిర్వహించనున్నారు. ఇప్పటికే అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. మొదటి సెషన్‌ను ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు, రెండో సెషన్‌ను మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారు. మొత్తం 86,184 మంది అభ్యర్థుల కోసం 116 కేంద్రాలను ఏర్పాటు చేశారు.

అందుబాటులో గ్రూప్-1 ప్రిలిమ్స్ హాల్‌టికెట్లు


ఈ నెల 9న నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమనరీ పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లను కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులోకి ఉంచినట్టు టీజీపీఎస్సీ అధికారులు తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్‌లోని నియమ నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సూచించారు. హాల్‌టికెట్‌లో ఫొటోలేని అభ్యర్థులు, ఫొటోతో కూడిన ఫాంను సమర్పించాలని తెలిపారు.

హెచ్‌సీయూలో పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్ సిటీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రవేశ పరీక్ష ఆధారంగా ట్రాన్స్‌లేషన్ స్టడీస్ 4, ఇంగ్లిష్ లాంగ్వేజ్ స్టడీస్ 8, హెల్త్ సైన్సెస్ (ఆప్టోమెట్రీ)2, మెటీరియల్స్ ఇంజనీరింగ్ 16, నానోసైన్స్, టెక్నాలజీ కోర్సుల్లో 4 సీట్లకు అడ్మిషన్లను నిర్వహించనుంది. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తుకు ఈ నెల 18 చివరి తేదీ అని ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ తుకారాం పొరిక తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు ఈ నెల 28 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, జూలై 7న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. మరిన్ని వివరాల కోసం వర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.


ఇదేమి తీర్పు!?

పిన్నెల్లికి బెయిల్‌పై సుప్రీం విస్మయం
ఆయనకు రక్షణ కల్పించడం పెద్ద జోక్



» నేడు కౌంటింగ్ కేంద్రానికి పిన్నెల్లి వెళ్లొద్దు
» ఆ పరిసరాల్లో కూడా కనిపించొద్దు
» సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మాచర్ల వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని జూన్ 6 వరకు అరెస్టు చేయొద్దంటూ హైకోర్టు మధ్యంతర ముందస్తు బెయిల్ ఇవ్వడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. హైకోర్టు తీరు వ్యవస్థలను అపహాస్యం చేసేలా ఉందని వ్యాఖ్యానించింది. మంగళవారం ఓట్ల లెక్కింపు రోజు పిన్నెల్లి తన నియోజకవర్గ కౌంటింగ్ కేంద్రంలోకి అడుగుపెట్టడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఆ పరిసర ప్రాంతాల్లో కూడా ఆయన కనిపించకూడదని తేల్చిచెప్పింది. ఇందుకు అంగీకరిస్తున్నట్లు అఫిడవిట్ ఇవ్వాలని పిన్నెల్లిని ఆదేశించింది. మే 13న పోలింగ్ సందర్భంగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్వాయిగేట్ పోలింగ్ కేంద్రంలో ఈవీఎంతోపాటు వీవీప్యాట్‌ను ధ్వంసం చేసిన సంగతి తెలిసిందే. అక్కడే ఉన్న టీడీపీ పోలింగ్ ఏజెంట్ నంబూరి శేషగిరిరావు ఆయనను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ దృశ్యాలన్నీ పోలింగ్ కేంద్రంలోని సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. దీంతో కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) పిన్నెల్లిపై తక్షణ చర్యలకు ఆదేశించింది. పిన్నెల్లి అజ్ఞాతంలోనే ఉండి హైకోర్టును ఆశ్రయించారు. ఈ నెల 6వ తేదీ వరకు ఆయన్ను అరెస్టు చేయొద్దంటూ హైకోర్టు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరుచేసింది. దీనిపై బాధితుడు శేషగిరిరావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిన్నెల్లికి హైకోర్టు ఇచ్చిన అరెస్టు మినహాయింపు ఆదేశాలు రద్దు చేయాలని కోరారు. ఆయన కౌంటింగ్ రోజు కూడా హింసకు పాల్పడే ప్రమాదం ఉందని, కౌంటింగ్ కేంద్రం వద్దకు రానివ్వకుండా ఆదేశాలు జారీచేయాలని మరో పిటిషన్ వేశారు. ఈ రెండు పిటిషన్లపై సోమవారం సుప్రీంకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ చేపట్టింది. హైకోర్టు తీర్పుపై విస్మయం వ్యక్తం చేసింది. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎం, వీవీప్యాట్‌ను ధ్వంసం చేసినట్లు ఆధారాలున్నా అరెస్టు చేయొద్దంటూ ఆదేశాలు ఇవ్వడాన్ని తప్పుపట్టింది. హైకోర్టు తీరు ముమ్మాటికీ న్యాయాన్ని అవహేళన చేయడమేనని మండిపడింది. శేషగిరిరావు తరఫున సీనియర్ న్యాయవాది ఆదినారాయణరావు వాదనలు వినిపిస్తూ ఎన్నికల సంఘం విడుదల చేసిన వీడియోను ఆదినారాయణరావు ధర్మాసనం ముందు ప్రదర్శించారు. ఈవీఎం, వీవీప్యాట్‌ను ఎమ్మెల్యే ధ్వంసం చేసినట్లు వీడియో సాక్ష్యం ఉన్నప్పటికీ పోలీసులు ఆయనపై కేసు నమోదు చేయలేదని.. గుర్తుతెలియని వ్యక్తులపై కేసు పెట్టారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.



మేమూ మౌనంగా ఉండలేం...

'పోలింగ్ కేంద్రంలో పిన్నెల్లి ఏం చేశారో వీడియోను చూస్తే అర్థమవుతోంది. అక్కడ ఏం జరిగిందో వీడియో సాక్ష్యం ద్వారా స్పష్టంగా తెలుస్తోంది. రామకృష్ణారెడ్డిని అరెస్టు చేయొద్దంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పు వ్యవస్థలను అపహాస్యం చేసేలా ఉంది. ఈ ఆదేశం అత్యంత లోపభూయిష్టంగా కనిపిస్తోంది. ఇప్పుడు మేం కూడా దీనిపై మౌనంగా ఉంటే సమాజానికి ఏం సందేశం ఇచ్చినట్లు? హైకోర్టు తీర్పుపై మేం స్టే ఇవ్వకుంటే అది న్యాయ వ్యవస్థను అపహాస్యం చేసినట్లే" అని జస్టిస్ అరవింద్ కుమార్ వ్యాఖ్యానించారు. ఇలాంటి కేసుల్లో మధ్యంతర రక్షణ ఎలా కల్పిస్తారని, ఇదో పెద్ద జోక్ అని ధర్మాసనం పేర్కొంది. 'ఇక బెయిల్ ఇచ్చే అవకాశం ఎక్కడిది? పిన్నెల్లిపై ఆరోపణలకు ప్రాథమిక ఆధారాలు కనిపిస్తున్నాయి' అని ధర్మాసనం స్పష్టంచేసింది. హైకోర్టు మధ్యంతర రక్షణ ఆదేశాలిచ్చేదాకా దాక్కున్న వైసీపీ ఎమ్మెల్యేను, ఈ షాకింగ్ ఘటనపై పోలీసులు స్పందించిన తీరును తీవ్రంగా విమర్శించింది. సిటింగ్ ఎమ్మెల్యే పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఈవీఎం, వీవీప్యాట్‌ను ధ్వంసం చేస్తే 'గుర్తుతెలియని వ్యక్తిపై కేసు పెడతారా' అని పోలీసులపై మండిపడింది.

మార్ఫింగ్ కాదు...

జరిగిన ఘటనలతో తాను విభేదించడం లేదని.. బూత్‌లో ఎమ్మెల్యే ఉన్నారనడంతో మాత్రం ఏకీభవించడం లేదని పిన్నెల్లి తరఫు న్యాయవాది వికాస్‌సింగ్ తెలిపారు. 'పోలింగ్ కేంద్రంలో ఈసీ ఏర్పాటుచేసిన సీసీటీవీ కెమెరాల ద్వారా జరిగిన ప్రత్యక్ష ప్రసారం నుంచి తీసిన వీడియో ఇది. దీనిని మార్ఫింగ్ వీడియో అనడానికి వీల్లేదు' అని తేల్చిచెప్పింది. పిన్నెల్లిపై ఉన్న కేసుల విచారణ హైకోర్టులో గురువారం జరుగనున్నందున.. ఆయనకు గత నెల 28న ఇచ్చిన మధ్యంతర ముందస్తు బెయిల్ ఆదేశాల ప్రభావానికి లోనుకాకుండా న్యాయస్థానం విచారించాలని నిర్దేశించింది. కౌంటింగ్ కేంద్రంలోకి ఆయన అడుగుపెట్టరని.. ఆయన తరఫు పోలింగ్ ఏజెంట్లు మాత్రమే వెళ్తారని వికాస్‌సింగ్ తెలిపారు. ఆయన ఇచ్చిన హామీని అంగీకరించిన ధర్మాసనం వ్యాజ్యాలను పరిష్కరించింది.

పోస్టల్ బ్యాలెట్లపై జోక్యం చేసుకుంటే ఓట్ల లెక్కింపుపై ప్రభావం: సుప్రీంకోర్టు

పోస్టల్ బ్యాలెట్ల అంశంలోనూ వైసీపీకి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పోస్టల్ బ్యాలెట్‌పై గెజిటెడ్ అధికారి సంతకం ఉంటే సరిపోతుందని, సీల్ అవసరం లేదన్న ఈసీ నిర్ణయంపై హైకోర్టు ఆదేశాలను ఆ పార్టీ సుప్రీంకోర్టులో సవాల్ చేసిన సంగతి తెలిసిందే. దానిపైనా సోమవారం వెకేషన్ బెంచ్ విచారణ చేపట్టింది. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు వ్యవహారంలో తాము జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. మంగళవారం ఓట్ల లెక్కింపు జరుగనుండగా.. ఈ దశలో జోక్యం చేసుకోవడం ఓట్ల లెక్కింపు ప్రక్రియపై ప్రభావం చూపుతుందని తెలిపింది. వైసీపీ పిటిషన్‌ను తోసిపుచ్చింది.

యాదాద్రిలో ప్రతిరోజూ వెయ్యి మందికి అన్నప్రసాదం

భువనగిరి అర్బన్: యాదాద్రి కొండ కింద సత్రంలో ప్రతిరోజు వెయ్యి మందికి అన్న ప్రసాదం అందజేసే కార్యక్రమాన్ని ఆలయ ఈవో భాస్కర్‌రావు సోమవారం ప్రారంభించి భక్తులకు అన్నం వడ్డించారు. ఇప్పటివరకు సత్రంలో ప్రతిరోజు 600 మందికి అన్నప్రసాదాన్ని అందజేస్తున్నారు. తాజాగా దీన్ని వెయ్యి మందికి పెంచా రు. యాదాద్రి కొండపై సోమవారం హరిహరులకు విశేష పూజలు కొనసాగాయి.

సార్వత్రిక పోరు..అభ్యర్థుల తీరు..
మొత్తం 8,360 మంది బరిలో

» 2,572 మందికి కోటికిపైగా ఆస్తులు
» 1,643 మందిపై నేరాభియోగాలు

న్యూఢిల్లీ, జూన్ 3 : ఇంకొన్ని గంటల్లో ఈవీఎంల్లో దాగిన అభ్యర్థుల భవితవ్యం తేలిపోనుంది. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ప్రధానంగా సంపద సర్వే, ఆస్తుల పునఃపంపిణీ చుట్టూనే వాదం, వివాదం, సవాళ్ల పర్వం సాగింది. ఈ నేపథ్యంలో 18వ లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థుల ఆర్థిక బలం గురించిన వివరాలు ఆసక్తి రేపుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 వరకు ఏడు విడతల్లో జరిగిన ఎన్నికల్లో 8,360 మంది పోటీ చేశారు. 1996 లోక్‌సభ ఎన్నికల తర్వాత ఈ స్థాయి పోటీ ఇదే మొదటిసారి. ఆ ఎన్నికల్లో 13,952 మంది అభ్యర్థులు తలపడ్డారు. మొత్తం అభ్యర్థుల్లో 2,572మందికి (31 శాతం) రూ. కోటికిపైగా ఆస్తులు ఉన్నాయి. వీరిలో ఒక్కొక్కరికి సగటున 6.23 కోట్ల ఆస్తులు ఉన్నాయి. మొత్తం అభ్యర్థుల్లో 1,643 మందిపై (20శాతం) క్రిమినల్ కేసులు ఉన్నాయి. 2019తో పోల్చితే ఒక శాతం, 2014తో పోల్చితే మూడు శాతం, 2014తో పోల్చితే ఇది ఐదు శాతం ఎక్కువ. ఇందులో 1,191 (14శాతం) మందిపై అత్యాచారం, హత్యలు, మహిళలపై నేరాలు వంటి తీవ్రమైన నేరాభియోగాలు ఉన్నాయి. అభ్యర్థులు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించిన నామినేషన్లలోని వివరాల ఆధారంగా స్వతంత్ర సంస్థలైన అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్), పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రిసెర్చ్.. ఈ వివరాలను అందించాయి. ఆ వివరాలను అనుసరించి.. ఆరు జాతీయ పార్టీలు సహా చిన్న, పెద్ద పార్టీలను కలుపుకొంటే 744 రాజకీయ పార్టీలు 543 స్థానాలకు తమ అభ్యర్థులు నిలిపాయి. అందులో 16 శాతం జాతీయ పార్టీల నుంచే ఉన్నారు. ఇందులో బీఎస్పీ అత్యధికంగా 488 మందిని నిలిపింది. ఇక బీజేపీ 441 మందిని, కాంగ్రెస్ 328 మందిని, సీపీఎం 52 మందిని, ఆప్ 22 మందిని, నేషనల్ పీపుల్స్ పార్టీ ముగ్గురిని బరిలో నిలిపాయి. ఇక ఆరుశాతం ప్రాంతీయ పార్టీల నుంచి అభ్యర్థులు ఉన్నారు. అత్యధికంగా ఎస్పీ 71 మందిని పోటీకి నిలపగా, తృణమూల్ కాంగ్రెస్ 48, ఏఐఏడీఎంకే 36, సీపీఐ 30, వైసీపీ 25, ఆర్‌జేడీ 24, డీఎంకే 22 మంది, టీడీపీ 17 మందిని నిలిపాయి. గుర్తింపు పొందని పార్టీల్లో అత్యధికంగా సోషల్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (కమ్యూనిస్టు) అత్యధికంగా 150 మందిని, పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా (డెమోక్రటిక్) 79 మందిని నిలిపాయి. లోక్‌సభ నియోజకవర్గానికి సగటున 15 మంది ఈసారి బరిలో ఉన్నారు. తెలంగాణలో మాత్రం సగటున 31 మంది నిలవగా, అత్యల్పంగా లఢక్, నాగాలాండ్‌ల్లో సగటున ముగ్గురు పోటీచేస్తున్నారు.

హ్యాకర్ల బారిన హ్యాక్ ఐ..!

హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పోలీసులు ప్రతిష్టాత్మకంగా పరిచయం చేసిన హ్యాక్-ఐ యాప్ హ్యాకింగ్‌కు గురైందా? యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్నవారి వ్యక్తిగత వివరాలు సైబర్ కేటుగాళ్ల చేతికి చిక్కాయా? ఈ ప్రశ్నలకు ఓ నెటిజన్ ఔనని పేర్కొంటూ సోషల్ మీడియాలో చేసిన పోస్టు కలకలం రేపుతోంది. హ్యాక్-ఐ యాప్‌ను ఉపయోగిస్తున్న 2 లక్షల మంది డేటాను సైబర్ నేరగాళ్లు తస్కరించారంటూ ఆ నెటిజన్ పేర్కొన్నారు. మహిళల ఫోన్ నెంబర్లు, వ్యక్తిగత సమాచారం, లోకేషన్ వివరాలపై హ్యాకర్లు యాక్సెస్ పొందినట్లు వెల్లడించారు. పోలీసులు మాత్రం దీనిపై వివరణ ఇచ్చేందుకు స్పందించడం లేదు.

లింక్ పంపి రూ. 3.82 లక్షలు కొట్టేశారు!

» బ్యాంకు లోగోతో సైబర్ నేరగాళ్ల వల
» మోసపోయిన రైస్ మిల్లు యజమాని
» కేసముద్రంలో ఘటన

కేసముద్రం, జూన్ 3 : తన మొబైల్‌కు వచ్చిన ఓ లింక్‌ను క్లిక్ చేసి వివరాలు నమోదు చేసిన ఓ రైస్ మిల్లు యజమాని రూ.3.82 లక్షలు పోగొట్టుకున్నాడు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం విలేజికి చెందిన ఈ రైస్ మిల్లు యజమాని మొబైల్‌లో వాట్సా‌ప్‌కు ఈ నెల 1న యూనియన్ బ్యాంకు లోగోతో లింక్ వచ్చింది. అయితే తన బ్యాంకు ఖాతాకు సాంకేతిక సమస్య రావడంతో బ్యాంకు వారే తనకు ఈ లింక్ పంపినట్టుగా భావించిన ఆయన ఆ లింక్‌ను క్లిక్ చేసి అందులో అడిగిన బ్యాంకు ఖాతా, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు వివరాలన్నీ నమోదు చేశాడు. ఆ మరుసటి రోజైన ఆదివారం వరుసగా బ్యాంకు నుంచి డబ్బులు డ్రా చేసేందుకు 8 సార్లు ఓటీపీ మెసేజ్‌లు వచ్చాయి. ఆ వెంటనే ఖాతా నుంచి నగదు విత్‌డ్రా అయిపోయింది. ఆయన క్రెడిట్ కార్డు నుంచి రూ.86,300, డెబిట్ కార్డు నుంచి రూ.2.96 లక్షలు వెరసి రూ.3.82 లక్షలను సైబర్ నేరగాళ్లు కాజేశారు. ఈ విషయంపై సైబర్ క్రైం విభాగం 1930కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇదే తరహాలో ఇదే జిల్లా మహబూబాబాద్ మండలం గడ్డిగూడెంతండాలో ఐదు రోజుల క్రితం ఓ బాధితుడు రూ.1.04 లక్షలు పోగొట్టుకున్నాడు.

రాష్ట్రాన్ని తాకిన నైరుతి

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతాల్లోకి ప్రవేశించాయని, ఏపీలో మిగిలిన చోట్ల నాలుగైదురోజుల్లో విస్తరిస్తాయని పేర్కొంది. మంగళ, బుధవారాల్లో తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40-50 కి.మీ వేగంతో వీచే ఈదురుగాలులతో కూడిన తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. అలాగే అక్కడక్కడ భారీ వర్షాలు పడతాయని తెలిపింది. ఆదివారం దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్-ఉత్తర తమిళనాడు తీరం వద్ద పశ్చిమ మధ్య, పరిసర నైరుతి బంగాళాఖాతం ప్రాంతాలలో కేంద్రీకృతమై ఉన్న ఉపరితల ఆవర్తనం సోమవారం సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో కేంద్రీకృతమై ఉందని వెల్లడించింది. కాగా సోమవారం నాటికి 31 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదు అయినట్లు పేర్కొంది. అలాగే 26 జిల్లాలో జూన్ 3 నాటికి నమోదుకావాల్సిన సాధారణ వర్షపాతం కంటే అత్యధిక వర్షపాతం నమోదైనట్లు వెల్లడించింది. మరోవైపు రాగల రెండు రోజులు రాష్ట్రంలో 9 జిల్లాలు మినహా మిగిలిన అన్నింటా 38 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలునమోదవుతాయని తెలిపింది. రాగల మూడు రోజుల్లో రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి, వికారాబాద్, నల్గొండ, నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఏపీ వ్యాప్తంగా పలు చోట్ల సోమవారం భారీ వర్షం పడింది.



గద్వాల జిల్లాలో వర్ష బీభత్సం..

గద్వాల జిల్లాలో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. రాజోలి మండలంలో అత్యధికంగా 14.78 సెంమీ వర్షం కురిసింది. అలంపూర్, ఉండవెల్లిలలో 11 సెంమీ, ధరూర్, వడ్డేపల్లిలలో 10 సెంమీ, కేటీదొడ్డిలో 7.5, గద్వాల, మల్దకల్‌లో 5.5 సెం.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా వాగులు వంకలు పొంగిపొర్లాయి. పొలాలు కోతకు గురయ్యాయి. ఆయా గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లోకి నీళ్లు వచ్చాయి. అలంపూర్‌లోని అక్బర్‌పేట కాలనీలో మోకాలిలోతు నీరు చేరింది. అలంపూర్ మండలం, లింగనవాయిలోని రవీంద్రనాథ్ కాలనీలోకి కూడా వర్షపునీరు చేరింది. కాగా కరీంనగర్ జిల్లా గంగాధర మండలం తాడిజెర్రిలో వడదెబ్బకు గుంటుకు మల్లయ్య (68) అనే వ్యక్తి మృతిచెందాడు.

కూతురికి కూల్‌డ్రింక్‌లో విషం కలిపి ఇచ్చిన తండ్రి

» ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన తొమ్మిదేళ్ల బాలిక
» సంగారెడ్డి జిల్లా శేరిలో దారుణం

వెల్దుర్తి, జూన్ 3: తండ్రి తన కోసం కూల్ డ్రింక్ తీసుకొచ్చాడని ఎంతో మురిసిపోయి తాగింది ఆ పాప. తర్వాత తీవ్ర అస్వస్థతకు గురై నాలుగు రోజులు పాటు మృత్యువుతో పోరాడి సోమవారం ఆస్పత్రిలో మృతి చెందింది. సంగారెడ్డి జిల్లా వెల్దుర్తి మండలం శేరి గ్రామానికి చెందిన ఇక్కిరి శ్రీశైలం, సౌందర్య దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె నిఖిత (9) ఉన్నారు. నిఖిత నాలుగో తరగతి చదువుతోంది. వ్యవసాయం చేసుకునే శ్రీశైలం తన కుమార్తెకు నాలుగు రోజుల క్రితం విషం కలిపిన కూల్‌డ్రింక్ ఇచ్చాడు. అది తాగిన బాలిక అస్వస్థతకు గురైంది. బాలిక వాంతులు చేసుకోవడం గమనించిన కుటుంబసభ్యులు స్థానిక ఆస్పత్రికి తరలించారు. బాలిక పరిస్థితి విషమిస్తుండడంతో స్థానిక వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నిఖిత సోమవారం మృతి చెందింది. నిఖిత మృతికి కన్నతండ్రి శ్రీశైలం ఇచ్చిన కూల్‌డ్రింకే కారణమని చిన్నారి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్రీశైలం తన కూతురికి విషం కలిపిన కూల్‌డ్రింక్ ఎందుకిచ్చాడనేది మాత్రం తెలియరాలేదు.


నిఖిత (ఫైల్)

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఏఎన్‌సీకి ఎదురుదెబ్బ

దక్షిణాఫ్రికా పార్లమెంట్ ఎన్నికల్లో అధికార ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సీ)కి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తెల్లవారి నుంచి దేశానికి విముక్తి సాధించిపెట్టిన ఆ పార్టీ పట్ల ప్రజలు ఈమారు విముఖత ప్రదర్శించడంతో ముప్పయ్యేళ్ళుగా ఒంటిచేత్తో దేశాన్ని ఏలుతున్నదల్లా ఇప్పుడు అధికారంలో కొనసాగడానికి మరోపార్టీతో చేతులు కలుపుతోంది. దేశాధ్యక్షుడు సిరిల్ రాంఫోసా నేతృత్వంలో ఏఎన్‌సీ ఈ ఎన్నికల్లో నలభైశాతం ఓట్లు మాత్రమే తెచ్చుకుంది. ప్రధాన ప్రతిపక్షం డెమోక్రాటిక్ అలయెన్స్ (డీఏ)కు 21శాతం, ఏఎన్‌సీ నుంచి విభేదించి బయటకుపోయిన మాజీ అధ్యక్షుడు జాకోబ్ జుమా నాయకత్వంలోని ఎంకే పార్టీకి 14శాతం వచ్చాయి. వామపక్ష భావజాలం ఉన్న ఎకనామిక్ ఫ్రీడమ్ ఫైటర్స్ (ఈఎఫ్ఎఫ్)కు 9శాతం ఓట్లు పడ్డాయి. ప్రజల్లో వ్యతిరేకత హెచ్చడంతో 1994లో నెల్సన్‌మండేలా నేతృత్వంలో అధికారం చేపట్టిన ఆ పార్టీ తొలిసారిగా ఈ ఎన్నికల్లో ఓటమి చవిచూడాల్సి వచ్చింది. ఏఎన్‌సిని అధికారానికి దూరంగా ఉంచడం ఈ ఎన్నికల సందేశమని విపక్షాల వాదన. ప్రజల ఆదేశాన్ని శిరసావహిస్తాం అంటూ, రాంఫోసా ఇప్పుడు కూటమిదిశగా చర్చలు జరుపుతున్నారు. ఓడినా, ఏఎన్‌సీయే పెద్దపార్టీ కనుక, రాంఫోసాకు ఆ అవకాశం ఉన్నది.

మూడుదశాబ్దాల తరువాత కూడా విద్యుత్, నీరు, ఆహారం ఇత్యాదివి సమస్యలుగా, అందని ద్రాక్షలుగా ఉన్నప్పుడు ప్రజలు మాత్రం ఎంత కని భరిస్తారు? వర్ణవివక్షనుంచి తమను రక్షించిన పార్టీగా ప్రజలకు ఇప్పటికీ ఆ పార్టీమీద ప్రేమాభిమానాలు లేకపోలేదు. కానీ, ఉత్సాహంగా పోలింగ్ బూత్‌ముందు బారులు తీరి ఓటేసిన తీరు మారింది. సకల సమస్యలకు, సమస్త కష్టాలకు తెల్లవాళ్ళే కారణమన్న వాదనకు కూడా కాలం చెల్లిపోయింది. మూడుదశాబ్దాలు అధికారంలో ఉన్న తరువాత, ఎవరినో తప్పుబట్టడానికీ, ఆరోపించడానికి కూడా ఏమీ ఉండదు. దీనికి తోడు, మాజీ అధ్యక్షుడు జాకోబ్ జుమా గత ఏడాది రాంఫోసాతో విభేదించి వేరు కుంపటిపెట్టుకోవడంతో ఏఎన్‌సీ బాగా బలహీనపడింది. పార్టీ ఓటును ఆయన గణనీయంగా చీల్చగలడన్న అంచనాలు నిజమైనాయి. జుమా స్వంత ప్రావిన్సు క్వాజులు నటాల్ లో ఈ చీలిక ప్రభావం బాగా కనిపించింది. అవినీతి, మనీలాండరింగ్ ఇత్యాది ఆరోపణలు ఎదుర్కొంటున్న సిరిల్ రాంఫోసా ఏమాత్రం ఉన్నతంగా వ్యవహరించకుండా తన రాజకీయబలంతో దర్యాప్తులను, విచారణలను అడ్డుకోవడం కూడా పార్టీ పరువు తీసింది. తన రాజకీయ మనుగడకోసం దాదాపు యాభైమంది విపక్ష నేతలు, అధికారులు, హక్కుల కార్యకర్తలను రాంఫోసా హత్య చేయించారన్న ఆరోపణలున్నాయి. దేశంలో అసమానతలు మరింత పెరిగాయి. నల్లవారు, తెల్లవారు అన్న తేడాలేకుండా ఈ ముప్పయ్యేళ్ళలో కొద్దిమంది ఆర్థికంగా బలపడ్డారు. అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోవడానికి ఏఎన్‌సి నాయకులు కారకులని ప్రజలు నమ్మారు. నిరుద్యోగం భయంకరంగా ఉంది, ప్రపంచంలోనే దక్షిణాఫ్రికా అగ్రస్థానంలో ఉంది. దారిద్ర్యం యాభైశాతం దాటింది, నేరాలు అధికమైనాయి. ఇంతటి తీవ్ర పరిస్థితుల నేపథ్యంలో ఈపాటి ప్రజావ్యతిరేకత సహజం కూడా.

ఏకఛత్రాధిపత్యంగా దేశాన్ని దశాబ్దాలు ఏలిన ఓ పార్టీకి ఎవరితోనో పొత్తు పెట్టుకోవాల్సిరావడం పెద్ద విషమపరీక్ష. మైనారిటీ శ్వేతజాతీయుల నాయకత్వంలో, వారి ప్రయోజనాల పరిరక్షణకు ఉద్దేశించిన పార్టీగా పేరుపడిన డెమోక్రాటిక్ అలయెన్స్ (డీఏ)తో కూడా రాంఫోసా చర్చలు జరుపుతున్నట్టుగా వార్తలు వస్తున్నాయి. కానీ, ఈ పార్టీతో చేతులు కలిపితే రాంఫోసాతో పాటు ఏఎన్‌సి మరింత అప్రదిష్టపాలవుతుంది. పార్టీ కేడరు, ఓటరు దీనిని చరిత్రాత్మక ద్రోహంగా, వెన్నుపోటుగా చూసే అవకాశం అత్యధికం. ఇక, అసమానతల నిర్మూలన, అవినీతిపై పోరాటం ఇత్యాది ఆశయాలనేకం లక్ష్యాలుగా ప్రకటించి ఏఎన్‌సీతో దశాబ్దం క్రితం వేరుపడిన మలేమా నాయకత్వంలోని ఎకనామిక్ ఫ్రీడమ్ ఫైటర్స్ (ఇఎఫ్ఎఫ్)తో చేతులు కలిపిన పక్షంలో పెట్టుబడిదారులకు, వ్యాపారవర్గాలకు వ్యతిరేకమన్న సందేశం ఇచ్చినట్టవుతుందని రాంఫోసా భయం. ఇఎఫ్ఎఫ్ రాడికల్ ఆలోచనలకు అనుగుణంగా నడుచుకుంటూ, దాని ఎజెండాకు కట్టుబడటం రాంఫోసాకు సమస్యలు తెచ్చిపెడుతుంది. మాజీ అధ్యక్షుడు జాకోబ్ జుమాతో చేతులు కలిపితే, ఆయనమీద ఉన్న అవినీతి ఆరోపణలు, కేసుల విషయంలో నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించాలి, సమీప భవిష్యత్తులోనే కేసులన్నీ వీగిపోవాలి. అధికారంలోకి రావడానికి రాంఫోసా ఇప్పుడు ఎవరితో పొత్తుపెట్టుకున్నా, అది ఏఎన్‌సి పునాదులు మరింత బలహీనపడటానికే తోడ్పడుతుంది.

మోదీకి తోడైన దైవబలం

'మేము మూడోసారి అధికారంలోకి రావడం ఎంతో దూరంలో లేదు. భారతీయ జనతా పార్టీ అత్యధిక సీట్లు సాధించి తీరుతుంది. దేశం మనోభావాలు ఎలా ఉన్నాయో నాకు బాగా తెలుసు. మూడో టరమ్‌లో మేము ఎన్నో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోబోతున్నాం. అది వేయి సంవత్సరాల వరకు భారతదేశ పునాదిని చెక్కుచెదరకుండా చేస్తుంది. మూడవ టరమ్‌లో భారతదేశం ప్రపంచంలోనే మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుంది' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ గత ఫిబ్రవరిలో రాజ్యసభలో చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో ఎన్డీఏ అఖండ విజయాలు సాధిస్తుందని దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ ప్రకటించడంలో ఆశ్చర్యం లేదు. ఎందుకంటే మళ్లీ మూడోసారి భారీ మెజారిటీతో ఎన్డీఏ అధికారంలోకి రావడం గురించి నరేంద్రమోదీకి కాని, భారతీయ జనతా పార్టీకి గానీ ఎప్పుడూ సందేహాలు లేవు. ఎగ్జిట్ పోల్స్ నిర్వహించిన సంస్థల ప్రతినిధులకు ప్రజలు తమ మనసులో మాట చెప్పుకున్నారు. విచిత్రమేమంటే ప్రతిపక్షాలు గత కొద్ది నెలలుగా ఒక అభూత మాయాజాలాన్ని కల్పించి బీజేపీకి గతంలో మాదిరి సీట్లు రాబోవనే బూటకపు ప్రచారాన్ని విస్తృతంగా జనంలోకి తీసుకువెళ్లాయి. సామాజిక న్యాయం చేస్తామని, ఉచితంగా వనరుల్ని పంచిపెడతామని, ఈ దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ప్రమాదంలో ఉన్నదని జనం ముందుకు వెళ్లాయి. వందలాది పుస్తకాలు, వ్యాసాలు రాశారు. కాని ఇవేవీ ప్రజలు ఏ మాత్రం నమ్మనందుకే ఇవాళ బీజేపీ అఖండమైన మెజారిటీతో తిరిగి రాబోతున్నది.




■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

తన ఎన్నికల మేనిఫెస్టో తొలి పేజీలోనే కాంగ్రెస్ జనం ముందు ఒక ప్రశ్నను ఉంచింది : 'మీ జీవితాలు 2014లో కంటే మెరుగైన విధంగా ఉన్నాయా?' ఈ ప్రశ్న ప్రజలను బాగా ఆలోచింపచేసింది. 2014 కంటే ముందు జరిగిన దుర్మార్గాలు, దారుణాలు వారి కళ్లముందు కదలాడాయి. ఆకలి చావులు, రైతుల ఆత్మహత్యలు, అత్యాచారాలు, మత కల్లోలాలు, సిక్కుల ఊచకోతలు, ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూలదోయడాలు, ప్రశ్నించిన వారిని జైలుపాలు చేయడం, ఒకే కుటుంబానికి వందిమాగధత్వం చేసిన వారికే పట్టం గట్టడం, బోఫోర్స్ నుంచి 2జీ వరకూ లక్షల కోట్ల అవినీతి కుంభకోణాలు, బుజ్జగింపు రాజకీయాలు, భారతీయులుగా ఆత్మగౌరవం కోల్పోవడం మొదలైనవన్నీ ప్రజలు తలుచుకున్నారు.

నిజంగా 2014కు ముందు అంతా బాగుంటే 2014లో మోదీ ఒక ప్రభంజనంలా ఎందుకు జనం ముందుకు వస్తారు? సంకీర్ణ యుగాలను ప్రక్కన పెట్టి పూర్తి మెజారిటీతో బీజేపీని ఎందుకు అధికారంలోకి తీసుకువస్తారు? త్రిపుర, బెంగాల్ లాంటి రాష్ట్రాల్లో వామ పక్షాలను కూడా తుడిచిపెట్టి బీజేపీని ప్రత్యామ్నాయంగా ఎందుకు ఆదరిస్తారు? 2014లోనే కాదు 2019లో కూడా గతంలో భారీ మెజారిటీతో ఎందుకు మోదీకి పట్టం గడతారు? ప్రజలు కొన్ని దశాబ్దాల పాటు కుళ్లిపోయిన రాజకీయ వ్యవస్థల్ని చూశారు కనుకే కొత్తగా ఆలోచించారు. ఎలాంటి అవినీతి మచ్చలేని, ప్రపంచ చిత్రపటంలో భారతదేశ ఆత్మగౌరవానికి పట్టం కట్టగల నాయకుడిని ఎన్నుకున్నారు. గత నాయకత్వాల పట్ల ప్రజలు ఎంత విసిగిపోయారంటే మోదీ మాట్లాడిన ప్రతి మాటకూ ఆకర్షితులయ్యారు. ఆయన ఉపన్యాసాలకు ఉర్రూతలూగారు. ఆయన కరోనా సమయంలో దేశ ప్రజలను ఐక్యంగా ఉంచేందుకు, వారి మనోబలాన్ని పెంచేందుకు ఏమి చేయమంటే అది చేశారు. ప్రజల మనసుల్లో నిరాశా నిస్పృహలు రాకుండా ఒక ఐకమత్యం సాధించడంలో ఆయన విజయం సాధించారు. 140 కోట్లమంది భారతీయులు తనపై అంత విశ్వాసం ఉంచినందువల్లే నరేంద్రమోదీ అనేక సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు. వ్యాపార, పారిశ్రామిక సంస్థలకు, ఎంఎస్ఎంఈ రంగానికీ భారీ ఎత్తున చేయూత కల్పించారు. కాలం చెల్లిన చట్టాలను రద్దు చేశారు. డిజిటల్ ఆర్థిక వ్యవస్థను ప్రవేశపెట్టి జనాన్ని బ్యాంకింగ్ వ్యవస్థలో భాగం చేశారు. ప్రజలకు ఆహారధాన్యాల సరఫరా చేసి ఆకలితో నిద్రించకుండా చూశారు. ప్రపంచ దేశాలన్నీ ఆర్థికంగా క్రుంగిపోతున్న తరుణంలో మోదీ తీసుకున్న చర్యల వల్ల భారతదేశం చెక్కుచెదరకుండా ఆర్థిక సుస్థిరత సాధించింది. ప్రపంచంలో అయిదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. భారతదేశం గత పాలకుల మాదిరి బలహీనంగా వ్యవహరిస్తుందనుకున్న పొరుగుదేశాలు ఈ దేశానికి మోదీ లాంటి బలమైన నేత ప్రధానిగా ఉన్న విషయం మరిచిపోయాయి. పాకిస్థాన్ ఎప్పటిలాగే భారత దేశ సరిహద్దుల్లో చొరబాటుకు ప్రయత్నిస్తే మోదీ ఆ దేశానికి బుద్ధి చెప్పారు. ఆ దేశ సరిహద్దుల్లోకి వెళ్లి మన సేన గుణపాఠం చెప్పింది. చైనా కూడా భారత దేశం పట్ల దుస్సాహసానికి పాల్పడి చివరకు వెనుకంజ వేసింది. మోదీ హయాంలో క్వాడ్, బ్రిక్స్, జీ-20, షాంఘై కార్పొరేషన్, ఐక్యరాజ్యసమితి వంటి అంతర్జాతీయ సంస్థల్లో భారతదేశ ప్రాధాన్యత పెరిగిన తీరు అనన్యసామాన్యం. పుతిన్, బైడెన్ వంటి అగ్రదేశాధినేతలు మోదీకి స్నేహహస్తం చాచి ఆయన దౌత్యనీతిని ప్రశంసించిన సందర్భాలు ఎన్నో. ఈ కారణాల వల్లే 2024 తర్వాత కూడా మళ్లీ మోదీయే రావాలని ప్రజలు అనుకుంటున్నారని ఎగ్జిట్‌పోల్స్ తేల్చాయి.



భగవంతుడు తనతో బృహత్తరమైన పనులు చేయించాలనుకుంటున్నారు కాబట్టే తాను ఈ స్థాయికి ఎదిగి బలమైన నిర్ణయాలు ధైర్యంగా తీసుకోగలుగుతున్నానని మోదీ సవినయంగా చెప్పుకున్నారు. ప్రతిపక్షాలు ఎంత అవహేళన చేసినా పుణ్యభూమి అయిన మన భారతదేశానికి మోదీ ప్రధానిగా లభించడం దైవేచ్ఛ తప్ప మరేమీ కాదు. ప్రతిపక్షాలకు వాటి స్థానం ఏమిటో చూపించడం కూడా దైవేచ్ఛే. అది ప్రజల సమష్టి నిర్ణయం.

ప్రజల నాడి మోదీకి తెలిసినందువల్లే ఆయన తనపై వారికున్న గౌరవాన్ని పార్టీకి ఉపయోగపడేలా చేసేందుకు మోదీ గ్యారంటీ పేరుతో జనంలోకి వెళ్లారు. ఇది పార్టీ నిర్ణయం. గత పది సంవత్సరాలుగా మోదీ పట్ల జనం చూపుతున్న ఆదరణ, ఆరునెలల క్రితం మోదీ ఉధృతంగా ప్రచారం చేసి మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో గెలిపించడంతో సార్వత్రిక ఎన్నికల్లో కూడా మోదీ పేరుతో ముందుకు వెళ్లాలని పార్టీ నిర్ణయించింది. ఈ వ్యూహం ఫలించినట్లు స్పష్టమవుతోంది. నిజానికి మోదీ కూడా తాను కేవలం ఒక వ్యక్తినని భావించడం లేదు. ఆయన ఎప్పుడూ కుటుంబ సభ్యులను ఏ విధంగానూ ప్రోత్సహించలేదు. చిన్నతనంలోనే భార్యను వీడి ప్రజా సేవకు తనను తాను అంకితం చేసుకున్నారు. శంకరాచార్య తన తల్లితో ఏర్పర్చుకున్నట్లే మోదీ కూడా తన తల్లితో భవబంధాలు ఏర్పర్చుకున్నారు కాని ఆయన ఎప్పుడూ కుటుంబ బంధాలకు లోనుకాలేదు ఏదో ఒక దైవిక ప్రోద్బలం లేకపోతే అతి సాధారణ కుటుంబంలో జన్మించిన నరేంద్ర మోదీ చిన్ననాటే సంసార బంధాలను వీడి హిమాలయాలకు ఎందుకు వెళతారు? ఆ తర్వాత రామకృష్ణ మిషన్‌లో లభించిన మార్గదర్శకత్వంతో సంఘ్ కార్యకలాపాలకు ఎందుకు అంకితం అవుతారు? ఆ తర్వాత రాజకీయాల్లో ప్రవేశించి అనూహ్యంగా అంచెలంచెలుగా ఎందుకు పైకి ఎదుగుతారు? ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి పదవులను సుదీర్ఘకాలం నిర్వహించడమే కాక అంతర్జాతీయంగా కూడా భారతదేశం తలెత్తుకునేలా ఎలా చేయగలుగుతారు?. తనతో భగవంతుడు బృహత్తరమైన పనులు చేయించాలనుకుంటున్నారు కాబట్టే తాను ఈ స్థాయికి ఎదిగి బలమైన నిర్ణయాలు ధైర్యంగా తీసుకోగలుగుతున్నానని మోదీ ఇటీవల ప్రకటించడం వెనుక ఉద్దేశం ఇదే. ప్రతిపక్షాలు ఎంత అవహేళన చేసినా పుణ్యభూమి అయిన మన భారతదేశానికి మోదీ ప్రధానిగా లభించడం దైవేచ్ఛ తప్ప మరేమీ కాదు. ప్రతిపక్షాలకు వాటి స్థానం ఏమిటో చూపించడం కూడా దైవేచ్ఛే. అది ప్రజల సమష్టి నిర్ణయం.

(బీజేపీ జాతీయ కార్యదర్శి)

కొత్త ప్రభుత్వం ముందున్న సవాళ్లు

ప్రచండ వేసవి, ఆ పై ఎన్నికల వేడి... ఆసేతు హిమాచలం సమస్త ఓటర్లకు ఎన్నడూ లేనిరీతిలో ఉక్కపోత కల్పించాయి. కేంద్రంలో తదుపరి ప్రభుత్వాన్ని ఏ పార్టీ / కూటమి ఏర్పాటు చేసినప్పటికీ వివిధ సమస్యలను (ఎన్నికల ప్రచారం వాటిని ప్రజల దృష్టి నుంచి నెట్టివేసింది మరి) ఎదుర్కోవలసి వుంటుంది. మన దేశ పాలన అనేక లోపాలు, లొసుగులతో భ్రష్ట స్థితిలో ఉన్నది. అన్నిటా అసమగ్రతలు. కళంకాలూ తక్కువేమీ కాదు. ఈ సమస్యలను దీక్షా దక్షతలతో పరిష్కరించని పక్షంలో మన రిపబ్లిక్ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది.

మొదటి లోపం అవినీతిమయమైన పార్టీ వ్యవస్థ. రాజకీయ పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యముండాలి. నాయకులను స్వేచ్ఛగా ఎన్నుకోవాలి. ఎన్నికైన నేతలు తమ సహచరులకు జవాబుదారీగా ఉండాలి. మరి భారతీయ రాజకీయాలు ఈ సమున్నత ప్రమాణాలకు యోజనాల దూరంలో లేవా? మన రాజకీయ పక్షాలు వ్యక్తి ఆరాధనకు నెలవులుగా ఉన్నాయి. లేదంటే కుటుంబ సంస్థలుగా మారిపోయాయి. మొదటి రకం పార్టీలకు ప్రథమ ఉదాహరణ భారతీయ జనతా పార్టీ. ఒక దశాబ్ద కాలంగా పార్టీ యంత్రాంగమంతా – ప్రభుత్వంలోని అనేక విభాగాలు కూడా... నరేంద్ర మోదీని ఒక మహా నాయకుడుగా చూపేందుకు శతవిధాల పాటుపడుతున్నాయి. మోదీ మహాశయుడు దైవాంశ సంభూతుడని, దైవతుల్యుడని ప్రచారం చేస్తున్నాయి. దేశ పౌరులు అందరూ ఆయన్ని ఆరాధించాలని ఒత్తిడి చేస్తున్నాయి. మోదీని నిరాక్షేపణీయంగా అనుసరించాలని ప్రేరేపిస్తున్నాయి. కాగా వివిధ రాష్ట్రాలలో ప్రభుత్వాధినేతలుగా ఉన్న పలువురు నాయకులు కూడా ఇటువంటి వ్యక్తి పూజకు కేంద్రంగా ఉన్నారు. బెంగాల్‌లో మమతా బెనర్జీ, కేరళలో పినరాయి విజయన్, ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్, ఆంధ్రాలో జగన్‌మోహన్ రెడ్డి, ఒడిషాలో నవీన్ పట్నాయక్‌లు తమ మాటే వేదవాక్కుగా వ్యవహరిస్తున్నారు.

కుటుంబ జమీగా మారిపోయిన పార్టీలు ప్రజాస్వామిక సంస్థలుగా చెలామణికావడం మరింత భయంకరమైన వాస్తవం. ఇందుకు తొలుత భారత జాతీయ కాంగ్రెస్‌నే వేలెత్తి చూపాలి. కాకపోతే దశాబ్దాలుగా పార్టీకి సేవలు అందిస్తున్న వారిని పక్కన పెట్టి ప్రియాంక గాంధీని రాత్రికి రాత్రే ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా చేయడమేమిటి? గాంధీలను అనుసరించే ఇతర నాయకులూ వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను చూడండి. తాను ఒకప్పుడు ప్రాతినిధ్యం వహించిన గుల్బర్గా నియోజక వర్గం నుంచి ఈ సారి సొంత అల్లుడిని నిలబెట్టారు. ఖర్గే కుమారుడు ఇప్పటికే కర్ణాటక మంత్రివర్గంలో సభ్యుడుగా ఉన్నారు. ఇదే విధంగా బిహార్‌లో రాష్ట్రీయ జనతాదళ్, ఉత్తర ప్రదేశ్‌లో సమాజ్‌వాది పార్టీ, తమిళనాడులో డీఎంకే అధినేతలు రాజకీయ పెత్తందారులుగా వ్యవహరిస్తున్నారు. పార్టీపై తమ కుటుంబ పెత్తనం శాశ్వతంగా సాగేందుకు వారు సంకల్పించుకున్నారని మరి చెప్పనవసరం లేదు.

సరైన కారణాలు లేకుండా పౌరులను అరెస్ట్ చేసి, ఎలాంటి విచారణ లేకుండా వారిని సంవత్సరాల తరబడి జైళ్లలో నిర్బంధించడానికి వీలు కల్పిస్తున్న వివిధ చట్టాల మూలంగా భారత ప్రజాస్వామ్య ప్రమాణాలు మరింతగా దిగజారిపోతున్నాయి. రాజకీయ ప్రత్యర్థులను, ఆ మాటకొస్తే భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్న వారినందరినీ బెదిరించేందుకు, మౌనం పాటించేలా చేసేందుకు ఈ చట్టాలను ఉపయోగిస్తున్నారు. పాలకులు చట్టాలను దుర్వినియోగపరచడంలో న్యాయస్థానాలు సైతం భాగస్వాములు అవుతున్నాయి. బెయిల్ మంజూరు చేయడంలో న్యాయమూర్తులు గర్హనీయమైన మందకొడితనంతో వ్యవహరిస్తున్నారు. నాగరీక సమాజాలలో ఉండకూడని ఊపా లాంటి చట్టాలు అమల్లో ఉండేందుకు సైతం వారు అనుమతించడం విస్మయం కలిగిస్తోంది.



పార్టీ వ్యవస్థ సక్రమంగా పనిచేయకపోవడం, భారత రాజ్య వ్యవస్థ అప్రజాస్వామిక స్వభావం, లోపభూయిష్టమైన ఆర్థికాభివృద్ధి నమూనా, పర్యావరణ విధ్వంసం... ఈ సమస్యలన్నిటికీ ప్రధాన బాధ్యత దశాబ్దాల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీదే అయినా 2014లో నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన తరువాత అవి మరింతగా విషమించాయి. జూన్ 4 అనంతరం కేంద్రంలో ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ వాటిని సమర్థంగా ఎదుర్కోవాలి. పాలనలో లోపాలు, లొసుగులను పరిహరించి ప్రజలకు శ్రేయస్సు సమకూర్చాలి. మరి రాబోయే ప్రభుత్వం నిజంగా ఇలా వ్యవహరిస్తుందా అన్నది వేరే విషయం.

ఇవీ మన రాజకీయ, పాలనా వ్యవస్థల లోని లోపాలు, లొసుగులు. అయితే ప్రపంచ అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ, ప్రజాస్వామ్యాల మాతృమూర్తి మొదలైన శబ్దాడంబరంతో కూడుకున్న పాలకుల ప్రచార హోరులో అవి కన్పించడంలేదు, విన్పించడంలేదు. 'ప్రపంచపు అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ' అనే ఘనత పాలకుల అనేక పాపాలను మరుగు పరుస్తోంది. ఆర్థిక సంస్కరణలు పేదరికాన్ని తగ్గించిన మాట వాస్తవమే అయినా అవి అసమానతలను విపరీతంగా పెంచాయి. జాతీయ ఆదాయం పెరుగుతున్నప్పటికీ అందుకు అనుగుణంగా ఉద్యోగాలు పెరగడంలేదు. కోటీశ్వరులను ఉత్పత్తి చేయడంలో ప్రపంచ అగ్రగామిగా ఉన్న భారత్‌లో విద్యావంతుల నిరుద్యోగిత కూడా చాలా హెచ్చుస్థాయిలో ఉన్నది. కార్మిక శ్రేణులలో మహిళల సంఖ్య ఇప్పటికీ చాలా తక్కువగా ఉండడం దేశానికి నిజంగా సిగ్గుచేటు. భారతదేశ ఆర్థికాభివృద్ధి చరిత్ర మిశ్రమమైనది. వర్తమాన భారత పర్యావరణ ఇతిహాసం విధ్వంసకరమైనది. భారత్ ఆర్థికోన్నతికి అద్దంగా ఉన్న బెంగళూరులో నీటి సంక్షోభం, న్యూఢిల్లీలో వాయు కాలుష్యం మన జీవితాలను నియంత్రించే జీవ భౌతిక వాస్తవాలను ఎంతగా నిర్లక్ష్యం చేస్తున్నమనడానికి ప్రత్యక్ష నిదర్శనాలు.

భారత్ పర్యావరణ ఆరోగ్యం దుర్బలమవుతోంది. మనం విషపూరిత గాలిని పీలుస్తున్నాం. భూగర్భ జలాలు తరిగిపోతున్నాయి. నదులలో నీటి మట్టాలు అడుగంటుతున్నాయి. నేలలు కలుషితమయిపోతున్నాయి. జీవవైవిధ్యం వేగంగా అంతరించిపోతున్నది. ఇవన్నీ కోట్లాది భారతీయుల ఆరోగ్యానికి, ఎనలేని హాని చేస్తున్నాయి. వారి జీవనాధారాలకు అపాయం కలిగిస్తున్నాయి. ఈ పరిణామాలు మన భవిష్యత్తు విషయమై ఆందోళనకర ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. వనరుల సాంద్ర, పెట్టుబడి సాంద్ర పారిశ్రామికీకరణ నమూనా సుస్థిరాభివృద్ధికి దోహదం చేసేది కాదని స్పష్టమయింది. ఈ సందర్భంగా నేను ఒక విషయాన్ని స్పష్టం చేయదలిచాను. భారతదేశ పర్యావరణ సంక్షోభం వాతావరణ మార్పుతో ప్రమేయం లేకుండా సంభవిస్తోంది. ఇదొక కఠోర వాస్తవం. వాతావరణ మార్పు పర్యావరణ సంక్షోభాన్ని విషమింపచేస్తుందనడంలో సందేహం లేదు. అయితే వాతావరణ మార్పు అనే సమస్య లేనప్పటికీ పర్యావరణ భద్రత, సమతుల్యత విషయమై మనం అనేక సవాళ్ళ, సమస్యలను ఎదుర్కోవలిసి ఉన్నది. అవన్నీ మన స్వయంకృతాలే అన్నది విస్మరించకూడని వాస్తవం.

పార్టీ వ్యవస్థ సక్రమంగా పనిచేయకపోవడం, భారత రాజ్య వ్యవస్థ అప్రజాస్వామిక స్వభావం, లోపభూయిష్టమైన ఆర్థికాభివృద్ధి నమూనా, మన అస్తిత్వ ప్రాకృతిక ప్రాతిపదికల విధ్వంసం... ఈ సమస్యల మూలాలు మన రిపబ్లిక్ నిర్మాణ వ్యవస్థల్లో ఉన్నాయి. వాటికి ప్రధాన బాధ్యత దశాబ్దాల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీదే. అయితే 2014లో నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన తరువాత అవి మరింతగా విషమించాయి. పర్యవసానంగా దేశ పురోగతి బాగా కుంటువడింది. మతతత్వ సమస్యనే చూడండి. అదేమీ కొత్త విపత్తు కాదు. పాకిస్థాన్ ఆవిర్భవించిన నాటి నుంచీ, భారత్‌లోనే ఉండిపోయిన ముస్లింల పరిస్థితి అభద్రతలో పడిందని చెప్పడం చాలా తక్కువగా చెప్పడమే అవుతుంది.



■ రామచంద్ర గుహ

పాకిస్థాన్ తన మైనారిటీ వర్గాల పట్ల ఏ విధంగా వ్యవహరించినప్పటికీ భారత్‌లోని ముస్లింలకు హిందువులతో పాటు సమాన పౌరసత్వ హక్కులు ఉంటాయని భారతీయ ముస్లింలకు భరోసా కల్పించేందుకు జవహర్‌లాల్ నెహ్రూ చాలా కష్టపడ్డారు. అయినప్పటికీ దేశ విభజన కష్ట నష్టాలను ముస్లింలే భరించవలసివచ్చింది. తోటి భారతీయులు వారిని తరచు అనుమానంతోనూ, శత్రుభావంతోను చూశారు. రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిత్వ కాలంలో హిందువులు–ముస్లింల మధ్య సంబంధాలు క్షీణించాయి. హిందూ, ముస్లిం తీవ్రవాదులు ఇరువురినీ సంతృప్తిపరచడానికి రాజీవ్ ప్రభుత్వం వ్యవహరించిన తీరుతెన్నుల కారణంగానే మతతత్వ సమస్య మరింత తీవ్రమయింది.

నేను ప్రస్తావించదలుచుకున్న చివరి సమస్య కేంద్ర ప్రభుత్వం – రాష్ట్రాల మధ్య సంబంధాలు. 1959లో కేరళలో కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వాన్ని నెహ్రూ బర్తరఫ్ చేయడం గురించి బీజేపీ మద్దతుదారులు తరచు మాట్లాడుతుంటారు. ఇందిరాగాంధీ హయాంలో అధికరణ 356ను తరచుగా ఉపయోగించడం జరిగిందని కూడా బీజేపీ శ్రేణులు ఫిర్యాదు చేస్తుంటాయి. అయితే బీజేపీయేతర పార్టీల ప్రభుత్వాలు అధికారంలో ఉన్న రాష్ట్రాల పట్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దాదాపుగా శత్రుత్వ భావంతో వ్యవహరించడం పరిపాటి అయింది. బీజేపీ పాలనలో లేని రాష్ట్రాల న్యాయబద్ధ హక్కులను ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా పూర్తిగా ఉపేక్షిస్తున్నారు. ఆ రాష్ట్రాల ముఖ్యమంత్రులను అమర్యాదకర భాషలో పరిహసిస్తున్నారు. ఆ రాష్ట్రాలకు గవర్నర్లుగా నియమితులయిన పెద్ద మనుషులు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాల పాలనకు రాజ్యాంగ విహితంగా పాలించేందుకు చీటికీ మాటికీ అనేక అవరోధాలు కల్పిస్తున్నారు. న్యూఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొనేందుకు ఆ రాష్ట్రాలకు అనుమతి నిరాకరిస్తున్నారు దేశంలోని ప్రతి రాష్ట్రమూ బీజేపీ పాలనలోకివచ్చే దాకా కేంద్రంలోని బీజేపీ పాలకులు విశ్రమించబోరని వివిధ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. భారత ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యం స్థానంలో హిందూ గణతంత్ర రాజ్యం స్థాపన ఆకాంక్షతోనే హిందూ రాజ్య ఆకాంక్షలతోనే వారు ఇలా నిరంకుశంగా వ్యవహరిస్తున్నారనేది కూడా మరింత స్పష్టమే.

సరే, కోట్లాది భారతీయులు 18వ సార్వత్రిక ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం వహించని రాజకీయ పార్టీల, రాజీపడి వివేక భ్రష్టత్వంతో వ్యవహరిస్తున్న ప్రభుత్వ సంస్థల, అప్రజాస్వామిక చట్టాల, బలహీనపడుతున్న ఆర్థిక వ్యవస్థ, ధ్వంసమవుతున్న పర్యావరణం, మతపరమైన మైనారిటీలలో తీవ్రమవుతున్న అభద్రతా భావం, సమాఖ్య పాలనా వ్యవస్థపై పెరుగుతున్న ఒత్తిళ్ల సందర్భంలో వారు ఓటు వేశారనే వాస్తవాన్ని మనం విస్మరించకూడదు. జూన్ 4 అనంతరం కేంద్రంలో ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ ప్రస్తావిత సవాళ్ల, సమస్యలను సమర్థంగా ఎదుర్కోవాలి. పాలనలో లోపాలు, లొసుగులను పరిహరించి ప్రజలకు శ్రేయస్సు సమకూర్చాలి. మరి రాబోయే ప్రభుత్వం నిజంగా ఇలా వ్యవహరిస్తుందా అన్నది వేరే విషయం.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

ఏ పార్టీ గెలిచినా ఓడేది ప్రజలే!

ఏ పార్టీ గెలుస్తుంది? ఏ పార్టీ పోతుంది? దేనికి ఎన్ని సీట్లు? ఎన్ని? ఇన్నా? అన్నా? అన్నేనా? చర్చలు! చర్చలు! వాదాలు! కాలక్షేపపు వాదాలు! ఎన్ని చేసినా పార్టీల సమర్థకులైతే ఫరవాలేదు! కానీ, మేధావులు! ఆలోచనాపరులు! పత్రికల్లో! టీవీల్లో! ఎన్నికల ఫలితాలకోసం రాత్రింబవళ్ళూ కబుర్లు! ఏ పార్టీ? ఏ పార్టీ? శ్రమ దోపిడీనే లక్ష్యంగా పెట్టుకున్న పార్టీల్లో ఏదో ఒక పార్టీ కోసం వెతుకులాటా, నిరీక్షణా!

ఇప్పుడున్న ఎన్నికల తంతునీ, అమలులో వున్న రాజ్యాంగాన్నీ, చలామణీలో వున్న ప్రజాస్వామ్యాన్నీ మేధావులు కూడా పసిపిల్లలకన్నా అమాయకంగా నమ్ముతూ అంచనాలు కడుతున్నారు. ఈ మేధావులు, ప్రజలకు మేలు చేసే పార్టీ ప్రభుత్వం వస్తే బాగుండునని కోరుకుంటారు. తక్షణ ఉపశమనం గురించి మాత్రమే ఆలోచించే అల్పసంతోషులైన వీరు, శ్రమ దోపిడీ విషయాలను కనీసంగా కూడా ఎత్తరు. ఉన్న పరిస్థితుల్లో, ఎప్పటికప్పుడు తక్షణ ఉపశమనాల గురించే ఆలోచిస్తే, దీర్ఘకాలిక పరిష్కారం గురించి ఎప్పుడు? 'శరీరంలో పెద్ద జబ్బు యేదో వున్నా, తలనొప్పిని పట్టించుకోకూడదా?' అంటారు. నిజమే. తాత్కాలిక సమస్యల్ని కూడా పట్టించుకుంటేనే ఒక అడుగు ముందుకు వెయ్యగలం. అయితే, అసలు జబ్బు సంగతి ఎప్పుడు? తల నొప్పీ, ఈ నొప్పీ, ఆ నొప్పీ రావడం అసలు జబ్బువల్లే అయితే, జబ్బుతో సంబంధం లేకుండా చిన్న నొప్పులు రాకుండా చూడడం సాధ్యమేనా? 'శ్రమ దోపిడీ' అనే జబ్బువేపు ఎప్పుడు చూస్తారు? అది సాధారణ ప్రజలకు తెలీదు. మేధావులకీ తెలీదా? దాని గురించి ప్రజలకు ఎప్పుడు తెలుపుతారు?

ప్రజానుకూల మేధావులకు దురుద్దేశాలను ఆపాదించలేము. కానీ, ఆ విషయాల్ని పైపైనే చూసే, రాసే రాతలూ, ఎన్నికల్లో సీట్ల సంఖ్యలూ, ప్రజల్ని భ్రమల్లోనే వుంచుతాయి. మేధావులు కూడా భ్రమల్లో ఉండడానికే అలవాటైపోతున్నారా? ఎన్నికల్లో నిలబడ్డ పార్టీల్ని, అధికారంలో వున్నా, లేకపోయినా, ప్రతీ ఒక్క పార్టీనీ వేరు వేరు స్వభావాలతో, వేరు వేరు లక్ష్యాలతో వున్నదాన్నిగా, ఈ మేధావులు భావిస్తారు. ఆ భావనలు నిజం కావని ఆ పార్టీలు అమలు చేసే విధానాల్ని బట్టి తెలిసిపోతుంది. 'ప్రైవేటీకరణ' విధానాన్ని ప్రతీ పార్టీ అమలు చేస్తుంది, కాకపోతే, కొన్ని హెచ్చు తగ్గులతో! ఉద్యోగ భద్రత పోయి, ప్రైవేటు యజమానుల దయాదాక్షిణ్యాల మీద బతికే జీవితాన్నే ఇస్తాయి పార్టీలు. అలాగే, 'సరళీకరణ' పేరుతో ఏమి చేస్తారో చూడండి: వాతావరణ కాలుష్యం జరగరాదనే దృష్టి గానీ, పని పరిస్థితుల్లో కార్మికుల భద్రతకు అవసరమైన ఏర్పాట్లు వుండాలనే దృష్టిగానీ, ఏదీ లేకుండా, పరిశ్రమలకు తేలిగ్గా (సరళంగా) అనుమతులిచ్చేసే పార్టీలే కదా ఇవి! పైగా, దోపిడీదారులకే భూముల్ని అడ్డగోలుగా నామమాత్రపు ధరలకు ఇవ్వడాలూ, కరెంటూ-నీళ్ళూ ఉచితంగానో, చవగ్గానో ఇవ్వడాలూ! 'ప్రపంచీకరణ' పేరుతో, విదేశీ కంపెనీలకు ఇక్కడి తలుపులూ, కిటికీలూ తెరిచి పెట్టడం! ఈ విధానాల్ని తిరస్కరించే పార్టీ ఒక్కటైనా వుంటుందా?

'స్వతంత్రం! స్వతంత్రం వచ్చేసింది! పోరాడి సాధించాం'- అంటారు! నిరుద్యోగ సమస్యకి పరిష్కారాన్ని సాధించారా? 75 ఏళ్ళగా వుంటూనే వుంది! ఏ సమస్యకైనా, ఏ దరిద్రానికైనా కారణం, శ్రమ దోపిడీని పెద్ద స్థాయిలో నడిపించే 'పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానమే' అని గ్రహించలేరా మన ప్రజానుకూల మేధావులు? గ్రహించినా ప్రజలకు తెలపలేరా? ధరల పెరుగుదలకు కారణమేమిటో గ్రహించినా బైటపెట్టలేరా? తిండీ, బట్టా, నివాసమూ, విద్యా, వైద్యమూ అనే కనీస అవసరాల్ని తీర్చని విషయంలో పార్టీల మధ్య ఏమిటి తేడా? దేశంలో కలిమి అంతా ఒక వర్గం దగ్గిరా, లేమి అంతా ఇంకో వర్గం దగ్గిరా పోగుపడడానికి ఈ పార్టీలు కారణమని మేధావులకి తెలీదా? కోటి రూపాయలతో కార్లు కొనేవాళ్ళు ఒక వేపూ, పొట్టకూటి కోసం ప్రాణాలకి తెగించి డ్రయినేజీ గోతుల్ని శుభ్రం చేసేవాళ్ళు ఇంకోవేపూ వుండడానికి ఈ పార్టీలు కారణం కాదా?

'రాజ్యాంగాన్ని రక్షించాలి!' అంటారు. అసలు రాజ్యాంగమే అనేక అసమానతలకి మూలం. ఇతరుల శ్రమని దోచి, లాభాలూ, వడ్డీలూ, కౌళ్ళూ అనే ఆదాయాలకు వీలునిచ్చే ఆస్తి హక్కుల్ని ఇస్తుంది. కొందరు పౌరులు, జీవితాంతమూ అట్టడుగు శారీరక శ్రమలే చేసే వారిగానూ, కొందరు పౌరులు ఎప్పుడూ మేధా శ్రమలే చేసే వారిగానూ వుండే అసమాన శ్రమ విభజనను నిలిపివుంచుతుంది. ఇలాంటి రాజ్యాంగాన్ని రక్షించమని శ్రామిక ప్రజలకు బోధించి ప్రయోజనం లేదు. నామమాత్రమైన హక్కుల్ని కూడా లేకుండా చేసే పార్టీని గెలిపించవద్దంటారు మేధావులు. కానీ, ఉన్న అన్ని పార్టీలూ, అధికారంలో వున్నప్పుడు ఒక రకంగా, లేనప్పుడు ఒక రకంగా ప్రవర్తించేవే.

'ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది' అంటారు. అసలు ఉన్న ప్రజాస్వామ్యమే కొద్దిమంది అనుభవించే ప్రజాస్వామ్యం అని ఈ మేధావులకి తెలియదా? ఓటు హక్కు ఇచ్చి, ప్రజాస్వామ్యంలో ప్రజలే స్వాములు అని భ్రమింపజేస్తే ఎలా? జీవితావసరాలూ, వాటి తయారీకి కావలసిన ఉత్పత్తి సాధనాలూ ఒక వర్గానికి రిజర్వ్ అయివుండగా, మిగతా కోట్ల మంది మొహాన 'రిజర్వేషన్లు' అనే మెతుకులు విసిరితే, ఆర్థిక రంగంలో ప్రజాస్వామ్యం ఉన్నట్టా? దుర్మార్గమైన నిర్బంధ చట్టాల్ని దుర్వినియోగం చేసే ప్రభుత్వం వద్దంటారు. శత్రు వర్గాలున్న సమాజంలో, ఏ పార్టీ ప్రభుత్వం అయినా ఆ నిర్బంధ చట్టాలు లేకుండా పాలించలేదు. 75 ఏళ్ళ చరిత్రలో ఈ పార్టీలు, ఎన్నో నిర్బంధ చట్టాలను కొత్తగా తయారు చేయడమో, ఉన్నవాటిని మరింత కఠినం చేయడమో చూడవచ్చును.



డబ్బూ, కులం, మతం, ఉచితాల పేరుతో పడేసే ముష్టి పథకాలూ ఉపయోగించి పార్టీలు అధికారంలోకి రావడానికే గదా ఈ ఎన్నికలు? ఎన్నికలకూ, పార్టీలకూ, వాటి విధానాలకూ సంబంధించిన నిజాల్ని ప్రజలకు వివరించే రాతలూ, చర్చలూ అవసరం. అంతేగానీ, ఈ పార్టీ గెలిస్తే ఏమి జరుగుతుందీ, ఆ పార్టీ వస్తే ఏమి జరుగుతుందీ అనే రాతలూ, చర్చలూ కాలక్షేపం కబుర్లుగా మిగిలిపోతాయి.

అన్ని రంగాలలోనూ అసమానతలున్న ఈ సమాజంలో ఎన్నికలు అనేవి, "పాలకవర్గంలోని ఒక ముఠా చేతుల్లోనించీ ఇంకో ముఠా చేతుల్లోకి బదిలీ చేసే సాధనంగా వుంటున్నది" అని ఈ ప్రజానుకూల మేధావులు గుర్తించి, ప్రజలకు చెప్పకపోతే ఎలాగ? ఎప్పుడో 155 ఏళ్ళ కిందటే, మార్క్సు అనే మేధావి గుర్తించిన విషయాన్ని, మనం 75 ఏళ్ళ అనుభవంలో చూడలేదా? ("సార్వత్రిక ఓటింగు ఎటువంటిదిగా వుంటుందంటే, కొన్ని సంవత్సరాలకు ఒక మారు పార్లమెంటరీ వర్గ పాలన కోసం అనుమతిని మంజూరు చెయ్యడానికి మాత్రమే ఉపయోగపడుతూ వుంటుంది." -మార్క్స్) ఎన్నికలు "పాలక వర్గాల చేతిలో ఒక ఆటబొమ్మగా దుర్వినియోగం" అవుతున్న విషయం, ఎన్నికలు జరుగుతున్న తీరులోనే కనపడుతున్నది గదా? డబ్బూ, కులం, మతం, ఉచితాల పేరుతో పడేసే ముష్టి పథకాలూ ఉపయోగించి పార్టీలు అధికారంలోకి రావడానికే గదా ఈ ఎన్నికలు? ఎన్నికలకూ, పార్టీలకూ, వాటి విధానాలకూ సంబంధించిన నిజాల్ని ప్రజలకు వివరించే రాతలూ, చర్చలూ అవసరం. అంతేగానీ, ఈ పార్టీ గెలిస్తే ఏమి జరుగుతుందీ, ఆ పార్టీ వస్తే ఏమి జరుగుతుందీ అనే రాతలూ, చర్చలూ కాలక్షేపం కబుర్లుగా మిగిలిపోతాయి.

సరైన రాజకీయ జ్ఞానం అందకపోతే, ప్రతీ ఎన్నికలోనూ ఓడిపోయేది ప్రజలే కదా?

■ రంగనాయకమ్మ

ఎన్ని కలలు.. ఎన్నికల పాఠాలు!

రాజకీయ ప్రక్రియగా సాగాల్సిన ఎన్నికలు ఆధిపత్య విద్వేష రాజకీయాలకు ఆలవాలంగా మారాయి. విధానాల ప్రాతిపదికన జరగాల్సిన ఎన్నికలు కులం, మతం పేరుతో సమాజాన్ని విభజించడమే గాక, ధన బలమే నిర్ణయాత్మక శక్తిగా మారి ప్రజాస్వామ్య ప్రక్రియనే అపహాస్యం చేశాయి. స్వతంత్ర భారతంలో ఎన్నడూ లేని విధంగా వికృత ధోరణులతో సాగిన ఎన్నికల ప్రక్రియ మరెన్నో హెచ్చరికలు చేసింది. రాజ్యాంగ బద్ధంగా ఏర్పడ్డ పాలనా వ్యవస్థలు అధికార పార్టీ కొమ్ముకాసే విధంగా దిగజారాయి. దేశ భద్రతను కాపాడే రక్షణ దళాల కర్తవ్యాలు–త్యాగాలు ఓట్లు రాల్చే సాధనాలుగా మారిపోయాయి. నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాల్సిన ఎన్నికల కమిషన్ అధికార పార్టీ కనుసన్నుల్లో నడిచేదిగా కుచించుకుపోయింది. దేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఎన్నికల సంఘం ఆర్టికల్ 324ను తవ్వితీసి ప్రచార గడువును కుదించింది. ఎన్నికల కమిషన్ సభ్యులు చివరి క్షణంలో రాజీనామా చేయడం వివాదాస్పదమైంది. నూతనంగా వచ్చిన కమిషన్ బాధ్యులు ఎన్నికల షెడ్యూల్ ఖరారు చేయడమే ప్రధాని మోదీకి కలిసివచ్చిందనే వాదన ఉన్నది. సమాచార వ్యవస్థ పటిష్టంగా లేని సమయంలో కూడా స్వల్ప వ్యవధిలో ఎన్నికలు నిర్వహించిన చరిత్ర ఉంది. అలాంటిది సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చి కూడా ఏడు విడతలుగా ఎన్నికలు ఎందుకు నిర్వహించాల్సి వచ్చిందో అంతుబట్టని విషయమే. స్వతంత్ర భారతంలోని తొలినాళ్లలో రాజకీయ సిద్ధాంతాలు, విలువలు పునాదిగా ఎన్నికలకు జరిగేవి. 2014లో పోటీచేసిన అభ్యర్థుల ఎన్నికల అఫిడవిట్లను పరిశీలిస్తే ఎన్నికైన వారిలో 50శాతం మంది కోటీశ్వరులే. తెలంగాణలో హుజూరాబాద్ ఉప ఎన్నికలో జరిగిన ఓటుకు నోటు విధానం కొంత ప్రజలను మేల్కొల్పింది. ప్రజలు రాజకీయాలకు ప్రాధాన్యం ఇవ్వటం వల్లే ఈ గెలుపు సాధ్యమైంది. ఈ కాలంలో అలాంటి ఉదాహరణలు అక్కడక్కడ కన్పిస్తున్నాయి. సామాన్యుడు పోటీలో నిలబడగలడా? అనే సందేహాలకు హుజురాబాద్ ఉప ఎన్నిక కారణమైంది. కానీ, 2023 ఎన్నికల ఫలితాలు దానికి మంచి సమాధానం చెప్పాయి. ప్రజాస్వామ్యాన్ని బ్రతికించుకోవాలంటే ఎన్నికల సంఘం విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావాలి. ఎన్నికల ప్రక్రియ వారంలో ముగిసే విధంగా రూపొందించాలి.

– డాక్టర్ సంగని మల్లేశ్వర్
కాకతీయ విశ్వవిద్యాలయం





మహబూబాబాద్‌లోని టీఎస్‌డబ్ల్యూఆర్ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాట్లు



ఏనుమాముల మార్కెట్‌లో కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు

ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాటుచేసిన టేబుళ్లు, కుర్చీలు



టిక్..టిక్..టిక్..



నేడే లోక్‌సభ ఓట్ల లెక్కింపు

- ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ
- వరంగల్ బరిలో 42 మంది అభ్యర్థులు
- మూడంచెల భద్రత మధ్య ఏనుమాముల మార్కెట్లో కౌంటింగ్ ప్రక్రియ
- ఉదయం 8గంటల నుంచి లెక్కింపు ప్రారంభం
- పోస్టల్, హోమ్ ఓటింగ్ లెక్కింపునకు ప్రత్యేక టేబుల్
- 125 టేబుళ్లు.. 127 రౌండ్లు... 396 మంది సిబ్బంది
- తొలి ఫలితం వరంగల్ తూర్పు నుంచే వెలువడే అవకాశం



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

22రోజుల ఉత్కంఠకు తెరపడబోతోంది. గత నెల 13న పార్లమెంట్ ఎన్నికలకు పోలింగ్ జరగ్గా.. నాటి నుంచి ఫలితాలపై అందరూ ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. జూన్ నాలుగో తేదీ ఎప్పుడొస్తుందా అని క్యాలెండర్ల వైపు చూస్తూ గడిపారు. ఈ క్రమంలో మంగళవారం లోక్‌సభ ఓట్ల లెక్కింపు జరగనుండగా అందుకోసం యంత్రాంగం పూర్తి ఏర్పాట్లు చేసింది. మంగళవారం ఉదయం 8గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరగనుండగా వరంగల్ పార్లమెంట్ స్థానానికి సంబంధించి ఏనుమాముల మార్కెట్ యార్డులో సర్వం సిద్ధం చేశారు.



వరంగల్ ఎంపీ స్థానానికి 42మంది అభ్యర్థులు బరిలో నిలిచినా ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ జరిగి నట్టు అంచనాలు వేస్తున్నారు. పోలింగ్ అనంతరం వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ ఆవరణలోని స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరిచారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. దీంతో విజయం ఎవరిని వరిస్తుందో అనే ఉత్కంఠతో అన్ని పార్టీల్లో నెలకొంది.

కౌంటింగ్ కేంద్రంలో విస్తృత ఏర్పాట్లు

వరంగల్ లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఏనుమాముల మార్కెట్‌లో మంగళవారం ఉదయం 8గంటలకు ప్రారంభం కానుంది. ఇందుకోసం వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లోని అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. మొత్తం వరంగల్ పార్లమెంట్ పరిధిలో 18,24,466 ఓట్లుండగా, 12,56,301 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 68.86శాతం పోలింగ్ నమోదవగా.. మొత్తం 1,900 పోలింగ్ కేంద్రాల్లో 5,900లకు పైగా ఈవీఎంలను వినియోగించారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా 12,521, హోం ఓటింగ్ ద్వారా 1,718 ఓట్లు, సుమారు 545సర్వీసు ఓట్లు నమోదయ్యాయి. లెక్కింపు ప్రారంభమయ్యే మంగళవారం ఉదయం 8గంటల వరకు వచ్చిన వాటికి మాత్రమే అనుమతిస్తామని అధికారులు పేర్కొన్నారు. వరంగల్ ఎంపీ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ప్రతీ నియోజకవర్గానికి 18 రౌండ్లలో ఓట్ల లెక్కింపు చేయనున్నారు. ఒక్క వరంగల్ తూర్పు నియోజక వర్గానికి మాత్రం 17రౌండ్లలోనే లెక్కింపు జరగనుంది. మొత్తంగా 125 రౌండ్లలో.. 125 టేబుళ్లపై లెక్కింపు నిర్వహించనున్నారు. దీంతో పాటు 42మంది అభ్యర్థులకు సంబంధించి ప్రతీ టేబుల్ వద్ద 42మంది కౌంటింగ్ ఏజెంట్లు ఉండనుండగా.. మొత్తం 125 టేబుళ్లకు 5,250మంది ఏజెంట్లు ఉండనున్నారు. అలాగే 132 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్స్, 132 మంది సహాయ కౌంటింగ్ సూపర్‌వైజర్స్, 132 మంది మైక్రో అబ్జర్వర్స్‌తో కలిపి మొత్తం 396మంది సిబ్బంది ఓట్ల

మిగతా 7వ పేజీలో..



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న పరిశీలకులు బండారి స్వాగత్ రణ్వీర్ చంద్

మహబూబాబాద్‌షా ఎవరో?

నేటి కౌంటింగ్‌కు 'టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్'లో ఏర్పాట్లు పూర్తి

- ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు.. 132 రౌండ్లు
- 1809 పోలింగ్ కేంద్రాలు... 98 టేబుళ్లు..

మహబూబాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ పూర్తయి 22రోజులైంది. ఈవీఎంలలో నిక్షిప్తమై ఉన్న ఓటర్ల తీర్పు మంగళవారం వెలువడనుంది. ఈ క్రమంలో మహబూబాబాద్ బాద్‌షా ఎవరనే ఉత్కంఠకు తెరపడనుంది. గెలుపుపై ఎవరికి వారు ధీమాగానే ఉన్నారు. కౌంటింగ్ ముందు రోజు పోలింగ్ సరళిపై మరోమారు లెక్కలు కట్టారు. అలాగే కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే తమ ఏజెంట్లకు సూచనలిస్తూ.. లెక్కింపు సమయంలో వ్యవహరించాల్సిన తీరుపై అవగాహన కల్పించారు.

హోరాహోరీ పోరులో..

మహబూబాబాద్ లోక్‌సభ బరిలో మొత్తం 23 మంది నిలవగా ప్రధాన పోటీ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్యే ఉంటుందని పరిశీలకులు అంచనాలు వేశారు. కానీ పోలింగ్ పూర్తయ్యాక వివిధ సంస్థల ఎగ్జిట్‌పోల్స్‌లో వచ్చిన అభిప్రాయాలతో అందరిలోనూ ఉత్కంఠ పెరిగింది. స్వరాష్ట్రం సిద్ధించాక జరిగిన మూడోదఫా మహబూబాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్, బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎంపీ మాలోతు కవిత, బీజేపీ నుంచి మాజీ ఎంపీ, ప్రొఫెసర్ అజ్మీర సీతారాంనాయక్‌లు బరిలో నిలిచారు. మొత్తం 15,32,366 ఓట్లకు గాను 11,01,030 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 5,58,678 మహిళలు ఉండగా 5,42,304 పురుషులు, 48 మంది ఇతరులు మొత్తం 71.85 శాతం పోలింగ్ నమోదైంది. మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలోని ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు, పినపాక, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1,809 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ నిర్వహించారు.

పటిష్ఠ భద్రత మధ్య కౌంటింగ్

పోలింగ్ అనంతరం ఈవీఎంలను మహబూబాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల (టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్) స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. మంగళవారం ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభించనుండగా లోక్‌సభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ పర్యవేక్షణలో మూడెంచెల భద్రత మధ్య పూర్తిచేయనున్నారు. కౌంటింగ్ జరిగే ఆర్టీసీ బస్టాండ్ సమీపాన ఈదు లపూ సపల్లి రోడ్డులోని టీఎస్ డబ్ల్యూఆర్ఎస్ కేంద్రం

మిగతా 7వ పేజీలో..





అరెస్టు చూపించిన పోలీసులు

పరీక్ష పత్రాలు మార్చిన కేసులో
ఉద్యోగుల అరెస్టు

వరంగల్ క్రైం, జూన్ 3 : కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ పరీక్షా పత్రాలు మార్చిడి ఘటనతో సంబంధం ఉన్న 11 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బందిని కాకతీయ యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం అరెస్టుకు సంబంధించిన వివరాలు సీఐ సంజీవ్ తెలిపారు. కాకతీయ యూనివర్సిటీ పరీక్షా విభాగంలో గత కొన్ని సంవత్సరాలుగా పని చేస్తున్న సిబ్బందికి రోజుకు రూ.220 చెల్లిస్తున్నారు. వీరు డిగ్రీ పరీక్ష ఫెయిల్ అవుతామనే విద్యార్థులతో లావాదేవీలు మాట్లాడుకుని పరీక్ష అనంతరం జవాబు పత్రాలు పరీక్షా విభాగం నుంచి సీలు వేసిన పత్రాలను బయటకు తీసుకు వచ్చి జవాబులు రాశాక తిరిగి యథావిధిగా పెట్టి పాస్ చేయించేవారు. చాలా రోజులుగా ఈ దందా సాగుతోంది. కాగా, గత నెల 23న పరీక్షా విభాగంలో పనిచేస్తున్న మాదాసి సునిల్, గడ్డం రాణాప్రతాప్, నాసం శ్రీధర్ ముగ్గురు జవాబు పత్రాలు తీస్తుండగా సీసీ టీవీలో చూసిన అధికారులు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు

మిగతా 8వ పేజీలో..

హంతకులే సంతాప సభ జరిపినట్లుంది

- అధికారిక చిహ్నం మార్పు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
- లేదంటే వరంగల్ నుంచి మరో ఉద్యమం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్



ప్రెస్ మీట్‌లో మాట్లాడుతున్న వినయభాస్కర్

రాంనగర్, జూన్ 3 : కాంగ్రెస్ హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో, వరంగల్‌లో తెలంగాణ ఉద్యమ కారులను సన్మానించడం చూస్తుంటే హంతకులే సంతాప సభ జరిపినట్లుందని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ ధ్వజమెత్తారు. సోమవారం హనుమకొండలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు ఉద్యమకారులపై తుపాకి గురిపెట్టిన వారు ఉద్యమ నేలను పాలించడం శోచనీయమన్నారు. ఉద్యమకారులను జైళ్లలో పెట్టి కేసుల పాలుచేసిన ఘన చరిత్ర కాంగ్రెస్‌దని, ఓరుగల్లు ఉనికిని, తెలంగాణ అస్తిత్వాన్ని ఓర్చుకోలేని వారని మండిపడ్డారు. తెలంగాణ, ఓరుగల్లు చరిత్రను ప్రతిబింబించేలా కేసీఆర్ కాకతీయ కళాతోరణాన్ని, చార్మినార్‌ను రాష్ట్ర అధికార చిహ్నంలో పొందుపరచడం జరిగిందని వినయభాస్కర్ తెలిపారు. దీన్ని ఓర్చుకోలేని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి అధికార చిహ్నం నుంచి కాకతీ య కళాతోరణం, చార్మినార్ తొలగించాలని నిర్ణయించినట్లు ఆయన దుయ్యబట్టారు. రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని మార్చుకోకుంటే వరంగల్ వేదికగా మరో ఉద్యమం ప్రారంభిస్తామని ఆయన హెచ్చరించారు. కాకతీయ కళాతోరణం, చార్మినార్ తొలగింపు నిర్ణయంపై ప్రజల అభిప్రాయాన్ని జిల్లా మంత్రులు సురేఖ, సీతక్క ముఖ్యమంత్రికి తెలపాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాలను నిర్వహించిన ప్రభుత్వం ఉద్యమకారులకు సరైన గౌరవం ఇవ్వకుండా అవమానించిందన్నారు. వరంగల్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఉద్యమకారులకు జరిగిన సన్మాన సభకు కోదండరాం హాజరవడం ఎంతవరకు సమంజసమన్నారు. అధికారిక చిహ్నం నుంచి కాకతీయ కళాతోరణం తొలగించి వరంగల్ చరిత్రను రూపుమాపే యత్నం కాంగ్రెస్ చేస్తుందన్నారు. ఈ సమావేశంలో మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, హరిరమాదేవి, రామ్మూర్తి, నర్సింహారావు, రజనీకాంత్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయంలో దశాబ్ది ఉత్సవాలు

బీఆర్ఎస్ కార్యాలయంలో మూడురోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు సోమవారం ముగిశాయి. మొదట అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. జాతీయ జెండాను మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ఆవిష్కరించారు. బీఆర్ఎస్ పార్టీ జెండాను జిల్లా పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ ఉద్యమ నేపథ్యంతో కూడిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. 1969 ఉద్యమకారులను ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.



సత్కార కార్యక్రమంలో ఉద్యమకారులతో మంత్రులు,ఇతర ప్రజాప్రతినిధులు, నేతలు

ప్రజాభీష్టం మేరకే మా పాలన

- ఉద్యమకారుల కుటుంబాలకు 250 గజాల ఇళ్ల స్థలాలు
- కాకతీయ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- ఘనంగా తెలంగాణ ఉద్యమకారులకు సన్మానం

వివరాలు : 7లో..

10 నుంచి సెమిస్టర్ల తరగతులు ప్రారంభం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 3 : కేయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈ నెల 10 నుంచి బీఏ, బీకాం, బీఎస్సీ 3, 5 సెమిస్టర్ల తరగతులు ప్రారంభం కానున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా తరగతులకు హాజరుకావాలని లేదంటే పరీక్షలకు అనుమతించమని తెలిపారు.

సోమవారం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం :	కనిష్ఠం :
34.0°C	22.5°C

ఉలిక్కిపడ్డ ఏజెన్సీ

- మందుపాతర పేలి వ్యక్తి దుర్మరణం
- పోలీసులే లక్ష్యంగా అమర్చిన మావోయిస్టులు
- కట్టెల కోసం అడవికి వెళుతుండగా ఘటన



ఏసు (ఫైల్)

వాజేడు, జూన్ 3: కూంబింగ్ బలగాలు, పోలీసులే లక్ష్యంగా మావోయిస్టులు ఏర్పాటు చేసిన మందుపాతరకు ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. వంట చెరుకు కోసం కొడుకు, మరో ముగ్గురితో కలిసి అడవికి వెళ్లిన అతడు అనంతలోకాలకు చేరుకున్నాడు. అప్పటి వరకు తమతో ఉన్న వ్యక్తి ఒక్కసారిగా కుప్పకూలి రెప్పపాటులో ప్రాణాలు వదలడంతో తోడున్న వారు భయంతో వణికిపోయారు. ములుగు జిల్లా వాజేడు మండలంలో సోమవారం జరిగిన ఈ ఘటన కలకలం రేపింది.

మండలంలోని జగన్నాథపురానికి చెందిన ఇల్లెందుల ఏసు(55) తన కుమారుడు రమేష్‌తోపాటు అదే గ్రామానికి చెందిన ఫకీర్, ఫాల్గుణ, పేరూరుకు చెందిన లక్ష్మయ్యతో కలిసి వంట చెరుకు కోసం సోమవారం ఉదయం కొంగాల అటవీ ప్రాంతాని వెళ్లాడు. అక్కడున్న మూలగండి గుట్ట ఎక్కేందుకు ముందుకు కదలుతుండగా ఒక్కసారిగా విస్ఫోటనం జరిగి ఏసు అమాంతం గాలిల్లోకి ఎగిరి బండలంపై పడ్డాడు. నడుము భాగంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అసలేం జరిగిందో తోటి వారు పరిశీలించగా అక్కడ మందుపాతర పేలి ఉంది. గుట్ట ఎక్కేందుకు నడుస్తున్న క్రమంలో మందుపాతరపై కాలు పడటంతో ఏసు మృతి చెందినట్టు గుర్తించారు. ఈ ఘటనలో అతడి కుమారుడు రమేష్‌కు స్వల్పగాయాలయ్యాయి. కళ్ల ముందే జరిగిన సంఘటనతో రమేష్, మిగిలిన వాళ్లు నిర్ఘాంతపోయి ఎక్కడి వాళ్లు అక్కడే నిల్చుండిపోయారు. మందుపాతర పేలుడుతో భయకంపితులైన ఫాల్గుణ, లక్ష్మయ్య గుట్ట నుంచి కిందకు దిగి స్థానికులకు సమాచారం అందించారు. దీంతో అక్కడకు చేరుకున్న కుటుంబ సభ్యులు, స్థానికులు ఏసు మృతదేహాన్ని కిందకు దింపారు. అనంతరం ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడికి ఇద్దరు భార్యలు ఉండగా వారిద్దరూ గతంలో మృతిచెందారు. మొదటి భార్యకు కొడుకు, కూతురు, రెండో భార్యకు కొడుకు ఉన్నారు.



పేలిన మందుపాతర ఇదే..

సంఘటన స్థలానికి రాని పోలీసులు

మందుపాతర పేలిన ప్రాంతం పూర్తి అటవీ ప్రాంతం కావడంతో పోలీసులు సంఘటన స్థలానికి రాలేదు. దీంతో మృతదేహం తరలింపులో తీవ్ర జాప్యమైంది. సంఘటన జరిగిన ప్రాంతంలో ఇంకేమైనా మందు పాతరలు ఉన్నాయేమోననే అనుమానంతో స్థానికులు గుట్టపైకి వెళ్లలేకపోయారు. కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడిన పోలీసులు మృతదేహాన్ని కిందకు తీసుకురావాలని సూచించారు. దీంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని కిందకు తీసుకొచ్చారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తరుచూ అడవుల్లోకి కూంబింగ్‌కు ఈ దారి మీదుగానే వెళ్తుండటంతో మావోయిస్టులు పోలీసులను టార్గెట్ చేస్తూ మందు పాతరను అమర్చి ఉంటారని స్థానికులు చర్చించుకున్నారు.

మృతుడి కుటుంబానికి ఎస్పీ పరామర్శ

మందుపాతరకు బలైన ఏసు కుటుంబాన్ని ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రిలో పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం పోలీసు శాఖ ఆధ్వర్యంలో తక్షణ సాయంగా రూ.10 వేలు అందజేశారు. ప్రభుత్వపరంగా సహాయం అందించేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ ఘటన పోలీసులను కలచివేసిందన్నారు. ఇదే క్రమంలో ఆయన ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. మావోయిస్టులు తమ ఉనికిని చాటుకునేందుకు సామాన్య ప్రజలను బలిగొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు నిత్యం తిరిగే ప్రదేశాల్లో మందుపాతరలు పెట్టి అమాయకుల ప్రాణాలు తీస్తున్నారని పేర్కొన్నారు. ఇటీవల మండలంలోని అరుణాచలపురంలో మావోయిస్టుల మందుపాతరకు ఓ పెంపుడు కుక్క మృతి చెందిందని, తాజాగా ఏసు బలి అయ్యాడని తెలిపారు. ఈ రెండు కేసులు వాజేడు పోలీస్‌స్టేషన్‌లో నమోదయ్యాయని పేర్కొన్నారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న మావోయిస్టులపై, సహకరిస్తున్న సానుభూతిపరులు, విలీషియా సభ్యులై చర్యలు తప్పవని హెచ్చరించారు.



సంఘటన స్థలంలో ఏసు మృతదేహం, పక్కన అతడి కుమారుడు రమేష్

23 నుంచి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 3 : వరంగల్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 25 వరకు ఎర్రగట్టుగుట్ట సమీపంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పింగిళి రమేష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-11, 13, బాలబాలికలకు సింగిల్స్, డబుల్స్‌లో, అండర్- 15, 17, 19 బాలబాలికలకు, స్త్రీ, పురుష విభాగాల్లో డబుల్స్, సింగిల్స్, మిక్సిడ్ డబుల్స్‌లో పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. క్రీడాకారులు ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఆన్‌లైన్ పేర్లు నమోదు చేసుకోవాలని వెల్లడించారు. వివరాలకు 94405 99888 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అందెశ్రీ గీతాన్ని సమాజం ఆమోదించదు..

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

వడ్డెపల్లి, జూన్ 3 : అందెశ్రీ రాసిన జయజయహే తెలంగాణ రాష్ట్ర గీతాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక గీతంగా ప్రకటించినప్పటికీ దాన్ని తెలంగాణ సమాజం ఆమోదించదని, అంగీకరించదని, ప్రజల గుండెల్లో నిలిచిన సంపూర్ణ గీతాన్ని ఆమోదించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ వడ్డెపల్లి రోడ్డులోని పల్లా రవీందర్‌రెడ్డి విద్యుత్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అందెశ్రీ రాసిన గీతాన్ని మార్చి ప్రభుత్వం సారంలేకుండా చేసిందని అన్నారు. 13 చరణాలతో కూడుకున్న ఈ గీతం కేవలం మూడు చరణాలకు కుదించి సారం, స్ఫూర్తి, సందేశం లేకుండా చేశారని దుయ్యబట్టారు. అందెశ్రీ రాసిన గీతం ఒకప్పుడు తెలంగాణ సమాజాన్ని నిద్రలేపిందని, ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించిందని మంద కృష్ణ మాదిగ స్పష్టం చేశారు. అందెశ్రీ గీతం ముక్కోటి తెలంగాణ సమాజాన్ని ఏకం చేసి ఉద్యమానికి ఊపిరిలూదిందని అన్నారు. అందెశ్రీ రాసిన గీతంలో పది చరణాలను తొలగించి కేవలం మూడు చరణాలతో గుర్తించినప్పటికీ ఆయన భావదారిద్ర్యానికి గురైనట్లుగా తాను భావిస్తున్నట్లు మంద కృష్ణ మాదిగ అన్నారు. గిరిజనుల ఇలవేల్పు అయిన సమ్మక్క- సారలమ్మ, కొమురం భీం పేర్లను గీతంలో తొలగించారని దీన్ని మంత్రి సీతక్క ఒప్పుకుంటారా.. అని ప్రశ్నించారు.


ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

బీసీ కవులు కంచర్ల గోపన్నతో సహా పలువురి కవుల పేర్లు కొత్త గీతంలో ఎక్కడా కనిపించడం లేదని దీన్ని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఒప్పుకుంటారా.. అని మంద కృష్ణ మాదిగ ప్రశ్నించారు. ఎంతో మంది బ్రాహ్మణ కవుల పేర్లను తప్పించి గీతాన్ని రూపొందించారని దీన్ని బ్రాహ్మణుడైన రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఒప్పుకుంటారా.. అని అన్నారు. రాష్ట్ర గీతంపై అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహిస్తామని రాజకీయ పక్షాలను కలుస్తామని మంద కృష్ణ మాదిగ స్పష్టం చేశారు. 1911లో కవి రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన జనగణమన అధినాయక జయహే అనే జాతీయ గీతాన్ని కేంద్ర ప్రభుత్వం ఆమోదించిందని అన్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన జాతీయ గీతం నుంచి ఏ ఒక్క చరణాన్ని సైతం తొలగించలేదని, అదే అందెశ్రీ రాసిన రాష్ట్ర గీతంలోని చరణాలను ఎందుకు తొలగించవలని వచ్చిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర చిహ్నంలో నుంచి కాకతీయ కళాతోరణాన్ని ఎందుకు తొలగిస్తున్నారో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. 1969 తెలంగాణ ఉద్యమంలో 369 మంది ఉద్యమకారులను పొట్టన పెట్టుకున్న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి పార్కు హైదరాబాద్‌లో ఉండడం ఏందని దీన్ని వెంటనే అమరుల పార్కుగా నామకరణం చేయాలని మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంఎస్‌పీ జాతీయ నేతలు మంద కుమార్ మాదిగ, వేల్పుల సూరన్న మున్నూరు కాపు, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద నరేష్ మాదిగ, జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ మాదిగ, జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, రాష్ట్ర నేతలు మంద రాజు మాదిగ, బండారి సురేందర్ మాదిగ, కొయ్యడ మల్లేశం, అరికిళ్ల రాజు మాదిగ, జేరిపోతుల సారంగం మాదిగ తదితరులు పాల్గొన్నారు.



5వ పేజీ తరువాయి

లెక్కింపులో పాల్గొననున్నారు. ఇప్పటికే కౌంటింగ్‌లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ నిచ్చారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేశారు. అలాగే కౌంటింగ్ కేంద్రం వద్ద భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మూడంచెల భద్రతతో పాటు 144 సెక్షన్ విధించారు. విజయోత్సవాలను నిషేధిస్తున్నట్లు పోలీసులు ప్రకటించారు. ఎన్నికల సంఘం జారీ చేసిన పాసులు ఉన్నవారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రానికి అనుమతి ఇస్తామని పోలీసులు తెలిపారు.

ఓట్ల లెక్కింపు ఇలా...

కౌంటింగ్ విధులు నిర్వహించే ఉద్యోగులు ఉదయం 5గంటల వరకు, అభ్యర్థుల ఏజెంట్లు 6గంటల వరకు లెక్కింపు కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది. ఉదయం 8గంటల నుంచి లెక్కింపు ప్రారంభించి.. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపు చేస్తారు. టేబుళ్ల వద్ద అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయ సూపర్‌వైజర్లు, సూక్ష్మ పరిశీలకులు పోలింగ్ కేంద్రాల వారీగా కంట్రోల్ యూనిట్లను తీసుకవచ్చి, టేబుల్‌పై పెట్టి రిజల్ట్ మీటపై నొక్కి పార్టీలు, స్వతంత్రులకు వచ్చిన ఓట్లను నమోదు చేస్తారు. ఆ తరువాత అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలను ఏఆర్‌వోలకు తెలియజేస్తారు. ఏఆర్‌వోలు 17ఏ ఫారం ద్వారా పోలైన ఓట్లను పరిశీలించి వివరాలను ఎన్నికల సంఘం పోర్టల్‌లో నమోదు చేస్తారు. ఇలా ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా వచ్చిన ఓట్లను కలిపి మొత్తం లోక్‌సభ పరిధిలో ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయో రౌండ్ వారీగా ఆధిక్యాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అధికారికంగా వెల్లడిస్తారు. అలాగే హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కూడా ఈ విధంగానే లెక్కిస్తారు. వీటి కోసం ప్రత్యేకంగా 15 టేబుళ్లను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 12.30గంటల వరకు ఓటింగ్ సరళిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంటుందని సమాచారం. కాగా, వరంగల్ పార్లమెంట్ పరిధిలో 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో వరంగల్ తూర్పు నియోజకవర్గం ఫలితం ముందుగా రానుంది. అన్ని చోట్ల 18 రౌండ్లు ఉంటే, తూర్పులో మాత్రం 17 రౌండ్లే ఉన్నాయి. దీంతో తొలి ఫలితం వరంగల్ తూర్పు నుంచే వచ్చే అవకాశం ఉంది.

టిక్.. టిక్.. టిక్..

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	లెక్కించాల్సిన ఓట్లు	టేబుళ్లు	రౌండ్లు
వరంగల్ పశ్చిమ	244	1,49,320	14	18
వరంగల్ తూర్పు	230	1,68,234	14	17
పరకాల	239	1,70,916	14	18
పాలకుర్తి	296	1,82,515	17	18
వర్ధన్నపేట	279	1,97,763	16	18
స్టేషన్‌ఘనపూర్	295	2,00,158	17	18
భూపాలపల్లి	317	1,87,395	18	18
మొత్తం	1,900	12,56,301	110	125

(నోట్: పోస్టల్, హోమ్ ఓట్ల కోసం మరో 15 టేబుళ్ల ఏర్పాటు)

అభ్యర్థుల్లో లబ్‌డబ్..

వరంగల్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 42మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థుల మధ్యే పోటీ నెలకొంది. మూడు ప్రధాన పార్టీలు వరంగల్ ఎంపీ సీటును ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రచారం నిర్వహించాయి. దీంతో మూడు పార్టీల అభ్యర్థుల్లో గెలుపుపై ధీమాతో ఉన్నారు. అయితే శనివారం విడుదలైన ఎగ్జిట్ పోల్స్ కూడా ఏ పార్టీ గెలుస్తుందో స్పష్టత ఇవ్వలేదు. దీంతో అభ్యర్థుల్లో లబ్‌డబ్ మొదలైంది. ఏ వర్గం నుంచి తమకు సహకారం అందింది.. ఎవరెవరు హ్యాండిచ్చారు అనే కోణంలో అభ్యర్థులో ఆరా తీస్తునే ఉన్నారు. అయితే అత్యధికంగా స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గంలో 2లక్షలకు పైగా ఓట్లు పోల్ కావటం చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే కడియం శ్రీహరి సొంత నియోజకవర్గంలో ఎక్కువ ఓట్లు పోల్ కావటం తమకే కలిసి వస్తుందని కాంగ్రెస్ నేతలు భావిస్తుండగా, బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ సొంత గ్రామం ఇదే నియోజకవర్గంలో ఉండటంతో తమకే కలిసి వస్తుందని బీజేపీ నేతలు అంచనా వేస్తుండగా, మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య గట్టిగా పని చేయటంతో ఓటింగ్ శాతం పెరిగిందని, అది తమకు కలిసి వస్తుందనే అంచనాల్లో బీఆర్ఎస్ నేతలు ఉన్నారు. వర్ధన్నపేట, భూపాలపల్లిలో కూడా భారీగా ఓట్లు పోలయ్యాయి. ఇవీన్ని ఎవరికి కలిసి వస్తాయో అనే ఆందోళనలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఉన్నారు. మొత్తానికి గత ఇరువై రెండు రోజులుగా నెలకొన్న ఉత్కంఠకు మంగళవారం తెరపడటంతో పాటు ఓటర్లు ఎవరిని కరుణించారో అనేది తేలనుంది.

ఎన్నికల ఫలితాల వీక్షణకు ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు

హనుమకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 3: లోక్‌సభ ఎన్నికల ఫలితాలను ఎప్పటికప్పుడు తెలియజేసేందుకు పెద్ద ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ తెలిపారు. ఈ క్రమంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏర్పాటు చేసినట్లు, హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో ఈసీఐ నుంచి ప్రసారం చేసేందుకు లింక్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తెలంగాణతోపాటు అన్ని రాష్ట్రాల ఫలితాలు తెలియజేయడం జరుగుతుందని కలెక్టర్ వెల్లడించారు.



పబ్లిక్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్

లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు

▸▸ భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన వరంగల్ కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, జూన్ 3: వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్టు వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. వరంగల్ ఏనుమాముల మార్కెట్‌యార్డులో మంగళవారం జరిగే ఓట్ల లెక్కింపు కేంద్రాలను డీసీపీ రవీందర్, హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, సంధ్యారాణితో కలిసి సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సిబ్బంది, పోలీసు బందోబస్తు మొత్తం 2,500 మంది సిబ్బంది పోలింగ్ ప్రక్రియలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ నేపథ్యంలో మూడంచలభద్రత ఏర్పాట్లు చేశామన్నారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతున్నందున టేబుళ్లు, కుర్చీలు, భారీ ఎల్ఈడీ స్క్రీన్లు, బారీ కేడ్లు ఏర్పాటు చేశామన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో పొరపాట్లకు తావులేకుండా సూపర్‌వైజర్లు, సహాయకులు, మైక్రో అబ్జర్వర్లు, ఇన్‌చార్జ్‌లకు నియోజకవర్గాల వారీగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే రెండో విడత ర్యాండమైజేషన్ ద్వారా విధులు కేటాయించి శిక్షణ పూర్తి చేశామని, మంగళవారం ఉదయం 6 గంటలకు కౌంటింగ్ పరిశీలకుల సమక్షంలో తుది ర్యాండమైజేషన్ నిర్వహించి ఆయా కౌంటింగ్ కేంద్రాలకు సిబ్బందిని కేటాయిస్తామన్నారు. ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని, ప్రతీ టేబుల్‌కు ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఒక కౌంటింగ్ అసిస్టెంట్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారన్నారు. రాజకీయ పార్టీలకు చెందిన కౌంటింగ్ ఏజెంట్లకు గుర్తింపు కార్డులు జారీ చేశామని, గుర్తింపు కార్డు లేని వ్యక్తులను, సిబ్బందిని ఎట్టి పరిస్థితుల్లోనూ సెంటర్‌లోకి అనుమతించేదిలేదన్నారు. కౌంటింగ్ సిబ్బందికి సైతం డ్యూటీ పాస్‌లు జారీ చేశామని, ఎన్నికల కమిషనర్ రౌండ్ వారీగా ఎన్ కోర్‌లో ఫలితాలు అప్‌లోడ్ చేసేలా ఎన్‌కోర్ సిబ్బందికి, ఐటీ సిబ్బందికి శిక్షణనిచ్చి సన్నద్ధం చేశామని కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు.

సజావుగా ఓట్ల లెక్కింపు : పరిశీలకులు బండారి స్వాగత్ రణ్వీర్ చంద్

ఎన్నికల సంఘం నిబంధనల మేరకే వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు కొనసాగుతుందని లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు పరిశీలకులు బండారి స్వాగత్ రణ్వీర్ చంద్ తెలిపారు. సోమవారం వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, భూపాలపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ల ఓట్ల లెక్కింపు కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం బండారి స్వాగత్ రణ్వీర్ చంద్ మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల వారిగా లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోటీలో 42 మంది అభ్యర్థులు ఉండగా ఏడు నియోజకవర్గాలకు గాను మొత్తం 124 టేబుళ్లు, 127 రౌండ్లు లెక్కింపు ఉంటుందన్నారు. సీసీ కెమెరాల నిఘా మధ్య లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుందని, లెక్కింపు కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువుల అనుమతి లేదని తెలిపారు. కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, సంధ్యారాణి, జిల్లా నోడల్ అధికారులు, తహసీల్దార్లు ఇక్బాల్, విజయ్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

మహబూబాబాద్‌షా ఎవరో?

5వపేజీ తరువాయి

వైపు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. కేసముద్రం-ఈదులపూస పల్లి మార్గాల నుంచి మహబూబాబాద్‌కు రాకపోకలు సాగించే వారు రాంచంద్రాపురం కాలనీ మీదుగా ఎస్వీ విద్యాలయం నుంచి వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. లెక్కింపు కేంద్రంలో ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్ల చొప్పున మొత్తం 98 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ప్రతీరౌండ్‌కు 98 ఈవీఎంల లెక్కింపు కొనసాగుతుంది. రౌండ్ల వారీగా పరిశీలిస్తే.. ములుగు అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధికంగా 22 రౌండ్లలో లెక్కింపు జరగనుం డగా.. మహబూబాబాద్, నర్సంపేట అసెంబ్లీ సెగ్మెంట్‌లలో 21 రౌండ్లచొప్పున లెక్కింపు జరుగుతుంది. డోర్నకల్ 19 రౌండ్లు, ఇల్లెందు, పినపాక అసెంబ్లీలకు 18 రౌండ్లకు లెక్కింపు పూర్త వుతుంది. భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు మాత్రం 13 రౌండ్‌లకే పూర్తి కానుంది. మరోవైపు పోస్టల్ బ్యాలెట్‌లు, హోం ఓటింగ్‌కు సంబంధించి లెక్కించేందుకు ప్రత్యేకంగా 12 టేబుళ్లను ఏర్పాటు చేశారు.

ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్.. ఎస్పీ...

మహబూబాబాద్ లోక్‌సభ ఎన్నికల ఫలితాల లెక్కింపు కేంద్రాన్ని మహబూబాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ ఆఫీసర్, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌తోపాటు ఎస్పీ సుధీర్‌రామ్ నాథ్‌కేకన్ సోమవారం పర్యవేక్షించారు. కౌంటింగ్ నిర్వహించే 98 టేబుళ్లను స్వయంగా పరిశీలించారు. ప్రతీ టేబుల్ వద్ద కౌంటింగ్ సూపర్‌వైజర్, అసిస్టెంట్ సూపర్‌వైజర్, మైక్రో అబ్జర్వర్లను నియమించారు. మొత్తం లోక్‌సభ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపునకు 750 మంది ఉద్యోగులను నియమించి వారికి శిక్షణ కూడా పూర్తి చేశారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 600 మందికి పైగా పోలీసు సిబ్బందిని మోహరించారు.



తెలంగాణ రాష్ట్ర సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	లెక్కించాల్సిన ఓట్లు	టేబుళ్లు	రౌండ్లు
డోర్నకల్	264	1,68,053	14	19
మహబూబాబాద్	287	1,84,410	14	21
నర్సంపేట	283	1,80,659	14	21
ములుగు	307	1,62,443	14	22
పినపాక	250	1,41,432	14	18
ఇల్లందు	242	1,58,650	14	18
భద్రాచలం	176	1,05,383	14	13
మొత్తం	1809	11,01,030	98	132

(నోట్ : పోస్టల్, హోమ్ ఓట్లు లెక్కింపు కోసం 12 టేబుళ్ల ఏర్పాటు)

400 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు

▸▸ విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు

▸▸ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ

▸▸ బందోబస్తు సిబ్బందితో సమావేశం



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝూ

వరంగల్ సిటీ, జూన్ 3: పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకుగాను ఏనుమాముల మార్కెట్లోని కౌంటింగ్ హాలు వద్ద 400మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ తెలిపారు. సోమవారం ఏనుమాముల మార్కెట్లో కౌంటింగ్ బందోబస్తు నిర్వహించే సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించి విధి విధానాలను, సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం సీపీ మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ కోసం సుమారు 400మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. కౌంటింగ్ కేంద్రానికి కేవలం ఎంపీ అభ్యర్థుల ను, సంబంధిత ఏజెంట్లను, పాసులున్నవారిని మాత్రమే అనుమతిస్తామన్నారు. మంగళవారం నగరంలో 144 సెక్షన్ అమలులో ఉంటుదని, కౌంటింగ్ పూర్తైన తర్వాత ఎలాంటి ర్యాలీలకు, సభలకు అనుమతి లేదని, ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీసీపీలు రవీందర్, అబ్దుల్ బారీ, అదనపు డీసీపీ రవి, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రం వద్ద అగ్నిమాపక వాహనాలు

మట్టెవాడ: లోక్‌సభ ఓట్ల లెక్కింపు జరిగే వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లో మంగళవారం వరంగల్ అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో 25మంది అగ్నిమాపక సిబ్బంది విధుల్లో ఉంటారని వరంగల్ అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. మూడు ఫైర్ ఇంజన్లు, ఏడు కౌంటింగ్ సెంటర్ల వద్ద 14 ఫైర్‌ఎక్స్ లింగ్విషర్లు ఏర్పాటు చేశామని, వీటిని ఆపరేట్ చేసేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించామన్నారు.

ప్రజాభీష్టం మేరకే మా పాలన

▸▸ ఉద్యమకారుల కుటుంబాలకు 250 గజాల ఇళ్ల స్థలాలు

▸▸ కాకతీయ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం

▸▸ ఉద్యమకారుల సన్మాన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్





మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ కోదండరామ్‌ను సన్మానిస్తున్న మంత్రులు

హనుమకొండ సిటీ, జూన్ 3 : తెలంగాణ ప్రజల అభీష్టం మేరకే మా పాలన ఉంటుందని రాష్ట్ర రవాణా, పౌర సరఫరాల శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. పాలనలో ప్రజలకు భాగస్వామ్యాన్ని కల్పించే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా పాలన చేపట్టారన్నారు. సోమవారం హనుమకొండ హంటర్‌రోడ్డులోని డీ-కన్వెన్షన్ హాలులో రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ సభ అధ్యక్షతన తెలంగాణ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని తెలంగాణ ఉద్యమ కారుల సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి నిర్వాహకుడిగా జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క పాల్గొన్నారు. తెలంగాణ బిల్లు లోకసభలో ప్రవేశపెట్టిన సమయంలో కాంగ్రెస్ ఎంపీలుగా ఉన్న మధుయాష్కీ, అంజన్‌కుమార్ యాదవ్, సిరిసిల్ల రాజయ్య, వివేక్ తదితరులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమ ఆరంభానికి ముందుగా అమరులను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. తెలంగాణ ఆత్మ గౌరవానికి ఏ మాత్రం భంగం కలగని పాలన సాగిస్తామన్నారు. అమరులు, ఉద్యమకారుల ఆశయాల ఫలించే పాలన రాష్ట్రంలో ఆరంభమైందని రాష్ట్ర రవాణా, పౌర సరఫరాల శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రజలు కోరుకున్న స్వేచ్ఛాయుత పాలన అమల్లోకి వచ్చిందన్నారు.

ఉద్యమకారుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు :

తెలంగాణ ఉద్యమకారులు, అమరుల కుటుంబాలకు 250 గజాల ఇళ్ల స్థలాలను అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. తెలంగాణ పోరాటం చరిత్రలో మరువలేని ఘట్టంగా నిలుస్తుందన్నారు. అమరుల త్యాగాలు చిరస్థాయిగా నిలుస్తాయని పేర్కొన్నారు. నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆశయాల సాధనే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని ఇందులో రాజీపడే ప్రసక్తే లేదని వెల్లడించారు.

కాకతీయ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం

కాకతీయ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. కేసీఆర్ పాలనలో కాకతీయ ఉత్సావాలను పట్టించుకోలేదని విమర్శించారు. పదేళ్ల కేసీఆర్ పాలన స్వార్థ ప్రయోజనాలకే పరిమితమైందన్నారు. తెలంగాణ ప్రజల ఆశలను వమ్ము చేశాడని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటు తమ ఘనతగా కేసీఆర్ ఆయన కుటుంబ సభ్యులు ప్రకటించుకొని ప్రజలను మభ్య పెట్టారన్నారు ప్రభుత్వం కూలిపోతుందని బీఆర్ఎస్ నేతలు కూతలు కూయడం మానుకోవాలని సూచించారు.

ఉద్యమకారులకు ఘనంగా సన్మానం

తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు, అమరుల కుటుంబ సభ్యులను సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. వివిధ సంఘాలు, జాక్ నేతలను శాలువాలు, తెలంగాణ అమరవీరుల స్థూపం మెమెంటో అందచేసి సత్కరించారు. ఉద్యమకారులను కార్యక్రమ వేదిక వద్దకు పూర్ణకుంభం, పూలు చల్లుతూ ఆహ్వానించారు. 1969 ఉద్యమంలో పాల్గొన్న వారికి సన్మానించి నాటి ఘట్టాలను స్మరించారు. మలి దశలో అమరుడైన శ్రీకాంతచారి తల్లి శంకరమ్మ తన కొడుకు త్యాగాన్ని స్మరించారు.

తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చేది రేవంత్‌రెడ్డియే...

తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చేది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డియే అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. తెలంగాణ ఉద్యమకారులు, రాష్ట్ర ఏర్పాటు కోసం ప్రాణాలు అర్పించిన అమరుల ఆశయాలను సాధించడంలో రేవంత్‌రెడ్డి రాజీపడబోరని స్పష్టం చేశారు. నాలుగున్నర దశాబ్దాలుగా జరిగిన పోరాటంలో ఎందరో ప్రాణ త్యాగాలు చేశారన్నారు. మరెందరో ఉద్యమకారులు సర్వం కోల్పోయారన్నారు. పోరాట బిడ్డల ఫలితమే రాష్ట్ర ఏర్పాటన్నారు.

తెలంగాణ సాధనలో చిత్తశుద్ధి లేదు : మాజీ ఎంపీ మధుయాష్కీ

కేసీఆర్‌కు సీట్లు, పదవులపైనే ధ్యాస తప్ప తెలంగాణ సాధనలో ఆయనకు చిత్తశుద్ధి లేదని మాజీ ఎంపీ మధుయాష్కీ విమర్శించారు. కేవలం సోనియా గాంధీ వల్లే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిందన్నారు. తెలంగాణ సాధన ముఖ్య పోరాట ఘట్టాల్లో కేసీఆర్ ఎప్పుడూ ముందు నిలువ లేదన్నారు. తెలంగాణలోని ప్రశ్నించే గొంతుకల మూగపోవద్దని మధుయాష్కీ సూచించారు. తప్పు చేస్తే తమ ప్రభుత్వాన్ని అయినా ప్రశ్నించాలని స్పష్టం చేశారు.

కేసీఆర్ నిరంకుశ పాలన ముగియడంతో రాష్ట్రంలో స్వేచ్ఛా వాయువులు నెలకొన్నాయని ఎమ్మెల్సీ ప్రొఫెసరు కోదండరాం పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమం ప్రజా ఉద్యమంగా మారిన తరుణంలో రాష్ట్ర ఏర్పాటు కాంక్షలు మరింత బలపడ్డాయన్నారు. ఎందరో బిడ్డలు నిప్పు కణికలై ఉద్యమాన్ని రగిల్చారని ఉద్యమ ఘట్టాలను గుర్తు చేశారు.

ఉద్యమకారులు, అమరుల కుటంబాలను సన్మానించడం జన్మ ధన్యంగా భావిస్తున్నట్లు కార్యక్రమ నిర్వహణ బాధ్యులు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కాకతీయ ఉత్సవాలను మరిచిన ఘనులు కళా తోరణం గురించి మాట్లాడడం సిగ్గు చేటన్నారు.

లోకసభలో బిల్లు ప్రవేశపెట్టిన సమయంలో నాటి కాంగ్రెస్ ఎంపీలు వివేక్, మధుయాష్కీ, అంజన్‌కుమార్ యాదవ్, పొన్నం ప్రభాకర్, సిరిసిల్ల రాజయ్య జరిగిన ఘట్టాలను కళ్లకు కట్టినట్లు చెప్పారు. పెప్పర్ స్ప్రే ఘటనతో పాటు బిల్లు స్పీకర్ వద్దకు చేరడం, లోకసభలో విద్యుత్ నిలువడం, సోనియాగాంధీ ఆత్రుత, స్పీకర్ మీరాకుమారి చేయుత ఇలా ప్రతి ఘటాన్ని ఆవిష్కరిస్తున్నంత సేపు ప్రతి ఒక్కరు భావోద్వేగంతో ఆలకించారు. కార్యక్రమ నిర్వహణ పట్ల పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని మంత్రులు ఇతర నాయకులు అభినందించారు.

కార్యక్రమంలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, టీపీసీసీ నాయకులు శోభారాణి, బత్తిని శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

లండన్‌లో బైరాన్‌పల్లి వాసి మృతి



రాహుల్‌రెడ్డి (ఫైల్)

వరంగల్ క్రైం, జూన్ 3 : హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన రేవిడి రాహుల్‌రెడ్డి(32) అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడి తండ్రి రాజిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం రాహుల్‌రెడ్డి ఉన్నత చదువుల కోసం 6 సంవత్సరాల క్రితం లండన్ వెల్లాడు. చదువు పూర్తి చేసిన రాహుల్‌రెడ్డి ఉన్నత ఉద్యోగంలో చేరాడు. నెలరోజుల క్రితం అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. చికిత్స పొందుతున్న క్రమంలో గత నెల 27న రాహుల్‌రెడ్డి బ్రెయిన్ డెడ్ అయ్యి మృతి చెందాడు. కుమారుడి మృతి వార్త తెలుసుకున్న రాహుల్‌రెడ్డి తండ్రి రాజిరెడ్డి లండన్ వెళ్లాడు. మృత దేహం తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. రెండు రోజుల్లో కుమారుడి మృత దేహం ఇండియాకు వచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపాడు. కుమారుడికి ఉన్నత విద్యను అందించేందుకు లండన్ పంపితే శవమై వస్తున్నాడని ఆంధ్రజ్యోతితో వివరాలు చెబుతూ విలపించాడు. కుమారుడికి ఈ సంవత్సరం వివాహం చేయాలని అనుకున్నట్లు ఆయన తెలిపారు. కాగా, రాజిరెడ్డి సతీమణి భారతి 12 సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా వ్యవసాయం చేస్తూ కుమారున్ని చదివించి లండన్ పంపించినట్లు ఆయన తెలిపారు. సతీమణి చనిపోగా ఏకైక సంతానమైన కుమారున్ని కోల్పోయి రాజిరెడ్డి ఒంటరయ్యాడు.

ప్రశ్నించే గళం చుంచు రాజేందర్

ఏబీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్



అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని బహూకరిస్తున్న ప్రజా సంఘాల నేతలు

వడ్డెపల్లి, జూన్3: ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రశ్నించే గొంతుక పరిష్కరించే గళం చుంచు రాజేందర్ అని అసైన్డ్ భూమి సమితి (ఏబీఎస్) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కలకోటి మహేందర్ అన్నారు. దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన చుంచు రాజేందర్ ను సోమవారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల నాయకులు ఘనంగా సత్కరించి అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని బహూకరించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పోలీస్ శిక్షణా కేంద్రంలో నేత్ర వైద్య శిబిరం



శిక్షణ కానిస్టేబుళ్లకు కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మడికొండ, జూన్ 3: మడికొండలోని సిటీ పోలీస్ శిక్షణా కేంద్రంలో హనుమకొండకు చెందిన ప్రముఖ కంటి వైద్య ఆసుపత్రి శరత్ మ్యాక్స్ విజన్ వారు సోమవారం నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా శిక్షణా కానిస్టేబుళ్లకు, ఇండోర్, అవుట్‌డోర్ శిక్షకులుగా పని చేస్తున్న సిబ్బందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అడిషనల్ డీసీపీ రాగ్యానాయక్, వైస్ ప్రిన్సిపాల్ రమణబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కేయూతో బౌర్న్‌టెక్ ఎంవోయూ



కేయూ ఇన్‌చార్జి వీసీ కరుణతో ఎంవోయూ కుదుర్చుకుంటున్న బౌర్న్‌టెక్ యాజమాన్యం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 3 : కాకతీయ విశ్వవిద్యాలయం జియాలజీ విభాగంతో హైదరాబాద్‌కు చెందిన బౌర్న్‌టెక్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్ పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. సోమవారం హైదరాబాద్ సచివాలయంలో కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. మల్లారెడ్డి, బౌర్న్‌టెక్ సీజీవో జి. యుగంధర్‌రెడ్డి ఎంవోయూపై సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జియాలజీ హెడ్ ప్రొఫెసర్ ఆర్. మల్లిఖార్జున్‌రెడ్డి మాట్లాడుతూ... జీఐఎస్ అనుబంధ విభాగాల్లో ప్రపంచ అత్యుత్తమ అభ్యాసాలను ప్రోత్సహించే సాంకేతిక శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకుల్లో మెళకువలు అభివృద్ధి చేయడంలో బౌర్న్‌టెక్ కేయూతో కలిసి పనిచేస్తుందన్నారు. ఈ ఒప్పందంతో కంపెనీ అవసరాలకు అనుగుణంగా జీఐఎస్ అనుబంధ విభాగాల్లో విద్యార్థులకు ఆధునిక పద్ధతుల్లో శిక్షణ ఇస్తుందన్నారు. బౌర్న్‌టెక్ నిపుణులను కేయూకు అందించి విద్యార్థులకు శిక్షణనిస్తుందన్నారు. ఎంఎస్సీ జియాలజీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అందజేస్తూ నిష్ణాతులైన విద్యార్థులను కంపెనీ కార్యకలాపాలకు నియమించుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బౌర్న్‌టెక్ ప్రెసిడెంట్ సృజన గూడూరు, కంపెనీకి చెందిన వి. వేణుగోపాల్, టి. బాలకోటేశ్వర్ పాల్గొన్నారు.

ఈగ మల్లేశంను సన్మానించిన మంత్రులు



తెలంగాణ ఉద్యమకారుల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఈగ మల్లేశం

న్యూశాయంపేట, జూన్ 3 : తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఈగ మల్లేశంను రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కలు సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులను సోమవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని డీ కన్వెన్షన్ హాల్‌లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సమక్షంలో మంత్రులు ఈగ మల్లేశంను సన్మానించారు. జేఏసీ కన్వీనర్‌గా ఈగమల్లేషం 2009 నుంచి 2014 వరకు 10 జిల్లాల్లో తెలంగాణ ధూంధాం కార్యక్రమాన్ని నిర్వహించి పోలీసులు కేసులను ఎదుర్కొని ఉద్యమంలో కీలకపాత్ర పోషించాడని మంత్రులు ప్రభాకర్, సీతక్కలు కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రులు ఈగమల్లేశంనకు శాలువా, తెలంగాణ అమరవీరుల స్థూపం మొమెంటోను అందచేశారు.

వాహనదారులకు జరిమానా

హనుమకొండ టౌన్, జూన్ 3 : నిబంధనలు ఉల్లఘించిన పలువురు వాహనదారులకు జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ షూకూర్ తెలిపారు. తనిఖీల్లో పట్టుబడిన 16 మందిని సోమవారం కోర్టులో హాజరుపరచగా డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 12 మందికి రూ 20,700, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడిన నలుగురికి రూ 5,100 జరిమానాను న్యాయమూర్తి రమేశ్ విధించారన్నారు.

ప్రకృతి విధ్వంసాన్ని అరికట్టాలి

కబ్జాదారుల చెర నుంచి చెరువులను కాపాడాలి

ఓరుగల్లు చెరువుల పరిరక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వక్కల కుమార్



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న వక్కల కుమార్

వడ్డెపల్లి, జూన్ 3: ప్రకృతి విధ్వంసాన్ని అరికట్టి, కబ్జాదారుల చెర నుంచి చెరువులు, కుంటలను కాపాడాలని ఓరుగల్లు చెరువుల పరిరక్షణ సమితి, ఆక్రమిత చెరువుల పునరుద్ధరణ సంస్థ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వక్కల కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. సోమవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మానవుడి మనుగడకు, జీవనానికి జలమే మూలాధారమని దాని ప్రాముఖ్యతను గుర్తించిన మన పూర్వీకులు, రాజులు ప్రకృతి ధర్మాన్ని రక్షించడానికి చెరువులు, కుంటలను తవ్వించారని అన్నారు. మానవుడు తన స్వార్థ ప్రయోజనాల కోసం ప్రకృతిని ధ్వంసం చేస్తూ చెరువులు, కుంటలను కబ్జా చేస్తూ చెరపడుతూ ప్లాట్లుగా విభజిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని వక్కల కుమార్ ఆరోపించారు. చెరువులు, కుంటలు కాలక్రమేణా మాయమై పోవడంతో ప్రకృతి వైపరిత్యాలు సంభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనావృష్టి ఫలితంగా భూమిలోని నీటి నిల్వలు తగ్గిపోయి సాగు, తాగునీటి సమస్య తాండవిస్తుందని స్పష్టం చేశారు. ప్రకృతి విధ్వంసం ఫలితంగా జలవనరులు అంతరించిపోయి మూగజీవాలైన పశువులు, పక్షులు దాహార్తితో తల్లడిస్తున్నాయని అన్నారు. భూ కబ్జాదారుల చెర నుంచి చెరువులు, కుంటలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంతోపాటు సమాజంపై ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో సంస్థ ప్రతినిధి ఆకుల రవి పాల్గొన్నారు.

భారీ వాహనాలను గ్రామంలోనికి రానివ్వొద్దు

మడికొండ చౌరస్తాలో రోడ్డుపై పడుకొని లారీలు రాకుండా అడ్డుకున్న స్థానికులు



రోడ్డుపై పడుకొని వాహనాలను అడ్డుకుంటున్న స్థానికుడు

మడికొండ, జూన్ 3: మడికొండ గ్రామంలోనికి భారీ వాహనాలు, టిప్పర్‌ల రానివ్వొద్దని సోమవారం స్థానిక చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తూ స్థానికులు రోడ్డుపై పడుకుని లారీలను అడ్డుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చౌరస్తా నుంచి గ్రామం చివర ధర్మసాగర్ రోడ్డు వరకు గల ఇరుకైన రోడ్డు మార్గం గుండా ప్రతీ రోజు అనేక భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో పలు ప్రమాదాలు జరిగి ప్రజలు మృత్యువాత పడుతున్నారని అయినా ప్రజా ప్రతినిధులు గానీ అధికారులు గానీ పట్టించుకోవడంలేదని ఆరోపించారు. పైగా ప్రజల నుంచి నిరసన వ్యక్తం కాగానే పోలీసులు ఓ బ్యానర్ ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారు కానీ వాహనాలు రాకుండా శాశ్వత పరిష్కారం చూపడంలేదని వాపోయారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసుల నిరసనకారులకు నచ్చజెప్పి వారిని అక్కడి నుంచి పంపించారు. ఈసందర్భంగా సుమారు గంటపాటు వాహనాలు రోడ్డుపై నిలిచిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అభినందనీయులు

మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్‌గౌడ్



కూరపాటి వెంకటనారాయణ ఇంట్లో మంత్రులు, ఎమ్మెల్యే

కాళోజీ జంక్షన్, జూన్ 3 : కల్వకుంట్ల కుటుంబ పాలనపై మొక్కవోని ధైర్యంతో ఉద్యమకారులను, ప్రజాస్వామ్యవాదులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఎదురించిన కూరపాటి వెంకటనారాయణ అభినందనీయులని రాష్ట్ర మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ మధుయాస్కీ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజులు ప్రశంసించారు. తేనేటి విందు కోసం వెంకటనారాయణ ఆహ్వానం మేరకు వారు సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ఆయన స్వగృహానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. కల్వకుంట్ల ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు ఎన్నికల ముందు ఆయన అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. విందుకు హాజరైన వారిలో మంత్రుల వెంట కేయూ ప్రొఫెసర్లు గుగులోతు వీరన్న, రాంరెడ్డి, కందకట్ల సుధాకర్, సంఘాని మల్లేశ్వర్, డాక్టర్ తిరుపతి, డాక్టర్ ఎర్ర బొజ్జ రమేష్ ఉన్నారు.

డప్పు కళాకారులకు యూనిఫాంల పంపిణీ



డప్పు కళాకారులకు యూనిఫాంలను పంపిణీ చేస్తున్న తక్కళ్ళపల్లి రాంగోపాల్‌రావు

మడికొండ, జూన్ 3: గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ రాంపూర్‌లో మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సమావేశంలో రాంపూర్‌కు చెందిన ఎన్నారై తక్కళ్ళపల్లి అరవింద్‌రావు సౌజన్యంతో సోమవారం డప్పు కళాకారులకు యూనిఫాంలు పంపిణీ చేశారు. సమావేశంలో స్టేట్ హౌజ్‌ఫెడ్ డైరెక్టర్ తక్కళ్ళపల్లి రాంగోపాల్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని డప్పు కళాకారులకు యూనిఫాంలు అందజేశారు. ఈసందర్భంగా ఎన్నారై అరవింద్‌రావు అమెరికా నుంచి ఫోన్ ద్వారా డప్పు కళాకారులతో మాట్లాడి వారికి అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చందరాజు జనార్ధన్, సత్తయ్య, బాబు, సంద్ర సుగుణాకర్, మునిగాల అశోక్, గుండె నాగరాజు, మాదాసి శ్రీను, గుండె పరమేష్, అరుణ్, కుమారస్వామి, గుండె మోహన్ పాల్గొన్నారు.

కాకతీయ టెక్స్‌టైల్స్ వీవర్స్ సొసైటీ నూతన కార్యవర్గం

మడికొండ, జూన్ 3: మడికొండలోని టెక్స్‌టైల్ పార్కులో జరిగిన కాకతీయ టెక్స్‌టైల్స్ వీవర్స్ వెల్ఫేర్ సొసైటీకి జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఊరుగొండ శ్రీరాములు, ఉపాధ్యక్షుడిగా కూరపాటి విజయ్‌కుమార్, కార్యదర్శిగా దార్ల రంగస్వామి, కోశాధికారిగా ఆముదాల జ్యోతిభాస్కర్ ఎన్నికయ్యారు. ఊరుగొండ శ్రీరాములు, ఇంజమూరి ఉపేందర్, లకుం సదానందం, సిద్ధి రాములు, చెడుపాక ప్రభాకర్‌లు డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన ఖైరంకొండ రవీందర్, సదానందం, శ్రీనివాస్‌లు గెలుపొందిన వారికి సోమవారం ధృవ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నూతన సొసైటీ సభ్యులు మాట్లాడుతూ పార్కులోని అన్ని ఫ్యాక్టరీలు విజయవంతంగా నడిచేందుకు కృషి చేస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు



ఎంజీఎంలో చికిత్స పొందుతున్న బాధితుడు

కాజీపేట, జూన్ 3: రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలైన ఘటన సోమవారం రాత్రి కాజీపేటలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. మడికొండకు చెందిన శివకుమార్, అంజయ్య, యశ్వంత్‌లు సోమవారం కాజీపేట నుంచి మడికొండ వైపు ద్విచక్రవాహనంపై వస్తున్నారు. డీజిల్‌కాలనీ వద్ద బైక్ యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో మడికొండ నుంచి కాజీపేట వైపు వస్తున్న కోళ్ల వ్యాను ఢీకొంది. ఈఘటనలో శికుమార్, అంజయ్యలు తీవ్రగాయాలయ్యాయి. యశ్వంత్‌కు, అక్కడే ఉన్న మరో ఇద్దరు పిల్లలకు సైతం తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో గాయాలపాలైన వారిని 108లో ఎంజీఎంకు తరలించారు.

రైల్వే జేఏసీని సన్మానించిన ఎమ్మెల్యే నాయిని



రైల్వే జేఏసీ నాయకులను సన్మానించిన ఎమ్మెల్యే నాయిని

కాజీపేట, జూన్ 3: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హనుమకొండ డీ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన తెలంగాణ ఉద్యమ కారులకు సన్మాన సభ నిర్వహించారు. ఈ మేరకు కాజీపేటకు చెందిన తెలంగాణ రైల్వే ఎంప్లాయిస్ కమిటీని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ సన్మానించారు. రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, ఛైర్మన్ కొండ్ర నర్సింగరావు, కో- కన్వీనర్లను పాక వేదప్రకాశ్, గుర్రపు సుధాకర్ రావు, రేండ్ల రమేష్, ఎం. మహేశ్, వి. తిరుపతి, వైస్ ఛైర్మన్‌లు కె. శ్రీనివాస్, కందుల సంఘమయ్య, టి. సారయ్య, ఎ. శ్రీనివాస్, పాక ఓం ప్రకాశ్, చింత తిరుపతి ఎస్. హరిబాబు లను శాలువాకప్పి, మెమెంటో ఇచ్చి అభినందించారు. తెలంగాణ ఉద్యమంలో రైల్వే జేఏసీ చేసిన ఆందోళనలు మరువలేనివని ఎమ్మెల్యే గుర్తు చేసినట్లు రైల్వే నాయకులు తెతిపారు.

లలితా త్రిపుర సుందరిదేవి ఆలయంలో మండల పూజ



లలిత త్రిపుర సుందరి దేవి ఆలయంలో అభిజ్ఞ భాషణం చేస్తున్న విద్యారణ్య భారతీ మహాస్వామి

వడ్డెపల్లి, జూన్ 3: గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ జవహర్‌కాలనీ రోడ్డు సురేంద్రపురి కాలనీలో నిర్మించిన లలితా త్రిపుర సుందరి దేవీ ఆలయంలో మండల పూజ మహోత్సవాన్ని సోమవారం అత్యంత భక్తి శ్రద్ధలతో శోభాయమానంగా నిర్వహించారు. ఉదయం లలితా త్రిపుర సుందరి దేవి అమ్మవారికి ఫల, పంచామృతాభిషేకాలు, అర్చన, గణపతి పూజ, గోపూజతో పాటు అగ్ని ప్రతిష్ఠ, గణపతి హోమం, మూల మంత్ర హోమం భక్తి ప్రపత్తులతో ఆలయ అర్చకులు చంద్రమౌళి చంద్రశేఖర శర్మ, శివపురం అరుణ్‌శర్మ, రాజశేఖర శర్మ ఆధ్వర్యంలో జరిపించారు. లోక కల్యాణార్థం సాయంత్రం సంధ్యావేళ జగద్గురు హంపీ విరూపాక్ష విద్యారణ్య భారతి మహాస్వామి కరకమలముల చేత సామూహిక కుంకుమార్చనలను నిర్వహించారు. మహా అన్నదాన కార్యక్రమాన్ని చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు డాక్టర్ రమేష్, సుధాకర్‌రెడ్డి, గణేష్, గోపాల్‌రెడ్డి, బొమ్మగాని కార్తీక్, వెంకన్న, వెంకట్రాజం, జి. రమేష్, శ్రీధర్, వెంకట్రాంరెడ్డి, చంద్రసేనారెడ్డి, రమేష్, నవీన్, రఘురాం, శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, వెంకటేశ్వర్లు, సాంబశివుడు, మహదేవ్‌తో పాటు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని లలితా త్రిపుర సుందరి దేవి అమ్మవారిని కొలిచి తరించారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మడికొండ, జూన్ 3: గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ రాంపూర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత, రజక కుల సంఘం అధ్యక్షుడు చందరాజు వెంకటేష్(46) ఆదివారం గుండె నొప్పితో మృతి చెందాడు. సోమవారం మాజీ ఉప ముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య వెంకటేష్ భౌతిక కాయాన్ని సందర్శించి భౌతిక కాయంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. వెంకటేష్ కుటుంబ సభ్యులను ఓదార్చి అంతిమయాత్రలో పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

వరంగల్ మెడికల్, జూన్ 3 : హనుమకొండ చౌరస్తాలోని పద్మాక్షి పాలిక్లినిక్‌లో ఈ నెల 5వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఎండోక్రైనాలసిస్టు (షుగర్, థైరాయిడ్, హార్మోన్స్ వ్యాధుల సూపర్ స్పెషలైజేషన్) డాక్టర్ లక్ష్మణ్ కుమార్, కార్డియాలజిస్టు డాక్టర్ పీవీ.అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మరిన్ని వివరాలకు 99559 96166, 91338 93360 మొబైల్ నెంబర్లకు ఫోన్ చేసి పేరు రిజిస్టర్ చేసుకోవాలని వైద్యులు సూచించారు.

పరీక్షా పత్రాలు మార్చిన కేసులో ఉద్యోగుల అరెస్టు

(5వ పేజీ తరువాయి)

చేసిన పోలీసులు విచారణ చేస్తున్న క్రమంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో పాటు వివిధ కాలేజీలకు చెందిన విద్యార్థులు చాలా మంది ఉన్నట్లు తేలింది. ఈ కేసుతో సంబంధం ఉన్నటువంటి 11 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు సీఐ సంజీవ్, ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఈ కేసుతో సంబంధం ఉన్న అందరిని అరెస్టు చేస్తామని వారు తెలిపారు. అరెస్టు అయిన వారిలో మాదాసి సునిల్, గడ్డం రాణాప్రతాప్, నాసం శ్రీధర్, బి.పృథ్వీరాజ్, బైరి రమేశ్, చాట్ల సందీప్, సల్ల పవన్‌కుమార్, పొన్నాల నితీష్, పొలెపాక శ్రీకాంత్, దేవరకొండ రాజేష్, చీకటి రాకేష్ ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



కాజీపేట, జూన్ 3: కాజీపేట ప్రగతినగర్‌లో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... సుమారు 25 నుంచి 30 సంవత్సరాలు వయస్సు ఉండి 5.5 అడుగుల ఎత్తు, ఎరుపు రంగు చాయగలిగి పొడవు ముఖం, బ్లూవైట్ గ్రీన్ చుక్కల టీషర్ట్, లైట్‌బ్లూ జీన్ ప్యాంట్ దరించి ఉన్న ఓ వ్యక్తి ఆదివారం ప్రగతినగర్ వినాయక ట్రేడర్స్ ఎదురుగా డివైడర్ మధ్యలో పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడకు చేరుకున్న 108 సిబ్బంది ఆ వ్యక్తిని పరిశీలించి అప్పటికే మృతి చెందాడని చెప్పి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మృతదేహాన్ని పోలీసులు ఎంజీఎంలో భద్రపరిచారు. మృతుడిని గుర్తించడానికి అతని వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులేదని మృతుని ఎడమ కన్నుపై కమిలిన గాయం ఉందని పోలీసులు తెలిపారు. వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు కాజీపేట పోలీస్ స్టేషన్ మొబైల్ నంబర్ 8712685122, 8712685008 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

వడదెబ్బతో యువకుడి మృతి



బెనని (ఫైల్)

కాజీపేట, జూన్ 3: వడ దెబ్బతగలడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కాజీపేటలో జరిగింది. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మోటం బెనని (34) కూలీపని చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతడు మద్యానికి బానిస కావడంతో భార్య పుట్టింటికి వెళ్లింది. కొంత కాలంగా మద్యం సేవిస్తూ అనారోగ్యానికి గురయ్యాడు. ఆదివారం రైల్వే స్టేషన్ సమీపంలో వడదెబ్బతో అపస్మారక స్థితిలో ఉండగా స్థానికులు 108 ద్వారా ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని తండ్రి మోటం మలాకి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మృతునికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.

కారు.. ట్రాక్టర్ ఢీకొని ఒకరి దుర్మరణం




కారు ప్రమాదంలో మృతిచెందిన రవినాగబాబు

ఐనవోలు, జూన్ 3: కారు.. ట్రాక్టర్ ఢీకొని ఒకరు మృతిచెందిన సంఘటన పంథిని గ్రామ శివారు జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. ఎస్సై అనిల్ కుమార్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం మండలం ఏలేటిపాడు గ్రామానికి చెందిన కొజు రవినాగబాబు(35)ఐదుగురితో కలిసి కరీంనగర్‌కు కారులో బయలుదేరారు. వరంగల్ బట్టుపల్లి షోరూం నుంచి నల్లగొండ షోరూంకు రెండు కొత్త ట్రాక్టర్ ఇంజన్లను డ్రైవర్ పిట్టల సిద్దు తీసుకెళ్తున్నాడు. పంథిని గ్రామ శివారులో తెల్లవారుజామున కారు, ట్రాక్టర్ వేగంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ట్రాక్టర్ ఇంజన్ బొల్తాపడగా కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న రవినాగబాబు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. కారులో ఉన్న మరో నలుగురు యేసు, నోవరాజు, వరప్రసాద్, సుధాకర్‌లకు గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ సిద్దుకు బలమైన గాయాలయ్యాయి. కారులో వెళ్తున్న ఐదుగురు కరీంనగర్‌లో ఉంటున్న వెంకన్నను తీసుకరావడానికి ఆదివారం రాత్రి ఏలేటిపాడు నుంచి బయలుదేరగా రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి ఆత్మహత్య

మృతుడిది జనగామ జిల్లా కొడకండ్ల



గుగులోతు రవి (ఫైల్)

గిర్మాజీపేట, జూన్ 3 : మద్యం మత్తులో భార్యను కొట్టగా, ఆమె పిల్లల్ని తీసుకుని పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపం చెందిన మేస్త్రీ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం హనుకొండ జిల్లా కాజీపేట దర్గా సమీపంలో చోటుచేసుకుంది. వరంగల్ జీఆర్‌పీ సీఐ జి.నరేష్ కథనం ప్రకారం.

జనగామ జిల్లా కొడకండ్లకు చెందిన గుగులోతు రవి(32)కి భార్య అనిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రవి మేస్త్రీ పనిచేసుకుంటూ దర్గా కాజీపేట ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. హనుమాన్ మాలధరించి 41 రోజుల అనంతరం దీక్షను విరమించాడు. ఆదివారం మాలవిరమణ అనంతరం మద్యం సేవించి భార్యను కొట్టాడు. దీంతో మనస్తాపం చెందిన భార్య, పిల్లల్ని తీసుకుని సోమవారం ఉదయం పుట్టింటికి వెళ్లింది. దీంతో జీవితంపై విరక్తి చెందిన రవి మద్యం తాగి భార్యకు ఫోన్ చేసి రైలు కిందపడి చనిపోతున్నానని చెప్పాడు. మధ్యాహ్నం వేళ దర్గా రైల్వేగేటు సమీపంలో వరంగల్ నుంచి న్యూఢిల్లీ వెళ్తున్న ఏపీ ఎక్స్‌ప్రెస్ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎంజీఎం మార్చురీలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ పి.రాజు కేసు దర్యాప్తు చేస్తున్నాడు.

ఉద్యమకారుల కుటుంబాలను ఆదుకోవాలి

సీపీఐ రాష్ట్ర నేత తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

బాలసముద్రం, జూన్ 3: తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చాలని, తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలను అన్ని విధాల ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సిద్ధించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నదని అన్నారు. తెలంగాణ కోసం పోరాడిన పార్టీలను, సంఘాలను, ఉద్యమకారులను గుర్తించాలని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా నాయకులు ఆదిరి శ్రీనివాస్, కర్రె లక్ష్మణ్, మునిగాల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

వేం నరేందర్‌రెడ్డిని కలిసిన మండల సమ్మయ్య

హనుమకొండ సిటీ, జూన్ 3 : ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని హనుమకొండకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మండల సమ్మయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం వేం నరేందర్‌రెడ్డి హనుమకొండకు వచ్చిన క్రమంలో ఎక్సైజ్ కాలనీలోని ఆయన నివాసంలో సమ్మయ్య కలిశారు. పార్టీకి చేసిన సేవలను తెలియచేశారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి తదితర కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

విషపూరితాలు



మనందరికీ ఇల్లే పదిలమైన ప్రదేశం. కానీ మనం చేసే చిన్న చిన్న పొరపాట్లు, నిర్లక్ష్యాల వల్ల సురక్షితమైన ఇల్లే ప్రమాదకరమైన ప్రదేశంగా మారిపోతుంది. మరీ ముఖ్యంగా క్రిమికీటకాలు, ఎలుక మందులు, ఇంటిని శుభ్రపరిచే ఉత్పత్తులు లాంటివి పొరపాటున పొట్టలోకి చేరుకుంటే, ఆరోగ్యపరంగా తిరిగి సరిదిద్దలేని నష్టం జరగవచ్చు. కాబట్టి వీటితో తలెత్తే ప్రమాదాలు, ప్రత్యామ్నాయ పద్ధతుల గురించి తెలుసుకుందాం!

ఆ మందులు మనకు ప్రమాదకరం

చీటలుకలు, ఎలుకలు, పందికొక్కులు లాంటివి గ్రామాలకే పరిమితం కాదు. నగరాల్లో కూడా అవి స్వేచ్ఛగా తిరుగుతూ ఉంటాయి. వాటితో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది కాబట్టి ఎన్నో రకాల ఎలుక మందులు తయారవుతున్నాయి. పొడి, పేస్ట్, పెల్లెట్స్, సిరీల్ బెయిట్స్ లేదా బ్లాక్స్ రూపంలో ఇవి మార్కెట్లో దొరుకుతూ ఉంటాయి. వీటిని ఇళ్లలో ఉపయోగించినప్పుడు, పొరపాటున లేదా ప్రమాదవశాత్తూ తినేయడం జరుగుతూ ఉంటుంది. మరీ ముఖ్యంగా పిల్లలున్న ఇళ్లలో ఇలాంటి ప్రమాదాలు ఎక్కువ. కొన్ని సందర్భాల్లో వీటి నుంచి వెలువడే విషపూరిత వాయువులు పీల్చుకోవడం వల్ల కూడా ప్రమాదాలు తలెత్తవచ్చు. ఎరువులు, బాణాసంచా, మందుగుళ్లు, ఎలుక మందుల తయారీల్లో పసుపు లేదా తెల్లగా ఉండే ఫాస్ఫరస్‌ను ఉపయోగిస్తూ ఉంటారు. వెల్లుల్లి వాసన వెదజల్లుతూ ఉండే ఈ పదార్థం అన్ని చోట్లా దొరుకుతూ ఉంటుంది.

ఫాస్ఫరస్ ప్రమాదం

ఎలుక మందుల తయారీలో ఉపయోగించే ఈ విషపూరిత పదార్థం పొట్టలోకి చేరుకున్న వెంటనే వేగంగా శోషణ చెంది, కాలేయం, మూత్రపిండాలు, జీర్ణకోశం, హృదయనాళ వ్యవస్థ పనితీరును దెబ్బతీస్తుంది. కేవలం 8 గ్రాముల ఎలుక మందు, ప్రాణాంతక పరిస్థితికి దారి తీసేటంత ప్రభావాన్ని కలిగి ఉంటుంది. ఈ విషం బారిన పడిన 24 గంటల్లోగా వాంతులు, తలతిరుగుడు, డయేరియా, పొట్టలో నొప్పి మొదలైన లక్షణాలు తలెత్తుతాయి. రెండవ దశలో ఒకటి నుంచి నాలుగు రోజుల పాటు ఎలాంటి లక్షణాలు కనిపించకపోవచ్చు. మూడవ దశలో, బహుళ అవయవాలు విఫలమవుతూ పరిస్థితి ప్రాణాంతకంగా పరిణమిస్తుంది. ఈ దశలో మానసిక స్థితి కూడా దెబ్బతింటుంది. అయోమయం, సైకోసిస్, చిత్రభ్రమలు మొదలై, కోమాలోకి జారిపోయే ప్రమాదం కూడా ఉంటుంది. అయితే ఈ ఎల్లో ఫాస్ఫరస్ విషానికి ఎలాంటి విరుగుడూ లేకపోయినప్పటికీ, డీకంటామినేషన్, సపోర్టివ్ థెరపీలతో చికిత్స చేయవచ్చు. దాన్లో భాగంగా విషం మరింతగా శోషణ చెందకుండా ఉండడం కోసం పొట్టలోని విషాలను బయటకు రప్పించే గ్యాస్ట్రిక్ లావేజ్ పద్ధతిని అనుసరిస్తారు. అందుకోసం పొటాషియం పర్మాంగనేట్ ద్రావణం లేదా సెలైన్‌ను పొట్టలోకి పంపిస్తారు. ఈ చికిత్సతో కోలుకున్న తర్వాత, రోగిని ఐసియులో ఉంచి, ప్రతిరోజూ కాలేయం, మూత్రపిండాల పనితీరులను పర్యవేక్షించవలసి ఉంటుంది.

పారాసిటమాల్‌తో...

ఈ మాత్రలను ఎక్కువ పరిమాణాల్లో తీసుకోవడం వల్ల కాలేయం తీవ్రంగా విషపూరితం అయ్యే ప్రమాదం ఉంటుంది. పెద్దలకు 7.5 నుంచి 10 గ్రాములు, ఒకటి నుంచి ఆరేళ్లలోపు పిల్లలైతే ఒక కిలో శరీర బరువుకు 150 మి.గ్రా నుంచి 200 మి.గ్రా పారాసిటమాల్ ప్రమాదకరం. ఈ మోతాదుల్లో పారాసిటమాల్ తీసుకున్న 24 గంటల్లోగా ఆకలి తగ్గిపోవడం, వాంతులు, తల తిరుగుడు లాంటి లక్షణాలు కనిపిస్తాయి. 48 గంటల్లోగా పొట్టలో నొప్పి, ఆకలి లేకపోవడం, వాంతులు, 48 నుంచి 96 గంటల్లోగా కామెర్లు, హైపోగ్లైసీమియా, కాలేయం, మూత్రపిండాలు దెబ్బతింటాయి. ఇలాంటి సందర్భాల్లో కూడా పొట్టలోని మాత్రలను బయటకు రప్పించే చికిత్సనే వైద్యులు అనుసరిస్తారు.

నెయిల్ పాలిష్, హార్పిక్‌లతో...

వీటిలోని విషపూరిత రసాయనాలైన టోలీన్, ఫార్మాల్డిహైడ్, డైబ్యుటైల్ థాలేట్‌లు, పారాసిటమాల్ పాయిజనింగ్ మాదిరిగానే కాలేయం, మూత్రపిండాలను దెబ్బ తీస్తాయి. పిల్లలు ప్రమాదవశాత్తూ బాత్రూమ్ శుభ్రం చేసే హార్పిక్ తాగేస్తూ ఉంటారు. హార్పిక్ పొట్టలోకి చేరుకుంటే జీర్ణ వ్యవస్థ దెబ్బతిని, వాంతులు, డయేరియా వేధిస్తాయి. కాలేయం ఇస్కీమిక్ షాక్‌కు గురవుతుంది. వీటితో పాటు, బాత్రూమ్ శుభ్రం చేసే యాసిడ్లు, ఫినాయిల్, పొడి, చాక్‌పీస్ రూపంలో ఉండే చీమల మందులు కూడా ప్రమాదకరమే!

నివారణ ఇలా...

■ **అగ్గిపుల్లలు:** వీటిని పిల్లలకు దూరంగా ఉంచాలి. వాడకాన్ని తగ్గించాలి. స్టవ్ వెలిగించడం కోసం వీటికి బదులుగా ఎలక్ట్రానిక్ లైటర్లను ఉపయోగించాలి.

■ **బాణాసంచా:** వీటి నుంచి వెలువడే పొగను పీల్చే అవకాశం లేకుండా చూసుకోవాలి. ఎక్కువ పొగను వెలువరించే మతాబులు, చిచ్చుబుడ్లు లాంటి బాణాసంచాలకు దూరంగా ఉండాలి. బాణాసంచా కాల్చేటప్పుడు రెండు పొరల మాస్క్ ధరించాలి.

■ **ఎరువులు:** ప్రమాదవశాత్తూ పిల్లలకూ, మానసిక కుంగుబాటుతో ఆత్మహత్య చేసుకొనే పెద్దలకు ఎరువులు ప్రాణాంతకంగా మారుతూ ఉంటాయి. కాబట్టి వీటిని తాళం వేసిన గదుల్లో భద్రపరచాలి.

■ **ఎలుక మందులు:** వీటిని కూడా పిల్లలు, పెద్దలు ఇద్దరికీ దూరంగా ఉంచాలి. వీటిని ఉంచిన గదికి తాళం వేసి ఉంచాలి. వీటిని నిల్వ చేసుకోకూడదు. తక్కువ మోతాదుల్లో కొని, కొన్న వెంటనే పూర్తిగా ఉపయోగించాలి. ఖాళీ అయిన డబ్బా లేదా ట్యూబ్‌లను వెంటనే పారేయాలి. మిగిలిపోయిన మందులను నేల మీద పారేయకూడదు.

■ ఎలుక మందులకు బదులుగా బోన్లు, జిగురుతో కూడిన ర్యాట్ ట్రాప్స్ వాడుకోవాలి.



డాక్టర్ గొలమారి శ్రీనివాస్ రెడ్డి
కన్సల్టెంట్ హెపటాలజీ అండ్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్,
స్టార్ హాస్పిటల్స్, హైదరాబాద్.





ఎల్లో ఫాస్ఫరస్ విషానికి ఎలాంటి విరుగుడూ లేకపోయినప్పటికీ, డీకంటామినేషన్, సపోర్టివ్ థెరపీలతో చికిత్స చేయవచ్చు. దాన్లో భాగంగా విషం మరింతగా శోషణ చెందకుండా ఉండడం కోసం పొట్టలోని విషాలను బయటకు రప్పించే గ్యాస్ట్రిక్ లావేజ్ పద్ధతిని అనుసరిస్తారు. అందుకోసం పొటాషియం పర్మాంగనేట్ ద్రావణం లేదా సెలైన్‌ను పొట్టలోకి పంపిస్తారు.



ఇలా చేద్దాం

మెదడు చురుగ్గా...

మెదడు శరవేగంతో పరుగులు తీయాలన్నా, పదునుగా పని చేయాలన్నా, అందుకు తోడ్పడే జాగ్రత్తలు తీసుకోవాలి. అందుకోసం...

మన తెలివితేటలు, మేథస్సు జన్యువుల మీదే ఆధారపడి ఉంటాయి. అయినప్పటికీ మన మెదడు ఆరోగ్యం, తెలివితేటలు మన దైనందిన అలవాట్ల మీదే ఆధారపడి ఉంటాయి. ఆరోగ్యకరమైన జీవనశైలి మన ఏకాగ్రత, చురుకుదనాలకు పదును పెట్టి, తెలివైన నిర్ణయాలు తీసుకోడానికి, క్లిష్టమైన సందర్భాల్లో చురుగ్గా ఆలోచించడానికీ తగ్గట్టుగా మెదడును పదునుగా మారుస్తుంది. ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగంగా ఎలాంటి అలవాట్లను అలవరుచుకోవాలంటే..

శారీరక వ్యాయామం: వ్యాయామంతో మెదడుకు రక్తప్రసరణ పెరిగి, మెదడు కణాలైన న్యూరాన్ల సంఖ్య పెరుగుతుంది. ఈత, జాగింగ్, బ్రిస్క్ వాక్ మొదలైన వ్యాయామాలు కూడా మెదడును ఆరోగ్యంగా ఉంచుతాయి.

ఆహారం: ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్లు, యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు మెదడు ఆరోగ్యానికి దోహదపడతాయి. చేపలు, నట్స్, బెర్రీలు, ఆకుకూరలు మెదడు పోషణకు అవసరమైన పోషకాలను సమకూరుస్తాయి.

బ్రెయిన్ గేమ్స్: చెస్, సుడొకు, పజిల్స్, కొత్త భాష నేర్చుకోవడం లాంటివి మెదడు పనితీరును మెరుగు పరుస్తాయి. తెలివితేటలను పెంచుతాయి. నాడీ కణాల మధ్య కనెక్షన్లు పెరిగి, సమస్యను పరిష్కరించే మెలకువలు అలవడతాయి.

నిద్ర: కంటి నిండా నిద్ర జ్ఞాపకశక్తిని చురుగ్గా ఉంచుతుంది. కాబట్టి రోజుకు ఆరు నుంచి ఎనిమిది గంటలకు తగ్గకుండా నిద్రపోవాలి.

ధ్యానం: ప్రాణాయామం ఒత్తిడిని తగ్గించి, మెదడు పనితీరును మెరుగుపరుస్తుంది. ప్రాణాయామంతో మెదడుకు సరిపడా ఆక్సిజన్ దొరికి, నాడీ కణాలు చురుగ్గా పని చేస్తాయి. కొత్త విషయాలను నేర్చుకోవడం, జ్ఞాపకశక్తిలకు సంబంధించిన మెదడులోని గ్రే మ్యాటర్ మెరుగ్గా ఉండడానికి ధ్యానం తోడ్పడుతుంది.

చదవడం: పుస్తకాలు చదవడం వల్ల నాడీ కణాల యాక్టివిటీ పెరిగి, మెదడులోని పాత్‌వేస్ బలపడతాయి. సమాచారాన్ని చటుక్కున సంగ్రహించే శక్తి కూడా పెరుగుతుంది.

హైడ్రేషన్: డీహైడ్రేషన్ ఏకాగ్రతను, దీర్ఘకాల జ్ఞాపకశక్తిని కుంటుపరుస్తుంది. కాబట్టి రోజుకు నాలుగు లీటర్ల నీళ్లు తాగాలి.



మీకు తెలుసా?

తన కోపమే తన శత్రువు

మనకు కోపమొస్తే ఎదుటివాళ్లకే నష్టం అనుకుంటాం. కానీ నిజానికి మన కోపం మనల్నే నష్టపరుస్తుంది. కోపం వల్ల మెదడుతో పాటు శరీరంలోని జీవ వ్యవస్థలన్నిటికీ ఆరోగ్యపరమైన నష్టం జరుగుతుంది.

కోపం పెల్లుబిగడాని కంటే ముందే, మెదడులోని అమిగ్డాలా యాక్టివేట్ అవుతుంది. అమిగ్డాలా హైపోథలామస్‌ను యాక్టివేట్ చేస్తుంది. హైపోథలామస్ కార్టికోట్రోపిన్ రిలీజింగ్ హార్మోన్ స్రవించేలా చేసి, పిట్యూటరీ గ్రంథిని ప్రేరేపిస్తుంది. పిట్యూటరీ గ్రంథి అడ్రినోకార్టికోట్రాపిక్ హార్మోన్‌ను స్రవించి, అడ్రినలిన్ గ్రంథుల్ని ప్రేరేపిస్తుంది. అడ్రినల్ గ్రంథులు కార్టిసాల్, అడ్రినలిన్, నోరాడ్రినాలిన్ అనే స్ట్రెస్ హార్మోన్లను విడుదల చేస్తాయి. ఇదంతా ఒక సైకిల్‌లా ఒకదాని తర్వాత ఒకటిగా క్షణాల్లో జరిగిపోతుంది. కోపం కారణంగా పెరిగిపోయే కార్టిజాల్ హార్మోన్ వల్ల నాడీ కణాలు అవసరానికి మించి క్యాల్షియంను శోషించుకుంటాయి. ఈ క్యాల్షియం ఓవర్‌లోడ్ ఫలితంగా నాడీ కణాలు తరచుగా ఫైర్ అవుతూ చివరకు చనిపోతాయి. మరీ ముఖ్యంగా మెదడులోని హిప్పోక్యాంపస్, ప్రిఫ్రాంటల్ కార్టెక్స్‌లు కార్టిసాల్, దాని దుష్ప్రభావాలకు గురవుతూ ఉంటాయి.



స్ట్రెస్ హార్మోన్ల ప్రభావం

కోపంతో మెదడులో ఉత్పత్తయ్యే స్ట్రెస్ హార్మోన్ శరీరంలోని వేర్వేరు జీవ వ్యవస్థల మీద ప్రభావం చూపిస్తుంది.

- **కార్డియోవ్యాస్క్యులర్ వ్యవస్థ:** గుండె వేగం, రక్తపోటు, రక్తంలో గ్లూకోజ్ మోతాదు, రక్తంలో ఫ్యాటీ యాసిడ్ల మోతాదులు పెరుగుతాయి. ఈ లక్షణాలు తీవ్రమైతే, రక్తనాళాల్లో పూడికలు ఏర్పడి, దెబ్బతింటాయి. ఫలితంగా స్ట్రోక్, హార్ట్ అటాక్ ముప్పు తలెత్తుతుంది.
- **రోగనిరోధక వ్యవస్థ:** కంటి చూపు, థైరాయిడ్ పనితీరు, సహజసిద్ధ కిల్లర్ సెల్స్ తగ్గుతాయి. కళ్లలో ఒత్తిడి, వైరస్ సోకిన కణాలు, కేన్సర్ అవకాశాలు పెరుగుతాయి.
- **జీర్ణ వ్యవస్థ:** రక్తప్రసరణ, మెటబాలిజం, ఎముకల సాంద్రత తగ్గుతుంది. మైగ్రెయిన్లు, ఇతరత్రా తలనొప్పులు, నోరు పొడిబారడం లాంటి లక్షణాలు పెరుగుతాయి.

గుడ్ కార్బ్స

కార్బ్స్ తింటున్నారా?

పిండిపదార్థాలతో బరువు పెరుగుతామనే భయంతో వాటిని ఆహారంలో పూర్తిగా తగ్గించేస్తున్నాం. కానీ నిజానికి పిండిపదార్థాలన్నిటినీ తగ్గించడం శ్రేయస్కరం కాదు. వాటిలో ఏవి మంచివో, ఏవి చెడ్డవో తెలుసుకుని, అవగాహనతో నడుచుకోవాలి.

పిండిపదార్థాలు శక్తిని సమకూర్చే ప్రధాన పోషకాలు. మనం తీసుకునే ఆహారంలోని పిండిపదార్థాలను జీర్ణ వ్యవస్థ గ్లూకోజ్‌గా మారుస్తుంది. శరీరం ఈ గ్లూకోజ్‌ను కణజాలం, కణాలు, అవయవాల శక్తి కోసం వినియోగిస్తూ ఉంటుంది.

పిండిపదార్థాలు లోపిస్తే?

శక్తికి మూలాలైన పిండిపదార్థాలు లోపిస్తే శరీరం పలు లక్షణాల రూపంలో ఆ లోపాన్ని బహిర్గతపరిచే ప్రయత్నం చేస్తుంది. అవేంటంటే...

- నీరసం- నోటి దుర్వాసన
- మలబద్ధకం
- వాంతులు
- తలనొప్పి
- పోషకలోపం

డి - గ్లూకోజ్

అత్యంత ముఖ్యమైన, కీలకమైన పిండిపదార్థం గ్లూకోజ్. అన్ని జీవరాశులూ శక్తి కోసం వాడుకునే సులువైన చక్కెర (మోనోశాఖరైడ్) ఇది. అయితే పిండిపదార్థాలు శరీర బరువును కచ్చితంగా పెంచుతాయి. అవసరం లేని చెడు పిండిపదార్థాలు ఎక్కువగా తీసుకుంటూ, అవసరం ఉన్న మంచి పిండిపదార్థాలను పరిమితంగా తీసుకునేవారికి ఈ సమస్య సహజం. కాబట్టి వాటిలో ఏవి మంచి, ఏవి చెడు? అనే విషయం మీద అవగాహన ఏర్పరుచుకోవాలి.

మంచి పిండిపదార్థాలు (కాంప్లెక్స్ కార్బ్స్)

వీటిలోని రసాయన రూపం, పీచులను జీర్ణం చేసుకోవడానికి శరీరం ఎక్కువ శక్తిని ఖర్చుచేయవలసివస్తుంది. వీటి నుంచి అందే శక్తి శరీరానికి ఎక్కువ సమయంపాటు ఉపయోగపడుతుంది. మంచి పిండిపదార్థాలలో...

- పోషకాలు, పీచు ఎక్కువ
- గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువ
- తక్కువ క్యాలరీలతోనే కడుపు నిండుతుంది
- శరీరం శక్తిని ఖర్చు చేసుకునే వేగం (మెటబాలిజం) పెరుగుతుంది.
- పొట్టు తీయని గోధుమలతో తయారైన బ్రెడ్, రొట్టెలు, తృణధాన్యాలు, ఆకుపచ్చని కూరగాయలు, చిలకడదుంపలు, తాజా పళ్లు ఈ కోవకు చెందినవి.

చెడు పిండిపదార్థాలు (సింపుల్ కార్బొహైడ్రేట్స్)

ఇవన్నీ పొట్టు తీసి, పాలిష్ చేసిన పదార్థాలు. వీటిలో సహజసిద్ధ పోషకాలు, పీచు తక్కువ. చెడు పిండిపదార్థాల్లో...

- పీచు, పోషకాలు అతి స్వల్పం
- గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువ
- క్యాలరీలు కొవ్వుగా మారతాయి
- అత్యధిక గ్లూకోజ్ స్థాయిలు (నీరసం తెప్పిస్తాయి)
- చాక్లెట్లు, తీపి పదార్థాలు, తీపి జోడించిన తృణధాన్యాలు, సోడాలు, శీతల పానీయాలు, పొట్టు తీసిన పిండ్లు ఈ కోవకు చెందినవి.

మేలురకం పిండిపదార్థాలు వీటిలో...

ఓట్స్‌తో తయారైన బిస్కెట్లు, నారింజ రసం, యాపిల్, కేరట్లు, టమేటాలు, ఎండుద్రాక్ష, ద్రాక్ష, అరటిపళ్లు.

- **ఓట్‌మీల్:** ఎక్కువ సమయంపాటు శక్తినిచ్చే నిలకడైన పిండిపదార్థం ఇది. నీళ్లు కలిపి తయారుచేసిన ఒక కప్పు ఓట్‌మీల్‌లో 159 క్యాలరీలు ఉంటాయి. 4 గ్రాములు పీచు, 6 గ్రాముల మాంసకృత్తులు ఉంటాయి.
- **యాపిల్:** భోజనానికి, భోజనానికి మధ్య తీసుకోవలసిన ఈ అల్పాహార ఫలంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించే 4 గ్రాముల పీచు, పెక్టిన్‌లు ఉంటాయి. మాంసకృత్తులు పుష్కలంగా ఉండే వేరుసెనగపప్పుతో తయారయ్యే వెన్నతో కలిపి తీసుకుంటే ప్రయోజనకరం.
- **చిలకడదుంపలు:** ఇది నిజమైన 'సూపర్ ఫుడ్'. కప్పు చిలకడదుంప ముక్కల్లో 7 గ్రాముల పీచు, అత్యధిక విటమిన్ ఎ, సిలు, 4 గ్రాముల మాంసకృత్తులు ఉంటాయి.
- **మినుములు:** ఒక కప్పు ఉడకబెట్టిన పొట్టు తీయని మినుముల్లో 15 గ్రాముల పీచు, అంతే పరిమాణంలో మాంసకృత్తులు ఉంటాయి. ఇంత పరిమాణంలో పోషకాలు మరే పదార్థంలోనూ ఉండవు.
- **టమేటాలు:** వీటిలో విటమిన్లు, ఖనిజలవణాలు పుష్కలం. పీచుతో పాటు లైకోపీన్ అనే యాంటీఆక్సిడెంటు కూడా వీటిలో ఉంటాయి.



డయాగ్నొసిస్

రక్తపరీక్ష మతలబులు

రక్తపరీక్ష ఫలితాల్లో మనకు అంతుపట్టని అంశాలెన్నో ఉంటాయి. కొన్ని విలువలు పెరిగిపోయి కనిపిస్తే, కొన్నిటి విలువలు తగ్గిపోయి ఉంటాయి. ఆ విలువలు, వాటిలో హెచ్చుతగ్గులకు కారణాల గురించి తెలుసుకుందాం!

టిపి (టోటల్ ప్రొటీన్)

పెరగడానికి కారణం: డీహైడ్రేషన్, ఇన్‌ఫ్లమేషన్

తరగడానికి కారణం: రక్తస్రావం, కాలేయ వ్యాధి, మూత్రపిండాల వ్యాధి, పేగుల వ్యాధి, కంజెస్టివ్ హార్ట్ ఫెయిల్యూర్

ఎఎల్‌బి (అల్బ్యుమిన్)

పెరగడానికి కారణం: డీహైడ్రేషన్

తరగడానికి కారణం: రక్తస్రావం, కాలేయ వ్యాధి, మూత్రపిండాల వ్యాధి, జీర్ణకోశ వ్యాధి, కంజెస్టివ్ హార్ట్ ఫెయిల్యూర్

బియుఎన్ (బ్లడ్ యూరియా నైట్రోజన్)

పెరగడానికి కారణం: డీహైడ్రేషన్, మూత్రపిండాల వ్యాధి, మూత్రంలో అడ్డంకి, గుండెజబ్బు, షాక్, అధిక ప్రొటీన్ డైట్

తరగడానికి కారణం: కాలేయ వ్యాధి, ప్రొటీన్ లోపం, ఓవర్ హైడ్రేషన్

జిఎల్‌ఒబి (గ్లోబ్యులిన్)

పెరగడానికి కారణం: క్రానిక్ ఇన్‌ఫ్లమేషన్, క్రానిక్ ఇన్‌ఫెక్షన్

తరగడానికి కారణం: రక్త నష్టం, గ్యాస్ట్రోఇంటెస్టైనల్ డిసీజ్, ఇమ్యునోడెఫిసియన్సీస్



సిఆర్ఇఎటి (క్రియాటినిన్)

పెరగడానికి కారణం: మూత్రపిండాల వ్యాధి, డీహైడ్రేషన్, కండరాలు దెబ్బతినడం, మూత్రంలో అడ్డంకి

తరగడానికి కారణం: ఓవర్ హైడ్రేషన్

జిఎల్‌యు (గ్లూకోజ్)

పెరగడానికి కారణం: డయాబెటిస్ మెల్లిటస్, అక్యూట్ స్ట్రెస్ రెస్పాన్స్

తరగడానికి కారణం: సెప్సిస్, పోషకలోపం, నాడీ సంబంధ వ్యాధి

సిహెచ్‌ఒఎల్ (కొలెస్ట్రాల్)

పెరగడానికి కారణం: డయాబెటిస్ మెల్లిటస్, హైపోథైరాయిడిజం, పాంక్రియటైటిస్, మూత్రపిండాల వ్యాధులు

తరగడానికి కారణం: లివర్ ఇన్‌సఫిసియన్సీ, పేగుల వ్యాధులు



క్లీంకారకు కల్కి టీమ్ గిఫ్ట్స్

విడుదల తేదీ దగ్గర పడడంతో 'కల్కి 2898 ఏ.డీ' చిత్ర బృందం ప్రచారం జోరు పెంచింది. ప్రమోషన్స్‌లో భాగంగా స్టార్ కిడ్స్‌కు గిఫ్ట్‌ను పంపిస్తోంది. ఇటీవలే ఈ గిఫ్ట్ రామ్‌చరణ్, ఉపాసనల కూతురు క్లీంకారకు చేరాయి. ఆ బహుమతుల్లో బుజ్జి-భైరవ స్టికర్స్, బుజ్జి క్యారెక్టర్ బొమ్మ, టీషర్ట్‌లు ఉన్నాయి. ఆ గిఫ్ట్‌తో ఆడుకుంటున్న క్లీంకార ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఉపాసన.. కల్కి టీమ్‌కు కృతజ్ఞతలతో పాటూ ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ ప్రచారంలో భాగంగా త్వరలోనే మరింత మంది సెలబ్రిటీల పిల్లలకూ ఈ గిఫ్ట్ అందుతాయట. కాగా, అభిమానులంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పాన్ ఇండియా మూవీ 'కల్కి 2898 ఏ.డీ' ఈ నెల 27న విడుదల కానుంది. ప్రభాస్ హీరోగా నటించిన ఈ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌కు నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొనే, దిశా పటానీలతో కూడిన భారీ తారాగణం ఇందులో నటించారు. వైజయంతీ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అశ్వనీదత్ నిర్మించిన ఈ చిత్రం మహా భారతంతో మొదలై క్రీస్తు శకం 2898లో పూర్తయ్యేలా, మొత్తం ఆరు వేల ఏళ్ల సంవత్సరాల వ్యవధిలో జరిగే కథగా తెరకెక్కింది.

అటు రజనీకాంత్.. ఇటు ఎన్టీఆర్



తమిళ చిత్రరంగ సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రస్తుతం హిమాలయ పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. తన ఆధ్యాత్మిక యాత్రలో భాగంలో కేదార్‌నాథ్, బద్రీనాథ్ దేవాలయాలను సందర్శించిన రజనీకాంత్ ఇప్పుడు అక్కడున్న సాధువులను కలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఓ సాధువుతో ఆధ్యాత్మిక విషయాలు చర్చిస్తూనే తన సినిమాల ముచ్చట్లు కూడా వివరించారు. ప్రస్తుతం 'వెట్టియాన్'లో నటిస్తున్నాను. నా వర్క్ పూర్తయింది. మిగిలిన నటీనటుల మీద చిత్రీకరణ జరుగుతోంది. విజయదశమి సందర్భంగా అక్టోబరు పదిన ఆ సినిమా విడుదల చేయాలనుకుంటున్నారు. నా కొత్త సినిమా 'కూలీ' షూటింగ్ ఈ నెల పదిన ప్రారంభమవుతుంది. ఈ సినిమాలకు లోకేశ్ కనకరాజ్ దర్శకత్వం వహిస్తారు' అని ఆ సాధువుకు చెప్పారు రజనీకాంత్.

జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న 'దేవర పార్ట్ 1' చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. అదే రోజున రజనీకాంత్ సినిమా కూడా వస్తుండడంతో ఈ రెండు చిత్రాల మధ్య పోటీ తప్పదంటున్నారు సినీ పరిశీలకులు. అయితే రజనీకాంత్ చిత్రం విడుదల తేదీని ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. ఈ రెండు చిత్రాల మధ్య పోటీ ఉంటుందా లేదా అని తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే!



ఇకపై... రెట్టింపు కష్టపడతా

నటిగా దక్షిణాదిలోని అగ్రతారల్లో ఒకరిగా గుర్తింపు తెచ్చుకున్నారు సమంత. ఇటీవలే ఆమె మరో అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. ఐఎండీబీ (ఇంటర్నెట్ మూవీ డేటా బేస్) ఇటీవలే 'గత దశాబ్దంలో ఎక్కువ మంది చూసిన భారతీయ సెలబ్రిటీల జాబితా'పై సర్వే నిర్వహించింది. ఇందులో సమంతకు 13వ స్థానం లభించింది. ఈ విషయంపై ఆమె స్పందించారు. "నటిగా ఇలాంటి గుర్తింపు తెచ్చుకున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఇది నా కృషికి, అదృష్టానికి తగిన ప్రతిఫలం. ఇండస్ట్రీలో ఇన్నేళ్లు ఎలా గడిచాయో తెలియట్లేదు. కెరీర్‌ను ఇప్పుడిప్పుడే మొదలుపెడుతున్నట్లు ఉంది. వరుస సినిమాల్లో నటించేందుకు అద్భుతమైన పాత్రలు వస్తున్నాయి. ఇకపై నేను నటించే ప్రతీ సినిమాలో అభిమానుల కోసం రెట్టింపు కష్టపడతా" అని చెప్పారు. కాగా, ఈ జాబితాలో బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణే అగ్రస్థానంలో నిలువగా.. షారుక్ ఖాన్, ఐశ్వర్య రాయ్ బచ్చన్, ఆలియా భట్ తర్వాతి స్థానాల్లో నిలిచారు. దక్షిణాది నుంచి తమన్నా, నయనతార 16, 18వ స్థానంలో నిలిచారు.

థ్రిల్లర్స్ ఇష్టపడే వారికి నచ్చేలా సత్యభామ



థ్రిల్లర్ చిత్రాల స్పెషలిస్ట్‌గా పేరు తెచ్చుకున్నారు సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల. సినిమాకు ఆయన ఇచ్చిన సంగీతం కంటే అందులోని నేపథ్య సంగీతంతోనే పాపులరైన శ్రీచరణ్.. తాజాగా మ్యూజిక్ అందించిన చిత్రం 'సత్యభామ'. కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటించగా.. నవీన్‌చంద్ర కీలక పాత్ర పోషించారు. ఈ క్రైమ్ థ్రిల్లర్ చిత్రానికి సుమన్ చిక్కాల దర్శకత్వం వహించారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ఆయన చిత్ర విశేషాలను మీడియాతో ముచ్చటించారు.

"నేను కేవలం థ్రిల్లర్ మూవీస్‌కే ఎక్కువ వర్క్ చేస్తానని అందరూ అభిప్రాయపడుతుంటారు. కానీ నాకు అన్ని రకాల సినిమాలకు సంగీతం అందించడం ఇష్టం. ఈ సినిమాలో మొత్తం ఐదు పాటలుంటాయి. అవి వేటికవే భిన్నంగా ఉంటూ.. అందరినీ ఆకట్టుకుంటాయి. థ్రిల్లర్ మూవీస్ ఇష్టపడే వారికి ఈ చిత్రం చాలా బాగా నచ్చుతుంది. ఇందులోని ట్విస్ట్‌లు అదిరిపోతాయి. ఒక పోలీసాఫీసర్ ఎమోషనల్ జర్నీ ఇది. కాజల్‌కు ఇది పర్ఫెక్ట్ కమ్‌బ్యాక్ సినిమా అవుతుంది. ఇందులోని యాక్షన్ ఎపిసోడ్స్ థియేటర్స్‌లో సినిమాను చూసే ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పిస్తాయి. పోరాట ఘట్టాల్లో ఆమె డూప్ లేకుండా చేశారు. కాజల్ కెరీర్‌లోనే ఈ సినిమా బిగ్గెస్ట్ హిట్‌గా నిలుస్తుందనే నమ్మకం ఉంది. డైరెక్టర్ సుమన్ ఈ సినిమాను తన మేకింగ్‌తో మరో స్థాయికి తీసుకెళ్లారు" అని చెప్పారు.

హిలేరియస్ ఎంటర్‌టైనర్



అదితి, జాన్సన్, హరినాథ్ పొలిచెర్లా, సుస్మితా ఛటర్జీ, సత్య ముఖ్య పాత్రలు పోషించిన ఈచిత్రం 'వాట్ ది ఫిష్'. వరుణ్ కోరుకొండ దర్శకత్వంలో విశాల్ బెజవాడ, విశాల్ బెజవాడ నిర్మించారు. 'ఇదొక యూనిక్ యాక్షన్ థ్రిల్లర్, హిలేరియస్ ఎంటర్‌టైనర్. ఇటీవల విడుదల చేసిన నిహారిక కొణిదెల, వెన్నెల కిశోర్ ఫస్ట్ లుక్ పోస్టర్స్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.' అని దర్శక నిర్మాతలు చెప్పారు. వివిధ భాషల్లో ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ చిత్రానికి శక్తికాంత్ కార్తీక్ సంగీతం అందిస్తున్నారు.



తొలి ఎన్నికల చీఫ్ కమిషనర్ బయోపిక్



దేశప్రజలంతా టీవీల ముందు కూర్చుని ఎన్నికల ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్న తరుణం ఇది. ఏ పార్టీ అధికారంలోకి వస్తుంది, ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి.. అని జోరుగా అంచనాలు, బెట్టింగ్స్ సాగుతున్న ఈ నేపథ్యంలో భారతదేశపు తొలి ఎన్నికల ఛీఫ్ కమిషనర్ సుకుమార్ సేన్ బయోపిక్ తీయనున్నట్లు చిత్ర నిర్మాత సిద్ధార్థ రాయ్ కపూర్ ప్రకటించారు. సివిల్ సర్వెంట్‌గా మారిన గణితశాస్త్ర వేత్త సుకుమార్ సేన్ 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికలకు పర్యవేక్షకుడిగా ఉన్నారు. 'మన జాతీయ కథానాయకుల్లో ఒకరైన సుకుమార్ జీవిత కథను తెరకు ఎక్కించే అవకాశం వచ్చినందుకు ఆనందంగా ఉంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో ప్రకటిస్తాం' అని తెలిపారు. తన తాతగారి బయోపిక్‌ను తీసే ప్రయత్నం చేస్తున్నందుకు సుకుమార్ సేన్ మనవడు సంజీవ్ సేన్ కూడా ఆనందం వ్యక్తం చేశారు.

గుడిలా మార్చేశా



కొద్ది రోజులుగా దివంగత బాలీవుడ్ నటుడు సుశాంత్‌సింగ్ రాజ్‌పుత్ ఇంటిపై జరుగుతున్న చర్చపై నటి అదాశర్మ మీడియాకు క్లారిటీ ఇచ్చారు. ఆ ఇంటిని కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. "సుశాంత్ నివసించిన ఇంట్లోనే ప్రస్తుతం ఉంటున్నాను. చుట్టూ పాజిటివ్‌గా ఉండే ఆహ్లాద వాతావరణం నన్నెంతగానో ఆకట్టుకుంది. ముంబై, కేరళలోని మా సొంతిళ్లను తలపించేలా ఉన్న ఈ ఇంటిని అందుకే కొన్నాను. ఇందులోని మొదటి అంతస్తును గుడిలా.. ఒక రూమ్‌ను మ్యూజిక్ రూమ్‌లా.. మరో గదిని డ్యాన్స్ స్టూడియోగా రీమోడలింగ్ చేయించాను. టెర్రస్‌ను గార్డెన్‌లా మార్చేశాను" అని చెప్పారు. కాగా, గతేడాది ఈ నటి, సుశాంత్ ఇంటి వద్ద కనిపించినప్పటి నుంచి ఆమె ఈ ఇంటిని కొనుగోలు చేశారని ఊహాగానాలు వినపడిన సంగతి తెలిసిందే.

యూత్‌ను ఆకట్టుకుంటుంది

యదార్థ సంఘటనల ఆధారంగా.. యూత్ ఆడియెన్స్‌కు మెప్పించేలా తెరకెక్కిన చిత్రం 'ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు-500143'. శ్రీనాథ్ పులకరం ఈ టీనేజ్ లవ్ డ్రామాకు దర్శకత్వం వహించగా, భువన్‌రెడ్డి కొవ్వూరి నిర్మించారు. ప్రణవ్ ప్రీతమ్, షాజ్ఞశ్రీ



వేణున్, రామ్ పటాస్, తేజగౌడ్ ముఖ్య పాత్రల్లో నటించారు. ఈ నెల 21న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు శ్రీనాథ్ పులకరం మాట్లాడుతూ "ఇందులోని లవ్‌స్టోరీ ప్రేక్షకుల మనసుకు హత్తుకునేలా ఉంటుంది" అని చెప్పారు. నిర్మాత భువన్‌రెడ్డి కొవ్వూరి మాట్లాడుతూ "ఈ సినిమా యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుంటుంది" అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్:కోదాటి పవన్‌కల్యాణ్, డీఓపీ: నిఖిల్ సురేంద్రన్, సంగీతం: కార్తీక్ రోడ్రిగజ్.





అరబిందో ఫార్మా నుంచి క్యాన్సర్ ఔషధం

హైదరాబాద్: అరబిందో ఫార్మా త్వరలో దేశీయ మార్కెట్లోకి సరికొత్త క్యాన్సర్ ఔషధాన్ని విడుదల చేయనుంది. ట్రాస్టుజుమాబ్ పేరుతో ఈ బయోసిమిలర్ ఔషధాన్ని మార్కెట్లోకి తీసుకురానుంది. కొన్ని రకాల రొమ్ము క్యాన్సర్ల చికిత్సలో ఈ ఔషధాన్ని వినియోగిస్తారు. అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ క్యూరాటెక్ బయోలాజిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ ఔషధాన్ని అభివృద్ధి చేసింది. అనుమతులు లభించిన వెంటనే ఉత్పత్తి ప్రారంభించి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో భాగంలో ఈ బయోసిమిలర్ క్యాన్సర్ ఔషధాన్ని దేశీయ మార్కెట్లోకి విడుదల చేయాలని భావిస్తున్నట్లు అరబిందో ఫార్మా బయోసిమిలర్స్ విభాగం సీఈఓ మక్కపాటి శాతకర్ణి తెలిపారు. అమెరికా, యూరోపియన్ దేశాల మార్కెట్లలోనూ ఈ బయోసిమిలర్ ఔషధాన్ని విడుదల చేసేందుకు కంపెనీ ప్రయత్నిస్తోంది.

జీనోమ్ వ్యాలీలో ఆరిజీన్ ఫార్మా యూనిట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ తన బయోలాజిక్స్ వ్యాపారాన్ని మరింతగా విస్తరించింది. ఇందులో భాగంగా కంపెనీ అనుబంధ సంస్థ ఆరిజీన్ ఫార్మాస్యూటికల్ సర్వీసెస్ లిమిటెడ్.. హైదరాబాద్ సమీపంలోని జీనోమ్ వ్యాలీలో కొత్త బయోలాజిక్స్ యూనిట్ ప్రారంభించింది. 70,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌లో ప్రాసెస్, అనలిటికల్ డెవలప్‌మెంట్ ల్యాబ్స్ ఇప్పటికే సిద్ధమయ్యాయి. ఉత్పత్తి యూనిట్ ఈ ఏడాది చివరికల్లా పూర్తవుతుందని కంపెనీ తెలిపింది.

సెబీ నుంచి సాథీ 2.0 యాప్

ముంబై: పెట్టుబడులపై మదుపరుల అవగాహన కోసం మార్కెట్ నియంత్రణ మండలి సెబీ మరో కీలక చర్య తీసుకుంది. 'సాథీ 2.0' పేరుతో ప్రత్యేక యాప్ విడుదల చేసింది. గూగుల్ ప్లే స్టోర్, ఐఓఎస్ యాప్‌స్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పెట్టుబడులకు సంబంధించిన సమస్త సమాచారం ఈ యాప్ ద్వారా పొందవచ్చు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,110 ▼	66,100 ▼	97,300 ▼
ముంబై	71,776 ▼	65,747 ▼	90,217 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4వ తేదీ			
హైదరాబాద్	505	విజయవాడ	450
వరంగల్	507	గోదావరి	450
చిత్తూరు	563	విశాఖపట్నం	450
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	147	గోదావరి	149
వరంగల్	147	విజయవాడ	149
కరీంనగర్	147	గుంటూరు	149
మహబూబ్‌నగర్	147	ఒంగోలు	149
కర్నూలు	147	చిత్తూరు	140
విశాఖపట్నం	135		


ర్యాలీ కొనసాగితే 77,000 ఎగువకు సెన్సెక్స్

లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు అనుగుణంగా ఉన్నట్లయితే, ఈ నెల 4న (మంగళవారం) కూడా మార్కెట్లో ర్యాలీ కొనసాగనుంది. సెన్సెక్స్ 77,000, నిఫ్టీ 23,500 స్థాయిలను దాటవచ్చు.

- సంతోశ్ మీనా, రీసెర్చ్ హెడ్, స్వస్తిక ఇన్వెస్ట్‌మార్ట్ లిమిటెడ్

బుల్స్ స్వైర విహారం

- సరికొత్త శిఖరాలకు సూచీలు
- సెన్సెక్స్ 2,507 పాయింట్లు అప్.. 76,469 వద్ద ముగింపు
- 733 పాయింట్ల వృద్ధితో 23,264 స్థాయికి నిఫ్టీ
- సూచీలకు మూడేళ్లలో ఇదే అతిపెద్ద లాభం
- 14 లక్షల కోట్లు పెరిగిన మదుపరుల సంపద
- రూ.425.91 లక్షల కోట్లు దాటిన బీఎస్ఈ మార్కెట్ క్యాప్



మార్కెట్లకు ఎగ్జిట్ పోల్స్ కిక్

ముంబై: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి ముచ్చటగా మూడోసారి భారీ మెజారిటీతో అధికారం చేపట్టనుందన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాలతో స్టాక్ మార్కెట్ వర్గాల్లో ఉత్సాహం ఉప్పొంగింది. ఇన్వెస్టర్లు కొనుగోళ్ల సునామీ సృష్టించారు. దాంతో ప్రామాణిక ఈక్విటీ సూచీలు మూడేళ్లలో అతిపెద్ద లాభాన్ని నమోదు చేసుకోవడంతో పాటు సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. సోమవారం ట్రేడింగ్ ముగిసేసరికి, సెన్సెక్స్ 2,507.47 పాయింట్ల (3.39 శాతం) లాభంతో 76,468.78 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు స్థాయిని నమోదు చేసింది. ఒక దశలో సూచీ 2,777.58 పాయింట్ల వరకు ఎగబాకి 76,738.89 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డునూ నమోదు చేసింది. నిఫ్టీ విషయానికొస్తే, ఒక దశలో 808 పాయింట్లు ఎగబాకి 23,338.70 వద్ద సరికొత్త ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి సూచీ 733.20 పాయింట్ల (3.25శాతం)లాభంతో 23,263.90 వద్ద స్థిరపడింది. 2021 ఫిబ్రవరి 1తర్వాత సెన్సెక్స్, నిఫ్టీకి ఇదే అతిపెద్ద ఒక్క రోజు లాభం. ఆసక్తికర విషయం ఏమిటంటే, 2019 మే 20న కూడా ఎన్‌డీఏ రెండోసారి అధికారంలోకి రానుందన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాతో సూచీలు 3శాతానికి పైగా పుంజుకున్నాయి. మార్కెట్ భారీ ర్యాలీతో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజులోనే రూ.13.78 లక్షల కోట్లకు పైగా పెరిగి సరికొత్త రికార్డు గరిష్ఠ స్థాయి రూ.425.91 లక్షల కోట్లకు (5.13 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. మరిన్ని ముఖ్యాంశాలు..

రూ.20 లక్షల కోట్లకు చేరువలో అదానీ గ్రూప్ సంపద

ఎగ్జిట్ పోల్స్ ర్యాలీలో అదానీ గ్రూప్ షేర్లు మరింత పుంజుకున్నాయి. గ్రూప్‌లోని 10 లిస్టెడ్ కంపెనీల షేర్లూ లాభపడగా.. అదానీ పవర్ ఏకంగా 16 శాతం ఎగబాకింది. అదానీ పోర్ట్స్ 10.25 శాతం, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 8.84 శాతం, అదానీ టోటల్ గ్యాస్ 7.77 శాతం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 6.86 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీ 6.39 శాతం, ఎన్‌డీటీవీ 6.15 శాతం, అంబుజా సిమెంట్స్ 5.72 శాతం, ఏసీసీ 5.16 శాతం, అదానీ విల్మర్ 3.51 శాతం పెరిగాయి. చాలా కంపెనీలు ఇంట్రాడేలో సరికొత్త గరిష్ఠాలను తాకాయి. కాగా, గ్రూప్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.లక్షన్నర కోట్ల మేర పెరిగి రూ.19.42 లక్షల కోట్లకు చేరుకుంది.

- ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంక్‌లు, అదానీ గ్రూప్ షేర్లు టాప్ పెర్ఫార్మర్లుగా నిలిచాయి. వీటితో పాటు రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ల ర్యాలీ మార్కెట్లకు భారీ లాభాలు పంచాయి.
- సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 25 లాభపడ్డాయి. ప్రభుత్వ రంగ ఎన్‌టీపీసీ షేరు 9.21 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. ఎస్‌బీఐ 9 శాతం, పవర్‌గ్రిడ్ 8 శాతానికి పైగా పెరిగాయి. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 5.65 శాతం బలపడింది. కాగా, హెచ్‌సీఎల్ టెక్, సన్‌ఫార్మా, ఏషియన్ పెయింట్స్, నెస్లే, ఇన్ఫోసిస్ షేర్లు స్వల్ప నష్టాల్లో ముగిశాయి.
- బ్లూచి‌ప్‌లతో పాటు చిన్న, మధ్య స్థాయి కంపెనీల షేర్లలోనూ ఇన్వెస్టర్లు కొనుగోళ్లను కదం తొక్కించారు. దాంతో బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 3.54 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 2.05 శాతం పుంజుకున్నాయి. ఈ రెండు సూచీలూ ఇంట్రాడేలో సరికొత్త జీవితకాల గరిష్ఠాలను తాకాయి. బీఎస్ఈలోని అన్ని రంగాల సూచీలూ లాభపడ్డాయి.

ర్యాలీకి దోహదపడిన అంశాలు

- మోదీ సర్కారు మరోసారి అధికారంలోకి వస్తే ప్రస్తుత ఆర్థిక విధానాలు కొనసాగడంతో పాటు వికసిత్ భారత్ లక్ష్యాలకు దోహదపడేలా ఈ టర్మ్‌లో మరిన్ని కీలక సంస్కరణలు చేపట్టవచ్చన్న అంచనాలతో సూచీలు అద్భుతమైన ర్యాలీతో దూసుకుపోయాయి.
- గత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి రేటు 8.2 శాతానికి ఎగబాకడం, 2024-25లోనూ వృద్ధి రేటు 7శాతంగా నమోదుకావచ్చన్న అంచనాలు కూడా ఉత్సాహం నింపాయి.
- మే నెల జీఎస్‌టీ వసూళ్లు ఆశాజనకంగా నమోదవడం, నైరుతి రుతుపవనాలు చురుకుగా ముందుకు సాగుతుండటం, ప్యాసింజర్ వాహన విక్రయాలు కాస్త నెమ్మదించినప్పటికీ మార్కెట్ అంచనాలకు అనుగుణంగానే ఉండటమూ కలిసివచ్చింది.

పీఎస్‌యూ షేర్లు జిగేల్

ప్రభుత్వ రంగ కంపెనీలు (పీఎస్‌యూ), ప్రభుత్వ రంగ బ్యాంక్ (పీఎస్‌బీ)ల షేర్లకు సోమవారం భారీ డిమాండ్ కన్పించింది. దాంతో ఈ రంగ షేర్లు 12 శాతం వరకు లాభపడ్డాయి. ఒక దశలో నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ సూచీ 8.72 శాతం మేర పెరిగి 8,030.15 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. సూచీలోని అన్ని పీఎస్‌బీల షేర్లూ భారీగా పుంజుకోగా.. బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎస్‌బీఐ, కెనరా బ్యాంక్ షేర్లు ఇంట్రాడేలో సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని తాకాయి. నిఫ్టీ సీపీఎస్ఈ ఇండెక్స్ సైతం 7 శాతానికి పైగా వృద్ధి చెంది 7,075 పాయింట్ల వద్ద సరికొత్త రికార్డు గరిష్ఠాన్ని నమోదు చేసింది. ఈ సూచీలోని పవర్‌గ్రిడ్, ఎన్‌టీపీసీ, ఓఎన్‌జీసీ, భారత్ ఎలక్ట్రానిక్స్ షేర్లు 10 శాతం వరకు పెరిగాయి. పవర్‌గ్రిడ్, ఎన్‌టీపీసీ, భారత్ ఎలక్ట్రానిక్స్ షేర్లు సరికొత్త ఏడాది గరిష్ఠాన్నీ తాకాయి.

ఎస్‌బీఐ @ 8 లక్షల కోట్లు

దేశంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) షేరు తొలిసారిగా రూ.900 మైలురాయిని దాటింది. ఒక దశలో రూ.912.10 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసిన ఎస్‌బీఐ షేరు.. చివరికి 9.12 శాతం లాభంతో రూ.905.80 వద్ద ముగిసింది. దాంతో బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.8 లక్షల కోట్లు దాటింది. తద్వారా స్టాక్ మార్కెట్లో ఈ స్థాయి మార్కెట్ సంపదను సాధించిన ఏడో లిస్టెడ్ కంపెనీగా అవతరించింది.

50,000 ఎగువకు బ్యాంక్ నిఫ్టీ

ప్రభుత్వ రంగ బ్యాంక్‌లతో పాటు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి ప్రైవేట్ బ్యాంక్ షేర్లలోనూ భారీగా కొనుగోళ్లు జరగడంతో బ్యాంక్ నిఫ్టీ సూచీ 4 శాతానికి పైగా ఎగబాకి 50,979.95 పాయింట్లకు చేరుకుంది. ఇంట్రాడేలో 51,100 స్థాయిని తాకింది.

లక్ష కోట్లు పెరిగిన రిలయన్స్ సంపద

మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ షేరు దాదాపు 6 శాతం పెరిగి రూ.3,000 మైలురాయిని దాటేసింది. ఒక దశలో షేరు ధర రూ.3,029.90 వద్ద సరికొత్త ఆల్‌టైం గరిష్ఠాన్ని నమోదు చేసుకుంది. కంపెనీ మార్కెట్ విలువ రూ.1.09 లక్షల కోట్లకు పైగా పెరిగి రూ.20.44 లక్షల కోట్లకు చేరుకుంది.

హైదరాబాద్‌లో క్యాష్ఈ ఎక్సలెన్స్ సెంటర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఏఐ ఆధారిత ఫిన్‌టెక్ కంపెనీ క్యాష్ఈ హైదరాబాద్‌లో కొత్తగా టెక్నాలజీ ఎక్సలెన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. డిజిటల్ ఇంజనీరింగ్ సామర్థ్యాలను విస్తరించటంలో భాగంగా ఈ సెంటర్‌ను నెలకొల్పుతున్నట్లు వెల్లడించింది. కాగా ప్రస్తుతం కంపెనీలో మొత్తం 550 ఉద్యోగులుండగా ఈ ఏడాది చివరి నాటికి కొత్తగా 300 మంది ఉద్యోగులను నియమించుకోనున్నట్లు క్యాష్ఈ తెలిపింది. ఇందులో 150 మంది ఉద్యోగులను హైదరాబాద్ కేంద్రం కోసం తీసుకోనుండగా మిగిలిన వారిని ముంబై కేంద్రంలో నియమించుకోనున్నట్లు పేర్కొంది.

బెటర్ న్యూట్రిషన్ బ్రాండ్‌లో పీవీ సింధు పెట్టుబడి

న్యూఢిల్లీ: రెండు సార్లు ఒలింపిక్ పతక విజేత, షట్లర్‌లో ప్రపంచ చాంపియన్ పీవీ సింధు గ్రీన్‌డేకు చెందిన "బెటర్ న్యూట్రిషన్" బ్రాండ్‌లో ఇన్వెస్ట్ చేశారు. ఆ బ్రాండ్‌కు ప్రచారకర్తగా కూడా వ్యవహరించనున్నారు. సింధు సోమవారం ఈ విషయం ప్రకటించారు. అయితే ఎంత మేరకు పెట్టుబడులు పెట్టారనే విషయం మాత్రం వెల్లడించలేదు. గ్రీన్‌డే సంస్థ బయోఫోర్టిఫైడ్ ఆహారాల ద్వారా పోషకాహార లోపాలపై పోరాటానికి ఈ బ్రాండ్‌ను ప్రారంభించింది. దేశంలో పోషకాహార లోపాన్ని ఎదుర్కొనేందుకు కృషి చేస్తున్న బ్రాండ్‌లో తాను భాగస్వామి కావడం ఆనందకరమైన అంశమని సింధు తెలిపారు. అహ్మదాబాద్ ఐఐఎం పూర్వ విద్యార్థులైన రస్తోగి, ఐశ్వర్య భట్నాగర్ గ్రీన్‌డే సంస్థను ఏర్పాటు చేశారు.

ఐసీఏఐ హైదరాబాద్ చాప్టర్ చైర్‌పర్సన్‌గా లావణ్య

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) హైదరాబాద్ చాప్టర్ చైర్‌పర్సన్‌గా సీఎంఏ డాక్టర్ లావణ్య కందూరి ఎన్నికయ్యారు. 2024-25 సంవత్సరానికి గాను ఈమె ఈ బాధ్యతలను నిర్వర్తించనున్నారు. లావణ్యకు కార్పొరేట్ రంగ వ్యవహారాల్లోను, విద్యాపరమైన అంశాల్లోను 20 సంవత్సరాల అనుభవం ఉంది. ప్రస్తుతం ఆమె స్కూల్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ మాన్సస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ చైర్‌పర్సన్, డీన్‌గా వ్యవహరిస్తున్నారు. వైస్ చైర్మన్‌గా డీ వెంకట్రామ్ బాబు, కార్యదర్శిగా ఖాజా జలాలుద్దీన్, కోశాధికారిగా కృతి అగర్వాల్ ఎన్నికయ్యారు.

అదానీ గ్రూప్ ఆర్థిక రంగంలోకి ప్రవేశించింది. ఐసీఐసీఐ బ్యాంక్‌తో కలిసి కో బ్రాండెడ్ క్రెడిట్ కార్డును విడుదల చేసింది. ఇది విమానయాన సంబంధిత ప్రయోజనాలు కస్టమర్లకు అందిస్తుంది. విమానయాన సంబంధిత ప్రయోజనాలతో ఐసీఐసీఐ బ్యాంక్ జారీ చేసిన తొలి కో బ్రాండెడ్ క్రెడిట్ కార్డు ఇదే.

స్పోర్ట్స్

లంక విలవిల

77 పరుగులకే ఆలౌట్

నోకియా అద్భుత స్పెల్ దక్షిణాఫ్రికా బోణీ



1 టీ20 ప్రపంచకప్‌ల్లో అత్యల్ప ఎకానమీ రేట్ (1.75) నమోదు చేసిన నోకియా

న్యూయార్క్: రెండు టెస్టు దేశాల మధ్య జరిగిన ఈ మ్యాచ్ మొత్తంలో నమోదైన పరుగులు 157 మాత్రమే.. కానీ నేలకూలిన వికెట్లు 14. ఇలా బౌలర్లు రాజ్యమేలిన పోరులో చివరకు దక్షిణాఫ్రికాదే పైచేయి అయ్యింది. పేసర్లు నోకియా (4-0-7-4), బార్ట్‌మన్ (4-1-9-1) అద్భుత బౌలింగ్‌కు శ్రీలంక తమ అత్యల్ప స్కోరుకే దాసోహమైంది. అటు ఛేదన ఆరంభంలో తడబడినా 6 వికెట్ల తేడాతో గెలిచిన సఫారీలు తాజా టీ20 వరల్డ్‌కప్‌లో బోణీ చేశారు. సోమవారం జరిగిన ఈ గ్రూప్ 'డి' మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 19.1 ఓవర్లలో 77 పరుగులకు కుప్పకూలింది. ఓపెనర్ కుశాల్ మెండిస్ (19), మాథ్యూస్ (16), కమిందు (11) మాత్రమే రెండంకెల స్కోర్లు సాధించడం గమనార్హం. రబాడ, మహరాజ్ రెండేసి వికెట్లు తీశారు. ఆ తర్వాత ఛేదనలో దక్షిణాఫ్రికా 16.2 ఓవర్లలో 4 వికెట్లకు 80 పరుగులు చేసి గెలిచింది. డికాక్ (20), క్లాసెన్ (19 నాటౌట్) రాణించారు. కెప్టెన్ వనిందు హసరంగకు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నోకియా నిలిచాడు.

ఆచితూచి..

78 పరుగుల స్వల్ప ఛేదనలో సఫారీల ఇన్నింగ్స్ కూడా కష్టంగానే సాగింది. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించకపోవడంతో ఆచితూచి ఆడాల్సి వచ్చింది. పవర్ ప్లేలోనే ఓపెనర్ హెన్‌డ్రిక్స్ (4), కెప్టెన్ మార్‌క్రమ్ (12) వెనుదిరగ్గా 27/2 స్కోరుతో నిలిచింది. స్పిన్నర్లు కట్టడి చేయడంతో పరుగులు మందగించాయి. దీనికితోడు హసరంగ వరుస ఓవర్లలో డికాక్, స్టబ్స్ (13)ల వికెట్లు తీసి తీవ్ర ఒత్తిడిలోకి నెట్టాడు. అప్పటికి స్కోరు 58/4. అయితే లక్ష్యం తక్కువగానే ఉండడంతో సౌతాఫ్రికా పెద్దగా ఇబ్బందిపడలేదు. క్లాసెన్ 15వ ఓవర్‌లో 6,4తో ఒత్తిడి తగ్గించి జట్టు విజయాన్ని సునాయాసం చేశాడు. దీంతో మరో 22 బాల్స్ ఉండగానే మ్యాచ్ ముగిసింది.

నోకియా కట్టడి..

టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న లంక.. సఫారీ బౌలర్ల ధాటికి అటు పరుగులు చేయలేక, ఇటు పేలవ షాట్లతో వికెట్లనూ కాపాడుకోలేక విలవిల్లాడింది. ముఖ్యంగా నోకియా, బార్ట్‌మన్‌ల ధాటికి లంకేయులు ఒక్కో పరుగు కోసం చెమటోడ్చాల్సి వచ్చింది. పవర్‌ప్లేలో 24/1 స్కోరు చేసిన లంక ఆ తర్వాత మరింతగా ఇబ్బంది పడింది. స్పిన్నర్ కేశవ్ మహరాజ్ తొమ్మిదో ఓవర్‌లో హసరంగ, సమరవిక్రమలను వరుస బంతుల్లో డకౌట్‌గా పంపాడు. అటు నోకియా వరుస ఓవర్లలో వికెట్లను తీస్తూ ప్రత్యర్థిపై ఉచ్చు బిగించాడు. ఈ దశలో రెండు సిక్సర్లతో మాథ్యూస్ కాస్త జోరు చూపినా, ఎక్కువసేపు నిలువలేకపోయాడు. మరోవైపు 9 పరుగుల వ్యవధిలోనే ఆఖరి 4 వికెట్లు నేలకూలడంతో లంక కనీసం వంద పరుగులు చేయలేకపోయింది.

1 టీ20ల్లో శ్రీలంక జట్టుకు ఇదే అత్యల్ప స్కోరు (77)

శ్రీలంక: 19.1 ఓవర్లలో 77 ఆలౌట్ (మెండిస్ 19, మాథ్యూస్ 16; నోకియా 7/4, రబాడ 2/21, కేశవ్ 2/22).

దక్షిణాఫ్రికా: 16.2 ఓవర్లలో 80/4 (డికాక్ 20, క్లాసెన్ 19 నాటౌట్; హసరంగ 2/22).

డీడీలోనూ వరల్డ్‌కప్ మ్యాచ్‌లు

న్యూఢిల్లీ: భారత జట్టు ఆడే టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌ల ప్రత్యక్ష ప్రసారాన్ని దూరదర్శన్‌లోనూ వీక్షించవచ్చు. ఈ విషయాన్ని ప్రసారభారతి సీఈవో గౌరవ్ ద్వివేది సోమవారం వెల్లడించారు. టీ20 వరల్డ్ కప్‌తో పాటు త్వరలో జరిగే పారిస్ ఒలింపిక్స్, పారాలింపిక్స్, వింబుల్డన్ ఈవెంట్లను కూడా డీడీ స్పోర్ట్స్ చానెల్‌లో ప్రసారం చేయనున్నట్టు ద్వివేది తెలిపారు. అలాగే జూలై 6 నుంచి జింబాబ్వేతో భారత్ ఆడే 5 టీ20ల సిరీస్, వచ్చేనెల 27 నుంచి శ్రీలంకతో భారత్ తలపడే పరిమిత ఓవర్ల సిరీస్‌లను కూడా డీడీ ప్రసారం చేయనుంది.

చాంపియన్‌కు రూ. 20.35 కోట్లు

● రన్నరప్‌నకు రూ. 10.65 కోట్లు ● మొత్తం ప్రైజ్‌మనీ రూ. 93.50 కోట్లు ● గతం కంటే రెట్టింపు

న్యూయార్క్: ఈసారి టీ20 ప్రపంచ కప్ విజేతలకు ఇచ్చే ప్రైజ్‌మనీని ఐసీసీ ఎట్టకేలకు ప్రకటించింది. అంతేకాదు.. గత వరల్డ్ కప్ కంటే ఈసారి మొత్తం ప్రైజ్‌మనీని భారీగా పెంచింది. ఈ వరల్డ్‌కప్ మొత్తం ప్రైజ్‌మనీ రూ. 93.52 కోట్లుగా సోమవారం వెల్లడించింది. 2022 ప్రపంచ కప్ మొత్తం ప్రైజ్‌మనీ రూ. 46.55 కోట్లు కాగా.. ఈసారి ఆ మొత్తాన్ని రెట్టింపు చేసింది. ఇక తాజా కప్పులో చాంపియన్‌గా నిలిచే జట్టు రూ. 20.36 కోట్లు అందుకోనుంది. గత టోర్నీలో విజేత ఇంగ్లండ్ జట్టుకు రూ. 13.30 కోట్లు దక్కాయి. ఇక ఈసారి రన్నరప్‌కు రూ. 10.65 కోట్లు లభిస్తాయి. క్రితంసారి ఫైనల్లో ఓడిన పాకిస్థాన్ రూ. 6.65 కోట్లతో సరిపెట్టుకుంది.

టీ20 ప్రపంచ కప్ ప్రైజ్‌మనీ వివరాలివి..

- సెమీఫైనల్స్‌లో ఓడిన రెండు జట్లకు: చెరి 6.55 కోట్లు
- సూపర్-8లో ఓడిన జట్లకు: తలో రూ. 3.18 కోట్లు
- 9 నుంచి 12 స్థానాల్లో నిలిచే ప్రతీ జట్టుకు: రూ. 2.05 కోట్లు
- 13 నుంచి 20 స్థానాలు: ఒక్కో జట్టుకు రూ. 1.87 కోట్లు
- సెమీఫైనల్స్, ఫైనల్ మినహా ఇతర మ్యాచ్‌ల్లో ఒక్కో విజయానికి తలో రూ. 26 లక్షలు అదనం.

నేటి మ్యాచ్‌లు

అఫ్ఘానిస్థాన్ × ఉగాండ
వేదిక: గయానా — ఉ. 6 నుంచి

స్టార్ స్పోర్ట్స్‌లో..

ఇంగ్లండ్ × స్కాట్లాండ్
వేదిక: బార్బడోస్ — రా. 8 నుంచి

నెదర్లాండ్స్ × నేపాల్
వేదిక: డాలస్ — రా. 9 నుంచి

నమీబియా 'సూపర్'

ఒమన్‌కు నిరాశ వీజ్ ఆల్‌రౌండ్‌షో



డేవిడ్ వీజ్ (3/28, 9 నాటౌట్)

బ్రిడ్జ్‌టౌన్: పేరుకు పసికూనలే అయినా తాజా టీ20 వరల్డ్‌కప్‌లో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నాయి. టోర్నీ తొలి రోజు కెనడాపై అమెరికా భారీ స్కోరును ఛేదించగా.. ఆదివారం పటిష్ఠ వెస్టిండీస్‌ను పపువా న్యూగినీ ముప్పుతిప్పలు పెట్టిన విషయం తెలిసిందే. ఇక సోమవారం ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన నమీబియా-ఒమన్ మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారి తీసింది. అయితే నమీబియా ఆల్‌రౌండర్ డేవిడ్ వీజ్ అంతా తానై (3/28, 9 నాటౌట్; సూపర్ ఓవర్‌లో 13 నాటౌట్, 1/10) జట్టుకు విజయాన్నందించాడు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఒమన్ 19.4 ఓవర్లలో 109 పరుగులకు ఆలౌటైంది. పేసర్ ట్రంపెల్‌మన్‌కు నాలుగు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత స్వల్ప ఛేదనలో నమీబియా కూడా తడబడి 20 ఓవర్లలో 6 వికెట్లకు సరిగ్గా 109 పరుగులే చేసింది. ఫ్రిలింక్ (45) టాప్‌స్కోరర్. పేసర్ మెహ్రాన్ ఖాన్ (3-1-7-3) వణికించాడు. దీంతో సూపర్ ఓవర్ అనివార్యం కాగా వీజ్ 4,6 ఎరాస్మస్ 4,4తో నమీబియా 21 పరుగులు చేసింది. ఆ తర్వాత వీజ్ బౌలింగ్‌కు దిగి 10 పరుగులే ఇచ్చి వికెట్ తీయడంతో ఒమన్‌కు ఓటమి తప్పలేదు.

1 అంతర్జాతీయ టీ20ల్లో తొలి ఓవర్ మొదటి రెండు బంతుల్లో వికెట్లు తీసిన ఏకైక బౌలర్‌గా ట్రంపెల్‌మన్.

3 టీ20 వరల్డ్‌కప్‌లో సూపర్ ఓవర్‌లో ఫలితం రావడం ఇది మూడోసారి. 2012లోనే రెండుసార్లు జరిగింది.

సంక్షిప్త స్కోర్లు

ఒమన్: 19.4 ఓవర్లలో 109 ఆలౌట్ (ఖాలిద్ 34, జీషన్ 22; ట్రంపెల్‌మన్ 4/21, వీజ్ 3/28);

నమీబియా: 20 ఓవర్లలో 109/6 (ఫ్రిలింక్ 45, డావిన్ 24; మెహ్రాన్ 3/7).

సాత్విక్ జోడీ టైటిల్ నిలబెట్టుకునేనా..?

నేటినుంచి ఇండోనేసియా ఓపెన్

జకార్తా: వచ్చే నెలలో ఒలింపిక్స్.ఈనేపథ్యంలో భారత స్టార్ డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి నిలకడైన ఫామ్‌ను కొనసాగించడమే లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ క్రమంలో మంగళవారం ఇక్కడ మొదలయ్యే ఇండోనేసియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో టైటిల్ నిలబెట్టుకోవాలన్న పట్టుదలతో ఉంది. నిరుడు ఇక్కడ విజేతగా నిలిచిన సాత్విక్/చిరాగ్ సూపర్ 1000 టైటిల్ అందుకున్న తొలి భారత డబుల్స్ జోడీగా చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. ఈసారి ఆరంభ మ్యాచ్‌లో వీ చాంగ్/కీ వున్ (మలేసియా) ద్వయంతో సాత్విక్ జంట తలపడనుంది. సింగిల్స్‌లో తైపీకి చెందిన వెన్ చీ స్యూతో సింధు, కెంటా సునయామాతో లక్ష్యసేన్, రజావత్‌తో ప్రణయ్ తొలి రౌండ్ ఆడనున్నారు. కిడాంబి శ్రీకాంత్, కిరణ్ జార్జ్ కూడా బరిలో ఉన్నారు. డబుల్స్‌లో తనీషా/అశ్విని, గాయత్రి/ట్రీసా కూడా అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

కేదార్ జాదవ్ రిటైర్మెంట్



న్యూఢిల్లీ: భారత ఆల్‌రౌండర్ కేదార్ జాదవ్ అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేసే కేదార్ ఆఫ్‌స్పిన్నర్‌గానూ రాణించాడు. 2014-2020 మధ్య జాదవ్ ఆడిన 73 వన్డేల్లో 1,389 రన్స్, 27 వికెట్లు తీయగా.. 9 టీ20ల్లో 122 పరుగులు సాధించాడు. 'కెరీర్ ఆసాంతం నాకు మద్దతుగా నిలిచిన వారందరికీ కృతజ్ఞతలు. మధ్యాహ్నం 3 గంటల నుంచి నన్ను అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఆటగాడిగా భావించండి' అని 39 ఏళ్ల కేదార్ సోమవారం ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. మహారాష్ట్ర తరఫున రంజీల్లో ఆడిన కేదార్ 87 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో తలపడ్డాడు.

అప్పటిదాకా.. బజ్‌రంగ్‌పై సస్పెన్షన్ ఎత్తివేత



న్యూఢిల్లీ: భారత స్టార్ రెజ్లర్ బజ్‌రంగ్ పూనియాపై జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) విధించిన సస్పెన్షన్‌ను తాత్కాలికంగా ఎత్తివేస్తున్నట్టు నాడా క్రమశిక్షణ కమిటీ (ఏడీడీపీ) సోమవారం ప్రకటించింది. మార్చిలో జరిగిన సెలెక్షన్ ట్రయల్స్ సందర్భంగా డోప్ పరీక్షకు తన శాంపిల్ ఇవ్వకుండా వెళ్లడంతో బజ్‌రంగ్‌పై నాడా సస్పెన్షన్ విధించిన సంగతి తెలిసిందే. అయితే, పరీక్షల కోసం నాడా అధికారులు గడువు దాటిన కిట్‌లను వాడడంతో తాను యూరిన్ శాంపిల్ ఇచ్చేందుకు నిరాకరించానంటూ ఏడీడీపీ ముందు హాజరై బజ్‌రంగ్ వివరణ ఇచ్చుకున్నాడు. అంతేకాదు.. గడువు ముగిసిన కిట్‌లను ఎందుకు వాడుతున్నారన్న తన ప్రశ్నకు నాడా ఇప్పటికీ బదులివ్వలేదని, ఈ విషయంలో న్యాయ పోరాటం చేస్తున్నానని రెజ్లర్ కమిటీకి వివరించాడు. దీంతో నాడా తదుపరి నోటీసులు ఇచ్చేదాకా బజ్‌రంగ్‌పై సస్పెన్షన్ ఎత్తివేస్తున్నట్టు ఏడీడీపీ తెలిపింది.

మెద్వెదెవ్‌కు షాక్

ఫ్రెంచ్ ఓపెన్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో ఐదో సీడ్ మెద్వెదెవ్‌కు షాక్ తగిలింది. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ నాలుగో రౌండ్‌లో 11వ సీడ్ అలెక్స్ డిమినార్ (ఆస్ట్రేలియా) 4-6, 6-2, 6-1, 6-3తో రష్యా స్టార్ మెద్వెదెవ్‌ను కంగుతినిపించగా.. రెండో సీడ్ సిన్నర్ 2-6, 6-3, 6-2, 6-1తో మౌటెట్‌పై నెగ్గి క్వార్టర్స్ చేరాడు. మహిళల సింగిల్స్‌లో 2వ సీడ్ సబలెంకా 6-2, 6-3తో ఎమ్మా నవారోను, 4వ సీడ్ రిబకినా 6-4, 6-3తో 15వ సీడ్ స్విటోలినాను చిత్తు చేసి క్వార్టర్స్‌లో ప్రవేశించారు.

బోపన్న జోరు: భారత డబుల్స్ స్టార్ రోహన్ బోపన్న క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టాడు. మూడో రౌండ్‌లో రెండో సీడ్ బోపన్న/మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం 6-7 (2), 6-3, 7-6 (10-8)తో భారత్‌కే చెందిన శ్రీరామ్ బాలాజీ/మార్టినేజ్ (మెక్సికో)జోడీపై సూపర్ టై బ్రేకర్‌లో గెలిచింది.

తుపాకీ నీడన ఇండో-పాక్ మ్యాచ్?

న్యూయార్క్: ఇండో-పాక్ మ్యాచ్‌కు ఉగ్ర ముప్పు పొంచి ఉందనే వార్తలు రావడంతో భద్రతను కట్టుదిట్టం చేశారు. 8 మ్యాచ్‌లకు వేదికైన ఐసెన్ హోవర్ పార్క్ స్టేడియంలో మ్యాచ్‌ల సమయంలో ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు పోలీసులు చర్యలు తీసుకొంటున్నారు. ఈ క్రమంలో స్పెషలిస్ట్ స్నైపర్లను కూడా మోహరించినట్టు సమాచారం. ప్రస్తుతం స్టేడియం వద్ద 24 గంటలూ గస్తీ కాస్తున్నారు. ఆదివారం ఇక్కడ జరిగే మ్యాచ్‌లో భారత్, పాక్ తలపడనున్నాయి.



శ్రీకాంతచారి తల్లి శంకరమ్మను సన్మానిస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, కోదండరాం తదితరులు

అమరులు కలగన్న పాలన మొదలైంది

- ఉద్యమకారులు, అమరుల కుటుంబాలకు.. 250 గజాల ఇళ్ల స్థలాలు ఇస్తాం: పొన్నం
- ప్రజల ఆకాంక్షను నెరవేర్చేది రేవంతే: సీతక్క
- కేసీఆర్ నిరంకుశ పాలన ముగిసింది: కోదండరాం

హనుమకొండ సిటీ, జూన్ 3 : అమరులు, ఉద్యమకారుల ఆశయాలు ఫలించే పాలన రాష్ట్రంలో ఆరంభమైందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రజలు కోరుకున్న స్వేచ్ఛాయుత పాలన అమల్లోకి వచ్చిందన్నారు. సోమవారం హనుమకొండలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని తెలంగాణ ఉద్యమకారులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కతో పాటు తెలంగాణ బిల్లు లోక్ సభలో ప్రవేశపెట్టిన సమయంలో కాంగ్రెస్ ఎంపీలుగా ఉన్న మధుయాష్కీ, అంజన్ కుమార్, సిరిసిల్ల రాజయ్య, వివేక్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులు, అమరుల కుటుంబాలకు 250 గజాల ఇళ్ల స్థలం ఇస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చేది సీఎం రేవంత్‌రెడ్డేనని మంత్రి సీతక్క అన్నారు. ఉద్యమకారులు, అమరుల ఆశయాలను సాధించడంలో రేవంత్ రాజీపడబోరని తెలిపారు. కేసీఆర్ నిరంకుశ పాలన ముగియడంతో రాష్ట్రంలో స్వేచ్ఛా వాయువులు వీస్తున్నాయని ప్రొఫెసర్ కోదండరాం పేర్కొన్నారు. ఉద్యమకారులు, అమరుల కుటుంబాలను సన్మానించడం ద్వారా జన్మ ధన్యమైనట్లు భావిస్తున్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

అందెశ్రీ గీతాన్ని సమాజం ఆమోదించదు

- పాటను సర్కారు నిస్సారం చేసింది: మంద కృష్ణ

వడ్డెపల్లి, జూన్ 3: అందెశ్రీ రాసిన గీతాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక గీతంగా ప్రకటించినప్పటికీ దాన్ని తెలంగాణ సమాజం ఆమోదించదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ప్రజల గుండెల్లో నిలిచిన సంపూర్ణ గీతాన్ని ఆమోదించాలని డిమాండ్ చేశారు. హనుమకొండలోమందకృష్ణ మాట్లాడారు.అందెశ్రీ రాసిన గీతం తెలంగాణ సమాజాన్ని ఏకం చేసి ఉద్యమానికి ఊపిరిలూదిందని గుర్తు చేశారు. 13 చరణాలతో కూడిన ఆ గీతాన్ని మూడు చరణాలకు కుదించి సారం, స్ఫూర్తి, సందేశం లేకుండా చేశారని మండిపడ్డారు. రాష్ట్ర గీతంపై అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహిస్తామని, రాజకీయ పక్షాలను కలుస్తామని తెలిపారు.

కాంగ్రెస్ సర్కార్‌ను కేంద్రం ఏడాదిలో కూల్చుతుంది

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



జనగామ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్‌ను కేంద్ర ప్రభుత్వం ఏడాదిలో కూల్చబోతుందంటూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సంచలన వాఖ్యలు చేశారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల ముగింపులో భాగంగా జనగామ జిల్లా కేంద్రం సమీపంలోని యశ్వంతాపూర్ బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇక మనుగడ సాధించడం కష్టమని ఎర్రబెల్లి అన్నారు. ప్రభుత్వ పతనం అనంతరం జరగబోయే ఎన్నికల్లో కేసీఆర్ మూడోసారి సీఎంగా పగ్గాలు చేపట్టడం ఖాయమన్నారు. తెలంగాణ ఉద్యమానికి ఏనాడూ అండగా నిలవని సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించే అర్హత లేదన్నారు. సీఎంపై ఒక్క ఉద్యమ కేసు కూడా లేదని ఎర్రబెల్లి తెలిపారు.

టోల్ పెంచడమంటే భారం మోపడమే: తమ్మినేని

హైదరాబాద్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): టోల్ చార్జీలు పెంచడమంటే ప్రజలపై తీవ్ర భారం మోపడమేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. దేశవ్యాప్తంగా సగటున 5 శాతం టోల్ చార్జీలు పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. దీని వల్ల ప్రయాణికులపై భారం పడుతోందని, ఏటా చార్జీలు పెంచి వాహనాదారులపై భారం మోపడం సరైంది కాదని తమ్మినేని అన్నారు. ఓవైపు చార్జీలు పెంచుతున్నా టోల్ గేట్ల నిర్వాహకులు మాత్రం వాహనదారులకు కనీస వసతులు కల్పించడం లేదని ఆరోపించారు.

పూర్వ వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలి: ట్రెసా

పెండింగ్‌లో ఉన్న పూర్వ వీఆర్ఏల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా) డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్‌ను ట్రెసా అధ్యక్షులు వంగ రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. గౌతమ్ కుమార్, ఉపాధ్యక్షులు కె. నిరంజన్ రావు కలిసి వినతి పత్రం సమర్పించారు. వివిధ శాఖల్లో సర్దుబాటు చేసిన పూర్వ వీఆర్ఏల సమస్యలను అందులో వివరించారు. వారికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సునీతను విడుదల చేయాలి: హక్కుల సంఘం

పోలీసులు అదుపులోకి తీసుకున్న ఆదివాసీ హక్కుల కార్యకర్త సునీత పొట్టంను బేషరతుగా విడుదల చేయాలని పౌరహక్కుల సంఘం డిమాండ్ చేసింది. డీఎస్పీ గరిమా దాదర్ నేతృత్వంలోని పోలీసు బృందం ఆమెను బలవంతంగా తీసుకెళ్లారని సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నారాయణ ఆరోపించారు. గత ఏప్రిల్‌లో బీజాపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 13 మంది చనిపోయారు. వారిలో ముగ్గురు మాత్రమే మావోయిస్టులని, మిగతా 10 మంది ఆదివాసీ ప్రజలని పేర్కొంటూ ఛత్తీస్‌గఢ్‌లోని మూలవాసి బచావో మంచ్‌కు ఉపాధ్యక్షురాలిగా పనిచేస్తున్న సునీత ఆందోళన చేపట్టారు. హింసను పేరేపిస్తూ ప్రచారం చేస్తున్నారనే నెపంతో సునీతను పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని నారాయణ తెలిపారు.



ఎన్టీఆర్ ఫౌండేషన్‌కు 2 కోట్ల విరాళం

- బాబుకు చెక్ అందజేసిన మన్నవ మోహన్‌కృష్ణ

అమరావతి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ట్రస్టు అనుబంధ విభాగమైన ఎన్టీఆర్ ఫౌండేషన్‌కు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహన్‌కృష్ణ రూ.2 కోట్లను విరాళంగా అందజేశారు. టీడీపీ అధినేత చంద్రబాబును సోమవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిసి చెక్ అందజేశారు. ఎన్టీఆర్ ట్రస్టు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, ఎంతోమంది పేద విద్యార్థులను ట్రస్టు ద్వారా చదివిస్తున్నారని మోహన్ కృష్ణ అన్నారు. విరాళం అందించిన మోహన్‌కృష్ణను చంద్రబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ టీడీపీ అధ్యక్షుడు వేమూరి రవి, ఎన్ఆర్ఐ గొట్టిపాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ 25 లక్షల విరాళం

ఎన్ఆర్ఐ, వ్యాపారవేత్త బొద్దులూరి కృష్ణ టీడీపీకి రూ.25 లక్షల విరాళాన్ని అందించారు. చంద్రబాబును కలిసి చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత ఎల్‌వీఎస్ఆర్‌కే ప్రసాద్ పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డి ఉద్యమ ద్రోహి

ఆయన ఎన్నడూ ఉద్యమకారుడు కాలేడు: హరీశ్‌రావు



సిద్దిపేట అర్బన్/ మర్కుక్, జూన్ 3: రేవంత్ రెడ్డి ఏనాడు జై తెలంగాణ అనలేదని, ఆయన ఎంత పెద్ద పదవులు అనుభవించినా ఉద్యమకారుడు మాత్రం కాలేడని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ ఉద్యమకారులపై తుపాకీ ఎక్కుపెట్టిన ద్రోహిగా రేవంత్ చరిత్రలో మిగిలిపోతాడని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారులమన్న ఘనత తమకు మాత్రమే దక్కుతుందని కరెంటు కోసం, తెలంగాణ ఉద్యమం కోసం ఎన్నో త్యాగాలు, పోరాటాలు చేశామని గుర్తు చేశారు. సిద్దిపేట జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ లేకపోతే తెలంగాణ సిద్ధించేది కాదని అన్నారు. ఆనాడు సమైక్య పాలనలో జై తెలంగాణ మాటను నిషేధించారని, ఇప్పుడు రేవంత్ పాలనలో ఆ పదమే మాయమైపోయిందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం కలను నిజం చేసిన బీఆర్ఎస్‌ను ప్రజలు మర్చిపోరని హరీశ్ స్పష్టం చేశారు. అనంతరం తెలంగాణ ఉద్యమకారులను సన్మానించారు. కాగా, సోమవారం తన పుట్టిన రోజు సందర్భంగా హరీశ్‌రావు మాజీ సీఎం కేసీఆర్‌ను కలుసుకుని ఆశీర్వాదం తీసుకున్నారు.

కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు.. గలీజు పాలన

- తీరుమారకపోతే జనం తరిమికొట్టడం ఖాయం:కేటీఆర్



హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు.. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే పాలన అని.. సురక్షిత మంచినీళ్లు కూడా ఇవ్వలేని ఈ సర్కారు ప్రజారోగ్యాన్ని పూర్తిగా గాలి కొదిలేసి గలీజుపాలన సాగిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. నల్లగొండ మునిసిపాలిటీలోని పాతబస్తీ హిందూపూర్ వాటర్ ట్యాంకులో మృతదేహం లభించడంపై సోమవారం ట్విటర్ ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. జలమే జగతికి మూలమని, మిషన్ భగీరథ పథకంతో.. దశాబ్దాల తాగునీటి తండ్లాటను తీరిస్తే.. కనీసం నీటి ట్యాంకుల నిర్వహణ కూడా ఈ ప్రభుత్వానికి చేతకావడం లేదన్నారు. 'కోతల్లేని కరెంట్ ఇవ్వలేరు.. కోతకొచ్చిన పంటకు సాగునీళ్లు ఇవ్వలేరు.. కోతులు పడి చనిపోయినా వాటర్ ట్యాంకులను పట్టించుకోరు చివరికి.. నల్లగొండలోని నీటి ట్యాంకులో పదిరోజులుగా శవం ఉన్నా నిద్రలేవరు' అంటూ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. నాగార్జున సాగర్ ఘటన స్మృతిపథం నుంచి చెరిగిపోక ముందే.. కాంగ్రెస్ సర్కారులో మళ్లీ అదే నిర్లక్ష్యంకనబడుతోందని, ఈ సర్కారు తీరుమారకపోతే జనం తరిమికొట్టడం ఖాయమని కేటీఆర్ పేర్కొన్నారు.

ఏపీ వ్యాపారులతో.. ఏవోల మిలాఖత్

తరలిపోతున్న పచ్చిరొట్ట విత్తనాలు.. రైతుల పేర్లతో వ్యవసాయ అధికారుల వ్యాపారం

- ఏవోల చేతిలో రైతుల పాస్‌బుక్, ఆధార్, సెల్ నంబర్లు
- రైతులు తీసుకున్నట్లు లెక్కలు రాసి.. మార్కెట్లో అమ్మకం
- బ్లాక్ మార్కెట్లో సీడ్ విక్రయిస్తే కఠినచర్యలు: తుమ్మల

హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు పంపిణీ చేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలు.. మండల వ్యవసాయ అధికారుల(ఏవోల) బ్లాక్ మార్కెట్ దందాతో ఆంధ్రప్రదేశ్‌కు తరలిపోతున్నాయి. మహబూబాబాద్, సూర్యాపేట, నల్లగొండ, వరంగల్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం తదితర జిల్లాల్లో కొందరు మండల వ్యవసాయ అధికారులు.. గుంటూరు, విజయవాడ నుంచి వచ్చే వ్యాపారులకు వీటిని దొంగచాటుగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.110 కోట్ల సబ్సిడీని భరించి 2 లక్షల టన్నుల పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తోంది. ఉదాహరణకు జీలుగ విత్తనాల ధర కిలోకు రూ.93 ఉంటుంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.55.80 సబ్సిడీగా ఇస్తుంది. రైతులు రూ.37.20 చొప్పున చెల్లించాలి. ఎకరానికి 12 కిలోల చొప్పున హెక్టారుకు 30 కిలోల బస్తా ఇవ్వాలనే నిబంధన పెట్టారు. ఈ బస్తా మార్కెట్ విలువ రూ.2,790 ఉండగా.. వ్యవసాయ శాఖ ద్వారా రూ.1,116కే రైతులకు సరఫరా చేస్తున్నారు. దాన్ని కొందరు ఏవోలు రూ. 1,500 నుంచి రూ. 1,800 చొప్పున ఏపీ ట్రేడర్లకు అమ్మేస్తున్నారు. పిల్లిపెసర 20 కిలోల బస్తా మార్కెట్ ధర రూ.2,710 కాగా.. ప్రభుత్వం సబ్సిడీపై రూ.1,084 చొప్పున పంపిణీ చేస్తున్నారు. జనుము 40 కిలోల బస్తా మార్కెట్ రేటు రూ.3,620 కాగా.. సబ్సిడీ రేటు రూ.1,448. వీటిని బ్లాక్‌మార్కెట్లో అమ్మడం వల్ల అటు ప్రభుత్వానికి, ఇటు రాష్ట్ర రైతులకు నష్టం కలుగుతోంది.

వారి వద్దే ఐడీ, పాస్‌వర్డ్



సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల సరఫరాకు సంబంధించిన పోర్టల్ యూజర్ ఐడీ, పాస్‌వర్డ్.. ఏవోల వద్ద మాత్రమే ఉంది. పట్టాదారు పాస్‌పుస్తకం, రైతుల ఆధార్, సెల్ ఫోన్ నంబరు పోర్టల్‌లో నమోదు చేసి రైతులకు లెక్క ప్రకారం సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేయాలి. అందుకు భిన్నంగా కొందరు మండల వ్యవసాయ అధికారులు(ఏవోలు) వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోంది. రైతులు ఈ సబ్సిడీ విత్తనాల కోసం తమ కార్యాలయానికి రాకపోయినా.. వారి వివరాలన్నీ తమ వద్ద ఉండడంతో ఏవోలు అక్రమాలకు పాల్పడుతున్నారు. రైతుబంధు పథకం అమలు కోసం సేకరించిన పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఆధార్, సెల్ ఫోన్ నంబర్లు అందుబాటులో ఉండడంతో రైతుల పేర్లమీద ఎంట్రీలు చేసి.. విత్తనాలను ఇతర రాష్ట్రాలకు అమ్ముకుంటున్నారు. ఉదాహరణకు.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని తొర్రూరులో 24 మంది రైతుల పాస్‌పుస్తకాలను పరిశీలిస్తే 14 పుస్తకాల్లో ఫేక్ ఎంట్రీలు ఉన్నాయి. అంటే వారు సబ్సిడీ విత్తనాలు తీసుకోకపోయినా.. తీసుకున్నట్లు నమోదుచేశారు. అదే ప్రాంతానికి చెందిన ఒక రైతుకు మామిడి తోట ఉంది. ఆయనకు జీలుగ విత్తనాలు అవసరం లేదు. తీసుకోలేదు కూడా! కానీ ఆయన పేరు మీద కూడా సబ్సిడీ విత్తనాలు తీసుకున్నట్లు నమోదు చేశారు. ఈ దందాపై రైతుల నుంచి ఫిర్యాదులు రావడంతో సోమవారం సాయంత్రం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విచారణకు ఆదేశించారు. దీంతో కొందరు వ్యవసాయశాఖ అధికారులు.. రైతుల వద్దకు వెళ్లి సబ్సిడీ విత్తనాలు తీసుకున్నట్లు చెప్పాలని వేడుకుంటున్నట్లు సమాచారం.

టార్గెట్‌కు అనుగుణంగా..

పచ్చిరొట్ట విత్తనాలు ఎక్కువ మొత్తంలో కొనుగోలుచేసి పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందని.. రాష్ట్ర రైతాంగానికి నష్టం కలిగిస్తున్నవారిపై కఠినచర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన వ్యవసాయశాఖ అధికారులతోపాటు వివిధ జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పత్తి, పచ్చిరొట్ట విత్తనాలు మార్కెట్లో అందుబాటు లో ఉన్నాయని, ప్రభుత్వ గుర్తింపు పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. ప్రైవేటు వ్యక్తులు, మాయమాటలు చెప్పే వ్యాపారులు, ఆఫర్లు, నజరానాలు ఇచ్చేవారివద్ద విత్తనాలు కొనుగోలు చేయొద్దన్నారు. నాలుగైదు రోజుల్లో టార్గెట్‌కు అనుగుణంగా విత్తనాలు సరఫరా చేస్తామని తుమ్మల తెలిపారు. కంపెనీలతో సమీక్షించి ప్రణాళిక ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన సీడ్ ప్యాకెట్లు మూడు రోజుల్లో అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

హైపవర్ కమిటీ నివేదికపై సమయం ఇవ్వండి

- హైకోర్టును కోరిన ప్రభుత్వం
- జీవో 111 ఎత్తివేతపై విచారణ

హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జంట జలాశయాలైన హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ పరివాహక ప్రాంత పరిరక్షణకు ఉద్దేశించిన జీవో 111ను ఎత్తివేత విషయమై ఏర్పాటు చేసిన హైపవర్ కమిటీ నివేదికపై వివరణ ఇచ్చేందుకు మరింత సమయం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును కోరింది. జీవో 111ను రద్దు చేసి, ఆ నిషేధిత ప్రాంతంలో పర్యావరణహితంగా అభివృద్ధి చేస్తామని పేర్కొంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం నూతన జీవో 69ను జారీచేసింది. ఆ ప్రాంతంలో తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో హైపవర్ కమిటీ ఏర్పాటు చేసింది. జీవో 111 రద్దును వ్యతిరేకిస్తూ హైకోర్టులో అప్పటికే పెండింగ్‌లో ఉన్న పిటిషన్‌లలో పిటిషనర్‌లతోపాటు కొత్త పిటిషన్‌లు దాఖలు కావడంతో హైపవర్ కమిటీ నివేదిక వచ్చే వరకు జీవో 111 రద్దుకు సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం తెలిపింది. నిర్మాణాలకు సంబంధించి గతంలో ఉన్న ఆంక్షలు, నిషేధాలను సడలించబోమని హైకోర్టుకు హామీ ఇచ్చింది. తాజాగా జీవో 111కు సంబంధించిన దాదాపు 12 పిటిషన్‌లపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. అసలు కమిటీ నివేదిక ఇచ్చిందా? ప్రస్తుత పరిస్థితి ఏమిటని ధర్మాసనం ప్రశ్నించింది. ఇందుకు సంబంధించిన వివరాలు తెలుసుకునేందుకు నాలుగువారాల సమయం ఇవ్వాలని ఏజీ కోరారు. అంగీకరించిన ధర్మాసనం విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

హైకోర్టు జడ్జి జస్టిస్ సూరేపల్లి నందా రికార్డు
ఒకే రోజు 76 కేసుల్లో తీర్పు వెల్లడి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నంద రికార్డు సృష్టించారు. వేసవి సెలవుల తర్వాత హైకోర్టు సోమవారం కార్యకలాపాలు ఆరంభించగా తొలిరోజు 76 కేసుల్లో తీర్పు వెల్లడించారు. గత ఏడాది కూడా ఇదే విధంగా ఆయన కోర్టు సెలవుల తర్వాత 71 కేసుల్లో తీర్పు వెల్లడించారు.



రేవ్ పార్టీ కేసులో.. సినీ నటి హేమ అరెస్టు

- విచారణ అనంతరం అదుపులోకి తీసుకున్న బెంగళూరు పోలీసులు
- వైద్యపరీక్షల అనంతరం కోర్టుకు!.. 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ

హైదరాబాద్ సిటీ, బెంగళూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సంచలనం సృష్టించిన రేవ్‌పార్టీ కేసులో తెలుగు సినీ నటి హేమను బెంగళూరు సీసీబీ పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు ఆమెకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. బెంగళూరు ఎలక్ట్రానిక్ సిటీలోని జీఆర్ ఫాంహౌస్‌లో జరిగిన ఈ రేవ్‌పార్టీపై దాడి చేసిన రోజే పోలీసులు ఐదుగురు మాదక ద్రవ్యాల వ్యాపారులు, పార్టీ నిర్వాహకులను అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. వారంతా ప్రధానంగా హేమ పేరును ప్రస్తావించినట్టు తెలిసింది. దీంతో ఈ కేసులో హేమకు రెండుసార్లు నోటీసులు పంపినా వైరల్ జ్వరంతో బాధపడుతున్నానంటూ ఆమె హాజరు కాలేదు. మూడోసారి నోటీసులు పంపించగా.. ఆమె సోమవారం విచారణకు హాజరయ్యారు. పక్కా ఆధారాలు చూపిన సీసీబీ అధికారులు, విచారణ అనంతరం ఆమెను అరెస్టు చేసినట్లు ప్రకటించారు. అనంతరం మల్లేశ్వరంలోని కేసీ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించి, సాయంత్రం కోర్టులో హాజరు పరిచారు. కాగా.. ఈ విషయంలో హేమ తీరు తొలి నుంచీ విమర్శలకు తావిచ్చింది. పార్టీలో పట్టుబడిన విషయం బయటకు రాగానే ఆమె ఓ వీడియో విడుదల చేసి తాను హైదరాబాద్‌లో ఉన్నానని నమ్మించే ప్రయత్నం చేశారు. అరెస్టయ్యాక సోమవారం ఆస్పత్రికి తరలించిన సమయంలోనూ ఆమె బురఖా ధరించి కనిపించారు. ఆస్పత్రి నుంచి బయటకు వచ్చినప్పుడు పలువురిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక.. ఇప్పటివరకు ఈ కేసులో 20 మందికి సీసీబీ నోటీసులు ఇచ్చినట్టు తెలిసింది. వీరిలో ఎంతమంది విచారణకు హాజరయ్యారనేది తెలియరాలేదు.

రేవ్ పార్టీలో నేను లేను: హేమ

రేవ్ పార్టీలో తాను లేనని, బర్త్‌డే కేక్ కట్ చేసిన వెంటనే హైదరాబాద్‌కు వచ్చేశానని సినీనటి హేమ అన్నారు. విచారణకు హాజరైన హేమను బెంగళూరు సీసీబీ పోలీసులు సోమవారం అరెస్టు చేసి న్యాయాధికారి ముందు హాజరు పరిచారు. కోర్టు నుంచి బయటకు వస్తున్న సమయంలో హేమ మీడియాతో మాట్లాడారు. ఆరోజు తాను హైదరాబాద్ నుంచే ఆ వీడియో పెట్టానని మరోసారి స్పష్టం చేశారు. మరుసటి రోజు బిరియానీ వండిన వీడియో కూడా హైదరాబాద్‌దేనని అన్నారు. పట్టుబడినట్లు చెబుతున్న రోజు ఎటువంటి టెస్ట్‌లూ చేయలేదని, పాజిటివ్ లేదని అన్నారు. ఈ రోజే శాంపిల్స్ తీసుకున్నారని ఆమె తెలిపారు. అంతకుముందు వైద్య పరీక్షలకు తీసుకెళ్లిన సమయంలోనూ హేమ ఇలాంటి వ్యాఖ్యలే చేశారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు హైకోర్టుకు

(మొదటి పేజీ తరువాయి)

ప్రెసిడెంట్ కేటీఆర్‌ను విమర్శించిన వారి ఫోన్‌లు ట్యాపింగ్ చేసినట్లు భుజంగరావు స్టేట్‌మెంట్‌ను ఉటంకిస్తూ రాశారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై విమర్శలు చేసిన వారి ఫోన్లు ట్యాపింగ్ చేశారు. అప్పటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ ఆదేశాల మేరకు హైకోర్టు జడ్జిల ఫోన్‌లు సైతం ట్యాపింగ్ చేసినట్లు వార్తా కథనాల్లో ఉంది. సదరు ట్యాపింగ్ వ్యవహారాన్ని ప్రభాకర్‌రావే పర్యవేక్షించినట్లు భుజంగరావు స్టేట్‌మెంట్‌లో వెల్లడైంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇతర నిందితులు మేకల తిరుపతన్న, డి.ప్రణీత్‌రావు, మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు, భుజంగరావు తదితరులు ప్రభాకర్‌రావు నుంచి ఆదేశాలు రాగానే ప్రత్యేక దర్యాప్తు బృందంగా ఏర్పడి, ఉగ్రవాదుల జాడను పసిగట్టే పరికరాలతో అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడు కొండల్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఫోన్‌లు ట్యాప్ చేశామని, ప్రణీత్‌రావు ఇచ్చే వివరాల ఆధారంగా జడ్జిలు, ప్రతిపక్ష నేతలు, అలాగే బీఆర్ఎస్ సొంత నాయకులపై నిఘా పెట్టామని భుజంగరావు స్టేట్‌మెంట్‌ను ఉటంకిస్తూ పత్రికల్లో పేర్కొన్నారు. విద్యార్థి నాయకులు, జర్నలిస్టులు, ప్రతిపక్ష నేతల కుటుంబ సభ్యులు ఫోన్‌లు సైతం ట్యాప్ చేసినట్లు అందులో పేర్కొన్నారు. దుబ్బాక, హుజురాబాద్, మునుగోడు, జీహెచ్ఎంసీ ఎన్నికల సందర్భంగా కూడా ట్యాపింగ్ చేసినట్లు పత్రికల కథనాల్లో ప్రస్తావించారు. మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి స్థాయిలో సివిల్ వివాదాలు పరిష్కరించేలా ఓ వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నామని భుజంగరావు ప్రకటనలో ఉంది. పెద్ద పెద్ద కంపెనీలు, పలుకుబడి కలిగిన వ్యక్తులకు సంబంధించిన వివాదాలను పరిష్కరించాలని ప్రణాళిక వేసుకున్నట్లు అందులో పేర్కొన్నారు. బీఆర్ఎస్ లీడర్ల ఆదేశాలతో పెద్ద మొత్తంలో డబ్బును టాస్క్‌ఫోర్స్ వాహనాల్లో రెండు ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించామని, సంధ్య శ్రీధర్‌రావు చేత రూ.13 కోట్ల విలువైన ఎన్నికల బాండ్లు క్రిమినల్ కేసుల భయం చూపి కొనిపించామని స్టేట్‌మెంట్‌లో ఉంది. కేసీఆర్ పోటీ చేసిన కామారెడ్డిపై ప్రత్యేక దృష్టి పెట్టామని, బీజేపీ అభ్యర్థి వెంకట్రమణారెడ్డి, రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డిపై నిఘా పెట్టామని భుజంగరావు అంగీకార ప్రకటన చేసినట్లు పత్రికల కథనాల్లో పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్, జీపీఎస్ లొకేషన్ ఆధారంగా గాలి అనిల్ కుమార్, కె.వినయ్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిల సన్నిహితుల వద్ద, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సన్నిహితుల వద్ద, యశస్వినిరెడ్డి అత్త ఝాన్సిరెడ్డి వద్ద డబ్బు పట్టుకున్నట్లు భుజంగరావు అంగీకరించారు. తిరుపతన్న నేరాంగీకార ప్రకటన ప్రకారం... కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కంప్యూటర్‌లలో డేటాతో పాటు డివైస్‌లను నాశనం చేసినట్లు తేలింది. ఇందులో పేర్కొన్న అంశాలపై తగిన ఆదేశాలను జారీ చేయాలని హైకోర్టు రిజిస్ట్రీ ధర్మాసనాన్ని కోరింది.



పాలిసెట్‌లో 84% ఉత్తీర్ణత

(మొదటి పేజీ తరువాయి)

పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 69,728 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 120 మార్కులకు నిర్వహించిన ఈ పరీక్షలో 36 మార్కులు (30 శాతం) సాధించిన వారిని ఉత్తీర్ణులుగా ప్రకటించారు. అయితే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఒక్క మార్కు సాధించినా ఉత్తీర్ణులుగా పరిగణించారు. విద్యార్థులు సాధించిన ర్యాంకుల ఆధారంగా పాలిటెక్నికల్ కాలేజీలతోపాటు ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ, కొండా లక్ష్మణ్ హార్టికల్చరల్ యూనివర్సిటీల్లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. అలాగే వెటర్నరీ యూనివర్సిటీలో డిప్లొమా కోర్సుల్లో సీట్లను కూడా భర్తీ చేయనున్నారు. కాగా పాలిసెట్‌లో ఖమ్మంజిల్లా పెనుబల్లి మండలం మండాలపాడుకు చెందిన తూమాటి హరీష్ ఎంపీసీ విభాగంలో 120కి 120మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించాడు. హరీష్ తల్లి శశి.. అంగన్‌వాడీ టీచర్. తండ్రి వెంకటేశ్వరరావు ఓ దుకాణంలో గుమస్తా. మధ్యతరగతి కుటుంబానికి చెందిన హరీష్ పాలిసెట్‌లో ప్రథమ స్థానం సాధించటం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంబైపీసీ విభాగంలో సూర్యాపేట బాలాజీ నగర్‌కు చెందిన గోపగాని శ్రీనిఖ 119.5 మార్కులతో మొదటి ర్యాంకు సాధించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థి ముత్యాల పార్థసారథి ఎంపీసీ విభాగంలో 118మార్కులతో రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంకు సాధించాడు. కేసముద్రం



తూమాటి హరీష్



గోపగాని శ్రీనిఖ

మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కంది శివకుమార్ 114 మార్కులతో 93వ ర్యాంకు సాధించడంతోపాటు ఎంబైపీసీ విభాగంలో 110.5 మార్కులతో 119వ ర్యాంకు సాధించాడు. కేసముద్రం మండలం కల్వల గ్రామానికి చెందిన ఆరెందుల అశ్రిత ఎంపీసీ విభాగంలో 110 మార్కులు సాధించి 278వ ర్యాంకు సాధించింది. కాగా పాలిసెట్‌లో హైదరాబాద్ విద్యార్థులు సత్తా చాటారు. టాప్ 15 ర్యాంకుల్లో నాలుగింటిని కైవసం చేసుకున్నారు. ఎంపీసీ విభాగంలో 2, 10, 12 ర్యాంకులతోపాటు బైపీసీ స్ట్రీమ్‌లో 5వ ర్యాంకు హైదరాబాద్ విద్యార్థుల సొంతమైంది. మీర్‌పేట్ త్రివేణి నగర్‌కు చెందిన కటకం లలిత్ మనోహర్ ఎంపీసీ స్ట్రీమ్‌లో స్టేట్ 2వ ర్యాంకు సాధించాడు. ఐఐటీలో బీటెక్ చదవడమే తన లక్ష్యమని మనోహర్ తెలిపాడు. మల్కాజిగిరి బీజేఆర్ నగర్‌కు చెందిన ముత్తోజు విష్ణువర్ధన్ బైపీసీ స్ట్రీమ్‌లో రాష్ట్రస్థాయి 5వ ర్యాంకు సాధించాడు. ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చదవడమే తన లక్ష్యమని తెలిపాడు. అల్వాల్ వీబీఆర్ కాలనీకి చెందిన చెలిమెల రోహన్ 10వ ర్యాంకు సాధించాడు. ఐఐటీలో బీటెక్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చేయాలనేది తన ఆకాంక్షగా తెలిపాడు. ఉప్పల్‌కు చెందిన వనం అమూల్య 12వ ర్యాంకు సాధించింది. మారేడ్‌పల్లిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్‌లో ఏఐఎంఎల్ డిప్లొమా చదవాలని తన ఆకాంక్షగా పేర్కొంది.

ఎంపీసీ విభాగంలో టాప్ 5 ర్యాంకర్లు

ర్యాంకు	పేరు	జిల్లా
1	తూమాటి హరీష్	ఖమ్మం
2	లలిత్ మనోహర్ కటకం	రంగారెడ్డి
3	జి.భవిత	మహబూబ్‌నగర్
3	గోపగాని శ్రీనిఖ	సూర్యాపేట
5	ముత్యాల పార్థసారథి	మహబూబాబాద్
5	నవ్వాతి సుశాంత్	భద్రాద్రి కొత్తగూడెం
5	గోత్రాల అక్షర	కామారెడ్డి

ఎంబైపీసీ విభాగంలో టాప్ 5 ర్యాంకర్లు

ర్యాంకు	పేరు	జిల్లా
1	గోపగాని శ్రీనిఖ	సూర్యాపేట
2	సామ అశువర్ధన్ రెడ్డి	సూర్యాపేట
3	జి. భవిత	మహబూబ్‌నగర్
4	కట్టా హితేష్	జగిత్యాల
5	ముత్తోజు విష్ణువర్ధన్	హైదరాబాద్



సివిల్స్ ర్యాంకర్ సాయి కిరణ్‌ను అభినందించిన సీఎం రేవంత్

హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సివిల్స్-2023 ఫలితాల్లో ఆల్ ఇండియా 27వ ర్యాంకు సాధించిన నందాల సాయికిరణ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. ఈ మేరకు జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో సోమవారం సీఎంను సాయికిరణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. కిరణ్‌ది కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెల్చాల గ్రామం.

రిసార్టుల్లో ఎన్నికల ఫలితాలు

- ఐపీఎల్ ఫైనల్ తరహాలో భారీస్థాయిలో తెరలు
- సంబరాలకు సిద్ధమవుతోన్న పార్టీల అభిమానులు

హైదరాబాద్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ ఫైనల్ సందర్భంగా దాదాపు అన్ని స్టార్ హోటళ్లలో భారీ తెరలపై మ్యాచ్‌ను ప్రదర్శిస్తారు. బార్‌లు, రిసార్టులు, రెస్టారెంట్లు.. వినియోగదారులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తాయి. ఇదే తరహా ఆసక్తి తొలిసారిగా లోక్‌సభ ఎన్నికల ఫలితాల నేపథ్యంలోనూ కనిపిస్తోంది. ఎగ్జిట్ పోల్స్ అంచనాల ఆధారంగా.. ఆయా పార్టీల నేతలు, వారి అనుచరులు, అభిమానులు సిద్ధమయ్యారు. ఫలితాల వీక్షణకు కీలక నేతలు, కార్యకర్తలను ఆహ్వానించి గెలుపు సంబరాలు జరుపుకొనేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి హైదరాబాద్ శివారుల్లోని పలు రిసార్టులను, నగరంలోని స్టార్ హోటళ్లనూ వేదికగా చేసుకున్నారు. ముఖ్యంగా శివార్లలోని రిసార్టులకు భారీ డిమాండ్ నెలకొంది. హైదరాబాద్‌లో ఉంటున్న ఏపీ వాసులు ఆ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై అత్యంత ఆసక్తిగా ఉన్నారు. ఇప్పటికే పార్టీల అభిమానులు అనేకమంది తమ సొంత ప్రాంతాలకు తరలివెళ్లారు. ఏపీ ఎన్నికల ఫలితాలపై మొక్కులు పెట్టుకున్నవారి సంఖ్య సైతం ఈసారి ఎక్కువగానే ఉండడం గమనార్హం.

విద్యుత్ సంస్థల్లో డైరెక్టర్ల భర్తీకి కసరత్తు

- 16 పోస్టులకు 50కి పైగా దరఖాస్తులు

హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ పంపిణీ సంస్థల్లో డైరెక్టర్ల పోస్టుల భర్తీకి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించనుంది. ఈ నెల 5న ఎన్నికల కోడ్ ముగియనుండటంతో పోస్టుల భర్తీకి త్వరలో ఎంపిక కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ట్రాన్స్‌కో, జెన్‌కోలలో డైరెక్టర్లను ఇన్‌చార్జీగా కొనసాగిస్తుండగా.. విద్యుత్ పంపిణీ సంస్థల్లో (డిస్కమ్) డైరెక్టర్లను ప్రభుత్వం తొలగించి సీజీఎంలకు ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగించింది. నాలుగు సంస్థల్లో కలుపుకొని 16 డైరెక్టర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి కోసం 50కిపైగా దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటిదాకా దక్షిణ డిస్కమ్‌లో ఏడుగురు డైరెక్టర్లు ఉండగా..నాలుగుకు కుదించారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయి రెండు నెలలు గడుస్తోంది. ఇప్పటికే జెన్‌కోలో ఇద్దరు డైరెక్టర్లు కొలువులకు రాజీనామా చేశారు. అయితే పలు సంఘాలు డైరెక్టర్ల వయోపరిమితిని 65 ఏళ్లకు పెంచాలని ప్రభుత్వానికి ఇప్పటికే నివేదించాయి. దాంతో పదేళ్ల తర్వాత పూర్తిస్థాయిలో కొత్తగా భర్తీ చేస్తుండటంతో ఆయా పోస్టుల కోసం పలువురు లాబీయింగ్‌ను ముమ్మరం చేశాయి.

రైళ్ల నిర్వహణలో భద్రతకు ప్రాధాన్యమివ్వాలి

- భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: రైల్వే జీఎం జైన్

హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రైళ్ల నిర్వహణలో భద్రతకు ప్రాధాన్యమివ్వాలని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం రైళ్ల భద్రతకు సంబంధించిన అంశాలపై ఆయా శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. రాబోయే రుతుపవనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. భారీ వర్షాలు, గాలులను దృష్టిలో ఉంచుకుని రైలు కార్యకలాపాలను పర్యవేక్షించడం, భద్రతను నిర్ధారించడం వంటి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలం దృష్ట్యా లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లతో పాటు రైలు కార్యకలాపాలలో నిమగ్నమైన సిబ్బందికి వరదలు సంభవించినప్పుడు అనుసరించాల్సిన విధానాలపై కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. ట్రాక్ పునరుద్ధరణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

'సూర్యఘర్' అమలుకు మిషన్ డైరెక్టరేట్

పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన అమలుకు మిషన్ డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. కేంద్ర నూతన, పునరుద్ధరణీయ ఇంధన శాఖ నేతృత్వంలోని ఈ మిషన్ డైరెక్టరేట్.. పథకం మార్గదర్శకాలతో పాటు అవసరమైన సవరణలపై నిర్ణయం తీసుకోనుంది. ఈ పథకం పూర్తి అమలు బాధ్యత దీనికే కట్టబెట్టారు. పథకం అమలు కోసం ప్రభావ వర్గాలు (స్టేట్ హోల్డర్ల)తో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లనుంది. రూఫ్‌టాప్ సోలార్‌తో ముడిపడిన రెగ్యులేషన్‌పై నియంత్రణ మండలితోనూ సంప్రదింపులు జరిపే బాధ్యత కూడా దీనిదే.

అమిత్ షాను కేసు నుంచి తప్పించే ప్రయత్నం

- పోలీసులపై ఈసీ చర్యలు తీసుకోవాలి: నిరంజన్

ఎన్నికల ప్రచారంలో పిల్లలను వాడుకోవద్దన్న నిబంధనను ఉల్లంఘించిన కేసులో కేంద్రమంత్రులు అమిత్‌షా, కిషన్‌రెడ్డి పేర్లను తొలగించేందుకు ప్రయత్నించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌ను టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ కోరారు. హైదరాబాద్‌లో మే 1న జరిగిన అమిత్‌షా ర్యాలీలో పిల్లలు బీజేపీ జెండాలను పట్టుకుని పాల్గొన్నారని, దీనిపై ఈసీకి అదే రోజున ఫిర్యాదు చేశామని వెల్లడించారు. మే 2న మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్‌లో అమిత్‌షా, కిషన్‌రెడ్డి, రాజాసింగ్, మాధవీలత, యమన్ సింగ్ పేర్లతో ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. అయితే భౌతిక సాక్ష్యాధారాల ప్రకారం అమిత్‌షా, కిషన్‌రెడ్డిల ప్రమేయం నిర్ధారణ కానందున కేసు నుంచి వారి పేర్లను తొలగించామని ఆ స్టేషన్ పోలీసులు తనకు పంపిన నోటీసులో పేర్కొన్నారన్నారు. కేసును తప్పుదోవ పట్టించేందుకే పోలీసులు ప్రయత్నిస్తున్నారని.. వారిపై విచారణ జరిపించాలని ఈసీని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కేసీఆర్ విషం కక్కుతున్నారని ఆ పార్టీ నేతలు గజ్జెల కాంతం, సతీశ్ మాదిగ ధ్వజమెత్తారు. పదేళ్ల పాటు నియంతలా పాలించిన ఆయన.. 130 ఏళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్‌కు పరిపాలించడం చేతగాదని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అమెరికాలో ప్రభాకర్‌రావును హరీశ్‌రావు కలిసినట్లుగా ఆధారాలున్నాయని, దానికి సంబంధించిన ఫొటోలు బయటపెడితే ఆయన రాజకీయ సన్యాసం తీసుకుంటారా అని సవాల్ విసిరారు.

గల్ఫ్‌లో ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

గల్ఫ్ దేశాల్లో ఉంటున్న తెలంగాణ ప్రవాసీలు రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నారు. ఆదివారం పలు ప్రాంతాల్లో మొదలైన ఉత్సవాలు మరో రెండు వారాల వరకు కొనసాగనున్నాయి. అబూధాబీ, బహ్రెయిన్‌లో ఆదివారం వేడుకలను వైభవంగా నిర్వహించారు. అబూధాబీలోని తెలంగాణ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రాజ శ్రీనివాసరావు మాట్లాడారు. తెలంగాణ ఒక రాష్ట్రం మాత్రమే కాదని.. అది ఒక స్ఫూర్తి అని వ్యాఖ్యానించారు. ఉద్యమ కాలంలో గల్ఫ్‌లోని ప్రవాసీలు నిర్వహించిన పాత్రను గుర్తు చేశారు. తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ తరఫున బహ్రెయిన్‌లో రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ కళా సమితి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. త్వరలోనే వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహిస్తామని సమితి అధ్యక్షుడు హరిబాబు తెలిపారు.

కే-సెట్ ఫలితాల్లో నారాయణ ప్రభంజనం

హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన కే-సెట్ పరీక్షలో తమ సంస్థ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్లు సింధూర, శరణిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కే-సెట్‌లో తమ విద్యార్థులు 1,2,3,4,6,7,9,10 వంటి ర్యాంకులతో సత్తా చాటారని చెప్పారు. 10లోపు ర్యాంకులు 19 వచ్చాయని, 100 లోపు ర్యాంకులు 92 వచ్చాయని వెల్లడించారు. అలాగే, వివిధ కేటగిరీల్లో రెండు విభాగాల్లో 1,000 లోపు 399 ర్యాంకులను సాధించినట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాలతో పాటు, కర్ణాటకలోనూ తమ విజయ ప్రస్థానం కొనసాగుతోందని సింధూ, శరణి పేర్కొన్నారు.

15లోగా కొత్త వీసీలు

మూడు రోజుల్లో సెర్చ్ కమిటీ సమావేశాలు

6 లేదా 7 నుంచి బడిబాట కార్యక్రమం

విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం వెల్లడి

హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాలకు కొత్త ఉపకులపతులను ఈ నెల 15లోగా నియమిస్తామని విద్యా శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం చెప్పారు. 3 రోజుల్లో సెర్చ్ కమిటీల సమావేశాలను పూర్తిచేసి, కొత్త వీసీల నియామక ప్రక్రియను చేపడతామని వెల్లడించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొత్త వీసీల నియామకంపై ఇప్పటికే కొంత కసరత్తు జరిగిందని.. మూడు రోజుల్లో సెర్చ్ కమిటీ సమావేశాలను పూర్తిచేస్తామని తెలిపారు. అనంతరం ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపిస్తామన్నారు. అలాగే.. విద్యార్థులను పెద్ద ఎత్తున ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించడమే లక్ష్యంగా 6 లేదా 7వ తేదీ నుంచి రాష్ట్రంలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని వెంకటేశం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం వల్ల కలిగే ప్రయోజనాలపై విస్తృత ప్రచారాన్ని నిర్వహిస్తామన్నారు. సర్కారు బడుల్లో చదివితే ఫీజుల భారం ఉండదని, పౌష్టిక ఆహారం లభిస్తుందని, ట్రిపుల్ ఐటీ వంటి సంస్థల్లో సీట్లను పొందవచ్చని, ఉచితంగా పుస్తకాలు, యూనిఫామ్‌లను పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. ఇక.. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను త్వరలోనే చేపడతామని ఆయన వెల్లడించారు. ఇప్పటికే రాష్ట్రంలో 1.20 లక్షల మంది టీచర్లు పనిచేస్తున్నారని.. త్వరలోనే డీఎస్సీ ద్వారా మరో 11 వేల మంది కొత్త ఉపాధ్యాయులు వస్తారని, వీరే కాకుండా 2008 డీఎస్సీ ద్వారా మరో మూడు వేల మంది వరకూ అందుబాటులోకి వస్తారని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వ స్కూళ్లలో 19 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉండాల్సిన ఉపాధ్యాయ పోస్టుల నిష్పత్తి కంటే మెరుగ్గానే టీచర్లు ఉన్నారని గుర్తు చేశారు. ఉపాధ్యాయులతో పాటు ప్రతి ఉద్యోగికీ హాజరు విధానాన్ని అమలు చేసే ఆలోచన ప్రభుత్వానికి ఉందని పేర్కొన్నారు. మంత్రులు, ముఖ్యమంత్రి వంటి వారికి కూడా హాజరు పద్ధతిని ప్రవేశపెట్టే ఆలోచన ప్రభుత్వానికి ఉందన్నారు.

ఫీజుల నియంత్రణపై..

నార్మలైజేషన్ లేకుండా టెట్ పరీక్షల ఫలితాలను వెల్లడించాలనే ఆలోచన ఉందని వెంకటేశం తెలిపారు. అలాగే.. కేంద్రం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యావిధానం(ఎన్‌ఈపీ)పైన కూడా తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. దీనిపై ఇంకా నిర్ణయం తీసుకోని ఏడు రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఉందని వెల్లడించారు. ఇక.. స్కూళ్లలో ఫీజుల నియంత్రణ అంశాన్ని క్యాబినెట్ సబ్ కమిటీ పరిశీలిస్తుందని చెప్పారు. ఈ విషయమై ఇప్పటికే ఒక నివేదికను సబ్ కమిటీకి అందించామని, దీనిపై కమిటీ చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. క్యాబినెట్ సబ్ కమిటీ ఇచ్చే సూచనల ఆధారంగా ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉందన్నారు.

తీర్పుకు వేళాయె

లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అంతా సంసిద్ధం



ఓయూ ప్రాంగణంలో కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

తొలి అరగంట పోస్టల్ బ్యాలెట్లు.. తర్వాత ఈవీఎంలు

హైదరాబాద్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): హమ్మయ్య.. సుదీర్ఘంగా సాగిన అంకానికి శుభం కార్డు పడనుంది. ఓటర్ల మనసు గెలుచుకున్నదెవరో మరికొద్ది గంటల్లో తేలిపోనుంది. మంగళవారం లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. మే 13న రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాలకు జరిగిన పోలింగ్‌లో ప్రజల తీర్పేమిటో స్పష్టం కానుంది. ఈ మేరకు ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. అన్ని లోక్‌సభ నియోజకవర్గ కేంద్రాల్లో కౌంటింగ్ సెంటర్లు నెలకొల్పింది. ఓటర్ల సంఖ్య, ఈవీఎం యూనిట్ల ఆధారంగా హైదరాబాద్‌లోనే ఏడు చోట్ల లెక్కింపు జరగనుంది. సికింద్రాబాద్‌కు సంబంధించి ఆరుచోట్ల, ఆదిలాబాద్, మల్కాజిగిరిలకు మూడు చోట్ల, మెదక్, పెద్దపల్లి నియోజకవర్గాలకు రెండేసి చోట్ల లెక్కింపు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, భువనగిరి, నల్లగొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, చేవెళ్ల, జహీరాబాద్, కరీంనగర్‌లకు ఒక్కోచోట కౌంటింగ్ జరగనుంది. పోస్టల్ బ్యాలెట్ల కోసం 19 హాళ్లు, ఈవీఎంల ఓట్ల లెక్కింపునకు 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒక్కొక్కటి చొప్పున, చేవెళ్ల పార్లమెంటు స్థానంలోని మహేశ్వరంలో రెండు హాళ్లు 120 కలుపుకొని మొత్తం 139 హాళ్లు, 1,855 టేబుళ్లను సిద్ధం చేశారు. భద్రతా బలగాల పహారాలో.. లెక్కింపు కేంద్రాల పరిసరాల్లో 100 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలుకానుంది.

కాగా, రాష్ట్రంలో పోస్టల్ బ్యాలెట్‌తో కలిపి 66.3 శాతం పోలింగ్ నమోదైంది. 3,32,16,348 మంది ఓటర్లకు గాను 2,20,24,806 మంది ఈవీఎంల ద్వారా, 2,10,771 మంది పోస్టల్ బ్యాలెట్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపునూ మంగళవారమే చేపట్టనున్నారు. నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు బుధవారం మొదలుకానుంది.

తొలి రౌండ్ ఫలితం 9.30కు..

ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదలుకానుంది. తొలి అరగంటలో పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఉంటుంది. తర్వాత ఈవీఎంలు తెరుస్తారు. మొదటి రౌండ్ ఫలితం వెలువడేందుకు గంటరన్నర సమయం పట్టనుంది. ఈవీఎంలను టేబుళ్లపైకి చేర్చడం, లెక్కించడం, సరిపోల్చుకోవడం, రిటర్నింగ్ అధికారి నిర్ధారించుకుని ప్రకటించడం వంటి ప్రక్రియలే దీనికి కారణం. ఈ నేపథ్యంలో తొలి రౌండ్ ఫలితం 9.30 వరకు వెలువడనుంది. అనంతరం ఒక్కో రౌండ్‌కు 20 నిమిషాల సమయం పట్టే అవకాశముంది. సాయంత్రం 4 గంటల్లోపు పూర్తి ఫలితాలు వస్తాయని ఎన్నికల అధికారులు చెబుతున్నారు.

మొదటి ఫలితం నిజామాబాద్!

లోక్‌సభ ఎన్నికల్లో మొదటి ఫలితం మధ్యాహ్నం ఒంటి గంటకు రానుంది. 15 రౌండ్లలో లెక్కింపు పూర్తయ్యే నిజామాబాద్ నియోజకవర్గం విజేత ఎవరో తొలుత తేలనుంది. 24 రౌండ్ల వంతున లెక్కింపు జరిగే కరీంనగర్, నల్లగొండ, హైదరాబాద్ ఫలితాలు ఆఖరున రానున్నాయి. చాలా లోక్‌సభ స్థానాల ఓట్ల లెక్కింపు 18 నుంచి 21 రౌండ్లలో పూర్తికానుంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని ఐదు పోలింగ్ స్టేషన్లను ఎంపిక చేసి, వీవీప్యాట్ స్లిప్పులను లెక్కిస్తారు. వీటిని, ఈవీఎంలలోని ఓట్లతో సరిపోల్చుకుంటారు. ప్రతి రౌండ్ ఫలితానికి సంబంధించి రాజకీయ పార్టీల ఏజెంట్లు ఫామ్ '17సీ'పై సంతకం చేయాల్సి ఉంటుంది. అనంతరం రిటర్నింగ్ అధికారి సంతకం చేస్తారు. తర్వాత కేంద్ర ఎన్నికల పరిశీలకుడు ఫలితాన్ని ప్రకటిస్తారు.

నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపు రౌండ్ల వివరాలు..

ఆదిలాబాద్, జహీరాబాద్, మెదక్, చేవెళ్ల, భువనగిరి- 23, నాగర్‌కర్నూల్, మహబూబాబాద్-22, పెద్దపల్లి, మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, ఖమ్మం-21, సికింద్రాబాద్-20, వరంగల్-18.

సవాళ్ల నడుమ రాజకీయాన్ని మార్చనున్న ఫలితాలు

ప్రధాని మోదీ సుడిగాలి పర్యటనలు.. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పలుసార్లు రాక.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్రతో రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా జరిగాయి. ఈ క్రమంలో ఫలితాలు అన్ని ప్రధాన పార్టీలకు ఎంతో కీలకం. వీటిని బట్టి భవిష్యత్ పరిణామాలుంటాయని విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో అందరిలోనూ ఆసక్తి నెలకొంది. కచ్చితంగా రెండంకెల సంఖ్యలో సీట్లు సాధిస్తామని అధికార కాంగ్రెస్ ఎంతో ధీమాగా ఉంది. ఫలితాలు తమ వంద రోజుల పాలనకు రెఫరెండమని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ప్రధాని మోదీ కరిష్మానే నమ్ముకున్న బీజేపీ పదికి పైగా సీట్లు సాధిస్తామన్న ఆత్మవిశ్వాసం వ్యక్తం చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయంతో డీలాపడిన బీఆర్‌ఎస్ సైతం మెరుగైన సంఖ్యలో స్థానాలు సాధిస్తామని గట్టిగా చెబుతోంది. కాగా, ఈ లోక్‌సభ ఎన్నికలు రాష్ట్రంలో రాజకీయ సవాళ్లకు వేదికయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ ఎప్పుడు చేస్తారో చెప్పాలని బీఆర్‌ఎస్ డిమాండ్ చేసింది. ఆగస్టు 15 నాటికి చేసి తీరతామని సీఎం రేవంత్ ప్రకటించారు. అదే జరిగితే తాను రాజీనామా చేస్తానని బీఆర్‌ఎస్ నేత హరీశ్ సవాల్ విసిరారు.

ఏపీలోనూ..

ఏపీలోనూ కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. రాష్ట్రమంతా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది. మే 13 తేదీన ఈవీఎంల్లోకి చేరిన జనం తీర్పు మంగళవారం విడుదల కానుంది. ఏడు దశల్లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో, నాలుగో విడతలో రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు జరిగాయి. రాష్ట్ర ఎన్నికల చరిత్రలోనే రికార్డు స్థాయిలో అత్యధికంగా 81.86 శాతం పోలింగ్ జరిగింది. ఇందులో ఈవీఎంల ద్వారా 80.66 శాతం, పోస్టల్ బ్యాలెట్‌తో 1.2 శాతం పోలింగ్ నమోదైంది. మంగళవారం జరిగే కౌంటింగ్ కోసం పూర్తి ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా వెల్లడించారు.

రాష్ట్రంలో డబుల్ డిజిట్ పక్కా

లోక్‌సభ సీట్ల గెలుపుపై కమలనాథుల ధీమా

హైదరాబాద్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో తెలంగాణలో డబుల్ డిజిట్ స్థానాలు సాధించడం పక్కా అని కమలనాథులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ప్రధాని మోదీ హవా స్పష్టంగా కనిపించిందని పేర్కొంటున్నారు. దీంతో పాటు పార్టీ సంస్థాగతంగా బలోపేతం కావడంతో ఓటు బ్యాంకు గణనీయంగా పెరిగిందని భావిస్తున్నారు. "సాధారణంగా పదేళ్లు అధికారంలో ఉన్నపార్టీపై కొంత వ్యతిరేకత వస్తుంది. కానీ, మోదీ ప్రభుత్వంపై వ్యతిరేకత బదులు సానుకూలత పెరిగింది. అందువల్ల 30-35 శాతం ఓటింగ్ మాకు అనుకూలంగా జరిగినట్లు అంచనా వేస్తున్నాం. ఐదేళ్ల కిందట జరిగిన ఎంపీ ఎన్నికల్లో బీజేపీ 19.6 శాతం ఓట్లు దక్కించుకోగా, ఆరు నెలల కిందట జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ 14 శాతం ఓట్లు కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ పాలన పట్ల యువత, మహిళలు, విద్యావంతులు గణనీయంగా ఆకర్షితులైనట్లు భావిస్తున్నాం. ఫలితంగా ఓటింగ్ శాతం కూడా పెరిగిందని అనుకుంటున్నాం. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నవారంతా కాంగ్రెస్‌ను ప్రత్యామ్నాయంగా భావించి ఆ పార్టీకి ఓటేశారు. కానీ, ఇప్పుడు పరిస్థితి వేరు. ప్రధానిగా మోదీకి ప్రత్యామ్నాయం అటు కాంగ్రెస్‌గానీ, ఇటు బీఆర్‌ఎస్‌గానీ కాదని రాష్ట్ర ప్రజలు భావించారు. అందుకే ఏకపక్షంగా మాకు ఓటు వేశారని భావిస్తున్నాం." అని బీజేపీ నేతలు విశ్లేషిస్తున్నారు.

కాంగ్రెస్ కంటే మాకే ఎక్కువ సీట్లు: లక్ష్మణ్

ఎంపీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ డబుల్ డిజిట్ సీట్లు ఖాయమని ఎంపీ లక్ష్మణ్ అన్నారు. కాంగ్రెస్ కంటే తమకే ఎక్కువ సీట్లు రాబోతున్నాయని చెప్పారు. పార్టీ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌తో కలిసి లక్ష్మణ్.. సమీక్ష నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆగస్టు సంక్షోభం తప్పకపోవచ్చని అన్నారు. ఈ ఎన్నికలు తమ పాలనకు రెఫరెండం అంటూ చేసిన ప్రకటనకు రేవంత్ కట్టుబడి ఉండాలన్నారు.

కోడ్ ఉల్లంఘన కేసులో.. అమిత్ షా, కిషన్‌రెడ్డి పేర్ల తొలగింపు

లోక్‌సభ ఎన్నికల వేళ నమోదైన కేసులో కేంద్ర మంత్రులు అమిత్ షా, కిషన్ రెడ్డి పేర్లను హైదరాబాద్ పోలీసులు తొలగించారు. హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీలతకు మద్దతుగా మే 1న పాతబస్తీలో నిర్వహించిన సభలో అమిత్ షా తదితరులు పాల్గొన్నారు. ఈ ఎన్నికల ప్రచారంలో చిన్న పిల్లలను భాగస్వాములను చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ నిరంజన్‌రెడ్డి ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎన్నికల సంఘం.. విచారణ జరపాలని హైదరాబాద్ సీపీని ఆదేశించింది. దీంతో మొఘల్‌పురా పోలీసులు అమిత్ షా, కిషన్‌రెడ్డి, మాధవీలత, ఎమ్మెల్యే రాజాసింగ్‌తోపాటు మరికొందరిపై కేసు పెట్టారు. కొద్ది రోజుల క్రితం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసిన పోలీసులు ఈ కేసు నుంచి అమిత్ షా, కిషన్‌రెడ్డి పేర్లను తొలగించినట్లు వెల్లడించారు.

అత్యధిక స్థానాలు మావే!

రాష్ట్రంలో మెజారిటీ సీట్లు గెలుస్తామంటున్న కాంగ్రెస్.. మైనారిటీలు తమకే మద్దతుగా నిలిచారని అంచనా

- బీజేపీకి బీఆర్‌ఎస్ ఓట్లబదిలీపై అస్పష్టత
- గట్టిపోటీ ఉన్నచోట్ల బదిలీతో ఇబ్బందేనన్న అభిప్రాయం
- కౌంటింగ్ లో అప్రమత్తంగా ఉండాలి
- కాంగ్రెస్ అభ్యర్థులతో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఎగ్జిట్ పోల్ నివేదికలు ఎలా ఉన్నా.. రాష్ట్రంలోని లోక్‌సభ నియోజకవర్గాల్లో మెజారిటీ సీట్లను కాంగ్రెస్సే దక్కించుకుంటుందని ఆ పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. తెలంగాణలో 14 శాతంగా ఉన్న మైనారిటీ ఓటర్లలో అత్యధికులు కాంగ్రెస్ అభ్యర్థులకే మద్దతుగా నిలిచారని చెబుతున్నాయి. ఒకటి, రెండు శాతం ఓట్లే గెలుపోటములను నిర్ణయించే పరిస్థితులున్న నేపథ్యంలో మైనారిటీ ఓటర్ల మద్దతు తమకు సానుకూలాంశమని అంటున్నాయి. తమ ప్రభుత్వం అమలు చేసిన ఐదు గ్యారెంటీలతో మహిళలకు కూడా తమకే మద్దతు తెలిపారని పేర్కొంటున్నాయి. కాంగ్రెస్‌కు 9 నుంచి 12 సీట్లు వస్తాయని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా, ఈ ఎన్నికల్లో బీజేపీకి ఓటింగ్ శాతం పెరిగే అవకాశం ఉందని, కానీ.. ఆ పార్టీ అభ్యర్థులను గెలిపించే స్థాయిలో మాత్రం పెరగదని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. అయితే రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్‌ఎస్ ఓట్లు ఏ మేరకు చీలాయన్న దానిపైనే కాంగ్రెస్ పెద్దలు పూర్తిగా అంచనాకు రాలేకపోతున్నారు. కాంగ్రెస్‌కు బీజేపీ పోటీ ఇస్తున్న నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ ఓట్లు పెద్ద ఎత్తున ఆ పార్టీకి మళ్లాయన్న అంచనాలే వారిని కలవరపెడుతున్నాయి. బీఆర్‌ఎస్ ఓట్లు చీలితే బీజేపీకి ప్రయోజనం కలుగుతుందన్న విషయాన్ని గ్రహించే.. త్రిముఖ పోటీ ఉండేలా సీఎం రేవంత్‌రెడ్డి మొదటినుంచీ తన ప్రచారంలో కేసీఆర్‌ను, ఆ పార్టీని టార్గెట్ చేసుకుని మాట్లాడారని కాంగ్రెస్ నేతలు అంటున్నారు.

బీజేపీకి బీఆర్‌ఎస్ ఓట్ల బదిలీ తక్కువే!

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో బీఆర్‌ఎస్ శ్రేణులు నిరాశలో కూరుకుపోవడం, పార్టీ ఉనికే ప్రమాదంలో పడే పరిస్థితి రావడంతో కేసీఆర్ సైతం విస్తృతంగా ప్రచారంలో పాల్గొని ఓటుబ్యాంకును కాపాడుకునే ప్రయత్నం చేశారని కాంగ్రెస్ వర్గాలు గుర్తు చేస్తున్నారు. దీంతో బయట ప్రచారం జరుగుతున్న స్థాయిలో బీఆర్‌ఎస్ ఓటుబ్యాంకు బీజేపీకి బదిలీ కాలేదని వారు అంచనా వేస్తున్నాయి. బీజేపీ గట్టి పోటీ ఇస్తున్న చోట్ల మాత్రం కొంతమేరకు బదిలీ అయిందని అంటున్నారు. కానీ, అలాంటి చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులకు కూడా బీఆర్‌ఎస్ ఓట్లు కొంత మేరకు బదిలీ అయ్యాయంటున్నారు. భావజాలం పరంగా బీజేపీ గెలవడం ఇష్టంలేని బీఆర్‌ఎస్ సానుభూతిపరుల్లో ఈ మేరకు ఓట్ల బదిలీ జరిగిందని అంచనా వేస్తున్నారు. మైనారిటీ ఓటర్ల మద్దతు, రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉండడం, పదేళ్లు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై సహజంగా ఉండే వ్యతిరేకత, ప్రచారం జరిగిన మేరకు బీఆర్‌ఎస్ ఓట్లు చీలే అవకాశం లేకపోవడం వంటి పరిణామాల నేపథ్యంలో రాష్ట్రంలో మెజారిటీ సీట్లను కాంగ్రెస్ పార్టీ దక్కించుకుంటుందన్న అంచనాలో ఉన్నారు. కనీసం 9 సీట్లు, కలిసివస్తే 12 సీట్లు దక్కించుకుంటామని చెబుతున్నారు.

ఇండియా కూటమి గెలుపుపై ఆశలు..!


జాతీయ స్థాయిలో ఇండియా కూటమి గెలుపుపై టీ కాంగ్రెస్ నేతలు ఆశలు పెట్టుకున్నారు. దేశవ్యాప్తంగానూ మైనారిటీలు మద్దతుగా ఉండడం, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ప్రజల్లో సహజంగా ఏర్పడే ప్రభుత్వ వ్యతిరేకత, పాంచ్ న్యాయ్.. పచ్చీస్ గ్యారెంటీలు కలిసివచ్చి ఇండియా కూటమి అధికారంలోకి వస్తే.. తెలంగాణ ప్రభుత్వానికి పెద్ద అండ దొరుకుతుందని చెబుతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మెడపై రైతు రుణమాఫీ పెద్ద భారంగా ఉన్న సంగతి తెలిసిందే. దీనికి తోడు నిరుద్యోగ భృతి, పెన్షన్లు తదితర హామీలూ ఎదురు చూస్తున్నాయి. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్రంపై రైతు రుణమాఫీ భారం తప్పుతుందని చెబుతున్నారు. కూటమి అమలు చేసే పాంచ్ న్యాయ్.. పచ్చీస్ గ్యారెంటీల్లో రైతు రుణమాఫీ సహా రాష్ట్ర ప్రభుత్వానికి భారంగా ఉన్న పలు హామీలు ఉన్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు.

అభ్యర్థులు అప్రమత్తంగా ఉండాలి: రేవంత్

ఓట్ల లెక్కింపు సమయంలో పార్టీ అభ్యర్థులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ప్రత్యేకించి పోటా పోటీ ఉన్న నియోజకవర్గాల్లో ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉండొద్దన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థులు, ఇన్‌చార్జి మంత్రులతో జూమ్ ద్వారా సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి నిబద్ధత ఉన్నవారిని మాత్రమే ఏజెంట్‌గా పంపాలన్నారు. సీనియర్ నాయకులనూ కౌంటింగ్ సెంటర్లకు తీసుకెళ్లాలని, ప్రతి రౌండ్ కౌంటింగ్ విషయంలోనూ జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి ఒక్కరి దగ్గరా 17-సి లిస్టు ఉండేలా చూసుకోవాలని, ఈ లిస్టులోని ఓట్లకు, ఈవీఎం ఓట్లకు తేడా వస్తే అక్కడే ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ కూడా పాల్గొన్నారు.

6 సీట్లపై బీఆర్‌ఎస్ ఆశలు!

- ఎటువంటి ఫలితం వచ్చినా స్వీకరించాలి
- ఓటింగ్ శాతంపైనే దృష్టి పెట్టాలి: కేసీఆర్



హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పాలై అధికారం కోల్పోయిన బీఆర్‌ఎస్.. లోక్‌సభ ఫలితాలపై ఆశలు పెట్టుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా తమ పార్టీ ప్రభావం ఏమాత్రం తగ్గదని, తాము ఆశించిన 12 స్థానాల్లో అంచనాలు కొంత అటు ఇటు అయినా.. ఆరు స్థానాల్లో మాత్రం గెలుపు అవకాశాలు ఉన్నాయని భావిస్తోంది. రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ వైఫల్యాలు, కేంద్రంలోని బీజేపీ తెలంగాణకు ఏమీ చేయడం లేదన్న అంశాలే ప్రధాన ఎజెండాగా బీఆర్‌ఎస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం నిర్వహించింది. అయితే.. పోలింగ్ ముగిసిన తర్వాత ఆయా పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని పార్టీ శ్రేణులు వెల్లడించిన సమాచారం ఆధారంగా.. ఆరు స్థానాల్లో గెలుపుపై ఆశాభావంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఆ పార్టీ వేసుకున్న లెక్కల ప్రకారం మెదక్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, కరీంనగర్, నాగర్‌కర్నూల్, పెద్దపల్లి పార్లమెంటు స్థానాల్లో గెలుస్తామని భావిస్తున్నట్లు తెలిసింది. ఇతర చోట్ల గత ఎన్నికల్లో పార్టీకి ఉన్న ఓటింగ్ శాతం ఏమాత్రం తగ్గదని, ప్రజలు బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా ఓట్లు వేశారని ఆ పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. కాగా జూన్ 2న తెలంగాణ భవన్‌లో నిర్వహించిన దశాబ్ది ఉత్సవ కార్యక్రమంలోనూ కేసీఆర్ లోక్‌సభ ఎన్నికల ఫలితాల గురించి ప్రస్తావిస్తూ.. ఒక్కో సర్వే సంస్థ ఒక్కో రకంగా చెప్పాయని అన్నారు. ఎవరు ఏం చెప్పినా.. ప్రజల తీర్పును శిరసావహించాల్సిందేనని పేర్కొన్నారు. ఆరు సీట్లొచ్చినా.. ఒకటి, రెండు సీట్లకు పరిమితమైనా.. నిరాశకు గురికావద్దని పార్టీ శ్రేణులకు సూచించారు. అదే సమయంలో ఎన్ని స్థానాలు వస్తాయన్నది పక్కన పెట్టి.. తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు ఎంత ఓటింగ్ శాతం అన్న దానిపై దృష్టి పెడదామని అన్నారు.

కట్టెల కోసం వెళ్తే.. మందుపాతర పేలి!

» తండ్రి మృతి.. కుమారుడికి గాయాలు


ఇల్లెందుల ఏసు (ఫైల్)

వాజేడు, జూన్ 3: అడవిలో పోలీసులే లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన మందు పాతరకు.. కట్టెల కోసం వెళ్లిన ఓ వ్యక్తి బలయ్యాడు. ఈ సంఘటన ములుగు జిల్లాలో సోమవారం చోటుచేసుకుంది. వాజేడు మండలంలోని జగన్నాథపురానికి చెందిన ఇల్లెందుల ఏసు (55) తన కుమారుడు రమేశ్, మరో ముగ్గురితో కలిసి కట్టెల కోసమని కొంగాల అటవీ ప్రాంతంలోకి వెళ్లాడు. వారు మూలగండి గుట్ట ఎక్కుతుండగా ఏసు మందుపాతరపై కాలేయడంతో అది పేలి అక్కడికక్కడే మృతి చెందాడు. పక్కనున్న అతడి కుమారుడు రమేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మరో ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. దీనిపై పోలీసులకు సమాచారమిచ్చినా.. మావోయిస్టులు ఇంకా ఏమైనా మందుపాతరలు అమర్చి ఉండొచ్చన్న అనుమానంతో వారు ఘటనా స్థలానికి రాలేదు. కుటుంబ సభ్యులు, స్థానికులే గుట్టపై నుంచి ఏసు మృతదేహాన్ని కిందకు తీసుకొచ్చారు. ఆ ఘటనపై కేసులు నమోదు చేశామని ములుగు ఎస్పీ శబరీశ్ ఓ ప్రకటనలో తెలిపారు. మావోయిస్టులు అమర్చిన మందుపాతరలకు అమాయకులు బలవుతున్నారని.. మావోలకు సహకరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆ అమ్మ వైద్య చికిత్సకు భరోసా!

» బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న పద్మకు తక్షణ వైద్య చికిత్సకు సర్కారు రూ.5లక్షల ఎల్‌వోసీ

» మిగతా వైద్యానికయ్యే సాయంపైనా హామీ

» 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన సీఎంవో


బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఎల్‌వోసీని అందజేస్తున్న సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు

హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతోన్న ఓ నిరుపేద మహిళ దీనావస్థపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'మా అమ్మను ఆదుకోరు' కథనంపై ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించింది. బాధిత మహిళ అనుముల పద్మ కుటుంబసభ్యులను సీఎంవో అధికారులు పిలిచి మాట్లాడారు. తక్షణ వైద్య చికిత్స కోసం రూ.5 లక్షల ఎల్‌వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్)ను పద్మ కుమారుడు రాజుకు సీఎం రేవంత్‌రెడ్డి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు అందజేశారు. పద్మకు మెరుగైన వైద్య చికిత్స కోసం బసవతారకం కేన్సర్ ఆస్పత్రి వైద్యులతో మాట్లాడారు. వైద్య చికిత్సకయ్యే మిగతా వ్యయాన్ని భరించేందుకు యత్నిస్తామని హామీనిచ్చారు. అలాగే ఇప్పటివరకు ఆమె వైద్యానికి అయిన ఖర్చును చీఫ్‌మినిస్టర్ రిలీఫ్ ఫండ్(సీఎంఆర్‌ఎఫ్) ద్వారా వీలైనంత ఎక్కువగా ఇప్పించే ప్రయత్నం చేస్తామని బాధిత కుటుంబసభ్యులకు చెప్పారు. తమ సమస్యను వెలుగులోకి తీసుకొచ్చినందుకు బాధిత కుటుంబం 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపింది.

రాధాకిషన్‌రావుకు ఎస్కార్ట్ బెయిల్

» తల్లి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు కరీంనగర్‌కు..

హైదరాబాద్/చిలుపూర్/సైదాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ (ఓఎస్డీ) పొట్లపల్లి రాధాకిషన్‌రావుకు నాంపల్లి కోర్టు ఎస్కార్ట్ బెయిల్ మంజూరు చేసింది. తన తల్లి సరోజినీ దేవి (98) సోమవారం మృతిచెందడంతో ఆమె అంత్యక్రియలకు హాజరయ్యేందుకు అనుమతించాలని రాధాకిషన్‌రావు సోమవారం కోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలు చేశారు. విచారణ అనంతరం కోర్టు ఆయనకు సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు ఎస్కార్ట్ బెయిల్ మంజూరు చేసింది. దాంతో చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న ఆయనను పోలీసులు బందోబస్తు మధ్య ప్రత్యేక వాహనంలో కరీంనగర్‌కు తీసుకెళ్లారు. కాగా, వయోభారం, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న సరోజినీ దేవి కొంతకాలంగా కరీంనగర్‌లో కుమార్తె వద్ద ఉంటున్నారు. పరిస్థితి విషమించడంతో సోమవారం ఉదయం మృతిచెందారు. ఆమె అంత్యక్రియలు స్వగ్రామం జనగామ జిల్లా చిలుపూర్ మండలం పల్లగుట్టలో నిర్వహించనున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తల్లిని చూసేందుకు అనుమతించాలని రాధాకిషన్‌రావు కోరడంతో ఏప్రిల్‌లో కోర్టు ఆయనకు 4 గంటల ప్రత్యేక అనుమతి మంజూరు చేసింది. ఏప్రిల్ 21న ఆయన తల్లిని చూసివచ్చారు.

కవిత కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జ్యుడిషియల్ కస్టడీని న్యాయస్థానం మరోసారి పొడిగించింది. సోమవారం ఆమెను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచారు. తొలుత ఈడీ కేసులో విచారణ జరిగింది. జూలై 3న కవితను కోర్టు ముందు హాజరు పరచాలని న్యాయమూర్తి కావేరి బవేజా స్పష్టం చేశారు. సీబీఐ కేసులో మాత్రం మధ్యాహ్నం 2 గంటలకు విచారణ చేపడతామని తెలిపారు. కాగా, కవితను కలిసేందుకు భర్త అనిల్‌తోపాటు ఇద్దరు కుమారులకు అవకాశం కల్పించాలని ఆమె న్యాయవాది నితేష్ రాణా కోరారు. ఇద్దరు కుమారులు మైనర్లేనా? అని న్యాయమూర్తి ప్రశ్నించారు. పెద్దబ్బాయి మేజర్ అని, చిన్న కుమారుడు మైనర్ అని న్యాయవాది బదులివ్వగా, కవితను కలిసేందుకు జడ్జి అంగీకరించారు. ఆ తర్వాత కవితతో భర్త, కుమారులు కొద్దిసేపు ముచ్చటించారు. సీబీఐ కేసులో మధ్యాహ్నం 2 గంటల తర్వాత కోర్టులో విచారణ జరిగింది. ఈ నెల 7 వరకు జ్యుడీషియల్ కస్టడీని పొడిగిస్తున్నట్లు జడ్జి చెప్పారు. కోర్టు హాలులోకి వచ్చే ముందు కవిత 'జై భారత్.. జై తెలంగాణ' అంటూ నినాదాలు ఇచ్చారు.

మంత్రి తుమ్మలను కలిసిన కమ్మ సేవా సంఘాల అధ్యక్షుడు బొడ్డు రవి శంకర్

దుండిగల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర కమ్మ వారి సేవా సంఘాల సమాఖ్య అధ్యక్షుడు బొడ్డు రవి శంకర్‌రావు సోమవారం రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. రాజకీయాలకు అతీతంగా అధ్యక్షుడిగా సంఘం అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేయాలని ఈ సందర్భంగా రవి శంకర్‌రావుకు మంత్రి సూచించారు. త్వరలోనే వివిధ పార్టీల్లోని పెద్దలందరినీ, వివిధ రంగాల్లోని ప్రముఖులను కలిసి సామాజిక వర్గాల అభివృద్ధికి సహకారం అందించమని కోరుతామని బొడ్డు రవి శంకర్‌రావు అన్నారు. గతనెల 19న అమీర్‌పేట్‌లోని కమ్మ సంఘం కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో తెలంగాణ కమ్మ సేవా సంఘాల సమాఖ్య అధ్యక్షుడిగా బొడ్డు రవి శంకర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎన్నికల తనిఖీల్లో రూ. 200 కోట్ల విలువైన నగదు, మద్యం పట్టివేత

హైదరాబాద్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికల తనిఖీల్లో రూ. 200 కోట్లు విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులు పట్టుకున్నట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో మే 13న జరిగిన ఎన్నికలకు సంబంధించి మార్చి 16 నుంచి ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. కోడ్ అమల్లోకి వచ్చాక 466 ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను, 89 సరిహద్దు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 16 నుంచి జూన్ 3 వరకు రూ. 99.16 కోట్ల నగదు, రూ. 11.48 కోట్లు విలువైన మద్యం, రూ. 14.52 కోట్లు విలువైన మత్తు పదార్థాలు, రూ. 63 కోట్లకుపైగా విలువైన బంగారం, వెండి, సుమారు రూ. 12 కోట్లు విలువైన ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు నోడల్ అధికారిగా ఉన్న అదనపు డీజీపీ మహేష్ భగవత్ తెలిపారు. అలాగే 7,272 లైసెన్సు కలిగిన ఆయుధాలు, 20 లైసెన్సు లేని ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా, 2019 పార్లమెంట్ ఎన్నికల తనిఖీల్లో రూ. 46.3 కోట్ల విలువ మేర నగదు, వస్తువులు స్వాధీనం చేసుకోగా ఈసారి అత్యధికంగా రూ. 200 కోట్లు విలువైన డబ్బు, వస్తువులు పట్టుబడ్డాయి.

సచివాలయంలో వాస్తు మార్పులు!

(మొదటి పేజీ తరువాయి)



వైపు మసీదు, చర్చి ఉండడం, అయా మతాల వారు అక్కడ నిత్యం ప్రార్థనలు చేస్తుండడంతో.. ముఖ్యమంత్రి ఆ గేటు నుంచి లోపలికి వచ్చేందుకు భద్రత పరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఈశాన్య గేటు నుంచి అయితేనే ఎలాంటి ఇబ్బంది లేకుండా రాకపోకలకు అవకాశం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమైనట్లు సమాచారం. ఈ మేరకు ఈశాన్య గేటు నుంచి రాకపోకలు జరిపితే ట్రాఫిక్ సహా ఇతర పరిస్థితులు ఎలా ఉంటాయనే దానిపై సెక్రటేరియట్ సెక్యూరిటీ టీమ్ అంచనాలు వేసినట్లు తెలిసింది. మరోవైపు సీఎం సచివాలయంలోకి (సెక్రటేరియట్ లోపలి ఎంట్రీ పాయింట్, బాహుబలి తలుపుల కింది భాగం) వచ్చే మార్గంలో ఉన్న సింగిల్ గేటు స్థానంతోపాటు, మసీదు, చర్చి వైపు వెళ్లేందుకు ఉన్న సింగిల్ గేటు స్థానంలోనూ ఐరన్ డబుల్ గ్రిల్ గేట్లను అమర్చారు. దీంతో సీఎం రాకపోకలు, వాస్తు మార్పులో భాగంగానే ముందుగా ఆ గేట్లను మార్చారనే చర్చ జరుగుతోంది.

ఐఏఎస్, ఐపీఎస్‌ల గేట్లూ మార్పు..

ఐఏఎస్, ఐపీఎస్‌లు సౌత్ ఈస్ట్ గేటు (ఆగ్నేయం, గేట్ నంబర్ 2) నుంచి సచివాలయంలోకి రానున్నారు. సీఎం ఎంట్రీ, ఎగ్జిట్‌లు నార్త్‌ఈస్ట్ గేటు నుంచి జరిగితే.. అధికారులకు ఆ మార్గం ద్వారా వెళ్లేందుకు అవకాశం ఉండదు. ఒకవేళ సీఎం రాకపోకల గేట్లు మారితే.. అధికారులు వచ్చివెళ్లే గేట్లు కూడా మారనున్నాయి. కాగా, ఇప్పటివరకు ముఖ్యమంత్రి సచివాలయంలోకి వచ్చివెళ్లే ప్రధాన ద్వారం (ఈస్ట్ గేట్ నెంబర్ 1, అమరుల స్మారక స్థూపం వైపు ఉన్న గేటు) ద్వారా రాకపోకలు సాగించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కూడా తన మార్గాన్ని మార్చుకోనున్నారు. ఇందులో భాగంగానే సోమవారం ఆమె ఈశాన్య గేటు నుంచే సెక్రటే రియట్‌లోకి వచ్చి, అదే గేటు నుంచి బయటకు వెళ్లారు. సీఎం వచ్చివెళ్లే మార్గాల గుండానే రాకపోకలు సాగించిన సీఎస్ సోమవారం ఈశాన్య గేటు నుంచి వచ్చి, వెళ్లడంతో.. ముఖ్యమంత్రి రాకపోకలు కూడా ఈశాన్య గేటు నుంచే ఉండనున్నట్లు తెలుస్తోంది. ఇక మంత్రులు, ఎమ్మెల్యేలు ఏ గేటు నుంచి వచ్చి వెళతారనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. అయితే సీఎం రాకపోకలకు సంబంధించి గేట్ల విషయంపై ఇంకా సాధారణ పరిపాలన విభాగం నుంచి సెక్రటేరియట్ సెక్యూరిటీ టీమ్‌కు ఎలాంటి ఆదేశాలు రాలేదని సమాచారం.

సీఎం కార్యాలయం.. ఆరు నుంచి తొమ్మిదికి.!

సచివాలయంలో ముఖ్యమంత్రి కార్యాలయం కూడా మారనుందనే ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం సచివాలయంలోని ఆరో అంతస్తులో ఉన్న సీఎం కార్యాలయం త్వరలో 9వ అంతస్తులోకి మారుతుందంటున్నారు. ఈ మేరకు ఇంటీరియర్, ఫర్నీచర్ కోసం పలువురు నిపుణులు తొమ్మిదో అంతస్తును ఇప్పటికే పరిశీలించినట్లు సమాచారం. నిజానికి ముఖ్యమంత్రిగా రేవంత్ ప్రమాణం చేసిన తర్వాత కొద్దిరోజులకే సీఎం కార్యాలయం తొమ్మిదో అంతస్తుకు మారనుందనే ప్రచారం జరిగింది. కానీ అలా ఏమీ జరగలేదు. మళ్లీ ఇప్పుడు సచివాలయంలో వాస్తు మార్పులు చోటుచేసుకోబోతున్నాయనే అంశం తెరపైకి వచ్చిన నేపథ్యంలో సీఎం కార్యాలయం మార్పు చర్చ జరుగుతోంది. వాస్తవానికి సచివాలయ భవనం నిర్మాణం 11 అంతస్తుల్లో జరిగింది. అందులో 6 అంతస్తుల వరకు మాత్రమే బయటకు కనిపిస్తున్నప్పటికీ.. డోమ్‌ల కింద కూడా కొన్ని ఫ్లోర్‌లు ఉన్నాయి. అయితే గత సీఎం 6 అంకెను తన అదృష్ట సంఖ్యగా విశ్వసించేవారు. అందుకే తన కార్యాలయాన్ని కూడా 6వ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసుకున్నారనే ప్రచారం జరిగింది. ప్రస్తుత సీఎం రేవంత్ 9 అంకెను అదృష్ట సంఖ్యగా విశ్వసిస్తారు. ఆయన వినియోగించే కార్ల నెంబర్లు కూడా 9 అంకెతోనే ఉంటాయి. ఈ నేపథ్యంలోనే ఆయన సచివాలయంలో తన కార్యాలయాన్ని 9వ ఫ్లోర్‌కు మార్చుకుంటున్నారని అంటున్నారు.

వాస్తు మార్పు.. ఇదీ చర్చ.!

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన సచివాలయాన్ని ప్రముఖ వాస్తు నిపుణులు పరిశీలించి, ఖరారు చేసిన తరువాతే నిర్మాణం చేపట్టారు. పైగా అప్పటి సీఎం కేసీఆర్ కూడా వాస్తుకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చేవారు. అయినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం వాస్తు మార్పులు ఎందుకు చేయాల్సి వచ్చిందన్నది చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలోనే పలు అంశాలు తెరపైకి వస్తున్నాయి. ముఖ్యంగా పాత సచివాలయం కూల్చివేతకు ముందువరకు ఉన్న 'నల్లపోచమ్మ' గుడిని కొత్త సచివాలయ నిర్మాణం పూర్తయిన తరువాత భవనం వెనుక భాగంలో ఉంచారని, ఇది సరైంది కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా.. సెక్రటేరియట్ కంటే కొంత కిందికి గుడి ఉందని, అలా ఉండడం అంత శ్రేయస్కరం కాదనే అభిప్రాయాలున్నాయి. దీంతోపాటు తూర్పు వైపున ఉన్న ప్రధాన ద్వారం కూడా సచివాలయం నిర్మాణం సమయంలో సూచించిన విధంగా వాస్తు ప్రకారం లేదనే చర్చ జరుగుతోంది. మొత్తంగా ఈ రెండు అంశాల నేపథ్యంలో ప్రస్తుతం సచివాలయానికి సీఎం వచ్చి, వెళ్లే రాకపోకలను మారుస్తున్నట్టు తెలుస్తోంది.

అమెరికాలో హైదరాబాద్ విద్యార్థిని అదృశ్యం

» వారం రోజులుగా తెలియని ఆచూకీ

» గత నెలలో మరో తెలంగాణ విద్యార్థి కూడా

» అంతకుముందు హైదరాబాద్ వాసి మృతి

» వరుస సంఘటనలతో కలకలం


కందుల నితీశ (ఫైల్)

హైదరాబాద్ సిటీ, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన తెలంగాణకు చెందిన మరో విద్యార్థిని అదృశ్యమైంది. కాలిఫోర్నియాలో రాష్ట్రంలో చదువుకుంటున్న హైదరాబాద్‌కు చెందిన కందుల నితీష (23) వారం రోజుల నుంచి కనిపించడం లేదు. ఆమె ఆచూకీ తెలుసుకునేందుకు అక్కడి పోలీసులు 'ఎక్స్' వేదికగా స్థానికుల సాయం కోరారు. పోలీసుల కథనం ప్రకారం.. కాలిఫోర్నియా స్టేట్ యూనివర్సిటీ, శాన్ బెర్నార్డినో (సీఎస్‌యూఎస్‌బీ) విద్యార్థిని నితీష గత నెల 28వ తేదీ నుంచి కనిపించడం లేదు. ఆమె చివరిసారిగా లాస్‌ఏంజెల్స్‌లో కనిపించింది. ఆమె అదృశ్యమైనట్టు 30న ఫిర్యాదు అందింది. కాలిఫోర్నియా నంబర్ ప్లేట్ ఉన్న టొయోటా కరోలా కారులో ఆమె స్వయంగా నడుపుతూ వెళ్లినట్టు తమ దృష్టికి వచ్చిందని పోలీసులు తెలిపారు. ఆమె గురించి సమాచారం తెలిస్తే తమకు తెలియజేయాలని స్థానికులను కోరారు. కాగా, అమెరికాలో ఇటీవల ఈ తరహా వరుస ఘటనలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. గత నెలలోనే తెలంగాణకు చెందిన విద్యార్థి రూపేశ్ చంద్ర చింతకింది (26) షికాగోలో అదృశ్యమయ్యాడు. అంతకుముందు మార్చిలో హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ అరాఫత్ కనిపించకుండాపోయాడు. అనంతరం క్లీవ్‌లాండ్‌లో అతడి మృతదేహాన్ని గుర్తించారు. దేశంలోని ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు, ఐటీ నిపుణులు కూడా ప్రమాదాల్లో చిక్కుకున్న సంఘటనలు ఉన్నాయి.

రూ.99,200 లంచం.. ఏసీబీకి చిక్కిన సూర్యాపేట సబ్‌రిజిస్ట్రార్


సబ్-రిజిస్ట్రార్ సురేందర్‌నాయక్

» గజానికి రూ.100 చొప్పున డిమాండ్

» రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ

» ఏసీబీ వలలో పరిశ్రమల శాఖ ఏడీ

సూర్యాపేటటౌన్/మేడ్చల్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్లాట్ రిజిస్ట్రేషన్‌కు గజానికి రూ.100 చొప్పున మొత్తం రూ.99,200 లంచం తీసుకున్న సూర్యాపేట సబ్-రిజిస్ట్రార్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నల్లగొండ రేంజ్ ఏసీబీ డీఎస్పీ జగదీశ్‌చంద్ర కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లాకేంద్రానికి చెందిన ఎం.వెంకటేశ్వర్లు తన 1,240 చదరపు గజాల ఖాళీ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించేందుకు మూణ్నెల్ల క్రితం సబ్-రిజిస్ట్రార్ బానోత్ సురేందర్‌నాయక్‌ను కలిశారు. తన కుమార్తె మానస పేరిట 1,080 చదరపు గజాలను, మిగతా 160 చదరపు గజాలను మేడిపల్లి రవిరాజు పేరిట సేల్‌డీడ్ చేయాలని కోరారు. అప్పటి నుంచి ఆయన సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఉన్నారు. ఆ తర్వాత సబ్-రిజిస్ట్రార్ తాపీగా, తనకు గజానికి రూ.100 చొప్పున లంచం ఇస్తే పనవుతుందని దస్తావేజు రైటర్లు కల్లూరి శ్రీనివాస్, తంగెళ్ల వెంకటరెడ్డి ద్వారా చెప్పించారు. దీంతో వెంకటేశ్వర్లు ఏసీబీని ఆశ్రయించారు. ఏసీబీ అధికారుల సూచన మేరకు.. సోమవారం ఆ మొత్తాన్ని శ్రీనివాస్, వెంకటరెడ్డికి అందజేశారు. వారిద్దరు ఆ మొత్తాన్ని సబ్-రిజిస్ట్రార్‌కు అందజేయగానే.. ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. కాగా.. సబ్-రిజిస్ట్రార్ సురేందర్‌నాయక్ గతంలోనూ ఏసీబీకి చిక్కారు. 2007లో వికారాబాద్ జిల్లా పరిగిలో, 2018లో మల్కాజిగిరిలో ఏసీబీ అధికారులు అతనిపై కేసులు నమోదు చేశారు. మరోవైపు.. దళితుల అభ్యున్నతికి ప్రభుత్వం అందించే పథకాల తనిఖీకి రూ.45 వేలు లంచం తీసుకున్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిశ్రమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ)ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. రంగారెడ్డి జిల్లా ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కథనం ప్రకారం.. తెలంగాణ స్టేట్ ప్రోగ్రామ్ ఫర్ ర్యాపిడ్ ఇంక్యుబేషన్ ఆఫ్ దళిత్ ఆంత్రప్రెన్యూర్స్ ఇన్సెంటివ్ స్కీమ్ కింద కూకట్‌పల్లికి చెందిన రమేశ్‌కు రూ.53 లక్షలు మంజూరయ్యాయి. ఆ మొత్తంతో ఆయన ఓ ట్రక్కు(టిప్పర్)ను కొనుగోలు చేశారు. స్కీమ్‌లో భాగంగా ఆయనకు రూ.23 లక్షలు మంజూరయ్యాయి. అయితే.. ఆ మొత్తం విడుదలకు ముందు.. ఏడీ వెంకట్‌నర్సిరెడ్డి తనిఖీ చేయాల్సి ఉంది. ఆ పని చేయడానికి రూ.50 వేలు ముట్టజెప్పాల్సిందేనని వెంకట్‌నర్సిరెడ్డి తేల్చిచెప్పారు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించారు. ఏసీబీ అధికారుల సూచన మేరకు బేరసారాలు చేసి, రూ.45వేలు ఇచ్చేలా వెంకట్‌నర్సిరెడ్డితో ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలో జీడిమెట్లలో వెంకట్‌నర్సిరెడ్డి ఆ మొత్తాన్ని తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు రెడ్-హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వెంకట్‌నర్సిరెడ్డిని అరెస్టు చేస్తున్నట్టు ప్రకటించారు.

ఆ బాలుడి ప్రాణం తీసింది కన్నతండ్రే!

» భార్యతో గొడవ, ఆ కోపం ఐదేళ్ల కొడుకుపై

» నిద్రలో హత్తుకునేందుకు ప్రయత్నించిన కొడుకుకిచెంపదెబ్బ.. ఛాతీపై 3 పిడిగుద్దులు

» ఊపిరాడక బాలుడి మృతి.. అంత్యక్రియలు

» తర్వాత ఇంట్లో రక్తపు మరకలున్న వస్త్రం లభ్యం

» భర్తను అనుమానించిన భార్య.. ఫిర్యాదు

» అర్వపల్లిలో బాలుడి మృతిపై వీడిన మిస్టరీ

అర్వపల్లి, జూన్ 3: తెల్లవారుజామున నిద్రలో ఉన్న ఐదేళ్ల కుమారుడు 'నాన్నా.. నాన్నా' అంటూ పక్కనే ఉన్న తనను హత్తుకునేందుకు ప్రయత్నించడంతో ఆ తండ్రి.. ఆ బిడ్డను చెంపమీద గట్టిగా కొట్టాడు! ఆపై బాలుడి ఛాతీ మీద మూడుసార్లు గట్టిగా పిడికిలితో గుద్దాడు! అస్వస్థతతో కొంతసేపు ఊపిరి తీసుకునేందుకు ఇబ్బందిపడిన ఆ బాలుడిని ఏమీ ఎరుగనట్లు తనే ఊర్లోని ఆర్‌ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లాడు! ఫలితం లేకపోయింది. ఆ పిడిగుద్దులను తట్టుకోలేని ఆ లేత గుండె ఆగిపోయింది!! సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం జాజిరెడ్డిగూడెం గ్రామంలో ఇటీవల అద్విక్‌తేజ్ (5) మృతిచెందిన బాలుడి ఘటన గుర్తుందా? ఈ ఘటనలో కన్నతండ్రి రావుల భిక్షమే కాలయముడని విచారణలో తేలింది. భార్యతో గొడవపడటం.. ఆ కోపంతో ఉన్న తన దగ్గరకు అద్విక్‌తేజ్ వచ్చేందుకు ప్రయత్నించడంతో భిక్షం ఉన్మాదంతో దారుణ హత్యకు ఒడిగట్టాడని పోలీసులు నిర్ధారించారు. ఘటన వివరాలను ఎస్పై యాకోబు వెల్లడించారు. రావుల భిక్షం-కర్ణ భార్యాభర్తలు. వీరికి అద్విక్‌తేజ్‌తో పాటు కుమార్తె కూడా ఉంది. ఈనెల 20న ఇంట్లో భార్యాభర్తలు గొడవపడ్డారు. మర్నాడు తెల్లవారుజామున ఆరున్నరకు కర్ణ.. సరుకుల కోసం కిరణా షాపుకు వెళ్లి వచ్చేసరికి బెడ్ మీద కుమారుడు అర్విక్‌తేజ్ ఊపిరి తీసుకునేందుకు ఉక్కిరిబిక్కిరవుతుండటాన్ని చూసింది. అప్పటికీ ఏమీ ఎరుగున్నట్టున్న భర్తకు విషయం చెప్పి.. ఇద్దరూ కలిసి ఊర్లోని ఆర్‌ఎంపీ వద్దకు బాలుడిని తీసుకెళ్లారు. అక్కడి నుంచి తిరుమలగిరిలోని మరో వైద్యుడి దగ్గరకు.. అక్కడి నుంచి 108లో సూర్యాపేట ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడికి వెళ్లే సరికే బాలుడు మృతిచెందాడు. మృతదేహాన్ని జాజిరెడ్డిగూడెం గ్రామానికి తీసుకొచ్చి ఖననం చేశారు. అయితే అద్విక్‌తేజ్ అంత్యక్రియలు పూర్తయిన నాలుగు రోజుల తర్వాత ఇంట్లో వస్తువులను కర్ణ సర్దుతుండగా రక్తపు మరకలతో కూడిన ఓ వస్త్రం కనిపించింది. అద్విక్‌తేజ్ అస్వస్థతకు గురైన సమయంలో భర్త పక్కనే ఉండటం, కుమారుడి మృతి తర్వాత ఒక మాదిరిగా ప్రవర్తిస్తుండటంతో కర్ణ అతడినే అనుమానించింది. తన కుమారుడి మృతిపై అనుమానాలున్నాయని, తన భర్త భిక్షంను విచారించాలని మే 29న పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మే 30న బాలుడి మృతదేహాన్ని వెలికి తీసి.. పోస్టుమార్టం నిర్వహించారు. భిక్షంను ప్రశ్నించగా కుమారుడిని తానే చంపానని అంగీకరించాడు. తాను పిడిగుద్దులు కురిపించగానే అద్విక్‌తేజ్ రక్తం కక్కుకున్నాడని.. భార్యకు అనుమానం రాకుండా వేరే వస్త్రంతో తుడిచేసినట్లు చెప్పాడు. భిక్షంను పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

ఢిల్లీ మద్యం కేసులో 1100 కోట్ల అక్రమాలు

(మొదటి పేజీ తరువాయి)



అనుబంధ అభియోగపత్రాన్ని దాఖలు చేసింది. 'ఢిల్లీ మద్యం కుంభకోణం ఎలా జరిగింది? ఇందులో ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత, అరుణ్ రామచంద్ర పిళ్లై, విజయ్ నాయర్, సమీర్ మహేంద్రుతోపాటు వివిధ మద్యం సంస్థల పాత్ర ఏంటి? ఎక్కడెక్కడ సమావేశాలు నిర్వహించారు? గోవా ఎన్నికల సమయంలో ఆప్‌కు ఎలా ముడుపులు సమకూర్చారు?' వంటి విషయాలన్నింటినీ ఈడీ వివరించింది. దాదాపు 44 మంది సాక్షులను, 92 కీలక డాక్యుమెంట్లను కూడా అభియోగపత్రంతో పాటు పొందుపర్చింది.

ఆప్‌కు 100 కోట్ల ముడుపులిచ్చిన కవిత..

ఢిల్లీ మద్యం విధానంలో.. కవిత 33 శాతం భాగస్వామిగా ఉన్న ఇండోస్పిరిట్ కంపెనీ రూ.92 కోట్ల మేరకు లాభాలు పొందిందని, కవితకు బినామీగా అరుణ్ రామచంద్ర పిళ్లై వ్యవహరించారని ఈడీ తెలిపింది. మద్యం విధానాన్ని తమకు అనుకూలంగా మార్చేందుకు విజయ్ నాయర్ ద్వారా ఆమ్ ఆద్మీ పార్టీకి కవిత రూ.100 కోట్ల ముడుపులను సమకూర్చారని పేర్కొంది. తన మొబైల్ ఫోన్ నంబరు 8008666666లో ఉన్న సమాచారం అంతటినీ కవిత తొలగించారని, ఆమె ఇచ్చిన ఫోన్‌లో ఎలాంటి సమాచారం లభించలేదని తెలిపింది. కవిత సమర్పించిన పది ఫోన్లను ఫోరెన్సిక్ పరీక్షకు పంపామని, అందులో నాలుగు ఫోన్లను ఆమె ఫార్మాట్ చేశారని వివరించింది. ఉద్దేశ పూర్వకంగానే ఆమె డిజిటల్ సాక్ష్యాలను తొలగించారంది. అనేక మంది సాక్షులను ప్రభావితం చేశారని తెలిపింది. అరుణ్ పిళ్లై కూడా కవిత పాత్ర గురించి తాను చేసిన ప్రకటనను వెనక్కి తీసుకున్నారని వెల్లడించింది. ఈడీ ముందు రికార్డు చేసిన ప్రకటనల్లో కవిత తప్పుడు సాక్ష్యాలు వెల్లడించారని, ఇండో స్పిరిట్‌లో తనకు ఎలాంటి వాటా లేదని బుకాయించారని.. బుచ్చిబాబు, రాఘవ మాగుంటల మధ్య వాట్సాప్ చాట్ల గురించి తనకేమీ తెలియదని చెప్పారని వివరించింది. తానే తొమ్మిది ఫోన్లను ఈడీకి సమర్పించి, తన ఫోన్లను ఈడీ లాక్కున్నదని తప్పుడు ప్రకటనలు చేశారని ఆరోపించింది. సౌత్ గ్రూపులో సభ్యులు సమీర్ మహేంద్రుతో కలిసి ఇండో స్పిరిట్‌ను నెలకొల్పడంలో కీలకపాత్ర పోషించడంతో కవిత పెర్నాండ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో కూడా డిస్ట్రిబ్యూషన్ హక్కులను పొందారని, మొత్తం లాభాల్లో రూ.192.8 కోట్లు కవితకు దక్కాయని ఈడీ తెలిపింది. కవిత పీఏ అశోక్ కౌశిక్.. దినేశ్ అరోరా కార్యాలయం నుంచి పెద్ద మూటల్లో నగదు సేకరించి మరో వ్యక్తికి ఇచ్చినట్లు సాక్ష్యాలు ఉన్నాయంది. అభిషేక్ బోయినపల్లి ఆదేశాల మేరకే గోవాకు హవాలా మార్గంలో రూ.7 కోట్లు పంపానని ఆంధ్రప్రభ ఎండీ ముత్తా గౌతమ్ అంగీకరించారని వెల్లడించింది. ముత్తా గౌతమ్‌కు చెందిన ఇండియా ఎహెడ్ ఛానల్‌లో ఆమె తనకు లభించిన రూ.192.8 కోట్లలో రూ.1.70 కోట్లు వాటాగా పెట్టారని, అభిషేక్ బోయినపల్లిని అక్కడ డమ్మీగా పెట్టారని తెలిపింది. ఇండియా ఎహెడ్‌కు ఎలా డబ్బు బదిలీ అయ్యిందో ఈడీ వివరించింది. మాగుంట రాఘవ, శరత్‌చంద్రారెడ్డి కూడా కవిత పాత్ర గురించి స్పష్టంగా తెలియజేసిన వైనాన్నీ వెల్లడించింది. కవిత తరఫునే అరుణ్ పిళ్లై పెట్టుబడి పెట్టినట్లు బుచ్చిబాబు వెల్లడించారని పేర్కొంది. వీటన్నింటిని బట్టి చూస్తే కవిత మనీలాండరింగ్ చట్టంలోని పలు సెక్షన్ల కింద అనేక నేరాలకు పాల్పడినట్టు స్పష్టమవుతోందని ఈడీ వెల్లడించింది.

తాగునీటి ట్యాంకులో మృతదేహం

(మొదటి పేజీ తరువాయి)

ఫిర్యాదు చేశారు. మునిసిపల్ సిబ్బంది ట్యాంక్ ఎక్కి తనిఖీ చేస్తే.. నీటిలో మృతదేహం తేలియాడుతూ కనిపించింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. పాతబస్తీకి సరఫరా అవుతున్న తాగునీటిలో దుర్వాసన వస్తోందని.. రోజురోజుకూ ఆ వాసన పెరుగుతుండడంతో.. పాతబస్తీలోని పలు కాలనీల వాసులు.. స్థానిక ప్రజాప్రతినిధి విషయాన్ని మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దాంతో.. మునిసిపల్ ఏఈ, వాటర్ లైన్‌మన్ వాటర్ ట్యాంక్ ఎక్కి పరిశీలించారు. అందులో కుళ్లిపోయి, పూర్తిగా ఉబ్బిపోయిన మృతదేహం కనిపించడంతో నివ్వెరపోయారు. వెంటనే ఉన్నతాధికారులు, పోలీసులకు సమాచారం అందించారు. 28వ వార్డు హనుమాన్‌నగర్‌కు చెందిన ఆవుల వంశీకృష్ణ(27)కు మతిస్థిమితం లేదని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. గత నెల 24 ఇంటి నుంచి బయటకు వెళ్లిన వంశీకృష్ణ.. తిరిగి రాకపోవడంతో వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్యాంక్‌లో మృతదేహమున్నట్లు పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న వంశీకృష్ణ కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఆ మృతదేహం వంశీకృష్ణదేనని గుర్తించారు.

హత్యా? ఆత్మహత్యా?

వంశీకృష్ణ మృతదేహంపై గాయాలున్నట్లు పోలీసులు గుర్తించారు. సమాచారం అందగానే.. జిల్లా ఎస్పీ చందన దీప్తి సంఘటనాస్థలికి చేరుకుని, పరిస్థితిని పరిశీలించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో.. వంశీకృష్ణ చనిపోయి రెండుమూడ్రోజులు అవుతుండొచ్చని తేలింది. పోస్టుమార్టం నివేదిక వస్తేగానీ ఎప్పుడు మృతిచెందాడు? ఎలా చనిపోయాడు? అనే వివరాలు చెప్పలేమని ఎస్పీ చందన దీప్తి తెలిపారు. కాగా.. వంశీ ఒంటిపై గాట్లు ఉండడంతో.. అది హత్యా? ఆత్మహత్యా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

మునిసిపల్ సిబ్బంది నిర్లక్ష్యం?

వాటర్ ట్యాంక్‌లో మృతదేహం ఘటన వెనక మునిసిపల్ సిబ్బంది బాధ్యతారాహిత్యంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక ఫిట్టర్‌తోపాటు.. ఇద్దరు ఆపరేటర్లు రోజూ ట్యాంక్‌ను పరిశీలించాలి. ట్యాంక్‌లోకి నీళ్లు వచ్చే సమయంలో.. మూతతీసి, నీటి వేగాన్ని పరిశీలించాలి. ట్యాంక్‌లో దుర్గంధం వస్తోందా? అని తనిఖీ చేయాలి. సాధారణంగా మిషన్ భగీరథ ట్యాంక్ భద్రతకు ఇద్దరు గార్డులను నియమించాల్సి ఉండగా.. ఒక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మాత్రమే పనిచేస్తున్నారు. ఆయన కూడా రోజూ ట్యాంక్ వద్దకు రారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిజానికి వాటర్ ట్యాంక్‌ల వద్ద సీసీకెమెరాలు, ట్యాంక్ పైభాగంలో విద్యుత్తు లైట్లు ఉండాలి. ఇక్కడ వాటి జాడే లేదు.

నాగార్జునసాగర్ ఘటన మరువకముందే..

నాగార్జునసాగర్‌లో నీటి ట్యాంకులో ఏప్రిల్ 2న కోతుల కళేబరాలు బయటపడ్డ విషయం తెలిసిందే.! ఆ ఘటనపై ప్రభుత్వంపై విపక్ష పార్టీలు, ప్రజల నుంచి పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. తాజాగా ఘటనతో మునిసిపల్ అధికారులు అప్రమత్తమయ్యారు. వాటర్ ట్యాంకులను తనిఖీ చేయాలని ఆదేశించారు.

కలెక్టర్ సీరియస్..

ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన సీరియస్ అయ్యారు. సమగ్ర విచారణ జరపాలంటూ అదనపు కలెక్టర్ పూర్ణచందర్‌ను ఆదేశించారు. కాలనీవాసులు కొన్ని రోజులుగా అదే నీటిని తాగిన నేపథ్యంలో ఆరోగ్యపరమైన సమస్యలేమైనా ఉత్పన్నమయ్యాయా? అనే కోణంలో పరిశీలించాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో వైద్య శాఖ బృందం ఇంటింటికీ తిరిగి తనిఖీలు జరిపింది. ఆ నీళ్లు తాగినవారిలో సమస్యలు కనిపించలేదని వైద్యులు గుర్తించారు. గత నెల 29న మిషన్ భగీరథ ట్యాంకును శుభ్రం చేయించినట్లు మునిసిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్ తెలిపారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: **K. Srinivas.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● మంగళవారం 4 జూన్ 2024

స్టూడెంట్స్ చాయిస్ సీఎస్ఈ



గ్లోబలైజేషన్ ప్రక్రియ ఊపందుకున్న తరవాత ముఖ్యంగా రెండు వేల సంవత్సరం నుంచి ఐటీ రంగం మూడు పూవులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. మధ్యలో రెండుసార్లు తలెత్తిన మాంద్యం ప్రభావం తీవ్రంగా ఉన్నప్పటికీ ఎక్కువ మందికి ఉపాధి కల్పించే రంగమే కాకుండా హై పెయిడ్‌గా ఉండడంతో సంబంధిత చదువులకు డిమాండ్ అధికంగా ఉంది. బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ) కొంతకాలంగా ఎదురులేని కోర్సుగా మారింది. ఈ నేపథ్యంలో సదరు కోర్సుకు తోడు ఎప్పటికప్పుడు కొత్త పుంతలు తొక్కుతున్న ఐటీ రంగంపై ఎన్ఐటి రాయపూర్ డైరెక్టర్ ప్రొఫెసర్ **ఎన్.వి.రమణారావు** చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి.

కంప్యూటర్లు, అల్గోరిథమ్స్ నుంచి ప్రోగ్రామ్స్, సర్క్యూట్స్ అలాగే సాఫ్ట్ వేర్, హార్డ్‌వేర్‌కుతోడు అప్లికేషన్స్(అన్వయం) సహా యావత్తు అధ్యయనం కంప్యూటర్ సైన్స్‌లో ఉంటుంది. ప్రాథమికంగా కంప్యూటర్లు, సంబంధిత అప్లికేషన్స్ అధ్యయనమే కంప్యూటర్ సైన్స్. సాఫ్ట్‌వేర్, అప్లికేషన్స్‌తోనే మొత్తం ప్రపంచాన్ని తెలుసుకునే స్వేచ్ఛను విద్యార్థికి అది కలుగజేస్తోంది. కంప్యూటర్ అల్గోరిథమ్స్, లాంగ్వేజ్‌లు సదరు మెషీన్లకు ప్రోగ్రామ్‌ను సమకూరుస్తాయి. డేటా స్ట్రక్చర్స్, నెట్‌వర్కింగ్ అదేవిధంగా కంప్యూటర్లలో నెట్‌వర్క్స్ అధ్యయనం కూడా ఉంటుంది. కేవలం సాఫ్ట్‌వేర్ లాంగ్వేజెస్ స్టడీకే పరిమితం కాదు. సదరు రంగాలు అంటే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ ఇంజనీరింగ్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్ తదితరాలూ ఉన్నాయి.

కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్: కంప్యూటర్స్‌కు సంబంధించి బేసిక్స్ నుంచి ఈ కోర్సులో నేర్చుకునే అవకాశం విద్యార్థులకు ఉంటుంది. సైన్స్ ఆఫ్ కంప్యూటర్స్ అంటే అందులోని ఆర్కిటెక్చర్ సహా కంప్యూటర్ సైన్స్ మెయిన్ ప్రోగ్రామ్ లాంగ్వేజెస్, కంప్యూటర్ సర్క్యూట్స్ పరిచయం, యావత్తు ప్రక్రియను రన్ చేసే అల్గోరిథమ్స్ ఈ కోర్సు అధ్యయనంలో భాగం. మేథమెటిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో ఈ సబ్జెక్టు మూలాలు ఉన్నాయి. దాంతో అటు సాఫ్ట్‌వేర్, ఇటు హార్డ్‌వేర్ తెలుసుకోవాల్సి ఉంటుంది.

కంప్యూటర్ ఇంజనీరింగ్: సీఎస్ఈ మాదిరిగానే ఉన్నప్పటికీ చిన్నపాటి తేడాతో ఈ కోర్సు ఉంటుంది. కొన్ని టాపిక్స్ విషయంలో ఈ రెంటి మధ్య తేడా కనిపిస్తుంది. హార్డ్‌వేర్ల డిజైనింగ్, అసెంబ్లింగ్‌కు తోడు మైక్రోప్రాసెసర్ల సర్క్యూట్ డిజైనింగ్, సూపర్ కంప్యూటర్స్ ఈ కోర్సులో ఉంటాయి. అంతిమంగా దేశాన్ని సాంకేతికంగా నడిపేందుకు అవసరమైన విద్య ఉంటుంది.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ: కంప్యూటర్స్ డేటా మేనేజ్‌మెంట్‌కు తోడు నెట్‌వర్క్స్, నెట్‌వర్క్ మేనేజ్‌మెంట్ ఈ కోర్సులో ఉంటాయి. డేటా స్టోరేజీ, మానిప్యులేషన్ అధ్యయనంగా ఉంటుంది. డేటా అంటే ఇక్కడ మెషిన్లలో ఉన్నదని అర్థం.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటి): మెషిన్ కోడ్స్, కంప్యూటర్ లేదంటే ఎలక్ట్రానిక్ డివైజ్‌ను డ్రైవ్ చేసే డేటా ఈ కోర్సులో చదవాలి. నెట్‌వర్కింగ్ స్టడీ అంటే ఒకే పని చేస్తున్న డివైజ్‌ల మధ్య నెట్‌వర్క్‌ను ఎస్టాబ్లిష్ చేయాలి. వాణిజ్యపరంగా బిజినెస్ ప్రపంచంలో ఇది కీలకం.

కొత్త బ్రాంచీలు

ఇటీవల కాలంలో ఐటి, సీఎస్ఈ సంబంధ బ్రాంచీలు చాలా అందుబాటులోకి వచ్చాయి. ఇవి అన్ని కాలేజీల్లో ఉండకపోవచ్చు. వారి డిమాండ్, ఇన్ఫ్రా ఆధారంగా బ్రాంచ్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. కంప్యూటర్ అప్లికేషన్స్, కంప్యూటర్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్ అండ్ ఐటీటీ, కంప్యూటర్ హార్డ్‌వేర్ అండ్ మెయింటెనెన్స్, కంప్యూటర్ హార్డ్‌వేర్ అండ్ నెట్‌వర్కింగ్, కంప్యూటర్ హార్డ్‌వేర్ ఇంజనీరింగ్, కంప్యూటర్ నెట్‌వర్కింగ్, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ, కంప్యూటర్ టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్, ఇన్ఫర్మేషన్ సైన్స్, ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎనేబుల్డ్ సర్వీసెస్ అండ్ మేనేజ్‌మెంట్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్,



క్లౌడ్ కంప్యూటింగ్ అండ్ బిగ్ డేటా, కమ్యూనికేషన్ అండ్ కంప్యూటర్ నెట్‌వర్కింగ్, సైబర్ ఫోరెన్సిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ అండ్ సెక్యూరిటీ, సైబర్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, వర్చువల్ అండ్ ఆగ్మెంటెడ్ రియాల్టీ, కంప్యూటర్ ఇంజనీరింగ్ (సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్), కంప్యూటర్ ఇంజనీరింగ్ అండ్ అప్లికేషన్, కంప్యూటర్ నెట్‌వర్కింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లయిడ్ మేథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ బయోసైన్సెస్, కంప్యూటర్ సైన్స్ అండ్ డిజైన్, కంప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ సిస్టమ్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సైబర్ సెక్యూరిటీ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(డేటా సైన్స్), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ అండ్ సైబర్ సైక్యూరిటీ ఇన్‌క్లూడింగ్ బ్లాక్ చైన్ టెక్నాలజీ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(నెట్‌వర్క్స్), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ అండ్ బిజినెస్ సిస్టమ్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ మెడికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ సోషల్ సైన్సెస్, కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్, కంప్యూటర్ టెక్నాలజీ కంప్యూటింగ్ ఇన్ మల్టీమీడియా, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇందులో ఉన్నాయి.

కెరీర్ అవకాశాలు

- ★ కంప్యూటర్ సైన్స్ లేదా ఐటీ లేదా సంబంధిత ఏరియాలో డిగ్రీ ఉన్న వ్యక్తులుగా సిస్టమ్ ప్రోగ్రామర్, సాఫ్ట్‌వేర్ డెవలపర్, వెబ్ డెవలపర్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, సాఫ్ట్‌వేర్ టెస్టర్, ప్రొడక్ట్ మేనేజర్, ఇంజనీరింగ్ మేనేజర్ వంటి ఉద్యోగాలు పొందవచ్చు. ఉదాహరణకు కంప్యూటర్ సైన్స్‌లో నిపుణుడు సీనియర్ ప్రోగ్రామర్, సిస్టమ్ అనలిస్ట్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, డేటాబేస్ మేనేజర్, సాఫ్ట్‌వేర్ డెవలపర్, ఫైనాన్షియల్ అనలిస్ట్‌గా చేరవచ్చు.
- ★ కంప్యూటర్ ప్రోగ్రామ్‌లో ఎక్స్‌పర్ట్ - కంప్యూటర్ ప్రోగ్రామర్, వెబ్ డెవలపర్/అడ్మినిస్ట్రేటర్, డేటా బేస్ అడ్మినిస్ట్రేటర్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, హెల్ప్‌డెస్క్ ఆపరేటర్, పీసీ సపోర్ట్ అడ్మినిస్ట్రేటర్, నెట్‌వర్క్ సపోర్ట్ అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేయవచ్చు.
- ★ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో నిపుణుడు ఐటీ ప్రాజెక్ట్ మేనేజర్, టెక్ సపోర్ట్ మేనేజర్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, వెబ్‌డెవలపర్, వెబ్‌సైట్ అడ్మినిస్ట్రేటర్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ అనలిస్ట్, డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్, అప్లికేషన్ డెవలపర్, సాఫ్ట్‌వేర్ టెస్టర్‌గా పనిచేయవచ్చు.
- ★ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ నిపుణుడు సిస్టమ్ అనలిస్ట్, డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ మేనేజర్, అప్లికేషన్ ప్రోగ్రామర్‌గా చేరవచ్చు.
- ★ కంప్యూటర్ ఫోరెన్సిక్ నిపుణుడు డిజిటల్ ఫోరెన్సిక్ అనలిస్ట్, ఎగ్జామినర్ అనలిస్ట్, కంప్యూటర్ ఫోరెన్సిక్స్ టెక్నాలజిస్ట్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్ సెక్యూరిటీ ఆఫీసర్, సిస్టమ్ అనలిస్ట్, సిస్టమ్ ఇంజనీర్, డేటాబేస్ అనలిస్ట్, కంప్యూటర్ ఫోరెన్సిక్ అసోసియేట్‌గా పనిచేయవచ్చు.
- ★ గేమ్స్ డిజైన్ ఎక్స్‌పర్ట్ గేమ్ డిజైనర్, గేమ్ ఆర్టిస్ట్, గేమ్ ప్రొడ్యూసర్, గేమ్ టెస్టర్, గేమ్ సౌండ్ ఇంజనీర్‌గా చేరవచ్చు.

గణాంకాలు

ఈ ఏడాది జనవరి చివరి నాటికి ఐటీ సెక్టార్‌లో ఓపెనింగ్స్ 50,000 ఉన్నాయి. మునుపటి సంవత్సరంతో పోల్చుకుంటే తగ్గుదల 21 శాతం. అంతకుముందు సంవత్సరం అంటే రెండేళ్ళ క్రితంతో బేరీజు వేసుకుంటే 60 శాతం తగ్గింది. లింక్డిన్, ఇతర జాబ్ బోర్డులను పరిగణనలోకి తీసుకుంటే ఈ లెక్క తేలుతోంది. డేటా శాంపిల్స్‌లో 80 శాతం ఒకే విషయాన్ని రూఢిపరుస్తున్నాయి. ఎంట్రీ లెవెల్‌లో స్లంప్ ఇంకా బాగా చెప్పాలంటే పిరమిడ్‌లోని అట్టడుగున రిక్రూట్‌మెంట్స్ దాదాపుగా స్తంభించాయని చెప్పవచ్చు. ఎనిమిది నుంచి తొమ్మిది శాతం మేర అట్రిషన్స్(ఒక కంపెనీని వదిలి ఇంకో చోటకు వెళ్ళడం) ఉంటోంది. అయినప్పటికీ కొత్తగా హైరింగ్ ఉండటం లేదు. ఇంకో మాటలో చెప్పుకొంటే హైరింగ్ విషయంలో రిక్రూటర్లు అప్రమత్తంగా ఉంటున్నారు.

ఈ పరిణామాన్ని 'లో నుంచి నో హైరింగ్ యాక్షన్‌గా 'ఎక్స్‌ఫెనో' కోఫౌండర్ అభివర్ణించారు. ఈ తగ్గుదల రెండేళ్ళుగా కొనసాగుతోంది. అన్ని పరిశ్రమలను లెక్కలోకి తీసుకుంటే అందులో ఉండే వైట్-కాలర్ జాబ్స్ స్పేస్ 2,10,000. కాగా జనవరి 2022ని ప్రామాణికంగా తీసుకుంటే తగ్గుదల 35 శాతంగా నమోదైంది. ఐటి సర్వీసెస్ సెక్టార్‌లో ప్రస్తుతం సిస్టమేటిక్ కరెక్షన్ చోటుచేసుకుంటోందని 'లాంగ్‌హౌస్ కన్సల్టింగ్' సీఈఓ తెలిపారు. ఎంట్రీ లెవెల్ గ్రాడ్యుయేట్లతో ఇప్పుడు క్యాంపస్‌లు నిండి ఉన్నాయి. నిజానికి వీరు ఇప్పుడు ఒకటి, రెండేళ్ళ అనుభవం ఉండి ఉద్యోగం పోగొట్టుకున్న వాళ్ళతో పోటీపడాల్సి వస్తోందంటూ పరిస్థితిని వివరించారు. అంతర్జాతీయంగా ఆర్థిక వ్యవస్థ మందగించిందని, ఆ ప్రభావం ఇండియన్ టెక్నాలజీపై కూడా పడిందని డెలాయిట్ ఇండియా డైరెక్టర్ తెలిపారు. స్థూల ఆర్థిక వ్యవస్థలోని అనిశ్చిత వాతావరణం ఫలితంగా క్లయింట్స్ చాలా అప్రమత్తంగా ఉంటున్నారని, ఇది రిక్రూట్‌మెంట్స్‌పై ప్రభావం చూపుతోందన్నారు. రాబోయే రెండు క్వార్టర్లలోనూ ఇదే పరిస్థితి ఉంటుదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనికితోడు సాంకేతికంగా మెరుగుదల ముఖ్యంగా ఏఐ కూడా నియామకాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని చెప్పారు. దరిమిలా మారుతున్న వాతావరణానికి తగ్గట్టు ఎదిగితేనే ఐటీరంగంలో కుదురుకోవడానికి వీలు ఉంటుందని, ఇది ఎప్పటికైనా రెండు వైపులా పదును ఉన్న కత్తే అని కూడా హితవు చెబుతున్నారు. మరో విషయం, ఐటీ రంగంలో గ్లోబల్ హబ్‌గా ఇండియా అలరారుతోంది. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీలో పెద్ద ఎత్తున స్కిల్డ్ ప్రొఫెషనల్స్‌ను తయారుచేస్తోంది. నాస్కామ్ ఇటీవలి నివేదిక ప్రకారం ఇండియన్ ఐటీ-బీపీఎం ఇండస్ట్రీ కేవలం 2022-23లో 45 లక్షల మందిని తీసుకుంది. అయితే సాఫ్ట్‌వేర్ కంపెనీలతో టైఅప్ అవుతున్న ఎస్ఆర్ఎం, బిట్స్ వంటి సంస్థలు ఇంటర్న్‌షిప్స్ నుంచి జాబ్స్ వరకు సింహభాగాన్ని తన్నుకు పోతున్నాయి. అది ఐటీ జాబ్ మార్కెట్‌పై విపరీతమైన ప్రభావం చూపుతోంది. అంటే తతిమా కాలేజీల నుంచి బైటకు వస్తున్న విద్యార్థులకు జాబ్ పొందడం ఇబ్బందికరంగా మారింది. ఏతావతా అది స్టార్టప్స్ నుంచి మొత్తం ఐటీ రంగంలో ఫ్రెషర్స్ రిక్రూట్‌మెంట్స్ వరకు అంతటా ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది.

3ఎల్ తప్పనిసరి

కంప్యూటర్ సైన్స్ అనే కాదు, ఏ బ్రాంచ్ తీసుకున్న విద్యార్థికి అయినా తన సబ్జెక్టుపై లోతైన అవగాహన ఉండాలి. అప్పుడే జాబ్ మార్కెట్లో ఇతరులపై ఎడ్జ్ ఉంటుంది. అదే అనుకున్న లక్ష్యానికి చేరువ చేస్తుంది. అదేవిధంగా ఎంపిక చేసుకున్న రంగానికి సంబంధించి తదుపరి కోర్సులపై కూడా దృష్టిసారించాలి. ఎప్పటికప్పుడు టెక్నికల్‌గా అప్డేట్ అవుతూ ఉండాలి. తద్వారా మరింత పరిణతి సాధించాలి. అంటే ఈ రంగంలో నిలదొక్కుకోవాలంటే లైఫ్ లాంగ్ లెర్నింగ్(3ఎల్)కు అలవడాలి. మరోవైపు వాస్తవ పరిస్థితినీ గమనించాలి. పెద్ద ఎత్తున కోర్సులు అలాగే ఛాయిస్‌లు ఉన్న ఈ రోజుల్లో చదివిన కోర్సుకు తగ్గ ఉద్యోగం లభించడం, అందులో నిలదొక్కుకోవడం ఒక రకంగా కత్తిమీద సాము అనే చెప్పాలి. కంప్యూటర్ సైన్స్ విషయానికి వస్తే దాని పరిధి ఏటేటా విస్తృతమవుతోంది. స్పెషలైజ్డ్ టాపిక్స్ పెరుగుతున్నాయి. కంప్యూటర్ ప్రోగ్రామింగ్, నెట్‌వర్కింగ్, డేటాబేస్ మేనేజ్‌మెంట్ నుంచి ఎన్నో స్పెషలైజేషన్లు ఉన్నాయి. అటు అవకాశాలు, ఇటు ఆసక్తిని అనుసరించి ఎందులో ఉండదలుచుకున్నామో నిర్ణయించుకోవాలి. అలా బెస్ట్ కంప్యూటర్ సైన్స్ కోర్సులను ఎంచుకోవాలి.

కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్(సీఎస్ఈ) లేదా డేటా సైన్స్, ఏఐ, మెషీన్ లెర్నింగ్ వంటి బ్రాంచీలను తీసుకునే ముందు విద్యార్థులు కొన్ని విషయాలను అర్థం చేసుకోవాలి. వాటిలో...

- మేథ్స్‌లో బలమైన పునాది ఉండాలి. కంప్యూటర్ సైన్స్‌కు సంబంధించి ఇది కీలకమైన సబ్జెక్టు. ఆల్జీబ్రా, కాలిక్యులస్, ప్రాబబిలిటీ, డిస్క్రీట్ మేథమెటిక్స్ చాలా ముఖ్యమైనవి.
- పైథాన్, జావా లేదా సి++ వంటి ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌లు తెలిసి ఉండాలి. వేరియబుల్స్, లూప్స్, ఫంక్షన్స్, డేటాస్ట్రక్చర్స్ వంటి బేసిక్ ప్రోగ్రామింగ్ కాన్సెప్టులు తెలిసి ఉండాలి.
- కంప్యూటర్ల పనితీరుపై ప్రాథమిక అవగాహన తప్పనిసరి. సీపీయూ, మెమరీ, స్టోరేజ్, ఆపరేటింగ్ సిస్టమ్స్ తెలియాలి.
- బేసిక్ అల్గోరిథమ్స్, డేటా స్ట్రక్చర్స్ అంటే ఆరేస్, లింక్డ్ లిస్ట్స్, స్టేక్స్, క్యూస్, ట్రీస్, సార్టింగ్ అల్గోరిథమ్స్ వంటి కంప్యూటర్ సైన్స్ ఫండమెంటల్స్‌పై పరిజ్ఞానాన్ని పెంచుకోవాలి.
- కంప్యూటర్ ఆర్కిటెక్చర్ బేసిక్స్ కూడా తెలియాలి. లాజిక్ గేట్స్, ప్రాసెసర్స్, మెమరీ హైరార్కీ, ఇన్‌పుట్/ఔట్‌పుట్ సిస్టమ్స్ వంటివి ఉపయోగకరం.
- సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ ప్రిన్సిపల్స్ కూడా తెలియాలి. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ప్రాసెసస్, డిజైన్ ప్యాటర్న్స్, టెస్టింగ్ మెథడాలజీస్, వెర్షన్ కంట్రోల్ సిస్టమ్స్‌పై అవగాహన పెంచుకోవాలి.
- నెట్‌వర్కింగ్ అండ్ సైబర్ సెక్యూరిటీపై ప్రాథమిక అవగాహన ఉండాలి. నెట్‌వర్క్స్, ప్రొటోకాల్స్, సైబర్ సెక్యూరిటీ కాన్సెప్ట్స్ వంటివి ఇవాల్టి సాంకేతిక ప్రపంచంలో చాలా ముఖ్యం.
- ప్రాబ్లెమ్ సాల్వింగ్ స్కిల్స్ ఉండాలి. కంప్యూటర్ సైన్స్‌లో తరచూ ఎదరయ్యే క్లిష్టమైన ప్రాబ్లెమ్స్‌ను సమర్థంగా పరిష్కరించగలగాలి. ప్రాబ్లమ్ సాల్వింగ్ నైపుణ్యాలను ఎంత బాగా నేర్చుకుంటే అంత మంచి కెరీర్ ముస్ముందు ఉంటుంది.

వీటన్నింటిపై ముందస్తు పరిజ్ఞానం ఉంటే కంప్యూటర్ సైన్స్‌లో రాణించేందుకు వీలు ఉంటుంది. ఈ టాపిక్స్‌ను కవర్ చేసే ఫౌండేషన్ కోర్సులు ఉన్నాయి. అన్నింటికీ మించి టెక్నాలజీపై అనురక్తి ఉంటే, నేర్చుకునే స్వభావం అందుకు తోడైతే పెద్దగా అనుభవం లేకున్నప్పటికీ ఈ రంగంలో దూసుకు వెళ్ళవచ్చు.




నిజాయితీకి పరీక్ష!


సౌగంధపురం అనే దేశాన్ని నరేంద్ర భూపతి అనే రాజు పాలిస్తూ ఉండేవాడు. ఆయన దగ్గర పనిచేసే కోశాధికారి మరణించటంతో నిజాయితీపరుడైన ఒక ఉద్యోగి అవసరమయ్యాడు. మహామంత్రిని పిలిచి నమ్మకస్తుడైన వ్యక్తిని ఎంపిక చేయమని ఆదేశించాడు. మహామంత్రి కొందరు యువకులను ఎంపిక చేసి వారందరిని ఒక పరీక్ష పెట్టాడు. గదిలో ఉన్న ఒక విగ్రహం చుట్టూ వేగంగా పది సార్లు పరిగెత్తాలి. పరీక్షకు వచ్చిన వారిలో ఒక యువకుడు తప్ప మిగిలిన వారందరూ ఏదో ఒక సాకు చెప్పి పరిగెత్తలేదు. మహామంత్రి పరిగెత్తిన యువకుడిని కోశాధికారిగా ఎంపిక చేసి రాజు దగ్గరకు పంపాడు. "ఈ యువకుడిని మీరు ఎందుకు ఎంపిక చేశారు" అని మహామంత్రిని రాజు అడిగాడు. అప్పుడు మహామంత్రి - "రాజా! యువకులందరినీ ముందుగా బంగారు నాణేలు ఉన్న ఒక చీకటి గదిలో ఉంచా. ఒక్కరు తప్ప మిగిలిన వారందరూ- బంగారు నాణేలకు తన దుస్తుల్లో దాచుకున్నారు. విగ్రహం చుట్టూ పరిగెత్తమన్నప్పుడు- వారు బంగారు నాణేలు కిందపడతాయనే భయంతో పరిగెత్తలేదు. వారెవ్వరూ నిజాయితీపరులు కారు. అందుకే ఈ యువకుడిని ఎంపిక చేశా" అని చెప్పాడు.



సరైన నీడ ఏది?









డైలీ సుడోకు - 323

3			1		5			4
9				3			7	
	4	2			9			
7				4			8	
			3		2			
	5			9				1
			7			4	1	
	6			1				5
1			2		4			3

సుడోకు - 322 సమాధానం

3	1	9	7	8	5	2	4	6
7	8	5	6	2	4	3	9	1
2	6	4	1	9	3	8	5	7
6	2	7	5	1	9	4	3	8
5	9	3	4	6	8	7	1	2
1	4	8	3	7	2	5	6	9
8	3	6	2	5	1	9	7	4
4	7	2	9	3	6	1	8	5
9	5	1	8	4	7	6	2	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.